


కవిత్రయ విరచితమైన
ఆంధ్ర మహాభారతం
తెలుగువారి అదృష్టం
వ్యాస భగవానుని సృజనకు
వాసి అయిన అనుసృజన
చేయడంలో నన్నయ, తిక్కన, ఎర్రన
కృతి అమోఘం!!
భారతాంధ్రీకరణతో
ముడిపడిఉన్న
ఈ ముగ్గురు కవిమూర్తుల
వ్యక్తిగత జీవిత చిత్రణే
ఈ అపురూప చారిత్రక ధారావాహిక

భారత మహా
కవిత్రయం

ఈనాటి సీరియల్స్ ధోరణికి అనుగుణంగా,
వేగం, టెంపో, సస్పెన్స్‌లు మేళవించి,
పాఠకుల కోసం ప్రత్యేకంగా విరచిస్తున్న
చారిత్రక ధారావాహిక

వీక్లీ పోస్ట్

శ్రీలంకలో

రూపిణి ముఖచిత్రంతో వెలువడిన "ఆంధ్ర సచిత్రవారపత్రిక"లో 'మద్రాసులో శ్రీలంక టెర్రరిస్టులు' అన్న సంపాదకీయం ఎంతో ఘాటుగా మరెంతో సూటిగా శ్రీలంకలో తమిళులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితుల గురించి తెలియజేసారు. అట్లే శ్రీలంక- భారత్‌ల మధ్య శ్రీ రాజీవ్‌గాంధీ హయాంలో చేసుకొన్న వొప్పందం వైఫల్యం చెందడం గురించీ, శ్రీలంక ప్రెసిడెంట్ శ్రీ ప్రేమదాస శ్రీలంక తమిళుల పట్ల వ్యవహరిస్తున్న అణచివేత గురించీ, శ్రీలంక తమిళులలో ఐక్యత లోపించడం గురించీ చక్కగా వివరించారు. నిజమే! తమిళ గ్రూపులలో ఐక్యత నెలకొని. పరస్పరం స్నేహభావంతో మెలిగి, పరస్పరం ఆధిక్యత కోసం పోరాడుకోవడం మానుకొంటే శ్రీలంక తమిళుల సమస్య పరిష్కారం సుగమం అవుతుంది! అట్లే శ్రీలంకలో స్పందనకి తమిళనాడులో, మద్రాసులో ప్రతిధ్వనులు వినపడటం గురించీ వాటిని అదుపు చెయ్యవలసిన బాధ్యత గురించీ చక్కగా వివరించారు అభినందనలు!

సి. రవితేజస్వి (చింతలూరు)

సూపర్ హీరో

"రూపిణి" ముఖచిత్రంతో వెలువడిన మన ఆంధ్రపత్రిక చాలా చూడ ముచ్చటగా ఉన్నది.

మన్నెం శారదగారి సీరియల్ "సూపర్ హీరో" కథ చాలా బాగున్నది. రచయితకు మా ధన్యవాదములు.

ఆర్యపల్లి ఆంజనేయులు, రాజ్యలక్ష్మి (ఖమ్మం)

(74 వ పేజీ చూడండి)



పదండి లోపలికి

ముఖచిత్రం:

దివ్య

(ఫొటో: జి. కె. నరసింహం)

ఈ వారం ప్రత్యేకం:

కథలు:

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు:

పై వారం:

బీజింగ్ ఆసియాడ్ '90 (ప్రత్యేక వ్యాసం)

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తనమనంబునకగు దా
నొరులకునవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్

THE ANDHRA PATRIKA GROUP OF MAGAZINES

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుపంతులు

సంపుటము 82 సంచిక 51

10-8-1990

విడిప్రతివెల నాలుగురూపాయలు

శకసం. 1912 శ్రావణమాసం 19వ తేదీ

PRINTER, PUBLISHER & SANCHALAKUDU:
CHAKRAPANI

EDITORS:
VEERAJI
M. MADHAVA RAO

ASSOCIATE EDITORS:
POTLURI VENKATA RAO
Dr GUMMANURU RAMESH BABU

SUB-EDITORS:
P. PRAMEELA
K S B. TILAK
BHISETTY LAXMANA RAO

ARTISTS:
KASI
CHALAM

PRODUCTION & ADMINISTRATIVE MANAGER:
M. THYAGARAJ

CIRCULATION MANAGER:
S. APPADORAI

ADVERTISEMENT MANAGER:
A. NANDAKUMAR

Printed and Published for Nageswara Rao Estates Ltd., by VAMARAJU CHAKRAPANI at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-520 003,
Editor: VEERAJI
Phones: Business: 61247, 61248,
Editorial: 75667.

సంపాదకీయం...

"అయోధ్య" కాండలో బౌద్ధ "మీమాంస"

"పాము చావకూడదు కర్రా విరగకూడదు" - అనుకున్నంత కాలం కొన్ని సమస్యలు అపరిష్కృతంగానే వుండిపోతాయి. మత సంబంధమయిన విశ్వాసాల వెనుక - విషయం కన్న వ్యక్తుల మమకారం అహంకారం యెక్కువగా వుంటుంది. వ్యక్తుల సమూహమే ఒక 'వర్గం'గా రూపుదిద్దుకున్నప్పుడు - సమస్య జటిలమైపోయి విడీవిడని చిక్కుగా మారిపోతుంది. దానిని రాజకీయ ప్రయోజనాలతో రంగరంచినట్లయితే అది పాకానపడి - చివరికి రామ జన్మభూమి-బాబ్రీ మసీదు సమస్య క్రింద విశ్వరూపం ధరిస్తుంది. రామజన్మభూమి - బాబ్రీమసీదు సమస్య మీద యింతవరకు ఒక్కొక్క పార్టీ ఒక్కో రకమైన అభిప్రాయాన్ని యేర్పర్చుకుని - తాను యెంచుకున్న వర్గం యొక్క వాదానికి మద్దతును యిస్తున్నవి - ఇవాళ తమ అభిప్రాయాలకు హేతువాదాన్ని గాని లోకజ్ఞాన తర్కాన్నిగాని జోడించటానికి - ఏ పార్టీకి ధైర్యం లేదు. కారణం యింత కాలంగా తమకున్న "వోటు బ్యాంకు"లు చెల్లాచెదురైపోతాయన్న భయమే.

అయితే ఈసారి ఎన్నికల అనంతరం - పరస్పర విరుద్ధమైన - పార్టీలు సహజీవన సౌభాగ్య సిద్ధాంతాన్ని తమ స్వార్థ - స్వంత ప్రయోజనాల కోసం - అద్యతన భావిలో రాగలవనుకున్న పరిణామాల దృష్టితోను - యిష్టం లేకపోయినా ఒక 'వార'లో మూడు కత్తుల మాదిరి కాపురం మొదలు పెట్టాయి. బి.జె.పి. మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీలు చెరో చక్రంగా వుండకపోతే నడవలేని "ఫ్రంట్" గవర్నమెంటులో కూడా ఆ రథానికి పూన్చిన గుర్రాలు తలో దిక్కులాగుతూ వున్నందువల్ల ప్రమాదం పొంచి వుండటంతో దినదిన గండం వెయ్యేళ్లు ఆయుష్షుగా 'జనమోర్చా' హయాం సాగుతున్నది. జనతాదళ్ గవర్నమెంటు రామజన్మభూమి వివాదం విషయంలో - బి.జె.పి.తో యింత పిసరు "కన్ను" కలిపి చూడలేకపోతున్నది అన్న సంగతికి యు.పి.లో ములాయం సింగ్ గారి మీద - బి.జె.పి.కి గల వైరమే చాలు! విశ్వహిందూ పరిషత్ మొదలగు సంస్థలు రామజన్మభూమి వర్గాలు అక్టోబర్ *30* నాడు "ఆరు నూరైనా" ఫ్రంట్ ప్రభుత్వం తల్లక్రిందులయినా "అయోధ్య వివాదగ్రస్త" స్థలంలో "రాముడి గుడి" కడతామంటున్నాయి. వీటి వాదానికి బి.జె.పి. బాహాటంగానే మద్దతునిస్తున్నది. ఈ దశలో ప్రధాన మంత్రి శ్రీ వి.పి.సింగ్ కోర్టు నడ్డం పెట్టుకొని ప్రస్తుతానికి యీ "విషమ (య) వలయం నుంచి" బయటపడాలనుకోడంలో తప్పులేదు. విలేఖరుల సమావేశంలో మాదిరి శ్రీ వి.పి.సింగ్ గారు యిటీవల గవర్నర్‌ల సమావేశంలో కూడా - తమ ఎనిమిది మాసాల ప్రభుత్వ పాలనను వొకసారి విహంగావలోకనంగా - బహిరంగంగా చర్చించారు. అట్లా చేయకపోతే యీ గవర్నర్‌ల సమావేశం గురించి అంతగా మనం పట్టించుకొనవలసిన అవసరమేలేదు. అందులో భాగంగా "కోర్టు నిర్ణయం ఏదైనా సరే దాన్ని అమలు చేయటానికే తన గవర్నమెంటు కట్టుబడి వుంటుంది" అన్నారాయన. శ్రీ వి.పి.సింగ్ యిలా అనడంలో - బి.జె.పి.కి దాని అనుబంధ సంస్థలకీ యేదైనా హెచ్చరిక వున్నదేమో? - మనకి శ్రీయుతులు అద్వానీ, జోషి, వాజ్‌పేయీలు మాత్రమే చెప్పగలరు. రామజన్మభూమి - బాబ్రీమసీదు వివాదానికి యిప్పుడు మరో కొత్త మలుపును శ్రీమతి అంబేద్కర్ తీసుకువచ్చారు. రాముడు;- బాబర్ కట్టినట్లు చెప్పబడుతున్న "మసీదు" వల్ల "అల్లా"-యిప్పటికి చాలాకాలంగా కోర్టుకి ఎక్కించబడ్డారు. వారికి తోడుగా యిప్పుడు బుద్ధభగవానుని కూడా కోర్టుకెక్కిస్తామని శ్రీమతి సవితా అంబేద్కర్ ఒక్క కొత్త వాదాన్ని రంగంలోకి దించారు. ఈ "అయోధ్య" అంతా బుద్ధ మతస్థులకు చెందిందని దీని అసలు పేరు "సా కేత" అని ఆమె యీ మధ్యనే తెలుసుకున్నారు. ఈ విషయం అలనాటి చైనా యాత్రికులే తమ (వారు బౌద్ధ మతావలంబికులై వుంటారు) తమ గ్రంథాలలో లిఖితంగా 'ఖచితం' చేశారని - కోర్టులోనైనాసరే దీన్ని రుజువు చేస్తామని శ్రీమతి సవితా అంబేద్కర్ వాదిస్తున్నారు. ఇట్లా అనడం చాలదు. దీని మీద కోర్టుకు వెళ్తేనే మంచిది. దీనివల్ల అయోధ్య ప్రాంతం గురించి మరికొంత పురావస్తు సమాచారం - ప్రాచీన గ్రంథస్త వింతలు విశేషాలు మనకి లభించి - పత్రికలకి మంచి మేతగా వుంటాయి -

బాబ్రీమసీదు - రామజన్మభూమి వివాదం మీద న్యాయస్థానాలు సాక్ష్యాధారాలనే గాని చరిత్రని భూగర్భస్థ నిక్షేపాలను ఆలకించి, పరికించి 'తీర్పు' చెప్పలేవు గనుక - యీ వివరాలను సేకరించి కోర్టు వారి యెదుట సమర్పించేవారు తమ వాదానికి ఊతంగా చారిత్రక సత్యాలను తప్ప యింకేమీ ఆసరా చేసుకోమని అనుకోవాలి. ఈ వివాదంలో "సిగపట్లు" పట్టుకున్న వారంతా సత్యాన్వేషణకి సహకరిస్తే తప్ప - "కోర్టు"లు కూడా ఒక నిర్ధారణకు రాలేవు! అంచేత చరిత్రను భౌగోళిక సత్యాలను త్రవ్వి కోర్టులకి ఎత్తుకోవాలి! కోర్టు తీర్పుని శిరసావహించాలి. ●

నీ వెనుకే నీ నీడ.

కె.కె. రఘునందన

జీవితాన్ని విజయవంతంగా నెట్టుకు రావటంలో కృతకృత్యుడు కానందుకు అనవరతం బాధపడే మధ్యతరగతి కుటుంబీకుడు రాధాకృష్ణయ్య.

అతని స్థితిగతులు- అతని బ్రతుకును అడుగడుగునా వెక్కిరిస్తూ మర్రి వూడలాంటి బలమైన నిరాశా ఛాయలు మనసులో జీరాడి పారాడుతున్నాయి. మదిలో ఒక చిన్న రేణువు లాంటి ఆశ కూడా- ఒక్కో క్షణం కనుచూపు మేరలో కానరాని చిట్టచీకటిలో కొట్టుమిట్టాడుతూ బ్రతకాల్సి రావటానికి ఒకే ఒక్క కారణం రాధాకృష్ణయ్య ఆడపిల్లల తండ్రి కావటమే!

అపుడపుడు మేఘాల చాటు మాటులను తప్పించుకుని తొంగి చూసే అందమైన చల్లని చందమామలా ఒకొక్కప్పుడు ఆశల వెన్నెల ఎదనిండా కాసిన క్షణం మధురాతి మధురం!

కాని ఆ మధురమే చేదుగా మారటానికి క్షణం పట్టని సంఘటన లెన్నో ఎదురైనాయి రాధాకృష్ణయ్య మనుగడలో.

పెద్దకూతురు సునాదను ఎలాగో మేనల్లుడుండబట్టి - చిన్నప్పటి నుంచీ అనుకోబట్టి- అదీ వాడు దాన్ని చేసుకుంటానని ఒప్పుకోబట్టి మెల్లగా కట్నం బాధ లేకుండా ఏదో అచ్చట- ముచ్చట లని తీర్చేసి కూతురును కుమారి నుండి శ్రీమతిగా మార్చాడు.

ఎటొచ్చీ- ఈ కాలం గాని కాలంలో మనుషులు వెర్రికోరికలను మనసుల్లో పాతేసుకుని, మనుషుల నడుమ వుండేది కేవలం పచ్చ నోట్ల సంబంధమే నన్నట్లు వాదిస్తూంటే- రెండో కూతురు సారిక అందాల బొమ్మ, రవ్వల దివ్వె అయినా ఏ పెండ్లి కొడుకు వివాహ బాంధవ్యం కోసం ప్రాకులాడతాడని?

కొద్దో, గొప్పో కట్నకానుకలు యివ్వగలడు రాధాకృష్ణయ్య. కానీ అంతమాత్రం చేత కూతురి శ్రీపాదం మెట్టినింట్లో మోపించాలన్న కోరిక మాత్రం విహ్వలంగా నవ్వేసి అతన్ని అథః పాతాళానికి అణగ తొక్కేసింది.

రంగరించిన జీవితానుభవాలు కనుల ముందర ఓ సారి కదిలినపుడల్లా ఆలోచనల దాడి ప్రారంభమౌతుంది రాధాకృష్ణయ్యలో.

ఆ సమయంలోనే తన తోడు-నీడల్ని త్రుళ్ళగొట్టి ఈ ప్రాపంచిక భవబంధాలతో శాశ్వత వీడ్కోలు కొని నిష్క్రమించిన అర్ధాంగి, తల్లి లేకపోయినా ఆ తల్లి సర్వ బాధ్యతలు తన భుజాలపై వేసుకుని లాలించి పెంచి పెద్ద చేసిన కూతుళ్ల జీవితాలు ఏర్పుకొస్తాయి.

సునాద గురించి అతనికి నిశ్చింతే!

కేవలం అతని మస్తిష్కం నిండా సారికే.

ఎటు వెళ్లినా ఇదే స్ఫురణకు వచ్చి గుండె కోత మొదలౌతుంది. కాని, ఈ ప్రాకులాటలు, లంపటాలు ఏవీ అర్థంకాని సారిక మాత్రం త్రుళ్ళుతూ, పరవళ్ళు తొక్కే వయసు గిలిగింతలలో ఓలలాడుతూ శుభ్రజ్యోత్స్నలా వెలుగొందుతూంది.

తన మానసిక అనిశ్చలత... ఎద గూటిలో దాగిన దిగులు బహిరంగం కాకుండా అతి జాగ్రత్తగా మసులుకుంటున్నాడు రాధాకృష్ణయ్య.

ఆ రోజు సైతం అతనలా ఆలోచనల వూబిలో కూరుకు పోతున్న వేళ- "నాన్నా! మీ కోసం ఎవరో!" అని సారిక చెప్పేదాకా ఏదో మాయలో వున్న భ్రాంతి



నుండి తేరుకుని వెళ్లాడు.

బయట పావనశాస్త్రి!

రాధాకృష్ణయ్య కళ్లలో ధవళచ్చాయ!

కోరి ముందుకొచ్చి కూసిన కోకిల ఆమని గీతికలాంటి ఆగమన మది.

"శాస్త్రీ! నీ కోసం ఎంత ఎదురు చూస్తున్నానో తెలుసా!" అని రాధాకృష్ణయ్య అంటుంటే ఆ పదాలలోంచె తేనె వూటలాంటి ఆనందం త్రుళ్లింది.

"వెళ్లిన పని సాధించుకు రావాలనే తపనలో కొద్ది ఆలస్యం అయితే అయింది గాని... మనం అనుకున్నది నెఱవేరింది. సారికను చేసుకోవటానికి అంతా అంగీకరించారు కానీ,"

"ఆఁ ఏంట్రా! ఆపావేం? చెప్పు... కానీ,..." రాధాకృష్ణయ్య కొండంత ఆశ్చర్యం వెల్లడించాడు.

"నువ్వు చెప్పిన అంకెకే కుదర్చలేక పోయినందుకు క్షమించు... మరో అయిదెక్కువయింది".

“అంటే ఇరవై వేలా!” గుండె బితుకు బితుకులాడింది.

“మొన్న అదవివరం సంబంధానికి పదిహేను దాకా వెళ్లావా లేదా! అక్కడికెంత మరో అయిదు వేలే! ఒరే! నీకున్నదింకొక్క కూతురే! దాంతో అన్ని బాధ్యతలు గట్టెక్కిపోతాయి. ఊఁ కొట్టు....” అని భుజం పట్టుకు కుదిపాడు శాస్త్రి.

అతని మాటల ప్రభావం రాధాకృష్ణయ్యపై బాగా పనిచేసింది. సారిక వివాహం జరగాలి. అదీ సాధ్యమైనంత త్వరగా!

మనసు మారుమూలల్లోంచి ఏదో సంకోచం, భయం బయలుదేరినా వాటిని వ్యతిరేకిస్తూ వీధిలోకి నడిచాడు.

అనుకున్నంత సులువుకాదు పని కావటం అని తెలియటానికి రెండు రోజులు పట్టింది. తర్వాత ఓ మనిషిలో దేవుడు దూరాడేమోనన్నట్లుగా-రాధాకృష్ణయ్యకు అప్పు ఇస్తానన్న భరోసా లభించింది.

ఆ నమ్మకం వేయి ఏనుగుల బలాన్ని ప్రసాదించింది.

ఇంత కాలానికి నిశ్చింతగా వూపిరి పీల్చుకున్నాడు.

జీవితం కొలది కాలమైనా ఎన్ని ఝ ఝూటాలు!!

పావనశాస్త్రితో పాటు రాధాకృష్ణయ్య కూడా బయలుదేరాడు. శాస్త్రి చెప్పినట్లుగా లేదు వారింటి వాతావరణం. వారందరి మొహాలలో ఏదో వెలితి తేటతెల్లమౌతూంది. ఆసరికే వారింటికి బంధువులెవరో పాదం మోపిన ఛాయలు బయట విడిచిన పాదరక్షల ద్వారానూ, లోపల వినిపిస్తున్న నవ్వుల ద్వారానూ ప్రస్ఫుటమైనాయి.

అరికాలి క్రింద పేడ పురుగు కదిలినట్లుగా అనిపించింది రాధాకృష్ణయ్యకు.

తనని రాగానే ఆప్యాయంగా పలకరించి, ఆదరించి మంచిగా మాట్లాడి అంగీకరిస్తారనే అతని అందమైన వూహ తలక్రిందులైంది.

పావనశాస్త్రిని చూసిన ఓ పెద్దాయన బయటకు వచ్చి- “ఇలా నాతో రండి...” అని తీసుకెళ్లి ఓ అయిదు నిముషాల తర్వాత బయటపడ్డారు.

“పద రాధాకృష్ణయ్యా! వచ్చిన పనయింది” అని పావనశాస్త్రి చెబుతున్నప్పుడే ఏదో అపశృతి తొంగి చూసింది.


“మనకంటే అయిదువేలు ఎక్కువ యిస్తామని ముందుకు రావటంతో వాళ్ళు అటు మొగ్గారు. నేను ఆ మధ్య చెప్పినపుడే డబ్బు వ్యాపగించితే.... అయినా ఈ రోజుల్లో డబ్బు మన చేతుల్లో వుండాలి కాని, డబ్బు చేతుల్లో మనం వుండకూడదు.” చిరాకుపడ్డాడు.

“నా పరిస్థితి నీకు తెలుసుగా... ప్రస్తుత కర్తవ్యం” జాలిగా ఆవేదనని ఒడిసిపట్టి అడిగాడు రాధాకృష్ణయ్య.

“నెత్తి బాదుకోవటం. చేతులు జారిపోయింది. ఇంకేమిటి చేస్తాం. ఈ రోజుల్లో ఎవరికయినా స్వార్థం తప్పదు. నిజానికి మీ అమ్మాయి ఆ అబ్బాయికి నచ్చింది. కానీ డబ్బు తల్లిదండ్రులకు నచ్చిందీ. ఏం చేస్తాం. తలరాత కూడా బాగుండాలి”. ఎన్నిసార్లు నొచ్చుకున్నాడో!

వాళ్ల వూరి బస్సు కనిపిస్తే ఎక్కి వెళ్లిపోయాడు పావనశాస్త్రి.

ఎడారిలో ఒంటరి కోయిలలా మిగిలిపోయాడు రాధాకృష్ణయ్య.



దగ్గరకొచ్చిన కూటిని కుక్క ముట్టినట్లు...

పెంచి జాగ్రత్త చేద్దామనుకున్న కోడిపిల్లను డేగ కరుచుకెళ్లినట్లు... హే భగవాన్! నీ తంత్రంలో ఇదో భాగమా!

ఈ ఒక్క అవకాశం ప్రసాదించమని నిన్ను ఎన్నిమార్లు జోహార్లర్పించానో.... కానీ అంతలోనే ఆశల దారాన్ని పుటుక్కున తెంపేశావు?!

ఇల్లు చేరినాసరే మానసిక భారం తగ్గుముఖం పట్టలేదు. జీవితం ఆమూలాగ్రం గ్రంథస్తం చేసినట్లుగా- తీపి చేదు అనుభవాలు జ్ఞాపకాలలోనికి చొచ్చుకు వస్తున్నాయి.

సారిక పెండ్లి తనీ జన్మలో జరిపించలేడా!

ఆమె నుదుట కల్యాణ తిలకం దిద్దడానికి వరుడు ప్రపంచంలోనే లేడా.

తన చిట్టి తల్లి దురదృష్టవంతురాలు కాకూడదు.

ఎక్కడో తన బంగారబొమ్మ కంఠాన్ని అలంకరించటానికి పూలమాలతో వేచి వుంటాడు.

అన్న ఆశావాదంతోనే ఆలోచిస్తున్నాడు. కాని లోలోపల ఎలా సాధ్యం అని పీకుతూనే వుంది.

‘మనసుంటే మార్గం వుండదా అంటారు’.

తనకు మనసు నిక్షేపంలా వుంది. కాని ఈ పరిస్థితి ఎలా ఎదుర్కోవాలో ఒక్క వుపాయం లేదా!

చాలాసేపు క్షుణ్ణంగా యోచించాడు.

తర్జనభర్జన పడ్డాడు.

చివరకు ఆ విషమ సమస్యకు ఓ చక్కటి వుపాయం రాధాకృష్ణయ్య బుర్రలోకి మెరుపులా దూసుకొచ్చింది.

మానవత్వ మెరిగిన అతని హృదయం అందుకు ప్రతిఘటించింది. కాని స్వార్థం ఆ అభిప్రాయంతో ఘర్షణపడి చివరికి తానే నెగ్గింది.

దాని ఫలితం రాధా కృష్ణయ్య ముఖాన పట్టిన చెమటను ఆత్రంగా తుడుచుకుని టేబిల్ దగ్గరకు వెళ్లి లైట్ ఆన్ చేసాడు.

లెటర్‌పాడ్ మీద పెన్ ఆనించిన క్షణం కూడా వివేకానికి- అంతరంగానికి యుద్ధమైంది. కానీ వివేకం తెల్ల మొహం వేసుకు వెళ్లిన క్షణాన అతని చేతిలో పెన్ త్వరితంగా కదిలింది. ఎన్నో అక్షరాలు కూర్చిన పదాల్లో భావాల పరంపరను చివరగా చదివి బరువుగా నిట్టూర్చి- వుత్తరం మడిచాడు.

ఆ చివరి నిముషం దాకా కొట్టుకు లాడిన గుండెలో భీతి కొద్దిగా సడలింది.

★ ★ ★ ★ ★ ★

రోజొక యుగంలా గడిచింది. అలాంటి యుగాలు ఏడు దొర్లాయి. చివరికి ఒక రోజు అకస్మాత్తుగా పావనశాస్త్రి దిగాడు.

వచ్చీరాగానే కౌగలించుకుని- “ఒరే రాధా! నీకెక్కడో సిరి మిగిలుందిరా! లేకపోతే ఏమిట్రా! తప్పిపోయిందనుకున్న సంబంధం తిరిగి కుదరడం- ఈ రోజుదయమే వాళ్లదగ్గర్నుండి పోస్టులో వుత్తరం వచ్చింది. ఇదిగో చదువు” అని సూట్‌కేసులోంచి వుత్తరం తీసి రాధాకృష్ణయ్యకు అందించాడు.



నాలుగార్లు 24 కాదు 454!

కపిల్ డెవిల్ "లార్డ్స్"లో అకస్మాత్తుగా విజృంభించాడు. ఎడ్డీ హెమ్మింగ్స్ (తాతగారంటారు అంతా 44 సం.లు) గారు వేసిన ఆఫ్ బ్రేకుల బ్రేకులు త్రెంచి వరసగా "నాలుగు ఆర్లు" కొట్టేసరికి "ఫాలో ఆన్" కోసం ప్యాడ్‌లు కట్టుకున్న సిద్ధూ, రవిశాస్త్రి పెవిలియన్‌లో ప్యాడ్‌లు విసిరి పారేసిహుర్రేమంటూ గెంతారు. అజ్జూ భాయి మీద బిషేన్ బేడీ నిన్నటిదాకా విరుచుకు పడ్డవాడు నాలిక్కర్చుకున్నాడు. ఎందుకో? మొదటిటెస్ట్‌ని రేడియోమీద వింటూన్నక్రికెట్ లవర్స్అందరికీతెల్సు.

కపిల్ కి జతగా అవతల హిర్వాణీ వున్నాడు-బ్యాట్ పట్టుకున్నాడేకాని కాళ్లు వణుకుతున్నాయి తనకి. అమ్మయ్య!అనుకుని ఆతర్వాతి అవకాశం తీసుకుని హిర్వాణీ అవుట్ అయిపోయాడు. అయితేనేం ఇండియా ఫాలో ఆన్ తప్పించుకుని, ప్రతిష్ట కాపాడుకున్నది-కపిల్ కొట్టిన నాలుగార్లు ఆవిధంగా 454 స్కోరు సాధించాయి-లార్డ్స్‌లో యీసారి పరుగుల వర్షమే కురిసింది కాని యీ పిడుగుల సిక్సర్‌లు చిరస్మరణీయాలు!

***

చదివాడు రాధాకృష్ణయ్య.

అతని పెదాలు విలాసంగా చిరునవ్వుతో మొగలి రేకుల్లా విచ్చుకున్నాయి. "రాధా' సారిక అదృష్టం కాకపోతే వాళ్లకి చివరిక్షణంలో ఎవరో వ్రాసారుట వారు చేసుకోబోయే అమ్మాయి చెడు తిరుగుళ్ళు తిరిగిందని- అందుకే ఆ విషయం బయట పడకుండా అర్జంటుగా ఎవరి చేతనయినా ఆమె మెడలో తాళి కట్టించేయాలని చెప్పి కట్నం కూడా

నీ వెనుకే నీ నీడ

ఎక్కువే ఇవ్వటం అందువల్లేనని.... కానీ వారికీ విషయం వుత్తరం ద్వారా తెలిసీ తెలియగానే కట్నం తక్కువ అని మొదట తిరస్కరించి అవమానించినందుకు బాధపడ వద్దని చెప్పి తిరిగి మన సారికనే చేసుకోవటానికి అంగీకరించి ముహూర్తాలు వీలైనంత త్వరగా పెట్టించమన్నారు." అని వివ రించి విషయమంతా మరల చెప్పాడు

రాధాకృష్ణయ్య వుల్లం రుల్లున వుప్పొంగింది.

ఈ ఆశ ఓ కొలిక్కి వచ్చేదాకా ఏ అడ్డంకు సృష్టించవద్దని భగవంతుని మనసారా స్మరించాడు

*   *   *   *   *   *   *

సారికను ఓ ఇంటి దాన్ని చేసి తన గుండెలపై భారం తొలగించు కున్నందుకు అందరి ఆడపిల్లల తండ్రుల్లాగా అవధిలేని సంతోషం అనుభవించాడు రాధాకృష్ణయ్య.

ఇంక జీవనరథం సాఫీ మార్గాన పడినట్లే!

ఈ అంతిమ జీవితం భక్తిచింతనతో గడిపేస్తే చాలు.

అలా హాయిగా కాలం నడుస్తూంది.

ఓ రోజు వుత్తరం- సారిక నుండి.

"నాన్నా'

అందరి తండ్రుల్లాగా మీ బాధ్యత మేర నన్నో ఇంటి కోడలిగా పసుపు కుంకుమలు కలకాలం నిలిచి వుండాలని ఆశీర్వదిస్తూ పంపారు. కాని కొందరి జీవితాల్లో వసంతాన్ని- మరి కొందరి జీవితాల్లో గ్రీష్మాన్ని నిలపాలని ముందే నిర్ణయించు కుంటాడేమో! దేవుడు!! ఎందుకో దేవుడి దృష్టి నా మీద చులకనయింది. నా సంసారం కార్తీక పౌర్ణమిలా వెలుగొందు తుందని ఎంతో గొప్పగా వూహించాను కాని ఆయన మొన్న మొన్నటి దాకా ఏ వ్యసనం లేని మంచి వ్యక్తి. కానీ నా దురదృష్టమో మరేమో, ఈ మధ్య ఓ ఫారిన్ ఫ్రెండుతో పరిచయం అయిన కారణంగా ఆయన ప్రస్తుతం మత్తు ఇంజక్షన్లకి బానిస. ఈ విషయం ఆ ఇంట్లో నాకు తప్ప మరెవరికీ తెలీదు అందుకే ఆ విషాన్ని నేను ఒక్కదాన్నీ గొంతులో మింగలేక కక్కలేక దాచుకున్నాను.

ఈ విషయం చెప్పి మిమ్మల్ని బాధ పెట్టడానికి మనస్కరించకపోయినా తండ్రి దగ్గర దాపరికం వుండరాదని మీ ముందర కూతురిగా వెళ్ళబోసుకున్నాను

– ఇట్లు

సారిక"

ఉత్తరం చదివి హతాశుడైనాడు రాధాకృష్ణయ్య.

ఒక్కసారిగా కనుల్లో నీరు చిప్పిల్లింది.

ఘోరమైన వేదనతో మునిగి పోయింది గుండె

ఆ క్షణమే ఆవేదనతో వున్న రాధాకృష్ణయ్యను అంతరాత్మ నిలదీసింది. "ఓ నాడు నీ స్వార్థం కోసం- గుండెల మీద కుంపటిలా భావించిన నీ కూతురి మెడలో తాళి కట్టించాలన్న బలమైన కాంక్షతో మరో ఆడపిల్ల చెడ్డదనే మరకను వేసి- సుకరమైన నీరాజ మార్గం కోసం అడ్డు తొలగించు కున్నావు. ఫలితం ఈ రోజెలా ఎదురైందో నీ కళ్లతో చూస్తున్నావు అనుభవించు..." వికృతంగా నవ్వసాగింది

రాధాకృష్ణయ్యలో అసలు మనిషి పశ్చాత్తాపంతో చితికి పోవటం మొదలెట్టాడు.

o

కొత్త సీరియల్ ప్రారంభం!

సాగరమథనం

అడివి సూర్యకుమారి

శ్రీలంక టైమ్స్...శ్రీలంక టైమ్స్
శ్రీలంక టైమ్స్...శ్రీలంక టైమ్స్
హాట్ న్యూస్..హాట్ న్యూస్
"రణసింఘెను పట్టుకొన్న వారికి 5 లక్షల రూపాయిల బహుమానం!" హాట్ హాట్ న్యూస్!

కొలంబో

ఉదయం 5గం. 50 నిముషాలు

సెంటర్లో పన్నెండేళ్ళ కుర్రాడొకడు పేపర్ల కట్ట భుజాన పెట్టుకొని అరుస్తున్నాడు.

అప్పటికే కొలంబో సిటీలోని అన్ని సెంటర్లలో ఈ ప్రముఖ వార్త దావానలంలాగా వ్యాపించింది!

ప్రతి ఒక్కరూ ఆ వార్త వింటూనే పేపరుకొని చూడసాగారు.

అయితే గత నాల్గు రోజులుగా మళ్ళీ అక్కడ 144 సెక్షన్ అమలులోకి రావటంతో ప్రజలెవరూ గుంపులుగా కాని, ముగ్గురు నల్గురు కలిసి నిలబడి మాట్లాట్టంగాని ‿గటం లేదు.

ప్రతి వీధిని అరగంటకోసారి మిలిటరీ ట్రక్కులు తిరిగి భయం కలిగిస్తున్నాయి.

ఎక్కడ ఎలాంటి అలజడి, అల్లరి కన్పించినా నిర్దాక్షిణ్యంగా కాల్చి పారెయ్యమని ఉత్తర్వులొచ్చాయి.

రోడ్ల మీద వెళ్ళేవాళ్ళలో కూడా అనుమానించదగ్గ వ్యక్తి ఎవరైనా కన్పిస్తే వాణ్ణి వెంటనే వెనకే వచ్చే వ్యాన్‌లో ఎక్కిస్తున్నారు మిలిటరీ అధికారులు.

సంజాయిషీలు-సంతాపాలు-ఏవీ, ఎవరూ వినటం లేదు.

గత ఆరేడేళ్ళుగా ప్రజలు ఈ ఊచకోతకి, మిలిటరీ వారి మితిమీరిన జులుంకి, టెర్రరిస్టుల టెర్రర్‌కి, విమోచనకారుల ఉద్యమానికి బలైపోతూనే ఉన్నారు!

కాని....వారం రోజుల క్రిందటి సంఘటన ప్రజల్ని ప్రభుత్వాన్ని కూడా భయభ్రాంతుల్ని చేసింది.

అది-

శ్రీలంక ప్రభుత్వము, ప్రతిపక్షాలు కూడా ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ యొక్క సేవలు తమకెంతో ఉపకరించాయని, ఇప్పుడు తమ దేశంలో శాంతి నెలకొన్నదని తెలుస్తున్నామని చెప్పాయి.

ఉద్యమకారులు ఐ.పి.కె.ఎఫ్. వెంటనే తమదేశం నుండి వెళ్ళకపోతే అరాచకం మిన్నుముట్టుందని హెచ్చరించాయి.


అంతేగాక అనేక మారణకాండలు సాగించి ప్రజల్లో భీతిని కల్గింపచేశాయి.

దీంతో శ్రీలంకప్రభుత్వము తప్పనిసరై ఐ.పి.కె.ఎఫ్.ని తిరిగి ఇండియా వెళ్ళిపొమ్మని కోరింది.

భారత ప్రభుత్వానికి ఈ విధంగా (విషయంగా) ఒక సందేశాన్ని శ్రీలంక ప్రెసిడెంటు పంపించారు.

ఇరుదేశాల దౌత్యాధికా ‿ ఈ విషయంగా సమగ్రమైన చర్చలు సాగించారు.

చివరికి శ్రీలంక కోరిక మేరకు





సాగరమథనం

భారత ప్రభుత్వం ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్‌ని తిరిగి స్వదేశానికి వచ్చెయ్యమని ఆదేశించటం జరిగింది.

భారతీయ శాంతిసేన ఉదయం ఆరు గంటలకి ట్రింకోమాలి తీరానికి చేరుకున్నారు. ట్రింకోమాలి - శ్రీలంకకి తూర్పు తీరాన వున్న నేచురల్ హార్బర్!

అంతకుముందు రోజే శ్రీలంక ప్రెసిడెంటు ప్రత్యేక దూత వారికి గౌరవపూర్వకమైన వీడ్కోలు అందించారు.

మూడురోజులు నుండి వారు బ్యాచీలవారీగా వెళ్తున్నారు. ఇ.పి.కె.ఎఫ్. మిలిటరీ ట్రక్కులలో నుంచి దిగిన వారంతా సైనికులే. ఇండియా వెళ్ళే స్టీమర్ రెడీగా వుంది.

శ్రీలంక మిలిటరీ ఉన్నతాధికారులు పీస్ కీపింగ్ ఫోర్స్‌కి హార్దిక వీడ్కోలివ్వటానికొచ్చారు.

అందులో ఇద్దరు శ్రీలంక ఇంటర్నల్ సెక్యూరిటీ ఎడ్వయిజర్స్, ఒకరు కర్నల్.

యూనిఫామ్‌లో కర్నల్ ఉన్నారు. మిగతా ఇద్దరూ ఫుల్ సూట్‌లో వున్నారు.

అందరూ కరచాలనం చేసి వెళ్ళి ఓడ ఎక్కారు. చేతులూపుతుండగా ఓడ కదిలింది.

తీరాన ఉన్న ఉన్నతాధికారులు చాలా నెలలుగా తమ మధ్య ఉంటూ తమ కష్టసుఖాల్లో పాలుపంచుకోవటానికొచ్చిన మిత్రులకు భారమైన హృదయాలతో చేతులూపుతూ సాగనంపారు.

ఓడ కన్పించినంత వరకూ నిలబడ్డారంతా.

కనుమరుగయ్యాక వెనక్కి మళ్ళారు.

సీ పోర్టు సందడిగా వుంది.

రామేశ్వరం నుండి వచ్చిన ఓడలో నుండి సింహాళీయులు దిగుతున్నారు. అందులో కొందరు స్ట్రెచ్చర్ల మీద తీసుకురాబడుతున్నారు. అలజళ్ళు, అల్లర్లు కొంత తగ్గాయని తెలిసి - అందాకా రామేశ్వరంలో తలదాచుకొన్న తమిళులు శ్రీలంకీయులు కూడా ఆ ఓడలో వున్నారు.

అంతా దిగి..

తమ ఇండ్లకు వెళ్ళే ఆత్రుతలో... చాలా కాలానికి మాతృభూమిపై కాలు మోపినందుకు, మిత్రుల్ని కలుసుకోబోతున్నందుకు ఆనందంగా వెళ్తున్నారు.

అలా వెళ్తున్న వారిని పోలీసులు ఓ



క్రమ పద్ధతిలో పంపుతున్నారు.

వచ్చిన ఉన్నతాధికారులు తిరిగి జీపు లెక్కిపోబోతున్నారు.

ఆ సమయంలో -

ఎక్కడి నుంచి వచ్చాయో పది బుల్లెట్లు వరుసగా కన్నుమూసి తెరిచేంతలో ఉన్నతాధికారులు ముగ్గురి గుండెల్లో నుండి దూసుకుపోయాయి.


జీప్ ఎక్కబోతున్నారిద్దరు, ఒకరు జీప్ దగ్గరకొస్తున్నారు.

ఎక్కడి వాళ్ళక్కడ హాహాకారాలు చేస్తూ కుప్పకూలిపోయారు.

కర్నల్ బాధతో కడుపు వైపు చెయ్యి పెట్టి కూడా పిస్టల్ తీసి బుల్లెట్స్ వచ్చిన దిక్కుకి వేగంగా కాల్చాడు.

కాని....

ఆ బుల్లెట్లు వెళ్తున్న ప్రయాణికులకి తగిలి వారు అక్కడి కక్కడే మరణించారు.



వెంటనే మిలిటరీ ఎలర్ట్ అయింది.

సీ పోర్టునంతా కవర్ చేసింది మిలిటరీ!

ఒక్కర్నీ బైటికి పోనివ్వలేదు.

అంగుళం అంగుళం మనుషుల్ని ఆ ప్రదేశాన్ని గాలించారు. కాల్చిన వ్యక్తి జాడలేదు.

అయితే - అక్కడ

విక్రాంతి దళ్ చిహ్నం - కాషాయ రంగు మీద సూర్యుడి బొమ్మ కన్పించింది.

అది విక్రాంతి దళ్ పనేనని స్థిరీకరించింది ప్రభుత్వం.

దేశంలో ఉన్నతాధికారులకే రక్షణలేక పోయాక సామాన్యుల మాటేమిటి? అని నిలదీశాయి ప్రతిపక్షాలు.

పత్రికలు అసమర్థపు ప్రభుత్వ పాలనని చెండాడుతూ వ్యాసాలు వ్రాశాయి.

అన్ని వైపుల నుండీ సవాళ్లే!

- ప్రతిపక్షాలు

విక్రాంతిదళ్!

జనతా విముక్తి పెరమున!

ఉద్యమకారులు!

విమోచన దళం!

టెర్రరిస్టులు!!

ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతున్నాయి.

ప్రభుత్వం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ప్రతిపక్షాలతో కలిసి చర్చించాక ఈ సంఘటనకు కారకుడు 'రణసింఘె' అని అక్కడ దొరికిన సాక్ష్యాధారాలు, అతనులోగడ చేసిన హత్యల వలె ఉన్న ఈ హత్యలు ఆధారంగా-

ఇప్పుడింత నిర్భయంగా, సీ పోర్టులో, అంత మిలిటరీ చుట్టు కవర్ చేసి ఉండగా.

మధ్యలో ఉన్న ఉన్నతాధికారుల్ని పట్టపగలే కాల్చిమాయమవటం - అంటే - అది తేలికైన విషయం కాదు.

సాగరమథనం

ఆ సమర్థత, తెగువ, ధైర్యం, తెగింపు - ఒక్క రణసింఘెకి తప్ప మరెవ్వరికీ లేవు.

అతడు చేసిన మారణకాండకు - కొన్ని ఊళ్ళు శ్మశానాలయ్యాయి. ఎందరో నిరాశ్రితులయ్యారు.

ఎంత మందో పసిపాపలు తల్లిదండ్రుల్ని కోల్పోయి అనాథలయ్యారు.

దీనికి అంతం లేకుండా సాగుతోంది.

అతని అరాచకాలకి పరాకాష్ట అనదగ్గ సంఘటన - ఉన్నతాధికారుల మూకుమ్మడి హత్యలు.

అందుకే ప్రభుత్వం అతణ్ణి పట్టించిన వారికి 5 లక్షల రూపాయల బహుమానం అని ప్రకటించింది.

ఈ ప్రకటన శ్రీలంకలోని ప్రతి పౌరుడూ విన్నాడు, చూశాడు, చదివాడు.

రేడియోల్లో, టి.వి.లో, సినిమాహాల్స్‌లో, పేపర్లలో అన్ని ప్రచార సాధనాలు ఈ ప్రకటనని ప్రముఖంగా ప్రచురించాయి.

పౌరులు తేలిగ్గా గుర్తించటానికి అతని బొమ్మకటౌట్స్ నాల్గు రోడ్ల కూడలిలో ఉంచారు.

ఇంత సంరంభం అతణ్ణి పట్టుకోవడానికి ప్రభుత్వం చేసినా-

ప్రజలు భయంతో అతని పేరు కూడా తలిచేందుకు జంకుతున్నారు.

అధికారుల్నే చంపి తప్పించుకున్న ఆ వ్యక్తిని ఎవరు పట్టుకొంటారు -

ఇద్దరు వ్యక్తులు ఒక చోట చేరితే - ఈ విషయమే మాట్లాడుకుంటున్నారు.

గాలిని గుప్పెట్లో బంధించగలరా?

నిప్పుని ఒడిసి పట్టగలరా?

నీటిని దోసిట నిలకడగా ఉంచగలరా?

ఇవన్నీ చేయగలిగితే - రణసింఘెని పట్టుకోవచ్చు.

ప్రకటన ఇచ్చిన మూడవ రోజు-

కొలంబో మిలిటరీ కంటోన్మెంటు సెక్యూరిటీ ఆఫీస్‌కి ఫోన్ వచ్చింది.

ఆఫీసర్ ఫోన్ ఎత్తి 'ఎస్. స్పీకింగ్' అన్నాడు.

"రణ సింఘె శవాన్ని దేహీవాలా జూపార్క్‌లో గుల్‌మెహర్ చెట్టు క్రింద ఉంచాను. వచ్చి స్వాధీనం చేసుకోండి. మీరిస్తానన్న బహుమతి 5 లక్షల రూపాయలు పాత సంచీలో వేసి ఆ సంచీని జూపార్క్‌కి 100 గజాల దూరంలో వున్న పోస్ట్ బాక్స్ వెనగ్గా వుంచండి. డబ్బు ఇవ్వడంలో తేడా వచ్చినా నన్ను తెలుసుకోవటానికి ప్రయత్నించినా మిమ్మల్ని కూడా రణసింఘె తోడుగా పడుకోబెడతాను" ఫోన్ కట్ అయింది.

రణసింఘె శవాన్ని చూసేందుకు ఆతృతగా తనే మందీ మార్బలంతో బైలుదేరాడు ఆఫీసర్.

పార్క్ దగ్గరికి రాకముందే వచ్చిన పోస్ట్‌బాక్స్ దగ్గర సంచీపెట్టి జీపులు పార్క్ ముందాగాయి.

అంతా పరుగు పరుగున గుల్‌మెహర్ చెట్ల వైపు పరిగెత్తారు. ఆరడుగుల రణసింఘె శవం అక్కడపడుకోబెట్టబడి వుంది.

అతని కాళ్ళపై, ఆపైన గుండెల్లోనూ బుల్లెట్లు దిగబడినాయి. అతణ్ణి ప్రాణాలతో పట్టుకోవాలని కాళ్ళను కాల్చారు. కాని అతను పట్టుపడకబోయేసరికి తప్పని సరై ప్రాణం తీసినట్లు తెలుస్తోంది.

వచ్చిన వారంతా బొమ్మల్లా నిలబడి - పచ్చని మెత్తని పచ్చికపై నున్న ఆ విగ్రహాన్ని రెప్పవేయక చూడసాగారు.

ఈ వార్త కార్చిచ్చులా వ్యాపించింది.

ఆరేళ్ళుగా జనాల్ని భయకంపితుల్ని చేసిన నరరూపరాక్షసుణ్ణి-

నిర్జీవుణ్ణి చేసిన ఆ మహావ్యక్తి ఎవరు?

పాఠకులే సెక్స్ కథలు కావాలంటున్నారా?

నిజమే!

ఈ ఆరోపణ నిజమే! ఎందుకంటే టీనేజ్ పాఠకులు సెక్స్ కథలు చదువు తున్నారు కనుక నేడు వస్తున్న పత్రికల్లో ప్రతి వారం శృంగార కథలు, సరసమైన కథలు వస్తున్నాయి.



నేడు వెలువడుతున్న పత్రికల్లో సెక్స్ కథలు, మంచి కథలు, రెండూ ప్రచురిస్తున్నారు.

– ఎ. విజయ్ కిరణ్ (నెల్లూరు)

మోతాదు మించకూడదు

నేటి యువత సెక్స్ సాహిత్యం వైపు మొగ్గు చూపటానికి కారణం నేడు ఆ సాహిత్యం కుప్ప తెప్పలుగా అందుబాటులోనికి రావటమే. యువత యిలా ఆకర్షితులు కావడం తప్పా?– ఆకర్షితులవుతున్నారు కదా అని యిలాంటి సాహిత్యాన్ని వీరిపై రుద్దే రచయితలది తప్పా?– అని ఆలోచిస్తే దొరికే సమాధానం ఒక్కటే– వాళ్ళు వ్రాస్తున్నారు కాబట్టి మేం చదువు చున్నాం– వాళ్ళు చదువు తున్నారు కాబట్టి మేం వ్రాస్తున్నాం– అని.

ఇలాంటి సాహిత్యం వ్రాయనూ వచ్చు– చదవనూ వచ్చు– కాని దానికి ఒక మోతాదు అంటూ వుంటే అందరికీ ఆమోదమే– దేనికయినా ఒక హద్దున్నట్టు!

– పి. వెంకటేశ్వర్లు (పోరుమామిళ్ల)

పచ్చి అబద్ధం

నో... పచ్చి అబద్ధం. నిజమయిన పాఠకులు దేన్నైనా తెలుసుకోటానికి ఉత్సుకత చూపుతారే గాని సెక్స్‌కే పరిమితం కారు. సెక్స్ ఒక భాగమని దానినే ఆర్పిస్తుండటం ఇంటలిజెన్స్‌నే తగ్గిస్తుందని గ్రహించి అర్థం చేసుకున్న ఏ పాఠకులు సెక్స్ కథలకే అంత ప్రాముఖ్యం చూపరు. పాఠకులు నవరసాలను సమపాళ్ళలో ఆస్వాదిస్తారే తప్ప– ఒకే రసానికి అంకితమయిపోరు. సెక్స్ మాత్రమే జీవితం కాదని పాఠకులు బాగా గమనించ గలరు. పాఠకులు తమ అక్వయిరింగ్‌లో సెక్స్‌నే చూసుకుంటే ఆ అవేర్‌నెస్‌తో ఇంటలిజెన్స్ అనే వ్యక్తిత్వ లక్షణాన్ని పూర్తిగా కోల్పోతారు.

– సహదేవ్ (బోళ్ళవరం)

పునాది

పాఠకులు సెక్స్ కథలు కావాలని ఎప్పుడు కోరరు. అది వారి పునాదిని బట్టి వుంటుంది. పాఠకులు చిన్నప్పట్నించి మంచి కథలకే అలవాటు పడ్తే అటువంటి



కథలే చదవటానికి ఇష్టపడ్తారు. మారే కాలాన్నిబట్టి కథల్లో కూడా సెక్స్ ఎక్కువగా వుంటే పాఠకుని అభిరుచి కూడా మారుతుంది. అతనికి అవే చదవాలనిపిస్తుంది. దీనివల్ల అతని అభిరుచి దెబ్బ తింటుంది. సెక్స్ వుండకూడదని కాదు. వుండొచ్చు. కాని తామరాకుపై నీటి బొట్టులా. అప్పుడే కథకు అందం.

యర్రా శ్రీనివాసరావు(ఋషి)
పాలకొల్లు

ఎవరు? అని అంతా చర్చించుకోసాగారు.

తలా ఓరకంగా అనుకోసాగారు.

టెర్రరిస్ట్‌లని కొందరు, విమోచన దళం, ఉద్యమకారులని - ఎవరికి తోచిన విధంగా వారు పేర్లు పెట్టుకున్నారు.

కానీ...అనేక మంది టెర్రరిస్టులని, ఉద్యమకారులని జాతీయ విమోచనదళం వారిని ఎందరినో నిర్దాక్షిణ్యంగా చంపివేసిన రణసింఘెని అతని మనుషులే అతన్నెలా చంపుతారు? అన్న ఆలోచన ఎవరికీ రాలేదా క్షణంలో! ఎవరైతేనేం!

కొంతకాలంగా ప్రజలకి, ప్రభుత్వానికి మనశ్శాంతి లేకుండా చేసిన భూతాన్ని శాశ్వత సమాధి చేశారు.

అతని శవాన్ని అక్కణ్ణించి తరలించారు.

పోస్ట్‌బాక్స్ దగ్గర ఉన్న పాత బ్యాగ్ భద్రంగా అలాగే వుంది.

ఓ అరగంటలో జూపార్క్ దగ్గర గుమికూడిన జనం అంతా వెళ్ళిపోయారు.

దేహీవాలా జూపార్క్ ఎదురుగా నేషనల్ బ్యాంక్ వుంది. ఆ బ్యాంకిపై అంతస్థులో ఓ వ్యక్తి బైనాక్యులర్స్ పెట్టుకొని చూస్తున్నాడు.

అతను దేహీవాలా జూపార్క్‌ని చూస్తున్నాడు. నలభై ఎకరాల్లో ఉందా పార్క్. ఇప్పుడా పార్క్ చూసేందుకు జనం ఎవరూ రావటం లేదు. అల్లర్ల దృష్ట్యా పార్క్ నిర్మానుష్యమైంది.

జూపార్క్ పరిసర ప్రాంతాల్ని, కొండ చరియల్ని, చరియల్లో ఉన్న టీ, కాఫీ తోటల్ని, ప్రకృతి అందాల్ని పరవశంతో చూస్తున్నాడు.

పార్క్‌కి కొద్దిదూరంలోనే తథాగత పబ్లిక్ స్కూలుంది. స్కూలు కాంపౌండ్ వాల్ దాటిం తర్వాత వచ్చిన స్ట్రీట్ లైట్ స్తంభానికి పక్కగా వుంది పోస్ట్ బాక్స్. దానికి కొంచెం వెనగ్గా వుంది పాత బ్యాగ్. పోస్ట్‌బాక్స్‌కి వందగజాల దూరంలో వుంది జూపార్క్.

సాయంకాలం నాలుగు దాటింది.

స్కూలు వదిలారు.

పిల్లలు గుంపులు గుంపులుగా,

జట్లు జట్లుగా రోడ్డు వారగా నడుస్తున్నారు.

ఆ వ్యక్తి దృష్టి రోడ్డుకి మొదలు నుండి చివరి వరకూ రెస్ట్‌లెస్‌గా తిరుగుతోంది.

జూపార్క్ ముందు నుండి పిల్లలు గుంపులు గుంపులుగా వెళ్తున్నారు. పుస్తకాల సంచులు భుజాన వేసుకొని క్యారియర్లు చేత పుచ్చుకొని ఓ చెయ్యి స్నేహితుల భుజాన వేసుకొని నడుస్తున్నారు.

కొందరు పిల్లలు నిలబడి లోపల - చెట్లపై ఎగిరే కోతుల్ని, పరిగెత్తే లేడి పిల్లల్ని చూస్తున్నారు.

భుజాలతో నెట్టుకుంటూ తోసుకుంటూ పిల్లలు పోతున్నారు.

అతని దృష్టి పిల్లల మీది నుండి పోస్ట్ బాక్స్ వైపు మళ్ళింది.

ఆశ్చర్యం!! అతని కళ్ళు వెడల్పయ్యాయి.

మళ్ళీ మళ్ళీ చూశాడు.

అక్కడ ఆ పాత బ్యాగ్ లేదు.

(ఇంకా వుంది)

న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు

అడ్వొకేట్: **బి.భాస్కరరావు** ఎం.ఎ.,ఎల్.ఎల్.బి.



సి. ఆర్. కృష్ణప్రసాద్, హైదరాబాద్-44.

ప్రశ్న:- నేను రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, సికింద్రాబాద్ వారు నిర్వహించిన వ్రాత పరీక్షలోను, ఇంటర్వ్యూలోను, ఉత్తీర్ణుడనై "ట్రాఫిక్ అప్రెంటిస్" పోస్టుకు సెలెక్ట్ అయ్యాను. నాకు ఆఫర్ ఆఫ్ అపాయింట్‌మెంట్ పంపించి మెడికల్ ఎగ్జామ్‌కు పంపించారు. దనిలో ఎడమ కంటి దూరపు చూపు తక్కువగా ఉంది "పవర్ గ్లాస్" వాడవలసి వున్నది. కాబట్టి ఈ పోస్టుకు నన్ను అనర్హుడు అని అపాయింట్‌మెంట్ ఆర్డర్ పంపించ లేదు. ఈ పోస్టుకు గ్లాసెస్ ఉన్నవారు అనర్హులు అని వారి వివరణ. రిక్రూట్‌మెంట్ బోర్డు వారు ఇంటర్వ్యూ జరిపి లిస్టులు 1988 ఏప్రిల్‌లో పంపించారు. కాని చీఫ్ పెర్సనల్ ఆఫీసర్ 1990 మార్చిలో ఆఫర్ ఆఫ్ అప్పాయింట్‌మెంట్ పంపించారు. ఈ విధంగా రెండు సంవత్సరములు గడచిపోయినవి. ఇంతవరకు పవర్ గ్లాస్ ధరించిన వారు అనర్హులని బోర్డు వారు తెలియపర్చ లేదు. రైల్వేలో జాయను అవుతానన్న ఆశతో నేను మిగిలిన బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ మొదలగు పరీక్షలకు వెళ్ళలేదు. నా వయస్సు ఇప్పుడు 28 సంవత్సరములు. అన్ని సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగాలకు అనర్హుణ్ని అయ్యాను. సికింద్రాబాద్ -రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వారు ఈ ఒక్క అడ్వర్‌టైజ్‌మెంట్‌లో మాత్రం విజన్ స్టాండర్డ్‌ని ప్రస్తావించ లేదు. ఇన్ని లోపాలతో జరిగిన రిక్రూట్‌మెంట్ వల్ల నేను నష్టపోయిన విషయం వివరిస్తూ, నాకు అదే స్కేలులో నా విజన్‌కు సరిపోయే "కమర్షియల్ అప్రెంటిస్" లేదా "సెక్షన్ కంట్రోలర్" పోస్టులకు తీసుకొన వలసినదిగా ఎస్. సి. రైల్వే జనరల్ మేనేజర్‌కు అప్పీలు పెట్టుకున్నాను. ఈ పోస్టుకు గల రెండు సంవత్సరాల ట్రైనింగ్ బ్యాచ్ మార్చి 26 నుండి ప్రారంభమైంది. కాబట్టి త్వరగా నిర్ణయం తీసుకొన వలసినదిగా మార్చి 24 తేదీన కోరాను. ఇంతవరకు సమాధానం రాలేదు. నేను ఏ కోర్టులో కేసు వెయ్యాలి? తాత్కాలికంగా న్యాయపీఠం ఉత్తర్వులు జారీ చేస్తుందా? నేను మధ్య తరగతి కుటుంబీకుడను. ఎక్కువ ఖర్చు భరించలేను. వివరంగా తెలియపరచ వలెను.

జవాబు:- మీరు రైల్వే ఉద్యోగం మీద ఆశ పెట్టుకొని మిగిలిన ఉద్యోగాలకు ప్రయత్నించకుండా నష్ట పోయారు. మీరు "ట్రాఫిక్ అప్రెంటిస్"గాఅనర్హులు అయినప్పుడు కనీసం "కమర్షియల్ అప్రెంటిస్"గా వెయ్యవచ్చును. దానికి విజన్ టెస్ట్‌లు లేదు గనుక ఈ విషయంలో సుప్రీంకోర్టు, మరియు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులు ఇచ్చాయి. ఆ తీర్పుల వివరాలు ఇవి:

మొహమ్మద్ సగీరుద్దీన్ 1940లో బెంగాల్ అస్సాం రైల్వేలో (నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే) జాయను అయ్యాడు. అతను 1961 వరకు సి.గ్రేడ్ ఇంజను డ్రైవర్‌గా ఉద్యోగం చేశాడు. ఇంజన్ డ్రైవర్లకు మెడికల్ టెస్టులు ఉంటాయి. 1961 డిసెంబర్ 25తేదీన డిస్ట్రిక్ట్‌మెడికల్ ఆఫీసర్ పరీక్ష చేసి ఇంజన్ డ్రైవర్‌గా సగీరుద్దీన్ ఉద్యోగం చెయ్యడానికి అన్‌ఫిట్ అని తెలియపర్చాడు. రైల్వే వారు రైల్వే ఎస్టాబ్లిష్‌మెంట్ కోడ్‌లోని రూలు 152 ప్రకారం సగీరుద్దీన్‌కు సెలవు మంజూరు చేశారు. పంప్ ఇంజన్ డ్రైవర్‌గా ఉద్యోగం ఇచ్చారు. సగీరుద్దీన్ పంప్ ఇంజన్ డ్రైవర్‌గా చేరాడు. క్రింద పోస్టులో వేసినందు వలన శిక్ష క్రింద పరిగణించాలని పాట్నా హైకోర్టులో 1962లో రిట్ పిటీషన్ పెట్టుకున్నాడు. హైకోర్టు రిట్ పిటిషన్ 1965లో డిస్మిస్ చేసింది. సగీరుద్దీన్ సుప్రీంకోర్టుకు అప్పీలు పెట్టుకున్నాడు. సుప్రీం కోర్టు తీర్పులో రూలు 152 సక్రమంగా ఉన్నదని అన్నారు. మెడికల్‌గా అన్‌ఫిట్ అయిన ఉద్యోగిని తొలగించాలి. కాని రూలు 152లో విజన్ టెస్టులో అపజయము పొంది మరియొక ఉద్యోగము చెయ్యడానికి అర్హుడు అయినప్పుడు అతనిని ఉద్యోగం నుండి తొలగించకుండా మరియొక ఉద్యోగములోనికి మార్చవలెనని నిర్దేశిస్తున్నది అని సుప్రీం కోర్టు పేర్కొన్నారు. సగీరుద్దీన్‌కు పంప్ ఇంజన్ డ్రైవర్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఈ ఉద్యోగం వలదని అంటే ఉద్యోగం నుంచి తొలగించవలసి వస్తుంది. కనుక ఈ ఉద్యోగం శిక్ష క్రింద పరిగణించడానికి వీలు లేదు, అని సుప్రీంకోర్టు అభిప్రాయ పడ్డారు. ఇంజన్ డ్రైవర్‌గా అన్‌ఫిట్ అయ్యాడు. కాబట్టి మరియొక ఉద్యోగం ఇచ్చారు. అందుచేత అప్పీలు డిస్మిస్ చేయడమైనది అని ముగ్గురు జడ్జీలు గల సుప్రీం కోర్టు ధర్మాసనం 1973లో తీర్పు చెప్పారు. (1973 ఎస్. సి. 1306) మీరు ఉద్యోగంలో చేరలేదు. కనుక ఈ రూలు మీకు వర్తించదు. కాని "ట్రాఫిక్ అప్రెంటిస్" పోస్టునకు విజన్ టెస్టు

టేప్‌రికార్డర్‌కి దొరికిన హంతకుడు!

హత్య చేసిన వ్యక్తిని పట్టుకోవడంలో పోలీసులకు శునకాలు ఉపయోగపడిన మాదిరి టేప్‌రికార్డర్‌లు కూడా ఉపయోగపడతాయన్న విషయాన్ని అలబామాలో జరిగిన సంఘటన ఒకటి రుజావు చేసింది.

లైటర్‌మాన్ అనే వ్యాపారవేత్త హత్యకు టేప్ రికార్డర్ సాక్ష్యంగా మిగిలిందట. ఆ వ్యాపారవేత్త తన వ్యాపార నిమిత్తం మరో వ్యక్తిని కలుసుకునేందుకు వెళ్తూ తమ మధ్య జరిగే సంభాషణలను రికార్డు చేసుకునేందుకు ఒక టేప్ రికార్డరు జేబులో పెట్టుకెళ్లాడట. ఆ సంభాషణలు వాగ్వివాదానికి దారి తీసి లైటర్‌మాన్ హత్యకు కారణమయ్యాయి. హంతకుడు ఎంచక్కా పారిపోదామని ప్రయత్నించాడు కాని పోలీసులకు చిక్కిపోయాడట. ఎలా అంటే ఆ టేప్‌రికార్డర్ వీళ్ల గొడవంతా రికార్డు చేసిందట. ఆ టేప్‌రికార్డరే లేకపోతే హంతకుడిని పట్టుకోవడానికి పోలీసులు ఎంత ప్రయాస పడాల్సి వచ్చేదో మనందరికి తెలిసిన విషయమే! టేప్‌రికార్డర్ జేబులో పెట్టుకొని తిరగటం ఎందుకైనా మంచిదేమో! రోజులసలే బాగోలేదు.


ఉన్నట్లయితే ఆ విషయం మీకు ప్రకటనలో ముందుగా తెలియ జెయ్యాలి. రిక్రూట్‌మెంట్ బోర్డు వారు ఆ విధంగా చెయ్యలేదు.

ఇక రైల్వే ఉద్యోగికి రూలు 152 ప్రకారం ఒక పోస్టునకు విజన్ టెస్టులో అన్‌ఫిట్ అయినప్పుడు మరియొక పోస్టు ఇవ్వవలెనని ఉన్నది. మీకు ఆర్డర్ ఆఫ్ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. విజన్ టెస్ట్‌లో అన్‌ఫిట్ అయ్యారు. కాబట్టి మీకు కూడా అదే న్యాయం వర్తింపజేసి మరియొక ఉద్యోగం ఇవ్వాలి. లేనట్లయితే వివక్షత చూపినట్లు అవుతుంది. ఇది రాజ్యాంగంలోని 14, 16 అధికరణలకు విరుద్ధం అవుతుంది. కనుక మీరు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు రిట్ పిటిషన్ పెట్టండి. ఇక విజయకుమార్ కేసులో కూడా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 1986లో తీర్పు చెప్పింది. విజయకుమార్ స్టేట్ బ్యాంక్‌లో ప్రొబేషన్ ఆఫీసర్ పరీక్షకు 1980 లో వెళ్ళాడు. వ్రాత పరీక్ష ప్యాసయిన తర్వాత ఇంటర్వ్యూలో సెలక్టు అయ్యాడు. మెడికల్ చెక్‌అప్‌లో అతనికి కలర్ బ్లైండ్ అని రిపోర్టు ఇచ్చారు. విజయకుమార్‌నకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించారు. విజయ కుమార్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టునకు రిట్ పిటిషన్ పెట్టుకున్నాడు. హైకోర్టు తీర్పు చెప్తూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఐ. ఏ. ఎస్., ఐ.పి.ఎస్ మొదలైన సర్వీస్‌లకు. రైల్వే ఎక్కౌంట్స్ సర్వీస్, రైల్వే పెర్సనల్ సర్వీస్‌లకు, ఇన్‌కమ్‌టాక్స్. పోస్టల్ సర్వీసులకు కలర్ బ్లైండ్‌నెస్ వలన ఉద్యోగాలు తిరస్కరించలేదని అభిప్రాయ పడింది. రంగు గుడ్డితనం వలన ఉద్యోగం నిరాకరించ కూడదు. అది రాజ్యాంగములోని 21 అధికరణకు విరుద్ధం అవుతుంది. రంగులు గుర్తించడంలో అన్‌ఫిట్ అయిన బ్యాంక్ డ్రైవర్‌ను క్లార్క్ పోస్టులో నియమించవచ్చును అని హైకోర్టు పేర్కొంది. కలర్ బ్లైండ్ వున్న అభ్యర్థి ఐ. ఏ. ఎస్. ఆఫీసర్‌గా నియమించబడినప్పుడు బ్యాంక్‌లో ఉద్యోగానికి ఎందుకు అర్హత లేదో అర్థం కాదు, అంటూ కలర్ బ్లైండ్ అభ్యర్థులను ఉద్యోగానికి అనర్హులుగా ఉత్తర్వులు జారీ చెయ్యడం అన్యాయము. మరియు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు తీర్పు చెప్పింది. విజయకుమార్‌ను ప్రొబేషన్ ఆఫీసర్‌గా నియమించవలెనని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 1986లో తీర్పు చెప్పింది. (1986 ఏ. ఎల్.టి. 543) కాబట్టి సుప్రీం కోర్టు: ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు తీర్పుల ప్రకారం మీకు "ట్రాఫిక్ ఎప్రంటిస్"గా నియమించనట్లయితే కనుసం "కమర్షియల్ ఎప్రంటిస్"గా నియమించ వచ్చును. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు వారు మీకు ఉద్యోగం తిరస్కరించడం ఏకపక్షమని, భారత రాజ్యాంగంలోని 14, 16, 21 అధికరణలకు విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వెంటనే రిట్ పిటిషన్ వెయ్యండి. మీకు అందుబాటులో ఉన్న లాయర్‌ను సంప్రదించండి. రిక్రూట్‌మెంట్ విషయంలో సాధారణంగా హైకోర్టు జోక్యం చేసుకోనదు. కాని మీకు అన్యాయం జరిగినదని హైకోర్టు అభిప్రాయపడినట్లు అయితే మీకు తప్పక న్యాయం జరుగుతుంది.

శ్రీకొండ నవీన్, గూడూరు

ప్రశ్న: పంపలేదు.

జవాబు: మీరు రాష్ట్రపతికి పంపిన లేఖ కాపీని మాత్రం పంపించారు. బినామీ కేసు క్రింద మిమ్ము సర్వీసు నుంచి తొలగించినట్లు తెలియుచున్నది. మీ ప్రశ్నకు 30-3-1990 తేదీగల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సమాధానం ఇవ్వబడినది. ౦



ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....

పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

'కాలం కలిసివస్తే నడిచొచ్చే కొడుకు పుడ్తాడట!' కలిసిరాకపోతే కొడుకు పుట్టడం అటుంచి ... కాదు... దేనికైనా కాలం కలిసి

కాలం కలిసి వచ్చింది

'బుధ'



రావాలి మరి !

నా మటుకు నేను ఎవ్వరితో పోట్లాడి ఎరగను. నాకు ఎవ్వరిపైనా ద్వేషం లేదు....నాపై కూడా ఎవ్వరికీ ద్వేషం లేదనే నా ఉద్దేశ్యం.

ఒకరిద్దరు నాకు కీడు తలపెట్టినా, నష్టము కల్గించినా, బాధ పెట్టినా... వారి కెలాంటి అపకారము తలపెట్టలేదు. నిజానికి ఇప్పుడు నా కెవరో కీడు తలపెట్ట లేదు....నా కిప్పుడు కాలం కలసి రాక నడిచొచ్చే కొడుకు పుట్టాడు.

****

"అన్నా! నీ వెందుకింకా పెళ్లి చేసుకోలేదు" పార్కులో నన్ను ప్రసాద్ అడిగాడు. ప్రసాదు నా కన్నా ఎంతో చిన్న - కానీ రోజూ కలవడంవల్ల మా యిద్దరి మధ్య మంచి 'ఫ్రెండ్‌షిప్' ఏర్పడింది.

ఆ సమయంలో మా మాటలు వినబడేంత దూరంలో మురళి ఉన్నాడు. మురళికి నాకూ పరిచయంలేదు.... కాని మురళి సుప్రియ తమ్ముడు.

నాలో కాస్త కొంటె బుద్ధి పుట్టింది. వెంటనే పర్యవసానం ఆలోచించకుండా - "పెళ్లెందుకు చేసుకోనా!?....రెండో పెళ్లి ఎవరైనా చేసుకుంటారా!? నా కిప్పుడు నడిచివచ్చే కొడుకున్నాడు....వాడికేం పేరు పెట్టాలోనని ఆలోచిస్తున్నా!" మురళి చెవిన పడాలనే కాస్త గట్టిగా అన్నాను.

"ఓహో!...." ప్రసాదు అర్థాంతరంగా లేచి వెళ్లిపోయాడు.

అప్పుడు ప్రసాదు ఎందుకలా వెళ్లిపోయాడో, తర్వాత అర్థమైంది నాకు.

సుప్రియను ఏడిపించాలనే ఉద్దేశ్యంతో అలా అసత్యం చెప్పాను.

సుప్రియ నన్ను ప్రేమిస్తోంది.

నేను సుప్రియను ప్రేమిస్తున్నాను.

మా ప్రేమకు మాటలు రాలేదింకా.....

కానీ, మా కనులు మాటాడుకుంటాయి. మా మనసులు దోబూచులాడుకుంటాయి.

సుప్రియ, లత ఇద్దరూ పార్కుకు వస్తారు. అందరం ఒకే కాలనీ వాళ్లమే కాబట్టి ఎవరు ఎవరింటి వాళ్లో అందరికీ తెల్సు. అట్లాగని ఎవరి పూర్తి వివరాలూ ఎవరికీ తెలియవు.

నా వాలకం, సుప్రియ ఆలోచనలు లత పసికట్టేసింది. ఇంకేం మరో యిద్దరి స్నేహితురాళ్లకి కూడా తెల్సిపోయింది ఆ సంగతి.

ఆ రోజు సుప్రియ పార్కుకు రాలేదు.

చీకటి పడేదాక ఉండి నేను వెళ్లిపోయాను.

****

మరుసటి రోజు సాయంత్రం కూడా పార్కుకు వెళ్లాను నేను.

ఆరోజు ప్రసాదు రాలేదు.

కాసేపటికి సుప్రియా, లత వచ్చారు.

సుప్రియ నల్లటి దుస్తులు వేసుకుంది.

"ఏమిటే! ఏమైంది నీకు!!" లత అడిగింది. లత మాటలు నాకు వినబడ్డాయి.

సుప్రియ మోకాళ్లపై తల ఆన్చింది.

సుప్రియ ఏం జవాబు చెప్పిందో నాకు వినబడలేదు....

లత మాత్రం వినకూడనిది విన్నట్టు చెయ్యితో నుదిటిని పదే పదే కొట్టుకుంది.

సుప్రియ కళ్లు తుడుచుకుంది. ఆమె కదలికలు చూసి ఏడ్చిందని - కన్నీళ్లు తుడుచుకుందని గ్రహించాను.

అంతే! వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

నాకేమిటో అర్థం కాలేదు విషయం.

సుప్రియకు పెళ్లికి ఏర్పాట్లు జరుగుతున్న విషయం నాకు తెల్సు.... ఏదైనా పెళ్లి చూపులను ఎదుర్కోవాలని బాధ పడుతోందేమో!

ఇలా నేనెందుకు అనుకుంటున్నానంటే సుప్రియ నన్ను ప్రేమిస్తోందని కచ్చితంగా తెల్సు కనక. అందుకు సాక్ష్యం ఏదీ అని అడగకండి - ఇలాటి వాటికి సాక్ష్యాధారాలు ఉండవు మరి. అటువంటి విషయాలు ఎవరికి వారే అనుభవాన తెల్సుకోవాలి.

సుప్రియను చూసినప్పుడు నా మనసు చాలా చిత్రంగా నాట్యం చేస్తుంది.

చల్లని వెన్నెల్లో విహరించే పక్షిలా, ఆనందసాగరంలో కేరింతలు కొడుతూ, సుందర మనోహర ఉద్యానవనంలో ఆడి పాడి అలసిపోయినట్లు తన్మయత్వంలో మునిగిపోతుంది నా మనసు. ఆమె కనబడిన వెంటనే అదో ఆనందం.... ఉల్లాసం... ప్రశాంతం....తన్మయత్వం.... అనురాగం...నామనసులో అదో స్పందన... ప్రతిస్పందన....అప్పుడు నా మనసొక పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తూంటుంది. ఇవన్నీ నేను సుప్రియను ప్రేమిస్తున్నాననేందుకు ఋజువులు అని మీరంటారని తెల్సు.

ఆమె నన్ను ప్రేమిస్తోందని నేనెలా అనుకున్నానంటే -

ఆమె వస్తూంటుంది.

నాలో ఆనందం వెల్లుబుకుతూంటుంది. అప్పుడెవరైనా నా పక్కన ఉంటే -

"ఆమె నన్ను ప్రేమిస్తోంది - అటు చూడండి! అందుకు సిగ్గుపడే ఆమె కనురెప్పలే సాక్షి."

"ఆమె ఆరాధిస్తోంది - అటు చూడండీ! అందుకు రెప్పల బరువుతో తటపటలాడిస్తూ నన్ను చూసే ఆ చూపులే సాక్షి."

"ఆమె నన్నే సర్వస్వంగా ఎంచి నా ఎదలో ఒదిగిపోవాలని వస్తూంది - అటు చూడండీ! అందుకు తన్మయత్వంగా తన్ను తాను మరిచిపోయి నా వేపు వేసే ఆ అడుగులే సాక్షి."

అంతే మీకు కనిపించేది.

నాలుగు కన్నులు రెండవడమూ -

రెండు హృదయాలు ఒకటవడమూ -

ఆమెకు తెల్సు - నాకు తెల్సు - ఇది మీకు తెలియదు.

ఇంత జరిగినా - ఆమె కౌగిలి కోసం నేను తపించడం లేదు - నా స్పర్శకోసం ఆమె ఎదురు చూడడంలేదు.... మా మధ్య ఏదో మధుర భావన - అసలు ఆ మధుర భావన 'ఉందో' 'లేదో!' తెలియనట్టు మమ్మలను మేము మరచిపోతాము ఇరువురం ఒకటవుతాము.

****

వారం రోజులు సుప్రియ రాలేదు.

ఆ వారం రోజులూ నా ఆవేదన వర్ణనాతీతం.

సుప్రియకు పెళ్లి నిశ్చయం అయిందా!?

నాకు తెలియదు - తెలిపేందుకు ప్రసాదు పార్కుకు రావడం లేదు - నాకో అనుమానం వచ్చింది. మురళి నేను ప్రసాదుతో అన్న మాటలు సుప్రియ చెవిన వేస్తే సుప్రియ నాతో పోట్లాడేందుకు వస్తుందనుకున్నా! - ఇంకెవరో చెవిన వేసుంటాడు - సుప్రియకు చీవాట్లు పడుంటాయి - ఏమి జరిగిందో -తెరవెనుక - సుప్రియ నాతో పోట్లాడేందుకు వస్తే నిజం చెప్పి 'సారీ' చెబుదామనుకున్నా కానీ ఏదీ! . పరిస్థితి చూస్తుంటే పూర్తిగా చేయి జారినట్టుంది.

"ఏమిటి మేష్టారూ! ఒక్కరే ఏదో ఆలోచిస్తున్నారు!?" సత్యం వచ్చాడు.

సత్యం మూర్తిగారి కొడుకు. మూర్తికి నాకు కథల పరిచయం. మూర్తీ నేనూ ఇద్దరం పోటీలకు కథలు పంపేవాళ్ళం - ఒకసారి మూర్తిది, ఒకసారి నాది సెలెక్టు అయ్యేవి.

"ప్చ్! ఏం లేదండీ!"

"మీ కోసం ఇంటికి వెళ్లాను.... మీ రిక్కడుంటారని చెబితే ఇక్కడికొచ్చాను. మా నాన్న మీతో మాట్లాడాలన్నారు.... మీరు ఇక్కడే ఉంటారా?"

"ఇక్కడ ఉండడం ఎందుకు? మీ యింటికే వస్తా!" లేవబోయాను.

"అబ్బే! అక్కడ లేము...ఇల్లు మార్చాము.... మీరిక్కడే ఉండండి... నాన్న వస్తారు."

"సరే....ఉంటాగా! మళ్లీ ఏదైనా కథల పోటీ వుందా?" నా మాటలు సత్యం చెవిని చేరలేదేమో జవాబు రాలేదు.

చీకటి పడుతూ ఉంది.

సుప్రియ రాకపోవడంవల్ల నా హృద యంలో చీకటి అలముకొనే ఉంది.

ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు ఉన్నాయి. మబ్బులు లేనిచోట నక్షత్రాలు మినుకు మినుకు మని మిడిసిపాటు పడు తున్నాయి.

"ఏమిటి ప్లాటు ఆలోచిస్తున్నారా?" మూర్తిగారు దూరం నుంచే అన్నారు.

"అబ్బే! మూడ్ బాగా లేదు...."

"అయితే ఇంకేం - మూడ్ బాగా అవుతూనే కథ రాసేస్తారనేగా!"

"ప్చ్!" ఎలా సంభాషణ సాగించాలో అర్థంకాక అన్నాను.

"సరేగానీ కవిగారూ - మా పక్కింట్లో మీ పేరు పదే పదే వినిపిస్తోం దేమిటి!? - వాళ్ల అమ్మాయి సరిగా అన్నం తినడం లేదట - అసలు విషయం ఏమిటీ?' '

"ఏముంది - మీరూ కవే గదా - అక్కడ అమ్మాయి - ఇక్కడ అబ్బాయి - కొంత కాలం ఆమె నేనూ 'ఒకటి'గా ఇప్పుడు ఆమె 'ఆమె'లా నేను 'నేను'లా మామధ్య దూరం 'దూరం'లా ఉంటోంది...." నిట్టూర్చాను నేను.

"అంటే!"

"మరోలా భావించకండీ! మా మన సులు ఏకమయ్యాయి - శరీరాలు కాదు సుమా!"

"ఓహో! అక్కడి పెద్దలో ఇక్కడి పెద్దలో అడ్డుపడ్డారన్న మాట." సిగరెట్టు

వెలిగించాడు మూర్తి.

"నా మాటే పెద్దల మాట కూడా! అక్కడే ఏం జరుగుతుందో తెలియని పరి స్థితి - నే నొక రోజు 'తమాషా'చేద్దామని నాకు నడిచొచ్చే కొడుకు వున్నాడని - వాడికేం పేరు పెట్టాలోనని ఆలోచిస్తున్నా నని ఆ సుప్రియ తమ్ముడికి వినబడేలా అన్నాను - ప్రసాదనే అబ్బాయితో!"

"ప్రసాదా! - సుప్రియకు దూరం చుట్టమేగా - ఆ పిల్లాడు నీ గురించి వివరాలు సేకరించడానికి వచ్చాడోయ్ - నీ విషయం వాళ్లు దృష్టిలో పెట్టుకొనే



వాణ్ని పంపారు నీ దగ్గరికి."

"అయ్యయ్యో! ఎంత పని జరిగింది!"

"జరగదా మరి!...ఎంత పొరపాటు చేశావు - అమ్మాయిల్ని ఏడిపించడానికి కూడా అనుభవం ఉండాలి - ఎలాబడితే అలా ఏడిపించాలని ప్రయత్నిస్తే ఇలాంటి అనర్థాలే జరుగుతాయి. నీవేమో ఒక వైపు అవస్థపడుతున్నావా? ఆ అమ్మాయి పాపం నిన్ను మనసారా ప్రేమించి - ఇప్పుడు భవిష్యత్తు అంధకారంగా తోచి ఆహార పానీయాలు వొదిలేసింది మరి - ఆ అమ్మాయిని చూసి ఆ తల్లిదండ్రులు ఒకటే ఆందోళన చెందుతున్నారు."

"ఏమిటి!'తమాషా'కన్న మాటల్ని ... సీరియస్‌గా తీసుకుంటారనుకో లేదు"

"సీరియస్ కాదేమిటయ్యా! సర్లె సర్లె - అయినా - మన స్త్రీల మనస్సు ఎంత సున్నితంగా ఉంటుందో నీకు తెలియదా - మరో స్త్రీకి అన్యాయం చేయగూడదని పెళ్లయిన వాడి జోలికి రాదు - కానీ ఆ ఇంగితజ్ఞానం మగవాళ్లకే లేదు. పెళ్ల యినవాళ్లను....పిల్లలున్న వాళ్లను...ఎవడినీ బడితే వాడిని ప్రేమించడానికి....ఎవడితో బడితే వాడితో అక్రమ సంబంధం ఉంచుకో డానికి మన సంప్రదాయం సంస్కృతి ఇంకా దిగజారలేదయ్యా! సరె సర్లే! ... ఒక స్త్రీ ఒకడిని ప్రేమించిందంటే అతని పై ఎంతో విశ్వాసం ఏర్పరుచుకున్నాకనే - సరెసర్లే! ప్చ్!! మొత్తానికి ఆ అమ్మాయి మనసును తీవ్రమైన క్షోభకు గురి చేశావయ్యా!....వెం టనే వెళ్లి క్షమాపణ చెప్పుకో!!" ఏకబిగిన మూర్తిగారు నాపై విరుచుకపడ్డారు.

"సారీ!...."

"నాకు చెప్పడం కాదు.... వెళ్లి వారికి చెప్పు."

"నే నెలా చెప్పేది...."

"కాబోయే పెళ్లానికి అత్తమామలకు అలా దూరం ఉంటారేమిటయ్యా!"

"నాకింకా వాళ్లతో సరైన పరిచయం కూడా లేదు - పై పెచ్చు నాకు నడిచొచ్చే కొడుకున్నాడని - ప్చ్"

"సరే! నేనే మాటల సందర్భంలో చెబుతాలే!" అందాక నీవూ అనుభవించు. మరో సిగరెట్టు అంటించారు మూర్తిగారు.

"మీరు - వాళ్లకెలా పరిచయం."

"అద్దింట్లో వుండాల్సిన వాడినిగా - పది రోజులయింది వాళ్లింటి వాటాలో చేరి - సరె సరేలే! నీవు పెళ్లి కాకుండా - ఎంత నడిచొచ్చే కొడుకు పై మోజుంటే మాత్రం అలా చెప్పుకుంటే ఎలా - అసలు నీ కెలా పెళ్లవుతుందనుకున్నావ్?"

"నాకేం తెల్సండీ!"

"సరే పద - చీకటి పడింది" మూర్తి గారు లేచారు.

నేనూ అనుసరించాను.

****

ఆరోజు రాత్రి మా తొలిరాత్రి.

"ఏమండీ! మీ నడిచొచ్చే కొడుకు ఎక్కడ" సిగ్గుపడుతూ అడిగింది సుప్రియ.

"అప్పుడు కాలం కలసి రాలేదుగా - ఇప్పుడు వచ్చింది" నాపైకి లాక్కున్నాను సుప్రియను.

జర్నలిస్టు అవాలనుకుంటున్న అమితాబ్

అమితాబ్ బచన్‌కు పత్రికల శక్తి బాగా తెలిసినట్లుంది. వచ్చేజన్మలో ఆయన జర్నలిస్టు అవాలని కోరుకుంటున్నారు. ఈమధ్య ఆయన వార్తా పత్రికలగూర్చి రకరకాల అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నారు. "పత్రికలు అద్భుతమైన శక్తి కలవి. అవి ప్రభుత్వాలను మార్చగలవు. ప్రజలను మార్చగలవు. దేనినైనా దించాలంటే దించగలవు. ఎత్తాలంటే ఎత్తగలవు" ఇవీ పత్రికల గురించి ఆయన అభిప్రాయాలు. పత్రికలు తనపై ఇదివరలో చూపిన అభిమానం యిపుడు చూపటం లేదంటున్నారు అమితాబ్.

మొత్తానికి ఆప్తమిత్రుడయిన రాజీవ్ గాంధీని క్లిష్ట సమయంలో ఆదుకోవటానికి రాజకీయాల్లో చేరిన అమితాబ్ ఏవిధంగా నయితేనేం తన సోదరుడు అజితాబ్‌తో కలసి బోఫోర్స్ లాంటి కుంభకోణాల్లో యిరుక్కున్నారు. ఈ విషయంలో పత్రికలభాగం ఎంత బలీయంగావుందో తెలిసి తాను కూడా వచ్చే జన్మలో నయినా జర్నలిస్టు నవుదామనుకుంటున్నారు. అవిధంగా నయినా కలం యొక్క శక్తి, బలం వినియోగించుకోవాలనుందట. జర్నలిస్టులు సినిమా యాక్టర్లు సంపాదించినంత డబ్బు, కీర్తి సంపాదించలేక పోయినా, అవి ఈ జన్మలో పుష్కలంగా సంపాదించిన అమితాబ్ వచ్చే జన్మలో జర్నలిస్టయి కలం యొక్క శక్తిని అనుభవంలో తెలుసుకోవాలనుంది అంటున్నారు.

1982లో ఆయనకు 'కూలీ' సినిమా షూటింగ్‌లో ఏక్సిడెంటు అయినపుడు దేశవ్యాప్తంగా ఆయన అభిమానులందరూ ఎంతో కలవరపడ్డారు. ఆయన ఆరోగ్యం కోసం ప్రార్థనలు జరిపారు. ఒక వ్యక్తి అయితే బరోడానుండి వెనక వైపుకు నడుస్తూ బొంబాయి చేరి ప్రార్థనలు చేశాడు అమితాబ్ ఆరోగ్యం కోసం. ఇపుడు రాజకీయాల్లోను, సినిమాలలోను ఒక మెట్టు దిగువ స్థాయిలో వుండి, కుంభకోణాల్లో యిరుక్కున్న క్లిష్ట సమయంలో అమితాబ్‌పై ఈరోజు అభిమానులు 1982లో చూపిన ప్రేమాభిమానాలు చూపటం లేదేమో ననిపిస్తుంది. కానీ అమితాబ్ తన వెంట యిప్పటికీ అశేష ప్రజానీకపు ఆశీస్సు లున్నాయనీ, అవే తనను నిలబెడుతున్నాయనీ అంటారు. రాజకీయాల్లో తనపై ఆరోపించబడిన నేరాల విషయంలోగానీ, 1982లో తన జీవితం కోసంగాని ఎపుడైనా తాను ఒంటరిగానే




పోరాడానంటారు. కాని తన వెనక లక్షలాది అభిమానుల బలం వున్నది అనే భావనే తనకు బలాన్ని, పోరాడే శక్తిని యిస్తున్నదంటారు అమితాబ్.

అమితాబ్ రాజకీయంగా ఫెయిలవటానికి కారణం అతని సినిమా ఛరిష్మాని ప్రజల ఓటు సంపాదించటానికి వాడుకోవటమే. అంతేకాదు. అతను ప్రజల దృష్టిలో అన్యాయాలను ఎదుర్కొని, అక్రమాలకు తలదించని వొక ఆదర్శ పురుషుడు. పేద ప్రజలకు న్యాయం చేకూర్చే నాయకుడు. కానీ నిజ జీవితంలో అతను ఎన్నికలలో గెలిచిన తరువాత అందరిలాగే అవేమీ చేయలేకపోయాడు. అందువలన ప్రజలు భ్రమలు తొలగి వాస్తవంలోకి వచ్చారు. అమితాబ్ కూడా అదే అంటారు. "సినిమాలలో చూపించేది నిజ జీవితంలో సాధించలేమని నాకు తెలుసు. నేను ఉత్తరప్రదేశ్‌నుండి ఎన్నికైన 85 మంది పార్లమెంటు సభ్యులలో ఒకణ్ణి మాత్రమే. మొత్తం నిధులన్నీ అలహాబాదుకు తరలించమని అడగలేను. మూడు గంటలలో వెండి తెరమీద జనాన్ని ఆకట్టుకుని, నాయక లక్షణాలతో వారిలో ఆరాధన కలిగించడం అనేది నిజ జీవితంలో సాధ్యం కానిదని అంటారు.

ఎప్పటికీ యిలాగే సాగదని తెలుసు. రిటైరవాలనుంది. ఎవరూ గుర్తు పట్టని చోటకు వెళ్ళి, రోడ్డుమీద స్వేచ్ఛగా తిరుగుతూ, మంచి పుస్తకాలు చదువుకుంటూ ఈ గుంపులనుండి దూరంగా వెళ్ళిపోయి, బ్రతకాలనుంది అంటారు అమితాబ్.

(జె శాంతి)



ఇంతవరకూ సాగిన కథ-5: శారి, ధీరల ప్రేమకు పెద్దలు ఒప్పుకోరు. ఇద్దరూ ఉద్యోగాలు సంపాదించుకొని తమకాళ్లపై తాము నిలబడితేనే తమ ప్రేమ ఫలిస్తుందనే నిర్ణయానికి వస్తారు. కాని ఉద్యోగాల వేటలో విఫలమౌతారు. ధీర తండ్రి శౌరిని కాదని వేరొక సంబంధం చూస్తుంటాడు. తను ప్రేమించిన శౌరి మరొక అమ్మాయితో ఉండటం ధీరకు అసహ్యం కలిగిస్తుంది. ధీరకు చిట్ ఫండ్ కంపెనీలో ఉద్యోగం వస్తుంది. ఆవేశంలో అపార్థాలకు లోనైన శౌరి, ధీరలు విడిపోతారు.

(గత సంచిక తరువాయి)

"వాళ్ళు వచ్చి మూడు రోజులయిందిట. హోటల్ కంట్రీలో దిగారు. నాకిప్పుడే తెలిసింది. వెళ్లి పలకరించి వచ్చాను. మధ్యాహ్నం వస్తామన్నారు. పెళ్లి చూపులకి కాదు. నిశ్చయతాంబూలాలకి. వచ్చే దశమినాడే పెళ్లి. శ్రీశైలం గుండె జారేలా ఘనంగా చేయాలి"

సప్తగిరి వస పిట్టలా వాగుతూనే వున్నాడు. తలూపుతూ తగు సలహాలు ఇస్తూనే వుంది మంగమ్మ.

అంతా వింటున్న ధీర పెదాల్లో రక్తం ఆవిరవుతున్నది. కింకర్తవ్యం.

మనువొద్దని మొరాయిస్తే తన చెవులు మూసి తాళి కట్టిస్తాడు తండ్రి. అంతటి కఠినుడే. పరారవుదామంటే ఎక్కడికి పోవాలి? ఎలా బ్రతకాలి? ఉద్యోగం సంపాదించుకుని బ్రతుకులో నెగ్గే ఆశ అణగారింది. జీవచ్ఛవంలా బ్రతకడమా? ఆత్మహత్య చేసుకోవడమా?

తన సమస్యలకి ఆత్మహత్యే పరిష్కారమార్గమనే నిశ్చయానికి అతిసులభంగా వచ్చేసింది ధీర. ఇక ఆ

"కొడుకుని అమ్ముకునే వంశం. ఈ ఊరిలో వున్న షామియానాలు అన్నీ బుక్ చేశాడంటే చేయడూ మరీ.... బేవర్స్‌గా డబ్బు దండుకుంటున్నాడు.

మచ్చుకైనా మామిడాకు మిగలకుండా తోరణాలు కడ్తాడుట. కట్నడూమరీ... లక్షలు లక్షలు కట్నం గుంజుతున్నాడు" స్వగతంగా చీదరిస్తూ ఇంట్లోకి వచ్చాడు సప్తగిరి.

శ్రీశైలాన్ని భర్త చెరిగి పారేస్తున్నాడని గ్రహించిన మంగమ్మ "పెళ్ళివారు వచ్చారా" అని మధ్యలో కలుగజేసుకుంది.

"హోటల్ కంట్రీలో వచ్చి మూడు రోజులయిందిట. వచ్చే దశమి నాడే పెళ్లట."

"ఎవరి గురించండీ మీరు చెప్పేది" విస్తుపోయిందామె.

"ఇంకెవరూ ఆ శ్రీశైలం గాడి గూడు పుఠాణీయే చెప్పేది"

"వాడి ఊసు మనకెందుకండి. మన అమ్మాయిని చూసుకోవడానికి పెళ్ళివారు వచ్చారా" గుంజుకుంది.

లక్ష్యం చేయలేదు.

పెరట్లోకి వెళ్ళింది. బావిలో నీళ్ళు నిండుకున్నాయని బాత్‌రూంలోకి చొరబడింది. ఖాళీ కిరసనాయిల్ డబ్బా వెక్కిరించింది.

హాయిగా చావడానికి ఇంట్లో అనుకూలంగా లేదని, వూరి చివర కొండెక్కి దూకాలని కొంగు బిగించింది ధీర.

* * * * * *

"పైసా ఖర్చులేకుండా కన్యాదాన ఫలం కొట్టేస్తున్నాడు... పిసినారి పీనుగ... వాడు పెట్టే అంపకం బట్టలకి అల్యూమినియం చెంచా కూడా ఇవ్వరు. పరమలోభి వెధవ... పంపు నీళ్ళతే ఖర్చని అల్లుడి కాళ్ళు డ్రైనేజ్ వాటర్‌తో కడుగుతాడు... ఛీ...ఛీ..."

'కాని' కట్నం లేకుండా ధీరకి పెళ్లి సంబంధం కుదిరిందని తెలుసుకుని తన అక్కసునంతా సప్తగిరిపై కుమ్మరిస్తున్నాడు శ్రీశైలం

"మీతో ఎలా వేగాలో తెలిసి చావడంలేదు. నేరుగా విషయంలోకి వస్తారా? బొట్టు చెరిపేసుకోమంటారా" బెదిరించింది గంగమ్మ.

"పెళ్ళివారి గురించే నేను చెప్పేది. వాళ్ళు వచ్చి మూడు రోజులయింది. ధీరని చూడగానే ముహూర్తం పెట్టేసుకున్నారు."

గబుక్కున అని, నాలిక్కరచుకుని "మన వియ్యంకుడూ వచ్చాడు. హోటల్ కంట్రీలో విడిది చేశాడు. నేనిప్పుడు అక్కడనుంచే వస్తున్నాను. పేరుకి మధ్యాహ్నం పెళ్లి చూపులు. పెళ్లి దశమినాడు. సగం కట్నం ఈరోజ

ముడుతుంది" కట్టి కొట్టి తెచ్చె అన్నట్లు ముగించాడు శ్రీశైలం.

"హోటల్లో నా పెళ్ళి చూపులు"

వివరాలు అడుగుతున్నది గంగమ్మ.

శౌరి చెవులు సరిగ్గా పని చేస్తున్నాయి. ఆలోచనలే అతనికి అందుబాటులో లేవు.

ఈ కళ్యాణం కానిపనంటే చేతులు ముడుచుకుని కూర్చోడు తండ్రి. తన కట్టే చేత తాళి కట్టిస్తాడు. తన తండ్రి పులిచేత పచ్చగడ్డి తినిపించే బాపతు. పరార్త్రైబతికి బట్టగట్టలేడు.

నిర్జీవంగా బ్రతికే బదులు జీవితం చాలించా లనుకున్నాడు శౌరి.

మేడమీంచి దూకాలనుకున్నాడు. చెట్టు కొమ్మల్లో ఇరుక్కునే ప్రమాదం లేకపోలేదని వూరుకున్నాడు. ఎలకల మందుకి చీమలే చావడంలేదు. మొద్దుబారిన కత్తిపీటకి పీక తెగదని విచారించాడు.

ఏదో విధంగా చావాలని ఇల్లు వదిలాడు శౌరి.

* * * * *

ఆ మధ్యాహ్నం వేళ.

ధీరకోసం మంగమ్మా, శౌరికోసం గంగమ్మా ఇల్లంతా గాలించే వేళ.

కాబోయే వియ్యంకుళ్ళని కలుసుకోవాలని శ్రీశైలం, సప్తగిరి ముస్తాబయ్యేవేళ.

ఆ మిట్ట మధ్యాహ్నం వేళ.

ఆ సందులో కామి కారు ఆగింది.

కారులోంచి దిగిన కామి సందు మధ్యలో నిల్చున్నాడు.

అదే కారులోంచి దిగిన ఇద్దరు వ్యక్తులు కామి కిరు ప్రక్కలా నిల్చున్నారు. వాళ్ళెవరో కాదు శ్రీశైలానికి, సప్తగిరికి కాబోయే వియ్యంకులు.

రోడ్డుమీది సందడికి తమ ఇళ్ళల్లోంచి బిలా బిలా వచ్చిన సప్తగిరీ, శ్రీశైలం ముక్కుపై వ్రేలేసుకోబోయి కళ్ళల్లో పొడుచుకున్నారు.

అప్పటికే ఆ సందు జనం గుమి గూడారు. కూలి గిట్టుబాటు అవుతుందేమోనని కొంతమంది "కాబోయే మినిష్టర్... జిందాబాద్" అని నినాదాలు చేశారు.

"శాంతి... శాంతి... ఆగండి... ఇందు మూలముగా ఈ సందు ఓటర్లకి తెలియజేయునది ఏమనగా... వీరి అమ్మాయిని శ్రీశైలంగారి అబ్బాయికీ, వారి అబ్బాయిని సప్తగిరిగారి అమ్మాయికీ ఇవ్వాలని వాళ్ళిద్దరూ ఈ వూరు వచ్చారు. నాతో పోటీ చేసి ఓడిపోయిన ఈ సందు విరోధుల చరిత్రలు పరిశీలించారు. నన్ను ఘనంగా గుర్తించారు. నాతో వియ్యమొందడానికి సిద్ధపడ్డారు. మా అబ్బాయీ, అమ్మాయిల పెళ్ళి వచ్చే దశమినాడు జరుగుతుంది. మీరంతా విలువైన ఆశీస్సులతో రావాలని ప్రార్థిస్తున్నాను."

ఉపన్యాస ధోరణిలో కామి జనాంతికంగా అనేసరికి శ్రీశైలం, సప్తగిరి కాళ్ళు చల్లబడ్డాయి. ఎంత తాపీగా వచ్చిందో అంతకన్నా తాపీగా జై... జై... నినాదాలతో కదిలింది కామి కారు.

ఎదురు బదురుగా సందు అంచుల్లో నిల్చున్న శ్రీశైలం, సప్తగిరి నివురుగప్పిన నిప్పుల్లా వున్నారు.

రిఫరీ ఈలకై ఎదురు చూస్తున్న వాళ్ళలా చొక్కా చేతులు వెనక్కి లాక్కుంటూ కాలు దువ్వుతూ కలియబడడానికి సిద్ధంగా వున్నారు.

రెండు కొండలు ఢీ కొనేవేళ, సముద్రాలన్నీ పొంగేవేళ, . అగ్ని పర్వతాలు బ్రద్దలయ్యేవేళ, ఆ సందులో ఆగింది పెద్ద ఓడలాంటి కారు.

ఆ కారులోంచి దిగిన జ్యేష్ఠాదేవిని చూడగానే నేలకి అంటుకు పోయారు శ్రీశైలం, సప్తగిరి. చెంచులక్ష్మిని చూసిన



ఉగ్ర నరసింహస్వామిలా చల్లబడ్డారు.

అంతలో రివ్వుమని వచ్చిన ఆటోలూ, స్కూటర్లూ, రిక్షాలు ఓడ చుట్టూ ఆగిన పడవల్లా ఆగాయి. గుత్తులు గుత్తుల్లా జనం వాహనాల్లోంచి రాసాగారు.

సమ్మోహనంగా నవ్వింది జ్యేష్ఠాదేవి. పూలమాలలు వేసినట్టు సప్తగిరి, శ్రీశైలం భుజాలపై చేతులేసి దగ్గరికి తీసుకుంది. తన కొప్పులో పూలు తీసి వాళ్ళ చెవుల్లో పెట్టింది.

"చిరు నిరుపేద బీదలపార్టీ స్థాపకాధ్యక్షురాలు జ్యేష్ఠాదేవి వర్ధిల్లాలి... వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేశారు జనం.

"మీదీ నాదీ ఒకటే కులం. మనం నిరుపేదల పార్టీలో వున్నా,

పేద బీదల పార్టీలో వున్నా మనమంతా ఒక్కటే. మౌలిక సిద్ధాంతాలపై భేదాభిప్రాయాలు వచ్చి మనం తాత్కాలికంగా వేరే కుంపట్లు

కెరటాలు-కేరింతలు

పెట్టుకున్నా మనమంతా ఒకటే. మీరిద్దరూ విరోధులయ్యేసరికి పరాయి కులంవాడు ఈ వూరిని ఏలుతున్నాడు. మనం మన్నుతిన్న పాముల్లైతే కప్పలు కూడా కాళ్ళు బార జాపడానికి ప్రయత్నిస్తాయి. అలా జరగడానికి వీలులేదు. మధ్యంతర ఎన్నికలు వస్తున్నాయి. మీ రిద్దరూ కలవాలి. ఈసారి పార్టీ టికెట్ ఎవరికిస్తానో తెలుసా? సప్తగిరి అల్లుడూ, శ్రీశైలం కొడుకైన శౌరికి"

సన్నసన్నగా పాము బుస కొడుతున్నట్టు మాట్లాడి నిప్పుకీ నీరుకి సంధి చేసింది జ్యేష్ఠాదేవి.

మంత్రముగ్ధుల్లా ఆమె గొడుగు క్రిందకి వచ్చిన సప్తగిరి, శ్రీశైలం ఒకే జెండా పట్టుకున్నారు.

వచ్చిన పని అయిందని, అక్కడ డేరా పీకేసి, జనాన్ని తోలుకుంటూ పక్క నియోజక వర్గానికి బయలుదేరింది జ్యేష్ఠాదేవి.

జూదంలో ఓడినవాడు, తన డబ్బు తిరిగి సంపాదించాలని మళ్ళీ మళ్ళీ ఆడతాడు. తన నష్టం పూడిపోగానే వూరుకోడు. లాభం సంపాదించాలని ఆడుతూనే వుంటాడు.

అంత వరకు బద్ధవిరోధుల్లా వున్న శ్రీశైలం, సప్తగిరి, నోరార "బావా... బావా... అని పిలుచుకుంటూ శౌరి గెలవడానికి ఏ వాడలో ఎవరిని పట్టుకోవాలో, ఎలా ఆకట్టుకోవాలో ఎంత ఖర్చు పెట్టాలో అప్పటికప్పుడే చర్చించుకుంటూ లెక్కలు వేస్తున్నారు.

రాజకీయంలో నిజంగా స్నేహితులూ, విరోధులు వుంటారా అని, ఆనందం తట్టుకోలేక కుప్పలా కూలిపోయారు గంగమ్మా, మంగమ్మ.

"ఇంత వరకు బాగానే వున్నారు. ఇప్పుడేమయిందని" భార్యలకి సేవలు చేయసాగారు సప్తగిరి, శ్రీశైలం.

"మన పిల్లలు కనిపించడం లేదండి. ఉత్తరాలు రాసి ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్ళారండి" బావురు మంటూ ఉత్తరాలు భర్తలకి ఇచ్చారు మంగమ్మా, గంగమ్మ.

ఉత్తరాలు చదువుతున్న సప్తగిరి, శ్రీశైలం ముఖాలు జేవురించాయి. ఉత్తరాలు విడివిడిగా వున్నా సారాంశం ఒకటే.

పోలీస్ ఇనస్పెక్టర్ గారికి,

మాకు తెలిసీ తెలియని వయసులో మమ్మల్ని మొగుడూ పెళ్ళాంగా చూశారు. తీరా మాకు పెళ్ళి వయసు వచ్చేసరికి పెద్దలు విరోధులైనారు. మాకు వేరే సంబంధాలు చూశారు. మా మనసు విరిగిపోయింది. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాం. మా ఆత్మహత్యకి మా పెద్దలే కారణం. వారికి తగినశిక్ష విధించి, మా ఆత్మశాంతికై రెండు నిమిషాలు వేస్తు చేస్తారని ఆశిస్తూ—

భవదీయ,

(ఇంకా వుంది)

దోమలున్నాయ్ "బాబోయ్"



కేంద్ర "పరిసరాల" మంత్రి శ్రీమతి మేనకాగాంధీ కేరళ వెళ్ళారీమధ్య. ఆమెకు "కొచీ" అనే గ్రామ ప్రజలు "అమ్మా! మా వూళ్ళో పందులంత దోమలున్నాయి తల్లీ! పీక్కు తింటున్నాయి" అంటూ మొరపెట్టు కున్నారు. "మరీ విడ్డూరం అంతలేసి దోమలుంటాయా? దోమ తెరలులేవూ"అంటూ విస్తుపోయింది ఇందిరమ్మగారి కోడలు.

కాని ఆ రాత్రికి ఆమెకి 'కొచీ' గెస్ట్ హవుస్‌లో, దోమతెరలుకట్టి మరీ బస ఏర్పాటు చేశారు— తెల్లారేదాకా మేనకాగాంధీ కన్నుమూస్తే ఒట్టు! తెల్లవార్లు 'టాప్ టాప్' మంటూ దోమల్ని కొట్టడమే సరిపోయింది. మర్నాడు విలేఖరులను పిలిచి "కొచీ"లో ప్రజలు ఎలా బ్రతికున్నారో ఆశ్చర్యంగా వుంది. నేను నమ్మలేను కానీ యిక్కడ దోమలు దున్నపోతులంత వున్నాయి— వీటిని సాంకేతిక పరికరాలు పంపించి నాశనం చేయిస్తానంటూ వాగ్దానించి మరీ ఢిల్లీకి బయలుదేరింది.

హలో! డాక్టర్ నేనేం చేయాలి?



డా. కొత్త రవీంద్రబాబు

పాల్ సుధాకరరెడ్డి, రాయవరం.

ఇంటర్‌కోర్స్ అంటే?

అమ్మాయి నా వలలో పడాలి. ఏం మందు వాడాలి. ఒక అమ్మాయి ఒక అబ్బాయిని ప్రేమిస్తుందని ఎలా తెలుస్తుంది?

మూడు ఉత్తరాలు రాసారు. డాక్టరుగా నేను మీకు సలహా లివ్వలేను. భారతదేశ పౌరునిగా మాత్రం నా సలహా "దూకుడు తగ్గకపోతే భంగపాటు తప్పదు". మీలాటి వ్యక్తులను చూచే గిరీశం పాత్ర సృష్టించాడు గురజాడ!

పి. యస్. నారాయణ, కడియం.

17 సంవత్సరములు. అమ్మాయితో 2 సార్లు కలిసాను. ఆ అమ్మాయికి గర్భం వస్తుందా? సెక్స్‌మీద విపరీతమైన మోజు వున్నది. ఏం చేయను.

చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు భయపడినందువలన ప్రయోజనం ఏమున్నది! నెలసరి తర్వాత పది యిరవై రోజుల మధ్య కలిసినందువలన గర్భంవచ్చే అవకాశా లెక్కువ. చదువుమీద లేకపనిమీద శ్రద్ధ వహించండి. స్పీమన్ బిళ్ళలు రోజుకు మూడు చొప్పున రెండు నెలలు [illegible].

జ్యోతి, కర్నూలు.

మొటిమలున్నాయి. లావు తగ్గాలి.

ఆహారంలో కొవ్వు పదార్థాలు తీపి పదార్థాలు తగ్గించండి. టెట్రాసైక్లిన్ 250 మిల్లీ గ్రాముల గొట్టం రోజు కొకటి చొప్పున ఆరునెలలు వాడండి. సబ్బు బదులు సున్నిపిండితో ముఖం కడుక్కోండి.

పి. వెంకట నారాయణ, కదిరి.

వయసు 20 సంవత్సరములు. మలంతో పాటు చీము రక్తం కనబడుతుంది. పరీక్ష చేయిస్తే గయార్డియా సిస్ట్సు వున్నాయన్నారు. మందులవలన ఫలితం కనపడలేదు.

గయార్డియాసిస్ వలన చీము నెత్తురూ పడదు. ఫిస్ట్యులా వుందేమో డాక్టరుగారికి చూపించుకోండి. ఫిస్ట్యులా లేకపోతే రినోచిన్ బిళ్ళలు రోజుకో మూడు చొప్పున పది రోజులు వాడండి. బాత్‌రూం నుండి వచ్చాక భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కొని గోళ్ళు తరచు కత్తిరించు కుంటూ హోటళ్ళల్లో భోజనం, టిఫిన్ చేయకుండా వుండండి. రోజు రెండు మార్లు స్నానంచేసి శుభ్రమైన దుస్తులు ధరించండి.

ఎస్. అక్బర్ భాషా, బేతంచర్ల.

వయసు 20 సంవత్సరములు. అంగం వంకరగా చిన్నదిగా వుంది. ప్రతి రాత్రి వీర్యస్ఖలనం జరుగుతున్నది. స్నేహితులు నేను సెక్స్‌లో పాల్గొనలేనంటున్నారు.

మీలో ఏ లోపం లేదు! నిర్భయంగా వుండండి. మీ స్నేహితులు ఏడిపించటానికలా అంటున్నారు.

రమణారెడ్డి, కొత్తఢిల్లీ.

వయసు 27 సంవత్సరములు. అంగంపై చర్మం వెనక్కు పోవడంలేదు. చర్మం చివర చాలా చిన్న రంధ్రం వుంది. సున్తీ చేయించుకోవాలా? చేయించుకున్నాక ఎన్నాళ్ళలో రతిలో పాల్గొనవచ్చు? ఎన్ని రోజులు సెలవు పెట్టాలి.

తప్పకుండా సున్తీ చేయించుకోండి. లేకుంటే ముందు ముందు బాధలు కల్గవచ్చు. ఆపరేషన్ తర్వాత పది పదిహేను రోజులలో రతిలో పాల్గొనవచ్చు. సెలవుపెట్ట నవసరం లేదు. ఒకవేళ బాధ అనిపిస్తే వారం రోజులు సెలవు తీసుకోండి.

పి. రమేష్, పులివెందుల.

ప్ర: కంటిరెప్పల కింద గుల్లలు వస్తున్నాయి.

జ: ఏరోవిట్ బిళ్లలు ఉదయం సాయంత్రం భోజనానంతరం వాడండి. రెండు నెలల పాటు.

కె. రమేష్, పామర్రు.

ప్ర: తేపులతో బాధపడుతున్నాను.

జ: స్టెలాబిడ్ బిళ్లలు భోజనం ముందు ఉదయం సాయంత్రం నెలపాటు వాడండి.

కె. వెంకటేశ్వర్లు, విజయవాడ.

ప్ర: అంగం చుట్టు పొక్కులు బొడ్డు నుండి వాసనతో కూడిన ద్రవం కుడిబీజం వాచింది.

జ: ఏంపిలాంగ్ గొట్టాలు ఉదయం సాయంత్రం వారం రోజులపాటు వాడండి.

జి. సుజని, కర్నూలు.

ప్ర: రాక్సిన్ బిళ్ల లెక్కడ దొరుకుతాయి.

జ: ఇంగ్లీషు మందులమ్మే ఏ షాపు లోనైనా దొరుకుతాయి. రోజుకు రెండు చొప్పున రెండేళ్లు వాడండి.

షేక్ రహీముల్లాఖాన్, తణుకు.

ప్ర: బుగ్గలు లోతుగా వున్నాయి. వయసు 20 సంవత్సరములు.

జ: పెరిగే వయసులో కొందరు పీలగా కనపడతారు. మరో సంవత్సరం రెండేళ్లలో సహజంగానే బుగ్గలు పూడి, నిండుగా కనపడతారు. ఈ లోపల మీగడ, పెరుగు, పండ్లు పాలు తీసుకున్నందువలన ఉపయోగం వుండవచ్చు. వినోఫిట్ జిన్సింగ్ రోజుకో గొట్టం రాత్రి భోజనానంతరం మూడు నెలల పాటు వాడండి. ○

'అశోకా ది గ్రేట్'

ఓ. పి. రాల్హన్ కన్నకలలు నిజం కాబోతున్నాయట. ఇరవై ఏడు సంవత్సరాల క్రితం తాను నిర్మించదలచుకున్న 'అశోకా ది గ్రేట్' చిత్రం నిర్మాణానికి సిద్ధమవుతున్నది. ప్రముఖ చరిత్ర కారుడు శ్రీ ఎం.ఎన్. దాస్ ఈ సబ్జెక్టుపై ఐదు సంవత్సరాలు పరిశోధన జరిపారు. దూరదర్శన్‌లో 52 భాగాలుగా యిది ప్రసారం అవుతుంది. కాగా ఇంగ్లీషు, హిందీ భాషల్లో వెండి తెరపై ప్రదర్శించబడుతుంది. ఇంగ్లీషులో అంద్రూసిన్ క్లెయిర్ స్క్రీన్‌ప్లే వ్రాస్తుండగా, హిందీలో సంభాషణలు రహీ మసూమ్‌రజా వ్రాస్తున్నారు. కాగా ఈ చిత్రానికి సంగీతం నౌషాద్ నిర్వహిస్తున్నారు. నటీనటుల్లో భారతీయులు, విదేశీయులు కూడా వుంటారట.

బంగారునాణెం

మల్లాది సూరిబాబు





"మీకోసం ఎవరో వచ్చారండీ" అని మా నౌకరు చెప్పగానే మేడమీదనుంచి క్రిందకు దిగి వచ్చాను. ఆయనని చూడగానే, అనుకోకుండానే మనసులో ఎంతో గౌరవమైన భావం కలిగింది.

మంచి స్ఫురద్రూపి, పండు ముదుసలి. చూడడానికి అంతులేని తేజస్సు మనిషిలో. చూస్తూండగానే వారికి నమస్కారం పెట్టాను. 'రండి! దయచేయండి' అన్నాను. ఆయన నావంక అర్థంకానట్లుగా చూశాడు. చూస్తే మనప్రాంతంవాడు కాడేమోనని ఇంగ్లీషులో చెప్పాను 'దయచేయండి 'రండి' కూర్చోండి' అని. ఆయన సంకోచపడుతూనే వచ్చి కూర్చున్నారు. నా వంక చూచి "తమరేనా? రామచంద్రయ్యగారూ" అని అడిగారు. "మిమ్మల్ని గురించి నే విన్నాను మీతో చిన్నపని వుంది. చిన్న సహాయంకోసం వచ్చాను."

నావల్ల వీరికి జరిగే సహాయమేమిటో నా కర్థంకాలేదు. ఎందుకంటే ఒకరివల్ల సహాయాన్ని ఆశించే మనిషిగా ఆయన కన్పడలేదు. మనిషిచూస్తే చాలా సంపన్నుడులాగా వున్నాడు. ఆ వేసుకున్న దుస్తులుగానీ, ఆ పద్ధతిగానీ చూస్తే చాలా సంస్కారవంతుడులాగా కన్పిస్తున్నాడు.

"చెప్పండి! నేనేం చెయ్యాలో?"

"ఈమధ్య నేను కాశీ వెళ్ళానండీ! వెళ్ళినప్పుడు అక్కడ ఏదో సంభాషణలో తమపేరుగూడా వచ్చింది. 1897లో 'నారాయణ్ కాళే అండ్ కంపెనీవారు వారు ప్రచురించినటువంటి 'యోగవాశిష్టం' మీవద్ద ఉందని తెల్సుకున్నాను. ఆ కాపీ ఒకసారి నాకు కావాలి. దానినిమిత్తంగా నేను ఇక్కడికి వచ్చాను."

ఆ కాపీ నాదగ్గర ఉన్నట్లుగా ముగ్గురు నల్గురు సన్నిహిత మిత్రులకు తెలుసు. అది అపురూపమైనటువంటి వస్తువు అవడంవల్ల దాన్ని భద్రంగా ఈరోజువరకూ ఇనప్పెట్టెలోపెట్టి భద్రంగా దాచుకున్నాను.

"ఎవరు చెప్పారండీ మీకు ఈ విషయం?" అని అడిగాను.

"దీక్షితులుగారు చెప్పారండీ! దీన్నిగురించి చర్చ వచ్చినప్పుడు మా దగ్గరవున్న గ్రంథాల్లోనూ, వారిదగ్గరవున్న గ్రంథాల్లోనూ పాఠ్య భేదాలు కన్పింస్తుంటేనూ 'ఏదీ మా రామచంద్రయ్యగార్ని అడగండి. వారిదగ్గర వుంది. మీకన్ని సంశయాలు తీరుతాయి.' అని చెప్పినప్పుడు మీ అడ్రెసుతీసుకోవడం జరిగింది.

అంటే "మీకు" యోగవాశిష్టంవారి ఉద్గ్రంథము మాదగ్గర 4 వాల్యూమ్స్‌లో వుంది. దాదాపు సంవత్సరం పడుతుంది కదా!" అని నే నాలోచించుకుంటూ-

"మీకు దీంట్లో ఏభాగం కావాలి?" అని అడిగాను.

"నాకు గ్రంథం అంతా ఒక్కసారి కావాలి! నేను ఒక చిన్నపని చేస్తున్నాను. షుమారు ఐదారు నెలలు పడుతుంది. ఈపని ఒకరోజులో జరిగిపోవచ్చు, లేకపోతే ఆరునెలలు పట్టవచ్చు. అందుకని ఈ పుస్తకం షుమారు 3, 4 నెలలు నావద్ద ఉంటేనే మంచిది. నాకు కావాలి." నేను ఒక్కక్షణం సంకోచించాను. పుస్తకం ఇవ్వడానికి నాకేం సంకోచంలేదు. కానీ ఒకవేళ పుస్తకం ఏదన్నాకారణంచేత రాకపోతే, ఆ పుస్తకం మళ్లీ నాకు బజార్లో దొరికే అవకాశంలేదు. చాలామంది ఆ పుస్తకాన్ని ప్రింటుచేశారు కానీ, ఈ ఎడిషనుమాత్రం లేదు.

నేనాలోచిస్తుండగానే, ఆయన జేబులోంచి ఒక బంగారునాణెం తీసి బల్లమీద పెట్టాడు.

"నేను ఈ పుస్తకం మీకు తీసుకువచ్చి ఇచ్చేదాకా దీన్ని మీదగ్గర ఉంచండి" అని అన్నారు.

నాకు ఆశ్చర్యమువేసింధి. రవ్వంత కోపంకూడా వచ్చింది.

విద్యార్థులమధ్య, పండితులమధ్య ఈ పుస్తకాలు యిచ్చి పుచ్చుకోవడమనేది మామూలు. సహజంగానూ, సామాన్యంగానూ జరుగుతూండే విషయమే. దాంట్లో కొత్త విషయమేమీలేదు. కానీ, దానినిమిత్తంగా మనదగ్గర ఏదో ఒక వస్తువు 'తనఖాపెడుతున్నట్లు'గా వున్న పద్ధతి నాకు కొంచెం చివుక్కుమనిపించింది. నేను ఆ నాణెంవంక చూచాను. మనస్సుకి ఆశ్చర్యంవేసింది. అది యిటు విక్టోరియా మహారాణి నవర్నూకాదు. అంతకంటే పెద్ద సైజు 'నాణెం'. రూపాయికంటే పెద్దదిగా వుంది. లావుగావుంది. బంగారంతో చేసింది. దాంట్లో ఏవో రకరకాల అక్షరాలు, ఒక విచిత్రమైన బొమ్మకూడా ముద్రించివుంది.

కుటుంబంలో అనాదిగా వస్తూవున్న వస్తువై వుండవచ్చు వారిని చూడగానే అన్పించింది. అది-ఆ వస్తువును మనదగ్గర పెట్టుకుని ఆ పుస్తకాన్ని యివ్వడం అనేటువంటిది నాకే చిన్నతనమన్పించింది.

"అవసరంలేదు. మీరు తీసుకెళ్ళండి. ఫర్వాలేదు పుస్తకం చదివి యిద్దురుగాని, నాకుమాత్రం మూడు నెలల్లో పంపిస్తే బాగుంటుంది. నేనుకూడా అప్పుడప్పుడు చదువుతుంటాను. ఆ గ్రంథం ఎంత అపరూపమైనదో మీకు తెలియనిది కాదుకదా!" అంటే ఆయన నమస్కారంపెడుతూ "మీరు ఈ నాణెం మీవద్ద వుంచుకుంటామూ అంటేనే నేను ఈ పుస్తకం తీసుకెళ్తాను. నేను వుండేది యిక్కడికి చాలా దూరం. దాదాపు వెయ్యి మైళ్ళుపై దూరం. నే నెవరో మీకు తెలియదు. దీక్షితులుగారి పేరు చెప్పబట్టి మీరు నాతో మాట్లాడారు ఇంతసేపు. మరి నన్ను నమ్మచ్చో, నమ్మకపోవచ్చోకూడా మీకు తెలీకపోవచ్చు. ఒక అపురూపమైన వస్తువు మీరు యిస్తున్నప్పుడు ఆ వస్తువుని మీకు నేను భద్రంగా యిస్తాను అని హామీ చెప్పడంతప్ప, యింకోవిధంగా అన్యవిధంగా మీరు భావించవద్దు."

వద్దనుకుంటూనే నేను ఆ బంగారు నాణెం వంక చూశాను. దాంట్లో నాక్కనిపించిన ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వెనకవేపు ఏవో కొన్ని అక్షరాలువున్నై. ముందు వేపు మాత్రం 'అమ్మవారి' మూర్తి వుంది. ఒక్కక్షణం ఆవిడ 'లక్ష్మి'లాగానూ, ఒక్కక్షణం 'పార్వతి'లాగానూ, ఒక్కక్షణం 'సరస్వతి' లాగానూ కనిపిస్తూంటే నా మనస్సులో భావనలో ఆలోచనలో అది కనికట్టేమో అని అనిపించింది. నేను ఏమీ మాట్లాడలేదు. దానిని జాగ్రత్తగా ఒక మెత్తటి గుడ్డలో పొట్లంకట్టి, ముడివేసి రవ్వంత పసుపు అటూ యిటూ అంటించి, దానిమీద కొంచెం కుంకుమపెట్టాను. మనింట్లో వుండే దేవతార్చనలో వుండే 'అమ్మవారి'కి దానిని చూపించి ఇనప్పెట్టెలోపెట్టి తాళంవేశాను. వారడిగిన 'యోగవాసిష్టం గ్రంథం' వారికి యిచ్చేశాను. అతను వెళ్ళిపోయాడు. ఆ విషయం నేను మరిచిపోయాను. నిత్యమూవుండేటువంటి సంసారిక ఈతిబాధలలో ఈ విషయం మనస్సులోకి రాలేదు. మూడునెలలు గడచినవి. వారు వచ్చారు. వస్తూ వారు ఈసారి చేసిన మంచిపని ఏమిటంటే, నాదగ్గర తీసుకువెళ్లిన పుస్తకానికి జాగ్రత్తగ బైండింగ్ చేయించి, వాటికి పైన చక్కటి అట్టవేసి, నా పేరు అందమైన అక్షరాలతో వ్రాయించి తీసుకువచ్చారు.

నేను ఆ పుస్తకాలు చూశాను. చాలా ఆనంద పడ్డాను. అవ్వి లైబ్రరీలో పెట్టుకుంటూ, వారి 'బంగారు నాణెం' కోసం ఇనప్పెట్టె తెరవబోతుంటే, "అది అక్కడే ఉంచండి! నాకు ఇంకా కొన్ని పుస్తకాలు కావాలి" అని. అన్నారాయన. అంటే

ఈ వారం
దెయ్యం కథ

బంగారునాణెం

చెప్పాను. పుస్తకం కావాలంటే మీరు తీసుకు వెళ్లండి! ఈ నాణెం నాకు అక్కరలేదు. దానితో నాకు పనిలేదు" అని అన్నాను.

"కాదు కాదు మీరు ఉంచండి. నేను, కావాల్సినపుడు నేనే అడిగి తీసుకు వెళ్తాను. మీదగ్గరున్న మాదగ్గరున్న ఒకటే, మీ దగ్గర వుంటేనే అది క్షేమంగా వుంటుంది" అని వారంటూ "ఇంకో విషయం గూడా విన్నాను. మీదగ్గర 'యాస్కనిరుక్తము' కూడా వుందని తెలిసింది. అది ఎప్పటిదో- పోర్లు విలియమ్స్ వారు ప్రింటు చేసినది మీ దగ్గర వున్నదని మిత్రుల ద్వారా తెలిసింది.

'దీక్షితులుగారేనా' అని అడిగాను.

"వారు కాదండీ, ఇంకెవరో, పేరు సరిగ్గా గుర్తు లేదండి. పండిత సభలో చెప్పారు. "రామచంద్రయ్యగార్ని అడగండి" 'నిరోక్తం' మీకు ఇస్తారు తీసుకు వెళ్లవచ్చని. అది నాకు ఒకసారి ఇచ్చినట్లయితే రవ్వంత నాకు సహాయ పడుతుంది. కొన్ని కొన్ని పాత గ్రంథాల్లో మాటలు కొరుకుడు పడటం లేదు. 'నిరోక్త' మన్నా సహాయం చేస్తుందేమో అని అనుకుంటున్నాను. మిమ్ములను అర్థిస్తున్నాను."

సరే నేను ఆలోచించి దాంతోపాటు "అయ్యా 'భామతి' గూడా తీసుకు వెళ్లండి అప్పుడు దీంట్లో తెలియని సందేహాలు దానిలో దొరుకుతాయేమో! మళ్లీ ప్రత్యేకంగా దాని కోసం రావడం దేనికి" అన్నాను.

కాదులెండి 'నిరుక్తం' చాలు! అని వారు తీసుకువెళ్లారు.

నాల్గు నెలలయింది. అయిదు నెలలు అయింది వారు రాలేదు. ఆ పుస్తకం విషయం నేను మరిచిపోయాను. మర్చిపోయిం తర్వాత ఒక రోజు ఆయన అకస్మాత్తుగా నాకు 'కలకత్తా'లో కన్పించారు. కనపడి, ఆయనే గుర్తుపట్టారు. పలకరించారు. కాసేపు మాట్లాడారు. మళ్లీ మీ ఊరు రావాలండీ, నేను చేసిన చిన్న పొరపాటు ఆ రోజునే 'వాచస్పతియం' తీసుకువెళ్తే బాగుండేది. 'భామతి' చదువుతుండేవాడిని- నా పని పూర్తి అయ్యేది. చెప్తూ "వచ్చే నెలలో పౌర్ణమినాడు వస్తాను ఇంటిదగ్గర ఉంటారు కదా!" అని అడిగారు.

ఆ రోజు ఆయన వచ్చారు. వచ్చినపుడు కూడా ఈ 'బంగారునాణెం' నా దగ్గరనుంచి తీసుకువెళ్లడానికి ఒప్పుకోలేదు. కలకత్తా నుంచి ఎన్నో రకరకాల పదార్థాలు తీసుకువచ్చారు. వస్తూ వస్తూ ఎప్పుడూ లేనటువంటిది 'కృత్తి వాస రామాయణం' కూడా ఒక కాపీ తీసుకు వచ్చారు. తీసుకువచ్చి మన ఇద్దరి స్నేహానికి గుర్తుగా మీ వద్ద ఉంచుకోండి' అంటే!

నేను నవ్వుతూ, "నా దగ్గర బంగారపు నాణేలు ఏవీ లేవే" అని అన్నాను.

"ఇది మనస్మృతికి చిహ్నం'. ఇది నా చిన్న కానుక" అనినేను 'వాచస్పతీయం' వారికిచ్చివేస్తూ "బాబూ! మీ బంగారునాణెం మీరు తీసుకు వెళ్లండి. మనం స్నేహితులం! మన మధ్య తాకట్లూ వాకట్లూ అక్కర్లేదు" అని అన్నాను.


ఈ సారి కూడా ఆయన పుచ్చుకోలేదు. గుమ్మందాకా వెళ్లి తిరిగి వస్తూ, ఉన్నట్లుండి "అన్నట్లు చెప్పడం మరిచి పోయాను. నా అడ్రసు మీ దగ్గర లేదుగదా. ఈ కాగితం మీ వద్ద ఉంచుకోండి" అని వారి లెటర్ హెడ్ ఒకటి తీసి నాకిచ్చారు.

ఆ కాగితం చూడగానే నాకు ఆశ్చర్యం వేసింది. అది ఎప్పుడో అనాదిగా ఇంగ్లండు నుంచి ఇంపోర్టు అయిన కాగితంగా నాకనిపించింది. దానిమీద వారి పేరు, ఆయన అడ్రెసు అన్నీ ఉన్నవి. సరే అన్నాను. ఇది కూడా తీసుకువెళ్లి ఆ నాణెం దగ్గర పెట్టాను. నాల్గు నెలలు అయింది, ఐదు నెలలు అయింది. దీన్ని గురించి ఆలోచన లేదు.

ఒకసారి కలకత్తా వెళ్లాను ఎలా వున్నారో పెద్ద మనిషి ఒకసారి పలుకరించి వద్దాం అని. చూచి చాలా రోజులయిందని సంకల్పం కలిగి, వారి కోసం వెళ్లాను. ఆ అడ్రసు వెతుక్కుంటూ వెళ్తే దాన్ని చెప్పగల్గిన వారెవరూ నాకు కన్పడలేదు. ఆ ప్రాంతాలు, రూపురేఖలు అన్నీ మారిపోయాయి. ఒకతను మాత్రం చెప్పాడు.

"సుమారు వలభై యాభై సంవత్సరాలు క్రితం ఈ ప్రాంతంలో ఆ ఇల్లు వుండేదేమో! ఇప్పుడవేమీలేవు." నా మనస్సు చివుక్కుమన్నది. నాకేదో భయం కూడా వేసింది. పుస్తకం విలువకంటే కూడా, ధరకంటే గూడా, ఆ పుస్తకాన్ని మళ్లీ నేను కొనుక్కోలేను. కంగారుపడుతూ ఇంటికి తిరిగి వచ్చాను. ఇనపపెట్టె తెరిచాను. ఆ 'బంగారునాణెం' నాకు కన్పించలేదు. తెలియని భయం ఏదో ఆవేశించింది.

లైబ్రరీ తెరిచి పుస్తకాలన్ని చూడటం మొదలు పెట్టాను. ఆశ్చర్యం! 'వాచస్పతీయం' అక్కడే వుంది. 'కృత్తివాస రామాయణం' కూడా అక్కడే వుంది. వాటిలో మార్పులేమీ లేవు. మళ్లీ తిరిగి వచ్చాను. ఇల్లంతా వెతికాను. ఇనపపెట్టెలో వుండే బంగారు నాణెం ఎప్పుడు చేరిందో తెలియదుగాని దేవతార్చనలో అమ్మవారి పాదాల చెంత వుంది. ఆ నాటికీ ఈ నాటికీ ఆయన మళ్లీ తిరిగిరాలేదు. పుస్తకం గురించి అడగలేదు- 'నాణెం' తీసుకువెళ్లలేదు. ●



యువతా! కవితా!!

తాపత్రయం

అడవుల్లో తిరుగుతుంటాను
గుండెలు చల్లుకుంటూ–
వెన్నెల చీల్చుకుంటూ
చైతన్యపు లంకెబిందెల్ని వెలికి
తీయడానికి
రాళ్ళల్లో వజ్రాల్ని ఏరటానికి!

చెట్లు నా నీడలైపోయి ఎందరినో
మేల్కొలిపి– సేదదీరుస్తున్నాయి,
చల్లగా స్పృశిస్తున్నాయి!
నా గుండె లక్ష ముక్కలై–
లక్ష గొంతుకలైంది
ఇపుడిపుడే కోట పునాదులు
కదులుతున్నాయి!

ఎప్పుడూ
నా తాపత్రయం
చీకటి అడవుల్లో
సూర్యుళ్ళను పుట్టించాలనే!

–వేమూరి శ్రీధర్

చేజారిన క్షణం

కళ్ళు తెరచి
నే చూసిందేమిటో
నాకు తెలియదు!
మాట నేర్చి
నే పలికిందేమిటో
నాకు గుర్తులేదు!
ఊహ తెలిసిన
నా హృదయం మాత్రం
తొలిసారి చూసింది
నీ రూపాన్ని!
మమత నేర్పిన
నా మనస్సు మాటకు
మొట్ట మొదటగా పలికింది
నీ నామధేయాన్ని!
ఆ చూపే వలపై
ఆ పిలుపే మలుపై
నా జీవితాన్ని తిరగరాస్తుందని
ఆ క్షణంలోనే
నాకు తెలిసి వున్నట్లయితే
బహుశా ఇలా జరిగి ఉండేది కాదేమో!

–మంతెన విజయలక్ష్మి

జీవితం

ఆటపాటలతో
సాగితే
ఆనందమే!
ఆటుపోటులతో
సాగదీస్తే
అస్తవ్యస్తమే!!

–జి. బాలాజీ

తేడా!

అయిదు వేళ్ళూ
నోట్లోకి పంపడం కోసం
అభిమానం చంపుకొని
అడుక్కుంటాడు
ముష్టివాడు!
అయిదేళ్ళు
హాయిగా గడపడం కోసం
అభిమానం తెంపుకొని
అడుక్కుంటాడు
(వి) నాయకుడు!

–పురిజాల సుధాకర్

"అమ్మ"

చంకనున్న చంటిబిడ్డ
పాలకోసం గుండెల్ని
తడుముతుంటే–
పాలసీసా నోట బెట్టిన
తల్లివైపు కన్నెత్తని
పసికందు
పాలసీసా చూసి
బోసిగా నవ్వింది
నీవే నా తల్లివన్నట్లు!!

–బలివాడ గణపతిరావు

తనయుడు - తనయ

తనయుడు
పెళ్ళి చేసుకొని
కట్నం తెచ్చాడు
అప్పులన్నీ తీరాయి!
కన్న తండ్రి
కళ్లల్లో వెలుగు కనబడింది!

తనయకు
పెళ్ళి జరిపించి
కట్నం ఇచ్చాడు
అప్పులింకా పెరిగాయి!
కన్యాదాత
గుండెల్లో మూలుగు వినబడింది!

–ప్రశాంతి

పగిలిన హృదయం!


దేవీ
మాటలతో మంత్రించావు
కళ్ళతో కౌగిలించావు
నా హృదయంలోకి
వచ్చినట్టే వచ్చి
సాంప్రదాయానికి
తలవంచి
శిల్పమై నా
మదిలో మిగిలావు!

"సలీం"



సీరియల్

సూపర్ హీరో



మన్నెం శారద

(గత సంచిక తరువాయి)

"ఎల్లుండి గాంధీ జయంతి. ఆ రోజు జైల్లోని నేరస్థులందరికి హోం మినిష్టరుగారు స్వీట్స్ పంచుతారు.

చాల పకడ్బందీ అయిన బందోబస్తుతో నేరస్థులందర్నీ టాంక్ బండ్ మీదకి తీసుకురావాలి!" కమీషనర్ ఉత్తర్వుని శిరసా వహించినట్లు తలలూపేరు పోలీసాఫీసర్సు.

ఈ ఏర్పాటు కేవలం విజయేంద్రని మరోసారి పెద్ద ఎత్తున అవమానించడానికే అన్న విషయం కమీషనర్ గాంధీకి, ఇన్స్పెక్టర్ జేమ్స్‌కి మాత్రమే బాగా తెలుసు. జేమ్స్ పరమోత్సాహంగా ఆ ఏర్పాట్లు చూశాడు.

జేమ్స్ ప్రత్యేకించి విజయేంద్ర వున్న సెల్ దగ్గరకొచ్చి "బయల్దేరండి బే! ఏంటింకా కూర్చున్నారు?" అన్నాడు.

పిల్లై బదులుగా పళ్లు పటపట నూరి "ఏంట్రా కూశావ్!" అన్నాడు రౌద్రంగా లేచి నిలబడి.

జేమ్స్ నల్లగుడ్డు బయటకొచ్చేలా కళ్ళురిమి లాఠీ ఎత్తేడు అతనిపైకి.

అంతవరకు గోడకి జేరబడి కూర్చున్న రాకా లేచి నిలబడి "ఆ లాఠీ అతని వంటిని తాకితే నీ బొమికలు పొడరుచేసి దేశమంతా వెదజల్లుతాను" అన్నాడు.

జేమ్స్ లాఠీ ఎత్తిన చెయ్యి మెల్లిగా క్రిందకి దిగింది.

అతను వచ్చిన కోపాన్ని దిగమింగి బయట కెళ్లిపోయాడు. మరో అయిదు నిమిషాల్లో పదిమంది కాన్‌స్టేబుల్సుతో అతను తిరిగొచ్చేడు. వాళ్లు పిల్లైని ఇష్టం వచ్చినట్లు కొడుతుంటే విజయేంద్ర చూడలేక అడ్డం వెళ్లేడు. అతని వంటిమీద కూడా లాఠీ నృత్యం చేయబోతుండగా "ఆగండి" అని అరిచేడు జేమ్స్.

పోలీసులు ఆగిపోయేరు.

"వాణ్ణి కొట్టకండి వాడీ రోజు పబ్లిక్‌లోకి వస్తున్నాడు. వాడి వంటిమీద దెబ్బలు కనపడకూడదు" అన్నాడు జేమ్స్ తిరిగి.

"వీళ్ళందర్నీ వేన్‌లోకి తొయ్యండి"

వెంటనే పోలీసులు వాళ్ల ముగ్గురికి హేండ్‌కఫ్స్ వేసి తోసుకొంటూ వేన్ ఎక్కించేరు.

పది నిముషాల్లో ప్రిజనర్స్ వున్న వాన్స్ వరుసగా టాంక్‌బండ్‌మీద నిలబడ్డాయి. పోలీసులు వాళ్లని మోకాళ్ల మీద కొట్టి అదిలిస్తూ వరుసగా టాంక్ బండ్ మీదున్న పేవ్‌మెట్సు మీద కూర్చోబెట్టేరు. హుస్సేన్‌సాగర్‌లోని మురికినీరు మహాతటాకమై సముద్రంలా పొంగిపొర్లుతోంది. బండ్‌మీద శిలా ప్రతిమలై నిలబడిన తెలుగు వెలుగులు ఆ కాలుష్యాన్ని పీలుస్తూ తమ దుర్గతికి తమనే శపించుకొంటున్నట్లు స్తంభించిపోయేరు. ఆ మురికి నీటిలో నిలబడటం కన్నా మునగటం మేలన్నట్లు అడుగున దాక్కున్నాడు తథాగతుడు. రానున్న సంవత్సరాలలో భాగ్యనగరానికి మహమ్మారి కాబోయే హుస్సేన్‌సాగరే అక్కడి ప్రజలకి ఆటవిడుపు. అక్కడ ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన నేరానికి గాంధీ జయంతి వుత్సవాల సందర్భంగా రంగు రంగుల తోరణాలు కట్టేరు.

ఎండ చుర్రుమంటోంది. జైలు డ్రెస్‌లో ప్రిజనర్స్ గాంధీకి తమకి ఉన్న సంబంధమేమిటో తెలీక ఉసూరు మంటూ కూర్చున్నారు.

అందులో ముగ్గురే ముగ్గురు మాత్రం చేతికి సంకెళ్లతో వున్నారు. వాళ్లలో విజయేంద్ర ఒకడు.


అనుకున్న టైముకి గంట ఆలస్యంగా కారులో వచ్చేడు రాయుడు. పోలీసులు నడ్డిమీద లాఠీలతో పొడుస్తుంటే లేచి నిలబడ్డారు ప్రిజనర్స్.

ఎత్తుగా కట్టిన వేదిక మీద నిలబడి రాయుడు స్వాతంత్ర్యానికి సినిమాలకి, గాంధీకి సినిమాలకి, ప్రిజనర్స్‌కి సినిమాలకి ఉన్న సంబంధం గురించి మాట్లాడేడు. ప్రిజనర్స్ తలలు గోక్కుంటూ అతని ఉపన్యాసం కన్నా హుస్సేన్‌సాగర్ గాలే నయం అన్నట్లు దిక్కులు చూస్తూ కూర్చున్నారు.

రాయుడు మాత్రం తనే స్వాతంత్ర్యాన్ని భుజాలమీద మోసుకొచ్చి అక్కడ పడేసినంత ఆయాస పడ్తూ వేదిక దిగేడు.

అసలైనది, చివరిది అయిన స్వీట్స్ పంచే తతంగం ప్రారంభమైంది.

ఇంతవరకూ సాగిన కథ-21: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిఖిలేశ్వరి తన కొడుకు విజయేంద్రకు చిత్రసీమలో వస్తున్న పేరు ప్రఖ్యాతులకు ఆనందిస్తుంటుంది. వ్యభిచార నేరం క్రింద అరెస్టు అయిన దమయంతి అవమానభారంతో ఆత్మహత్య చేసుకుంటుంది. బ్లూఫిల్ములు తీస్తున్నాడన్న నేరంపై విజయేంద్రను పోలీసులు అరెస్టు చేస్తారు. జైలులో కొడుకు దుస్థితిని చూసి నిఖిలేశ్వరికి మనసు వికలమవుతుంది. దమయంతి హత్య జరిగిన తీరును అనకాపల్లి వ్యాపారస్థుడి ద్వారా శ్యామసుందర్ రాబడతాడు. పీయూష గృహనిర్బంధంలో వున్నట్లు రజనికి; నిఖిలేశ్వరికి తెలుస్తుంది.



వెంటనే కరంచంద్ గాంధీ రంగంలోకి ప్రవేశించేడు. జేమ్స్ అప్పటికే అందర్నీ అదలిస్తున్నాడు. రాయుడు ఒక్కొక్కరి చేతిలో స్వీట్స్ పెడుతూ వారి నమస్కారాలు స్వీకరిస్తున్నాడు. అతని దృష్టి మాత్రం దూరంగా హేండ్‌కఫ్స్‌తో నిమిత్తమాత్రుడిలా కూర్చొని వున్న విజయేంద్ర మీదే వుంది.

కాల్‌షీట్స్ కోసం వెళ్తే ఎంతబడాయి వెళ్లబోసేడు! ఈ రోజు సూపర్ హీరో పాపర్‌లా రోడ్డుమీద కూర్చొని వున్నాడు. ఇప్పుడు తన చెయ్యి పైన- అతని చెయ్యి క్రింద వుండే క్షణం వచ్చింది. ఈ విషయాన్ని బాగా ఎక్స్‌ప్లాయిట్ చెయ్యాలి!

రాయుడు పంచెకొంగు జేబులో దోపుకొని కళ్లద్దాలని సవరించుకొంటూ విజయేంద్ర ముందుకి వచ్చేడు.

విజయేంద్ర ఎటో చూస్తూ పరధ్యానంగా వున్నాడు.

రాయుడు దగ్గినట్లు సకిలించేడు.

"చెయ్యి చాపు బే!" అంటూ లాఠీతో డొక్కలో పొడిచేడు జేమ్స్.

విజయేంద్ర ఉలిక్కిపడి చూశాడు.

ఎదురుగా రాయుడు వంకరగా నవ్వుతూ నిలబడ్డాడు. అతని పక్కనే కరంచంద్ గాంధీ క్రూరంగా చూస్తూ నిలబడ్డాడు.

"తప్పు ఇన్స్‌పెక్టర్. ప్రతిమనిషి తెలిసో తెలియకో తప్పులు చేస్తుంటారు. గాంధీ జయంతినాడు నా ఎదుటే నువ్వు నేరస్థుడయినా కొట్టడం సహించలేను" అన్నాడు రాయుడు.

"క్షమించండి సార్!" అన్నాడు జేమ్స్.

"చెయ్యి చాపు నాయనా!" అన్నాడు రాయుడు.

అతని వైపు ఏవగింపుగా చూశాడు విజయేంద్ర.

గాంధీ కోపంగా జేమ్స్‌వైపు చూశాడు.

జేమ్స్ అర్థమైన వాడిలా "నిన్నే, త్వరగా తీసుకో. మినిస్టర్‌గారు నీ ఒక్కడి

దగ్గరే ఎంతసేపు నిలబడాలి!" అంటూ కఫ్స్ వేసున్న అతని చేతుల్ని బలంగా గుంజేడు.

రాయుడు అతని దోసిట్లో స్వీట్ పెడుతుండగా పథకం ప్రకారం ఎరేంజ్ చేసిన ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీసేరు.

రాయుడు ముందుకి నడవగానే విజయేంద్ర స్వీటుని కాలిక్రిందవేసి నలిపేసేడు కసిగా.

"నువ్వేం చేసి ప్రయోజనం బ్రదర్! ఆ తొత్తులు ఫోటోలు తీసేరు! ఇదంతా అసలు దేనికి? నా కర్థం కావడం లేదు!" అన్నాడు రాకా విజయేంద్రవైపు చిత్రంగా చూస్తూ.

విజయేంద్ర నిర్లిప్తంగా నవ్వి "నేనెంత హీనస్థితిలో వున్నానో చూపించి ఒకరి మనసు విరిచేయడానికి!" అన్నాడు.

"ఎవరు?"

విజయేంద్ర ఏదో చెప్పబోయేంతలో పోలీసులు హడావుడి చేసి వారిని వ్యాన్లు ఎక్కించేరు.

పోలీసు బందోబస్తుతో వ్యాన్లు ముందుకి కదలిపోయేయి.

* * *

"ఎందుకిలా చేసేవ్?" తన ముందు నిలబడి వున్న వెంకటస్వామిని కఠినంగా ప్రశ్నించేడు గాంధీ.

స్వామి తలదించుకొని "తమకి తెలుసు!" అన్నాడు గొణిగినట్లుగా.

"ఏంటి తెలుసు? ఇదే ఇంకొకరు చేస్తే తోలు ఒలిపించేసే వాణ్ణి!" అన్నాడు

సూపర్ హీరో

గాంధీ ఉద్రేకపడుతూ.

స్వామి తలెత్తేడు. "నాకు మాత్రం ఎందుకు ఒలిపించ కూడదయ్యా?" అన్నాడు మెల్లిగా.

గాంధీ దెబ్బతిన్నట్లు చూసి "నాతో సవాలు చేస్తున్నావా? ముసలి వెధవ్వని చూస్తున్నాను. ఒక్క లాఠీ దెబ్బకి చచ్చి వూరుకుంటావు!" అన్నాడు.

"కొట్టండి బాబూ! నేను కాని పనేం చెయ్యలేదు. అమ్మాయి గోరు నా చేతుల మీద పెరిగేరు. ఆరి బాధ చూడలేక నేనింతకు తెగించేను. అందుకు మీరే శిక్ష విధించినా సమ్మతమే!"

గాంధీ చిరాగ్గా కుర్చీలో కూర్చున్నాడు.

వెంకటస్వామి క్రీగంట అతన్ని చూస్తూ నిలబడ్డాడు.

"స్వామీ!" అన్నాడు గాంధీ మెల్లిగా.

వెంకటస్వామి "అయ్యా!" అన్నాడు వినయంగా.

"బేబీ నా యింటి పరువు మంట కలుపుతోంది. నీకు తెలుసు- నేను పరువుకి ప్రాణం పెడ్తానని. నిన్ను నేను ఏనాడూ జవానుగా చూడలేదు. ఈ ఇంట్లో అంత అభిమానం నువ్వు సంపాదించుకోబట్టే నిన్ను ఏం చేయలేకపోతున్నాను. బేబికి నాన్న మనసు నొప్పించొద్దని- మనసు మార్చుకోమని చెబుతావని ఆశించేను. కాని నువ్వే నాకు ఎదురు తిరిగి ఇలా బేబికి సహాయపడటానికి సిద్ధపడ్తావని అనుకోలేదు" చివరి మాటలంటున్నప్పుడు గాంధీ గొంతు వణకడం గమనించేడు వెంకటస్వామి.

సింహంలాంటి మనిషి సింహంలానే ఘర్జిస్తే ఎవరూ ఆశ్చర్యపోరు. కాని చెవుల పిల్లిలా జారిపోతే మనసు ద్రవించకమానదు. గాంధీని చూస్తే అలాంటి భావమే కల్గింది వెంకటస్వామికి.

"బేబి మాత్రం ఏం తప్పు చేసింది! ప్రేమించింది. ఆ పిల్ల ప్రేమని గౌరవించి పెళ్లి చెయ్యొచ్చుగా!" అని చెప్పే సాహసం లేదు వెంకటస్వామికి.

డిపార్టుమెంటులో పులిలా బ్రతికిన మనిషికి పిల్లిలా మారమని తనేకాదు ఎవరూ చెప్పలేరు.

ఇప్పటికే పరిస్థితి విషమించింది. ఆ పిల్ల ప్రేమించిన మనిషి పరువు బజార్న పడింది. ఒక నేరస్థుడికి నీ కూతుర్నిచ్చి చెయ్యమని ఎవరు చెబుతారు. పోనీ బేబీకే చెబుదామంటే పంతానికి ఆ పిల్ల తండ్రి నోట్లోంచి ఊడిపడింది.


వెంకటస్వామి దీనంగా ఆలోచిస్తూ

గాంధీ ఎదుట నిలబడి వుండగా సాల్యూట్ చేస్తూ జేమ్స్ ప్రవేశించేడక్కడికి.

గాంధీ మొహం కఠినంగా మారింది తిరిగి.

ప్రశ్నార్థకంగా అతనివేపు చూశాడు.

బదులుగా అతని కొన్ని పేపర్లు అతని ముందు పెట్టేడు.



సూపర్ స్టారైనా అల్‌పాసినో జీవన విధానం మారలేదు



తారాపథానికి నిచ్చెనలు...

అతడికి 7వ ఏడు వచ్చేవరకు ఇంట్లోంచి కదలలేదు.

13వ ఏట తాగడం ప్రారంభించాడు.

40వ ఏట మన్‌హటన్ వీధుల్లో గూండాలతోనూ రౌడీలతోనూ తిరుగుతున్నాడు.

ఇది 'గాడ్‌ఫాదర్', 'స్పెరికో' 'క్రూయిసింగ్' వంటి చిత్రాల సంచలన నటుడు కోట్లకు పడగలెత్తిన సూపర్‌స్టార్ 'అల్‌పాసినో' జీవితం. అతడి చిత్రాల్లో చాలా పాత్రలు అతడికి పరిచయమైనవే!

న్యూయార్క్‌లో అతిపేదవానిగాపుట్టిన అల్‌పాసినో ధనవంతుడైనా, ప్రపంచ ప్రఖ్యాతిగాంచినా మారలేకపోయాడు.

న్యూయార్క్ స్లమ్‌లో నివసించే అందరిలా తన కొడుకు కూడా అల్లరి చిల్లరిగా తిరగ కూడదని అతని తల్లి కట్టుదిట్టం చేసింది. సినిమాలు చూపించేది. ఇంటికొచ్చి అమ్మమ్మ ముందు సినిమాలో పాత్రలన్నీ నటించి చూపించేవాడు. స్కూల్లో అంతా పాసినోని 'నటుడు' అని పిలిచేవారు.

"13వ ఏట త్రాగడం ప్రారంభించాను. మానలేక పోతున్నాను' అంటాడు అల్‌పాసినో.

కష్టకాలంలో పాసినోని ఒక వృద్ధురాలు తన దగ్గర పెట్టుకుంది. వుండటానికి స్థలం తినడానికి తిండి ఇచ్చేది. ఫలితంగా సెక్స్ కోరేది.

స్కూలు చదువు, హాస్య నాటికలు రాయడం నేర్పింది. రాసిన నాటకాలను గ్రీన్‌విచ్ విలేజ్ కాఫీ హవుస్‌లో ప్రదర్శించేవాడు. హాలీవుడ్‌లో చిన్న చిన్న వేషాలు దొరికాయి.

అల్‌పాసినో నటించిన 'ది పానిక్ ఇన్ నీడిల్‌పార్క్' చిత్రం 1971లో విడుదలయి అతడికి సూపర్‌స్టార్ ఇమేజ్ సంపాదించిపెట్టింది.

ఈ రోజు పార్క్ ఎవెన్యూలో అందమైన ఇంట్లో నివసిస్తున్నా అతడి జీవన విధానం మారలేదు. జీవితాన్ని పెద్దగా పట్టించుకోని పాసినో మాసిన బట్ట లేసుకుని మన్హటన్ వీధుల్లో తిరగడం చూసి చాలా మంది ఆశ్చర్య పడతారు.

హాలీవుడ్‌లో నటిస్తున్నప్పుడు మాత్రం చాలా సీరియస్‌గా క్రమశిక్షణతో వుంటాడట అల్‌పాసినో.

గాంధీ వాటిని తెరచి చూశాడు. అతని మొహంలో ఒకలాంటి ఆనందం తాండవించడం గమనించేడు వెంకటస్వామి. మెల్లిగా రెండడుగులు ముందుకేసి పేపరు చూడటానికి ప్రయత్నించేడతను.

టాంక్‌బండ్ మీద నేరస్థులు వేసుకొనే యూనీఫామ్‌తో హేండ్‌కప్స్ ఉన్న చేతులు చాచి రాయుడిస్తున్న లడ్డు తీసుకొంటున్న విజయేంద్ర ఫోటో అది.

వెంకటస్వామి మళ్లీ రెండడుగులు వెనక్కేసి ఎరగనట్లుగా నిలబడ్డాడు.

"మొత్తం స్టేట్‌లో వున్న పేపర్లన్నీ ఈ ఫోటోని ప్రచురించేయి సర్!" అన్నాడు జేమ్స్ పైశాచికానందంతో.

గాంధీ తల పంకించేడు.

జేమ్స్ సాల్యూట్ చేసి వెళ్లిపోగానే గాంధీ కాస్సేపు కళ్లు మూసుకొని కుర్చీకి వెనక్కి జేరబడి మళ్లీ కళ్లు తెరచి "స్వామీ!" అన్నాడు.

"అయ్యా!" అన్నాడు స్వామి వినయంగా.

"నువ్వు చేసిన తప్పు ఈసారికి క్షమిస్తున్నాను. ఇంకోసారి ఇలా చేసేవంటే నేనేం చేస్తానో చెప్పలేను. ఈ పేపర్లు బేబికి చూపించి దాని జవాబు తెలుసుకొనిరా! వెళ్లు" అన్నాడు.

వెంకటస్వామి టీపాయ్ మీద వున్న పేపర్లు తీసుకొని గాంధీకి నమస్కరించి

బయటికి వచ్చేడు.

*   *

అర్ధరాత్రి దాటింది.

విజయేంద్ర చేతులు తలక్రింద పెట్టుకొని కళ్లు మూసుకొని ఆలోచిస్తున్నాడు. తన ఫొటోలు పేపర్లో వచ్చి వుంటాయి. వాటిని తన తల్లి చూసే వుంటుంది. ఎంత గట్టి మనసున్నట్లు లోకానికి నటించి బ్రతుకుతున్నా ఆమె ఒక స్త్రీ. సున్నితత్వానికి మారుపేరు. తన కడుపున పుట్టిన బిడ్డ ఇంత హీనదీనస్థితిలో వుండటాన్ని చూసి ఏ స్త్రీ సహించలేదు. ఖచ్చితంగా తల్లడిల్లిపోతుంది. ఏ అర్ధరాత్రో తనకోసం ఏడ్చి తీరుతుంది. ఆమె కడుపున పుట్టినందుకు ఆమెను దుఃఖపెడుతున్నాడు తను. పీయూష పరిస్థితేమిటో తనకి తెలీదు. ఆమె మనసు మార్చుకుందా లేక ఆమెని కూడ గాంధీ బాధిస్తున్నాడా!

అతనాలోచనల్లో అతనుండగా ఎవరో ఏడుస్తున్న ధ్వని వినిపించింది.

విజయేంద్ర ఉలిక్కిపడి చూశాడు.

రాకా గుర్రుపెడుతున్నాడు.

పిళ్లే గోడవైపు తిరిగి పడుకున్నాడు.

ఏడుస్తున్నట్లుగా అతని భుజాలు కదలడం గమనించేడు విజయేంద్ర.

చప్పున లేచి వెళ్లి "పిళ్లే!" అని పిలిచేడు.

బదులుగా అతని దుఃఖం అధికమైంది.

విజయేంద్ర అతని భుజాలమీద చేతులుంచి తనవైపు తిప్పుకొని "ఒంట్లో బాగోలేదా?" అనడిగేడు.

పిళ్లే కాదన్నట్లుగా తల అడ్డంగా తిప్పేడు.

"ఏంటో చెప్పు మరి! ఎంతో గంభీరంగా వుండే నువ్వే ఏడిస్తే మిగతా వారి సంగతేంటి?" అన్నాడు విజయేంద్ర అనునయంగా.

పిళ్లే లేచి గోడకి జేరబడి కూర్చున్నాడు.

"పైకి గంభీరంగా వున్నా రోజూ లోపల ఏడుస్తూనే వున్నాను బ్రదర్. పగతో నా మనసు అతలాకుతలమైపోతున్నది. ఈ శిక్ష ఎప్పుడు పూర్తవుతుందో ఎప్పుడు వాణ్ణి చంపుతానో... అంతవరకు నా మనస్సు శాంతించదు. గుండెలో మంటని వాడి రక్తంతో ఆర్పుకోవాలి!" అన్నాడతను కసిగా.

ఆ మాటకి విజయేంద్ర చిన్నగా నవ్వి "బాగుంది నీ శపథం. ఇదేమన్నా మరో [illegible]రత కాలం అనుకొంటున్నావా [illegible] శపథాలు చెయ్యడానికి. మనసుని శాంతపరచుకో! " అన్నాడు.

పిళ్లే అతని వైపు సీరియస్‌గా చూసి "కాలం మారినా మనసులోని అవమానాలు, వాటి తాలూకు పగలు మారవు బ్రదర్. వాడెంత అన్యాయం చేసాడో తెలిస్తే నువ్విలా మాట్లాడవు. వాణ్ణి నిలువునా చీరిపాతేసినా పాపం లేదు." అన్నాడు క్రోధంగా.

"ఇంతకీ ఎవరతను?"

"వాడే, జేమ్స్!"

ఆ జవాబు విని ఆశ్చర్య పోయేడు విజయేంద్ర.

పిళ్లే కళ్లు మూసుకొన్నాడు. మూసిన ఆ కళ్ళ క్రిందనుండి మళ్లీ దుఃఖం పొంగి క్రిందకి జారింది.

కాస్సేపు మౌనంగా కూర్చుని "నా చెల్లెలు- నా ఒక్కగానొక్క చెల్లెలు ఎలా చచ్చిపోయిందో తెలుసా! వీడివలనే! వీడే దాన్ని పొట్టన పెట్టుకొన్నాడు.!"

"ఎలా జరిగిందది?"

"చెబుతాను. ఈ రోజు ఎంత కాదన్నా నా చెల్లెలు నాకు గుర్తొస్తున్నది. మా ఇంటి పక్కనే వీడి చెల్లెలు, చెల్లెలు భర్త వుండేవారు. మొదట మాతో స్నేహంగానే ఉండేవారు. నాకు తల్లీతండ్రీలేరు. చెల్లెలొక్కర్తే నా ప్రపంచం. నా చెల్లెలని చెప్పడం కాదుగాని ఎంతో గుణవంతురాలు. ఆమె పెళ్లి కోసం నేను ఎంతగానో శ్రమిస్తున్నాను. ఏదో అవసరమొచ్చిందని వీడి బావ అడిగితే నా చెల్లెలు పెళ్లికోసం దాచిన డబ్బు అప్పుగా ఇచ్చేను. కాలం గడుస్తోంది. అతనెంతకీ అప్పు తీర్చడంలేదు. ఇంతలో నా చెల్లెలు పెళ్లి కుదిరింది. నేను డబ్బివ్వమని అడిగేను. అతను డబ్బేంటని ఎదురు ప్రశ్నవేసేడు. నేను బిత్తరపోయేను. ఆలస్యమైతే అవతల నా చెల్లెలు పెళ్లాగిపోతుంది. అంతడబ్బు అస్తిలేని నా కెవరూ అప్పివ్వరు. నేన తన్ని మర్యాదగా ఇవ్వకపోతే చంపుతానని బెదరించేను. పెళ్లి దగ్గర కొచ్చేస్తున్నది. పక్కవూళ్లో ఉన్న మా పెదనాన్నని అప్పు అడుగుదామని ఊరెళ్లేను. ఆయన కొంత సహాయం చేస్తానన్నాడు. ఆ సంతోషంతో తిరిగొచ్చిన నాకు ఇంటి ముందు జనం కనిపించేరు! కంగారుగా వెళ్లి చూస్తే నా చెల్లెలు శవంగా మారి కనిపించింది. నేను పిచ్చెక్కిపోయేను. నేను ఊరెళ్లగానే ఆ జేమ్స్‌గాడు నామీద కసితో నా చెల్లెల్ని వ్యభిచారం నేరం మోపి అరెస్టు చేసి ఊరందరూ చూస్తుండగా జైలుకి తీసుకెళ్లేడట. తిరిగి వదిలేయగానే ఆమె అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకొంది. కసితో నా మనసు ఊగిపోయింది. ఎలాగైనా జేమ్స్‌ని చంపితీరాలని నిర్ణయించుకొన్నాను. వాడు బైక్‌మీద రావడం చూసి సరిగ్గా వాడిమీద పడేలా రాయి దొర్లించేను. కాని నా దురదృష్టం కొద్దీ వెంట్రుక వాసిలో నా ప్రయత్నం విఫలమైంది. హత్యా నేరంపై నన్ను అరెస్టు చేసి ఇలా జైల్లో పెట్టేరు."

విజయేంద్ర అనునయంగా అతని చేతిని పట్టుకొన్నాడు.

"మొదట్లో నిన్నపార్థం చేసుకొన్నాను. నీ మనసులో ఇంత వ్యథ వుందని నాకు తెలీదు. గతం మరచిపో. నువ్వేం చేసినా నీ చెల్లెలు తిరిగి రాదుకదా!" అన్నాడు.

"నో! నా కలాంటి మాటలు చెప్పొద్దు బ్రదర్. నేనేం ఆశించి ఎవరి కోసం బ్రతకాలి! నా చెల్లెలి జీవితాన్ని నాశనం చేసిన ఈ నీచుణ్ణి చట్టం ఏమీ చేయదు. నేను వదిలేస్తే వాడు హాయిగా విచ్చలవిడిగా ఇలాంటి పాపాలు ఇంకా ఎన్నో చేస్తాడు. వీణ్ణి చంపడమే నా జీవిత ధ్యేయం!" అన్నాడు ఖచ్చితంగా పిళ్లే.

విజయేంద్ర జవాబు చెప్పలేదు.

(ఇంకావుంది)

జీవితం

ఆమెకు, అతడికి మధ్య
అందని చిరునవ్వుల పువ్వులు!
అతడికి, ఆమెకు మధ్య
అగుపించని అవకాశాల దివ్వెలు!!

ఆమె కన్నులలో అత్యద్భుతమైన
అనంతాకాశపు నీలి కిరణాల పిలుపులు!
అతడి చేతలలో పొంగిపొరలే
అతిమాత్న చైతన్యతరంగాల వలపులు!!

ఆమె ఆశ! అతడు ఆదర్శం!!
ఆమెను అందుకోవాలని నిత్యం
అతడు చేసే ప్రయత్నమే జీవితం!!

-[illegible] శ్రీనివాసులు విద్యాన్

వలకొసిరి

- విహారి



ఆదివారం, మధ్యాహ్నం మూడు దాటింది. ఒక కునుకు తీసి అప్పుడే లేచాను.

సుడిగాలిలావచ్చాడు రాజు. ముకుందం వాళ్ల ఇంట్లో అద్దెకున్న టీచరు కొడుకు. పన్నెండేళ్లవాడు-రాజు.

ఉన్నఫళాన రమ్మని కబురుపెట్టాడు ముకుందం. హడావిడిగా ముకుందం వాళ్ల ఇంటికి వెళ్లాను. మా పక్క ఇల్లే వాళ్లది. నా వెనుక మా ఆవిడ-శారద- వచ్చింది.

నే వెళ్లేసరికి -రణరంగం మధ్యలో వున్నారు తండ్రీకొడుకు. సిదిలో ఓ మూలగా భయంతో ఒణకిపోతూ ఒదిగిపోయి కూర్చొనివున్నాడు ముకుందం. రామ్మూర్తి చేతిలో వెదురుకత్తి. కొడుకు కాళ్లు చేతులు పట్టుకొని ప్రాధేయపడుతూ ఏడుస్తోంది వర్ధనమ్మ. వీళ్ల ప్రక్కగా తలుపుచాటున సరోజ పిల్లని ఎత్తుకొని బిక్కచూపులు చూస్తూ వెక్కిలు పెడుతూంది. సరోజ రామ్మూర్తి భార్య. ముకుందం వర్ధనమ్మల కోడలు.

నన్నుచూస్తూనేబావురుమంటూ 'రక్షించండి శేఖరంగారూ' అంటూ నెత్తినోరు కొట్టుకోసాగాడు ముకుందం. నాకు పరిస్థితి అర్థమైంది.

ఒక్క ఉదుటున రామ్మూర్తి చేతిలో కత్తిని లాక్కుని అతన్ని పక్కకి త్రోసేశాను.

'ఇవాళ అటో ఇటో తేలిపోవాల్సిందే. వీడో నేనో ఎవరో ఒకళ్లం చావాల్సిందే. లం...కు' అంటూ గోడవారగా వున్న మంచం మీద కూలబడ్డాడు రామ్మూర్తి.

అప్పటికప్పుడే వర్ధనమ్మ చెయ్యిపట్టుకొని పక్కకి తీసుకెళ్లి కూర్చోబెట్టింది మా శారద.

"చూశారా...చూశారా ఎంతమాటం

టున్నాడో విన్నారు గదా. నీ నోట్లో నిప్పులుపొయ్య, పురుగులు పడి చస్తావురా నీచుడా" ముకుందం లేచి తుండుతో ముఖం తుడుచుకున్నాడు.

"నోరు మూసుకు కూర్చో. మాట్లా డావంటే తలకాయ పగులుతుంది."

నేను వినలేకపోయాను.

వున్నట్టుండి -"ఏయ్ రామ్మూర్తి కమాన్. లే లేచి నాకు కొంచెం టీ పెట్టు. ముందు నేను టీ తాగాలి. ఇంట్లో తాగబోతూ వుంటే మీ కబురు వచ్చింది." అంటూ వంటింట్లోకి నడి చాను. నా వెనగ్గా మంత్రముగ్ధుడిలా రామ్మూర్తి వచ్చాడు. వాతావరణం చల్ల బడింది.

టీ త్రాగుతూ మంచం మీద కూర్చు న్నాను. రామ్మూర్తి టీ తాగుతున్నాడు. ముకుందంకీ ఓ కప్పు అందించాను. ఆడ వాళ్లు ముగ్గురు వంటింటి గుమ్మంలో కూర్చున్నారు.

క్షణాల తర్వాత నేనే కదిపాను. "ఏవిటోయ్ రామ్మూర్తీ, చదువుకున్నవా డివి. ..ఇలా ..."

ఒక నిమిషంసేపు దిక్కులు చూశాడు రామ్మూర్తి. ఆ వెంటనే అన్నాడు "మా ఇంటి విషయాలు మీకు తెలుస్తూనే వుండి వుంటాయి. కనుక, నన్నేమి వివరాలు అడగొద్దు. ఇక ఇవాల్టి రచ్చ అంటారా? ఈ దర్టీరోగు నన్ను, నా పెళ్లాన్ని ఇంట్లో నుంచి బయటకి పొమ్మంటున్నాడు. కొంప అమ్మేసి నా భాగం నాకిచ్చేయమనండి" రామ్మూర్తి స్వరంలో కసి, కోపం.

"ఎందుకూ -ఆ నాలుగురాళ్లు తగ లేసి బొచ్చె పుచ్చుకుపోదామనా? అడగండి

కలకానిది...

శేఖరంగారూ"- ముకుందం. "అయినా ఈ ఆస్తిలో ఏ ముండమోపికి భాగాల్లేవు."

"ఆ మాటే అనకు. ఎలా వుండదో మేము చూస్తాం. ఇక్కడ ఎవరూ గాజులు తొడిగిచ్చుక్కూర్చోలేదు" రామ్మూర్తి.

"ఏవోయ్ నీ విసురు మా మీదకి రానియ్యకు. నేనసలే మంచిదాన్నికాదు" నవ్వుతూ అన్నది శారద. సరోజ కూడా సన్నగా నవ్వుకుంది.

మరికొద్దిసేపటికి- మార్కెట్ దాకా వెళ్లొద్దాం పదమని ముకుందంని బయటికి తీసుకొచ్చాను. ఇద్దరమూ మా ఇంటికొచ్చి కూర్చున్నాం. నిజానికి నాకు మార్కెట్లో పనేమీలేదు. యుద్ధ వాతావరణం నుంచీ తప్పిద్దామనే అతన్నిలా బయట పడేశాను.

చెస్‌బోర్డ్ తీశాను. నా ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు ముకుందం.

"వీడి పరిస్థితి శ్రుతిమించి రాగాన పడు తోంది- శేఖరంగారూ, మీకు తెలుసుగదా విషయాలన్నీ." చేతిలోని దినపత్రికని తిర గేస్తూ సాలోచనగా అన్నాడు ముకుందం, "ఏమీ బాగాలేదు".

అవును. నాకు కొంతవరకూ తెలుసు. కొడుకుతో తాము పడుతున్న అవస్థ లన్నీ అడపాదడపా శారదకి చెప్పుకుంటూ వుంటుంది వర్ధనమ్మ. తద్వారా నేనూ విన్నాను.

ముకుందం వర్ధనమ్మలకి రామ్మూర్తి ఒక్కడే కొడుకు. గారాబంగా పెంచి పెద్ద చేశారు. గ్రాడ్యుయేషన్ కాగానే- ముకుందం తన పలుకుబడితో ఏదో కంపె నీలో ఉద్యోగంలో చేర్చాడు రామ్మూర్తిని.

ముకుందం డైరెక్టర్‌కి పి.ఏ.గా చేసి రిటైరయ్యాడు. అంతో ఇంతో వున్న హాడి క్రిందే లెక్క. పాతికేళ్ల క్రితం ఓ ఇల్లు కట్టుకున్నాడు. సర్వీసులో వుండగా కంపెనీకి ఎంతో విశ్వాసంగా సేవచేశాడు. ఆ మంచితనంతోనే నిజానికి రామ్మూర్తికి వుద్యోగం దొరికింది. ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకే అతనికి సరోజతో వివాహం జరి గింది. ఆ పెళ్లికి ముందు జరిగిన రభ సలూ, రాద్ధాంతాలు కూడా చూచాయగా తెలుసు నాకు. సరోజది శాఖాంతరమని ముకుందం వొప్పుకోలేదు. రామ్మూర్తి సరోజనే చేసుకుంటానని మొరాయిం చుక్కూర్చున్నాడు. చివరికి సరోజ తల్లి దండ్రులు కట్న కానుకలు అధికంగానే యివ్వజూపారని, ఆ కారణాన ముకుందం పంతాలూ పట్టింపులూ సడలినాయనీ చెప్పు కున్నారు.


పెళ్లయిన మూడు నాలుగు నెలల నుంచీ- ఏ రాత్రీ ఆ యిల్లు ప్రశాంతంగా నిద్రపోలేదు. రామ్మూర్తికి అన్ని వ్యస నాలూ అబ్బినై. క్లబ్బుల్లో పేకాట, చెడు తిరుగుళ్లు, తాగుడూ నిత్యకృత్యాలైనై. సరోజ పురిటికి వెళ్లి వచ్చింది. ఆ తర్వాత, ఈ రెండేళ్లలోనూ మనిషి పూర్తిగా చెడిపో యాడు రామ్మూర్తి, క్రమంగా- ఆఫీసుకు వెళ్లకపోవడంతో- వుద్యోగమూ వూడింది.

అయితే, గుడ్డిలోమెల్ల అన్నట్టు సరో జకు బ్యాంకు వుద్యోగం వచ్చింది. అప్ప ట్నుంచీ ఆమె సంపాదననీ తన వ్యసనాలకి తగలేయడం నిత్యకృత్యమైంది- రామ్మూ ర్తికి. కుమ్మరి ఆవంలో కంకరాయిలా తగు లుకున్నాడు- రామ్మూర్తి!

ఆ వేళ-

నేను ఆఫీసు నుంచీ వచ్చి వోవర్ హెడ్ ట్యాంక్‌కి నీళ్లు పంప్ చేయడానికి మోటార్ వేస్తున్నాను. అదిగో అప్పుడు ఇలాగే ఈ రాజుగాడే పరుగెత్తుకొచ్చాడు. నే వెళ్లేసరికి రామ్మూర్తి కడుపులో నెప్పితో మెలికలు తిరిగిపోతున్నాడు. ముకుందమూ, వర్ధనమ్మ ఏదో పెళ్లికి వెళ్లారుట. అతని బాధ చూసి సరోజ కళ్ల నీళ్లు పెట్టు కుంది. నేను ఆటోపిలిపించి రామ్మూర్తిని డాక్టర్ దగ్గరికి తీసుకుపోయాను. సరోజా వచ్చింది.

వెళ్లగానే ఇంజక్షనిచ్చాడు డాక్టర్. లివర్ దెబ్బతింటోందని బీ.పి. చాలా



ఎక్కువగా వుందనీ, సిగరెట్లు తాగుడూ మానకపోతే కష్టమనీ చెప్పి ఏదో మందులు రాసిచ్చాడు, డాక్టర్. ఆ మందులు తీసుకు వచ్చాం. నేను చెప్పాల్సిన జాగ్రత్తలు చెప్పి వచ్చాను.

ఆ తర్వాత నాలుగు రోజులకి ముకుందం మా ఇంటికి వచ్చి ప్రత్యేకంగా నాకు కృతజ్ఞతలు చెప్పి వెళ్లాడు.

"నన్నేం చెయ్యమంటారో సలహా యివ్వండి." ముకుందం మాటలతో ప్రస్తుతంలోకి వచ్చాను. ఈ పరిస్థితుల్లో నేనుగా ఏం సలహా ఇవ్వాలో తోచలేదు. "చూద్దాంకానీయండి" అని వూరుకున్నాను. ఇంతలో శారద టిఫిన్ కాఫీలతో వచ్చింది.

ఇల్లూ వొళ్లూ ఎలా గుల్లయిపోతున్నదీ, కొడుకుతో తాము ఎలాంటి అవస్థలు పడుతున్నదీ-వివరంగా చెప్తూ చాలాసేపు కూర్చున్నాడు ముకుందం. ఆరు అవుతుండగా తన యింటికి వెళ్లాడు.

రాత్రి ఎనిమిదిముప్పావు. నేను హిందీ వార్తలు వింటూ టీవీ ముందు కూర్చున్నాను. శారద వంటింట్లో ఏదో చేస్తోంది. పక్కయింట్లో పెద్దగా గావుకేకలు, పెడబొబ్బలూ వినిపించినై. లేచి, త్వరత్వరగా ముకుందం ఇంటికి వెళ్లాను. ఇంటి ముందు కాంపౌండ్‌లో చుట్టుపక్కల వాళ్లు పదిమంది దాకా చేరేరు. వాళ్లను తప్పుకుంటూ నేను లోపలికి నడిచాను. మర్యాదా మన్ననా లేకుండా తల్లినీ, తండ్రినీ, పెళ్లాన్నీ-కలగా పులగంగా తిడుతున్నాడు రామ్మూర్తి, బలవంతంగా ఇద్దర్నీ విడదీశాను.

ఏడుస్తూ చెప్పింది వర్ధనమ్మ. "కత్తిపీట తీసుకుని తండ్రిని కొట్టబోయాట్ట రామ్మూర్తి. ఆ ...కుముందు కత్తిపీటతో ఆత్మహత్య చేసుకుంటానని గది తలుపులు బిగించుకుని మొరాయించుక్కూర్చున్నాట్ట- రామ్మూర్తి. తలుపులు బద్దలుకొట్టి లోపలి కొడుకుని బయటికి లాక్కొచ్చాడట ముకుందం. నన్ను చావనీయకపోతే, నిన్నే చంపుతానని ఎదురు తిరిగాడట రామ్మూర్తి."

నాకు చాలా చిరాకు వేసింది. అతని ప్రవర్తనకు అసహ్యమూ కలిగింది. ఇంతలో ఎవరో అన్నారు, "పోలీసుల్ని పిలిచి కేసు పెట్టిస్తేసరి -ఇరుగు పొరుగు వాళ్లని ప్రశాంతంగా బ్రతకనీయడంలేద"ని.

నావైపు చూశాడు ముకుందం-రామ్మూర్తిలో ఏమీ చలనం లేదు. తుమ్మమొద్దులా ఓ ప్రక్కన కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు. చుట్టూ చేరిన వాళ్లకి సర్దిచెప్పి అందర్నీ పంపించేశాను. నేనూ ఏమీ మాట్లాడకుండా మా యింటికి వచ్చేశాను.

ఆరాత్రి చాలా ప్రొద్దుపోయిన తర్వాత -పిల్లని చంకనేసుకుని మా యింటికి వచ్చింది సరోజ. భర్త ప్రవర్తనకి కళ్లనీళ్లు పెట్టుకుంది. శారదా, నేనూ అనునయింపు మాటలు చెప్పాం.

ఉన్నట్టుండి, లేచి నా చేతులు పట్టుకుంది సరోజ. నేను ఉలిక్కిపడ్డాను. "ఆయన మనసు చాలామంచిది బాబాయిగారూ, ఏదో ఒకటి చేసి నాభర్తని నాకు దక్కించండి. పంతానికి పోయి ఏ క్షణాన్న ఏ అఘాయిత్యం చేస్తారోనని భయంగా వుంది." ఏడుపు ఆపుకోలేక పోయింది సరోజ.

కన్ను అదిరింది, గుండె దడదడలాడింది నాకు. క్షణాల్లో నన్నునేను సంబాళించుకున్నాను. నిబ్బరంగా సరోజ భుజం తట్టి "పిచ్చిపిల్ల ఊరుకో, ఏంఫర్వాలేదు" అని కూర్చోబెట్టాను.

మరో అరగంట తర్వాత సరోజ వెళుతుండగా -హఠాత్తుగా నాకు ఖాశిం గుర్తు



"రూప్‌కీ రాణితో యిక్కట్లు"

నిర్మాతలు ఈ మధ్య శ్రీదేవి మూలంగా కొన్ని యిబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోనీకపూర్ నిర్మిస్తున్న 'రూప్ కి రాణి' నిర్మాణం ఆగిపోయింది. ఒక పాట చిత్రీకరణకు శ్రీదేవికి వీలు కుదరక పోవటమే యిందుకు కారణమట. ఇప్పటికే ఈ చిత్ర నిర్మాణానికి రెండున్నర సంవత్సరాలు పట్టింది. ఇంకెంత కాలం పడుతుందో అని కాబోలు ఆ నిర్మాత భయం. యాష్ చోప్రా నిర్మిస్తున్న 'లంహే' చిత్రానికి ఎక్కువ డేట్స్ యివ్వాలని శ్రీదేవి నిర్ణయించుకుంది. కాని రాజన్‌సిప్పీ నిర్మిస్తున్న 'హరాజ్' కు మద్రాసు తిరిగి వెళ్లిపోయే విధంగాడేట్స్ యిచ్చింది. బొంబాయిలోనే వుండమని ఆ నిర్మాత ఎయిర్ టికెట్స్ కూడా పంపాడట. దానికి శ్రీదేవి ఏం సమాధానం చెప్పిందో?

కొచ్చాడు. ఆశారేఖ తోచినట్లైంది.

మర్నాడు ఉదయాన్నే రామ్మూర్తిని ఖాశిం దగ్గరకు తీసుకువెళ్లాను. తన కథంతా పూసగుచ్చినట్లు చెప్పుకొచ్చాడు ఖాశిం. తిరిగి వచ్చేటప్పుడు నోరు మెదప కుండా తన ఆలోచనల్లో తానుగా వచ్చేశాడు రామ్మూర్తి.

నాలుగురోజుల తర్వాత, వో సందె వేళ-

రామ్మూర్తీ, సరోజా పిల్లతో మా యింటికి వచ్చారు. ఇద్దరి మొహాల్లోనూ కొత్తకళ తొణికిసలాడుతోంది. శారద కాఫీ ఇచ్చింది. ఆ తర్వాత నెమ్మదిగా చెప్పింది సరోజ, "మరో ఫ్రెండ్‌తో కలిసి చిన్న టైలరింగ్ షాప్ ప్రారంభిస్తున్నారు బాబాయిగారూ, మీ ఆశీస్సులు కావాలి."

నాకు చాలా ఆనందం కలిగింది. "చాలాసంతోషం, మనస్ఫూర్తిగా శుభా కాంక్షలు అందిస్తున్నాను రామ్మూర్తీ. విష్‌యూ ఆల్ దిబెస్ట్ ఆఫ్ లక్."

రామ్మూర్తి కరచాలనం చేశాడు. ఆ వెంటనే సరోజే అంది, "మేమిద్దరమూ మరో నిశ్చయానికి కూడా వచ్చాం. మాకు మీ ఇంట్లో రెండు గదులు అద్దెకి కావాలి."

కలకానిది

"అవును, మీరు మాకీ హెల్ప్ చేయాలి" రామ్మూర్తి అన్నాడు.

నేనూ శారదా వొకరి నొకరం చూసుకున్నాం. శారద అన్నది," దానికేం భాగ్యం, రేపే సర్దించి సిద్ధంచేయిస్తాను. ఉన్న ఒక్కగానొక్క కూతురు ఎలాగూ అమెరికాలో వుంది. లక్ష్మీదేవిలాగా నీలాంటి ఆడపిల్ల ఇంట్లో తిరుగుతూ వుండటం కంటే అదృష్టం ఏముంది. సంతోషంగా వచ్చి చేరండి."

ముకుందం ఏమనుకుంటాడో అని అనిపించింది నాకు. కానీ, పరిస్థితులు చక్క బడేదాకా ఇలా కొనసాగనిస్తేనే బాగుంటుం దంటే అతను మాత్రం ఏమంటాడు? అభ్యంతరం పెట్టడనే అనుకున్నాను.

నా ఆలోచనల్లో రామ్మూర్తీ సరోజలు వెళ్లిపోవడం గమనించలేదు నేను. నా మనసునిండా నిండిపోయాడు ఖాశిం. ఇంట్లో భాగాన్నీ, సుక్షేత్రం లాంటి పదెకరాల జామతోటనీ పెద్ద సంసారమని అన్న కిచ్చేసి, పట్నంచేరి పళ్లదుకాణం తెరిచి తన కాళ్లమీద తను నిలబడిన ఖాశిం. వయసు తెచ్చిన వ్యసనాలనుంచీ కూడా బయటపడి 'మనిషి'గా నిలదొక్కుకున్న వ్యక్తి ఖాశిం.

తన కథ అంతా చెప్పిన తర్వాత రామ్మూర్తితో ఆరోజు అతనన్న మాటలూ గుర్తు కొచ్చినై నాకు. "బతికేది నాలుగు రోజులు భాయ్, వయస్సు క్షణక్షణానికీ తరిగిపోతోంది. ఈ నాలుగు రోజులూ మనం ఏడుస్తూ-మన వాళ్లని ఏడిపిస్తూ గడపడం కంటే, మనం నవ్వుతూ మన తోటివాళ్లని నవ్విస్తూ గడపడం మేలుగదా. ఆలోచించు...అనుభవం మీద జ్ఞానోదయం అయింది నాకు. నా అనుభవం నీకు ఉపయోగించి, నువ్ నడుస్తున్న దారిని మార్చగలిగితే చాలా సంతోషిస్తాను. ఓకే."

ఖాశిం మాటలు రామ్మూర్తి మీద ఇంతటి ప్రభావాన్ని చూపడం నిజంగా 'మనిషి'మీద నాకున్న విశ్వాసానికితార్కాణం!

అవును, అందుకనే, తుంచకుండా విడివడింది పీటముడి!! ఇప్పుడు-

మా యింట్లో బోసినవ్వులూ, పండు వెన్నెలలూ పండుతున్నాయ్.

ముకుందం ఇల్లుప్రశాంతంగా వుంటోంది!

*

శ్రీ వరలక్ష్మీ పూజా విధానం

శ్రీ మహాగణాధిపతియే నమః ఆచమ్య: ఓం కేశవాయ స్వాహా, ఓం నారాయణాయస్వాహా, ఓం మాధవాయస్వాహా మమ ఉపాత్త సమస్త దురిత క్షయద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్థే. శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే, భరత వర్షే భరత ఖండే,అస్మిన్ వర్తమానే వ్యావహారిక చాంద్ర మానేన..............సంవత్సరే......... అయనే.......... ఋతౌ.........మాసే..........పక్షే...........తిథౌ............ వాసరే.......... శుభనక్షత్రే శుభయోగే. శుభకరణ ఏవం గుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ......... శ్రీమత్యాః (పేరు).......గోత్రావత్యాః నభర్తృకాయాః అస్మాకం సహ కుటుంబానాం క్షేమస్థైర్య ధైర్య విజయాయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధ్యర్థ్యం ధర్మార్థ కామ మోక్షచతుర్విధఫలపురుషార్థ సిద్ధ్యర్థం సత్సంతాన సౌభాగ్య ఫలప్రాప్త్యర్థం శ్రీ వరలక్ష్మీ దేవతాముద్దిశ్య శ్రీ వరలక్ష్మీ దేవతా ప్రీత్యర్థం కల్పోక్త విధానేన యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే. (అని సంకల్పము చేసుకొని పాత్రకు గంధము అద్ది కుంకుమ బొట్టుపెట్టి నీటితో గంధము పుష్పము అక్షతలు వేసి కుడిచేతితో కలశము పట్టుకొని.......)

శ్లో॥ కలశస్య ముఖే విష్ణుః కంఠే రుద్రః సమాశ్రితః
మూలే తత్రస్థితో బ్రహ్మమధ్యే మాతృగణాః స్మృతాః,
కుక్షౌతు సాగరాఃసర్వేసప్తద్వీపా వసుంధరా,
ఋగ్వేదో థ యజుర్వేదః సామవేదో హ్యథర్వణః,
అంగైశ్చసహితాః సర్వే కలశాంబుస మాశ్రితాః
ఆయాన్తు శ్రీ వరలక్ష్మీ పూజార్థం దురితక్షయ కారకాః,

శ్లో॥కల్యాణి కమలనిలయే కామితార్థ ప్రదాయిని,
యావత్త్వాం పూజయిష్యామి శుభదే సుస్థిరాభవ,
గంగేచ యమునేచైవ గోదావరి, సరస్వతి,
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధింకురు.

పూజ ప్రారంభము


శ్లో॥ పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే,
నారాయణ ప్రియే దేవి సుప్రీతా భవ సర్వదా,
క్షీరోదార్ణవ సమ్భూతే కమలే కమలాలయే,
సుస్థిరా భవమే గేహే సురాసుర నమస్కృతే
వరలక్ష్మీ దేవతాం ధ్యాయామి,

శ్లో॥ సర్వమంగళ మాఙ్గళ్యే విష్ణువక్షఃస్థలాలయే,
ఆవాహయామి దేవీ త్వాం సుప్రీతా భవ సర్వదా,
వరలక్ష్మీ దేవతా మావాహయామి.

శ్లో॥ సూర్యాయుతని భస్ఫూర్తేస్ఫుర ద్రత్న విభూషితం,
సింహాసనమిదం దేవీ స్థీయతాం సురపూజితే,
వరలక్ష్మీదేవతాయై రత్నసింహాసనం సమర్పయామి.

శ్లో॥ శుద్ధోదకం చ పాత్రస్థం గన్ధపుష్పాది మిశ్రితం,
అర్ఘ్యం దాస్యామి తేదేవీ గృహాణ సురపూజితే,
వరలక్ష్మీ దేవతాయై అర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ సువాసితజలం రమ్యం సర్వతీర్థ సముద్భవం,
పాద్యం గృహాణ దేవీ త్వం సర్వదేవ నమస్కృతే,
వరలక్ష్మీదేవతాయై పాద్యంసమర్పయామి.



శ్లో॥ సువర్ణ కలశానీతం చన్దనాగరు సంయుతం,
గృహాణాచమనం దేవీ మయాదత్తం శుభప్రదే,
వరలక్ష్మీ దేవతాయై ఆచమనీయం సమర్పయామి.

శ్లో॥ పయోదధిఘృతోపేతం శర్కరామధుసంయుతం,
పఞ్చామృత స్నానమిదం గృహాణ కమలాలయే,
వరలక్ష్మీ దేవతాయై పఞ్చామృతస్నానం సమర్పయామి.

వరలక్ష్మీ వ్రత మహిమ

శ్లో॥ గఙ్గాజలం మయా నీతం మహాదేవ శిరఃస్థితం,
శుద్ధోదకస్నాన[illegible] [illegible] గృహాణ [illegible]సోదరి.

వరలక్ష్మీ దేవతాయై స్నానం సమర్పయామి
స్నానానంతరం ఆచమనీయం సమర్పయామి

శ్లో॥ సురార్చితాంఘ్రియుగళే దుకూలవసనప్రియే,
వస్త్రయుగ్మం ప్రదాస్యామి గృహాణ హరివల్లభే
వరలక్ష్మీ దేవతాయై వస్త్రయుగ్మం సమర్పయామి.

శ్లో॥ కేయూరకఙ్కణే దివ్యే హారనూపుర మేఖలాః,
విభూషణాన్యమూల్యాని గృహాణ ఋషిపూజితే,
వరలక్ష్మై ఆభరణాని సమర్పయామి.

శ్లో॥ తప్త హేమకృతం సూత్రం ముక్తాదామ విభూషితం,
ఉపవీతమిదం దేవి గృహాణ త్వం శుభప్రదే,
వరలక్ష్మీ దేవతాయై యజ్ఞోపవీతం సమర్పయామి.

శ్లో॥ కర్పూరాగరు కస్తూరీరోచనాదిభిరన్వితం,
గంధందాస్యామ్యహం దేవి ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్
వరలక్ష్మీ దేవతాం గంధాన్ ధారయామి.

శ్లో॥ అక్షతాన్ ధవళాన్ దేవీ శాలీయాం స్తండులాన్,
శుభాన్,
హరిద్రాకుంమోపేతాన్ గృహ్యతామబ్ధిపుత్రికే,
వరలక్ష్మీ దేవతాయై అక్షతాన్ సమర్పయామి.

శ్లో॥ మల్లికాజాజికుసుమైశ్చం పకైర్వకుళైస్తథా,
శతపత్రైశ్చ కల్హారైః పూజయామి హరిప్రియే,
వరలక్ష్మీ దేవతాం పుష్పైఃపూజయామి.

వరలక్ష్మీ అష్టోత్తర శతనామావళి

ముందు "ఓం" అని, చివర "నమః" అని చేర్చుకోవాలి.

ఓం ప్రకృత్యై నమః, వికృత్యై, విద్యాయై, సర్వభూతహిత ప్రదాయై, శ్రద్ధాయై, విభుత్యై, సురభ్యై, పరమాత్మికాయై, వాచే, పద్మలయాయై, పద్మాయై, శుచయే, స్వాహాయై, స్వధాయై, సుధాయై, ధన్యాయై, హిరణ్మయై, లక్ష్మై, నిత్య పుష్టాయై, విభావర్యై, అదిత్యై, దిత్యైనమః దీప్తాయై, వసు ధాయై, వసుభారిణ్యై, కమలాయై, కాన్తాయై, కామాక్ష్యై, క్రోధసంభవాయై, అనుగ్రహప్రదాయై, బుద్ధయే, అనఘాయై, హరివల్లభాయై, అశోకాయై, అమృతాయై, దీప్తాయై, లోక శోకవినాశిన్యై, ధరన్మిలయాయై, కరుణాయై, లోకమాత్రే, పద్మప్రియాయై, పద్మహస్తాయై, పద్మాక్ష్యై, పద్మసున్దర్యైనమః, పద్మోద్భవాయై, పద్మముఖ్యై, పద్మనాభప్రియాయై, రమాయై, పద్మమాలాధరాయై, దేవ్యై, పద్మిన్యై, పద్మగన్ధిన్యై, పుణ్యగ న్ధాయై, సుప్రసన్నాయై, ప్రసాధాభిముఖ్యై, ప్రభాయై, చంద్రవ దనాయై, చన్ద్రాయై, చంద్రసహోదర్యై, చతుర్భుజాయై, చన్ద్ర రూపాయై, ఇన్దిరాయై, ఇన్దుశీతలాయై, ఆహ్లాదజనన్యై, పుష్ట్యై, శివాయైనమః, శివశంకర్యై, సత్యై, విమలాయై, విశ్వజనన్యై, తుష్ట్యై, దారిద్ర్యనాశిన్యై, ప్రీతిపుష్కరిణ్యై, శాన్తాయై, శుక్ల మాల్యామ్బరధరాయై, శ్రియై, భాస్కర్యై, బిల్వనిలయాయై, వరరోహాయై, యశస్విన్యై, వసుందరాయైనమః, ఉదారాంగయై, హరిణ్యై, హేమమాలిన్యై, ధనధాన్యకారిణ్యై,సిద్ధయే, స్త్రైణసౌ మ్యాయై, శుభప్రదాయై, నృపవేశ్మగతానన్దాయై, వరలక్ష్మై, వసుప్రదాయై, శుభాయై, హిరణ్యప్రాకారాయై, సముద్రతన యాయై, జయాయై, మఙ్గళాయై, విష్ణువక్షస్థలస్థితాయై, విష్ణు పత్న్యై, ప్రసన్నాక్ష్యై, నారాయణ సమాశ్రితాయై, దారిద్ర్య ధ్వంసిన్యై, దేవ్యై, సర్వోపద్రవవారిణ్యై, నవదుర్గాయై, మహా కాళ్యై, బ్రహ్మవిష్ణుశివాత్మికాయై, త్రికాలజ్ఞానసంపన్నా, భువనే శ్వర్యై, ఓం వరలక్ష్మీ దేవతాయైనమః

అష్టోత్తర శతనామపూజాం సమర్పయామి!

శ్లో॥ దశాఙ్గం గుగ్గులోపేతం సుగన్ధంచ మనోహరం
ధూపం దాస్యామి దేవేశి వరలక్ష్మీ గృహాణతమ్,
శ్రీ వరలక్ష్మీ దేవతాయై ధూపమాఘ్రాపయామి

శ్లో॥ ఘృతాక్తవర్తి సంయుక్త మన్ధకార వినాశకరం,
దీపం దాస్యామి తే దేవి గృహాణ ముదితా భవ
శ్రీ వరలక్ష్మీ దేవతాయై దీపం దర్శయామి.

శ్లో॥ నైవేద్యం షడ్రసోపేతం దధిమధ్వాజ్య సంయుతం,
నానాభక్ష్యఫలోపేతం గృహాణ హరివల్లభే,
ధూపదీపానన్తరం ఆచమనీయం సమర్పయామి,
శ్రీ వరలక్ష్మీ దేవతాయై నైవేద్యం సమర్పయామి.

శ్లో॥ మనసార సుగంధేన మిశ్రితం పుష్పవాసితం,
పానీయం గృహ్యతాం దేవి శీతలం సుమనోహరమ్,
శ్రీ వరలక్ష్మీ దేవతాయై పానీయం సమర్పయామి.

శ్లో॥ పూగీఫల సమాయుక్తం నాగవల్లీ దళైర్యుతం.
కర్పూరచూర్ణ సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్,
శ్రీ వరలక్ష్మీ దేవతాయై తాంబూలం సమర్పయామి.


శ్లో॥ నీరాజనం సమానీతం కర్పూరేణ సమన్వితం,
తుభ్యం దాస్యామ్యహం దేవి గృహ్యతాం విష్ణువల్లభే,
శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమఃనీరాజనం సమర్పయామి.

శ్లో॥ పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే
నారాయణ ప్రియే దేవి సుప్రీతా భవసర్వదా,
శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః మన్త్రపుష్పం సమర్పయామి.

శ్లో॥ యాని కాని చ పాపాని జన్మాన్తర కృతాని చ
తాని తాని ప్రణశ్యన్తి ప్రదక్షిణ పదేపదే,
శ్రీ వరలక్ష్మీ దేవతాయైనమః ప్రదక్షిణం సమర్పయామి.

పాపోహం పాపకర్మాహంపాపాత్మా పాపసంభవ
త్రాహిమాం కృపయాదేవి శరణాగత వత్సలే
అన్యథా శరణం నాస్తిత్వమేవ శరణం మమ
తస్మాత్కారుణ్య భావేన రక్ష రక్ష జనార్దని.

శ్లో॥ నమస్త్రైలోక్య జనని నమస్తే విష్ణువల్లభే,
పాహిమాం భక్తవరదే వరలక్ష్మీ నమోనమః



శ్రీ వరలక్ష్మీ దేవతాయై నమస్కారాన్ సమర్పయామి.

తోరపూజ-: తోరమును అమ్మవారి వద్దవుంచి అక్షతల తోటి ఈ క్రింది విధంగా పూజించాలి.

కమలాయైనమః ప్రథమ గ్రంధిం పూజయామి; రామాయై నమః ద్వితీయ గ్రంధిం పూజయామి, లోకమాత్రేనమః తృతీయ గ్రంధిం పూజయామి, విశ్వజననైనమః చతుర్ధ గ్రంధిం పూజయామి, వరలక్ష్మైనమః పంచమగ్రంధిం పూజయామి, క్షీరాబ్ధి తనయాయైనమః షష్ఠ గ్రంధిం పూజయామి, విశ్వసాక్షిణ్యైనమః సప్తమ గ్రంధిం పూజయామి వరలక్ష్మీనమః నవమి గ్రంధిం పూజయామి.

ఈ క్రింది శ్లోకము చదువుచు తోరము కట్టుకొనవలెను.

శ్లో॥ బధ్నామి దక్షిణేహస్తే నవసూత్రం శుభప్రదం
పుత్రపౌత్రాభి వృద్ధించ దేహిమేకమే.

వాయన దానము:- వాయన మిచ్చునపుడు ఈ క్రింది శ్లోకమును చదువుచు నివ్వవలెను.

శ్లో॥ ఏవం సంపూజ్య కళ్యాణీం వరలక్ష్మీం స్వశక్తితః,
దాతవ్యం ద్వాదశాపూపం వాయనం హిద్విజాతయే

శ్లో॥ ఇందిరా ప్రతిగృహ్ణాతు ఇందిరా వైదదాతి చ,
ఇందిరా తారకో భాభ్యా ఇందిరాయై నమో నమః.

అని వాయనమిచ్చి అక్షతలు పుచ్చుకొని యీ క్రింది వ్రతకథ చదువుకోవాలి.

* * * *

సూత పౌరాణికుడు శౌనకుడు మొదలగు మహర్షులను జూచి యిలా అన్నాడు:- మునివర్యులారా! స్త్రీలకు సర్వసౌభాగ్యములు గలుగునట్టి యొక వ్రతరాజంబును పరమేశ్వరుడు పార్వతీదేవికి జెప్పె. మీకు చెప్పెద వినుడు. కైలాసపర్వతమున వజ్ర వైఢూర్యాది 'మణి'మయ ఖచితంబగు సింహాసనంబునందు పరమేశ్వరుడు కూర్చుండి యుండ పార్వతి పరమేశ్వరునకు నమస్కరించి "దేవా! లోకమున స్త్రీలు యే వ్రతం బొనర్చిన సర్వసౌభాగ్యంబులు పుత్రపౌత్రాదులం గలిగి సుఖంబుగ నుందురో అట్టి వ్రతం నా కానతీయవలయు"ననిన పరమేశ్వరుడిట్లనియె- "ఓ మనోహరి! స్త్రీలకు పుత్రపౌత్రాది సంపత్తులు గలుగంజేసెడి వరలక్ష్మి వ్రతంబను నొక వ్రతంబుగలదు. ఆ వ్రతంబును శ్రావణ మాస శుక్లపక్ష పూర్ణిమకు ముందుగ వచ్చెడి శుక్రవారమునాడు చేయవలయు"ననిన పార్వతీదేవి ఇట్లనియె. "ఓ లోకారాధ్యాని! నీ వానతిచ్చిన వరలక్ష్మి వ్రతంబును నెట్లు చేయవలయును? ఆ వ్రతంబునకు విధియేమి? ఏ దేవతను పూజింపవలయును? పూర్వం బెవ్వరిచే నీ వ్రతం బాచరింపబడియె? వీనినెల్ల వివరంబుగా వివరింపవలయు"నని ప్రార్థించగా పరమేశ్వరుడు పార్వతీదేవినిగాంచి "ఓ కాత్యాయనీ! వరలక్ష్మి వ్రతమును సవిస్తరముగ జెప్పెద వినుము. మగధ దేశంబున కుండినంబను నొక పట్టణము గలదు. ఆ పట్టణము బంగారు ప్రాకారములతోడను, బంగారు గోడలు గల యిండ్లతోను గూడియుండెను. అట్టి పట్టణమునందు చారుమతి యనునొక బ్రాహ్మణ స్త్రీగలదు. ఆ వనితామణి పెనిమిటిని దేవునితో సమానముగదలచి ప్రతిదినంబును ఉదయంబున మేల్కాంచి స్నానంబుచేసి పుష్పంబులచే భర్తకు పూజచేసి పిదప అత్తమామలకు ననేక విధంబులైన యుపచారంబులను చేసియు ఇంటిపనులను జేసికొని గయ్యాళిగాక మితముగాక ప్రియముగాను భాషించుచుండెను. ఇట్లుండ అమ్మహా పతివ్రతయందు వరలక్ష్మికి ననుగ్రహము గలిగి యొకనాడు స్వప్నంబున ప్రసన్నమై "ఓ చారుమతి నేను వరలక్ష్మీ దేవిని, నీ యందు నాకు అనుగ్రహము కలిగి ప్రత్యక్షమైతిని. శ్రావణ శుక్ల పూర్ణిమకు ముందుగా వచ్చెడు శుక్రవారమునాడు నన్ను పూజించిన నీవు కోరిన వరంబులు నిచ్చెద"నని వచించిన చారుమతీదేవి స్వప్నములోనే వరలక్ష్మీదేవికి ప్రదక్షిణ నమస్కారములుచేసి "నమస్తే సర్వలోకానాం జపన్యై పుణ్యమూర్తియే శరణ్యే త్రిజగ్వంద్యే విష్ణు వక్షస్థలాలయే" అని అనేక విధంబుల స్తోత్రముచేసి, ఓ జగజ్జననీ! కటాక్షంబు గలిగెనేని జనులు ధన్యులుగను, విద్వాంసులుగను, సకల సంపన్నులుగను నయ్యెద రు. నేనును జన్మాంతరంబున

శ్రీ వరలక్ష్మీ పూజా విధానం

జేసిన పుణ్య విశేషమున మీ పాద దర్శనంబులు నాకు గలిగెనని చెప్పిన వరలక్ష్మి సంతోషంబు జెంది చారుమతికి ననేక వరంబులిచ్చి యంతర్ధానంబు నొంద చారుమతి తక్షణంబున నిదుర మేల్కొని యింటికి నాలుగు ప్రక్కలం జూచి వరలక్ష్మీదేవిని గానక, ఓహో! మనము కలగంటిమని ఆ స్వప్న వృత్తాంతము భర్తకు, మామగార్కి మొదలయిన వాండ్రతో జెప్పగా వారు ఈ స్వప్నము మిగుల ఉత్తమ యయినదని శ్రావణ మాసంబు వచ్చిన తోడనే వరలక్ష్మి వ్రతం బవశ్యంబుగ జేయవలసినదని చెప్పిరి. పిమ్మట చారుమతియు స్వప్నంబువిన్న స్త్రీలును శ్రావణమాసం యెప్పుడు వచ్చునాయని యెదురు చూచుచుండిరి.



శ్రావణమాసం

ఇట్లుండగా వీరి భాగ్యోదయంబువలన శ్రావణ మాస పూర్ణిమకు ముందువచ్చెడి శుక్రవారము వచ్చెను. అంత చారుమతియు మొదలగు స్త్రీలందరును ఈ దినంబేగదా వరలక్ష్మీదేవి చెప్పినదినంబని యుదయంబుననే మేల్కాంచి స్నానంబులంజేసి చిత్ర వస్త్రంబులను గట్టుకొని చారుమతీ దేవి గృహంబున నొక ప్రదేశమునందు గోమయంబుచే నలికి మండపం బేర్పరచి, యందొక ఆసనంబువైచి దానిపై కొత్త బియ్యం బోసి మఱ్ఱిచిగుళ్లు మొదలగు పంచపల్లంబులచేత కలశం బేర్పరచి యందు వరలక్ష్మీదేవిని ఆ వాహనముచేసి చారుమతి మొదలగు స్త్రీలందరు మిగుల భక్తియుక్తులై సాయంకాలంబున పద్మాసనే పద్మకరే సర్వలోకైక పూజితే. నారాయణప్రియే దేవి సుప్రీతా భవ సర్వదా, అను నీ శ్లోకముచే ధ్యానావాహనాది షోడశోపచార బూజలంజేసి తొమ్మిది సూత్రములుగల తోరంబును దక్షిణ హస్తము గట్టుకొని వరలక్ష్మి దేవికి నానావిధ భక్ష్యభోజ్యంబులును నివేదనచేసి ప్రదక్షిణముచేసిరి. ఇట్లొక ప్రదక్షిణము సేయగానే ఆ స్త్రీలందరికి కాళ్ళయందు ఘల్లు ఘల్లుమను నొక శబ్దము కలిగెను. అంతకాళ్లను జూచుకొనిన గజ్జెలు మొదలగు నాభరణములు గలిగియుండ చారుమతి మొదలగు స్త్రీలందరును ఓహో! వరలక్ష్మి దేవి కటాక్షమువలన గలిగినవని పరమానందంబునొంది మరియొక ప్రదక్షిణంబు చేయగా హస్తములందు దగద్ధగాయమానంబుగామెరయుచుండ నవరత్న ఖచితంబులైన మొదలగు నాభరణములుండుటగనిరి. ఇంక చెప్పనేల మూడవ ప్రదక్షిణంబు గావించినతోడనే ఆస్త్రీలందరు సర్వభూషణాలంకృతులైరి. చారుమతి మొదలగు నా స్త్రీల గృహంబులెల్ల స్వర్ణమయంబులై రథ, గజ, తురంగ వాహనములతో నిండియుండెను. అంతనాస్త్రీలను దోడ్కొని గృహంబులకు పోవుటకు వారి వారి యిండ్లనుండి గుఱ్ఱములు, యేనుగులు, రథములు బండ్లను నా స్త్రీలు వరలక్ష్మీదేవిని పూజించు స్థలమునకు వచ్చి నిలచియుండెను. పిదప చారుమతి మొదలగు స్త్రీలందరు తమకు కల్పోక్త ప్రకారముగా పూజ చేయించిన బ్రాహ్మణోత్తముని గంధ పుష్పాక్షతలచే బూజించి పండ్రెండు కుడుములు వాయన దానంబిచ్చి దక్షిణ తాంబూలంబు లొసంగి నమస్కారముచేసి ఆ బ్రాహ్మణోత్తమునిచే నాశీర్వాదంబు నొంది వరలక్ష్మీదేవికి నివేదనలు చేసిన భక్ష్యాదులను బంధువులతో నెల్లరును భుజించి తమకొరకువచ్చి కాచుకొనియుండు వాహనములపై యిండ్లకు బోవుచు ఒకరితో నొకరు "ఓహో! చారుమతీదేవి భాగ్యం బేమని చెప్పవచ్చు. వరలక్ష్మీదేవి తనంతట స్వప్నములోకి వచ్చి ప్రత్యక్షంబాయెను. ఆ చారుమతీదేవి వలనకదా మన కిట్టి మహాభాగ్యసంపత్తులు గలిగె"నని చారుమతీదేవిని మిక్కిలి పొగడుచు, తమ తమ యిండ్లకు బోయిరి. పిదప చారుమతి మొదలగు స్త్రీలందరు ప్రతి సంవత్సరంబును నీ వ్రతంబు చేయుచు పుత్రపౌత్రాభివృద్ధిగలిగి, ధనకనక వస్తువాహనముల తోడం గూడుకొని సుఖంబుగానుండిరి. కావున ఓ పార్వతీ! ఈ యుత్తమమైన వ్రతమును బ్రాహ్మణాది నాలుగు జాతుల వారును చేయవచ్చును. అట్లొనర్చిన సర్వ సౌభాగ్యంబులను గలిగి సుఖంబుగనుందురు. ఈ కథను విన్నవారలకును, చదివినవారలకును వరలక్ష్మి ప్రసాదమువలన సకల కార్యాలూ సిద్ధించుతాయి.

సమాప్తము

ఈవారంలో మీ యోగం

10-8-1990 శుక్రవారం మొదలు

16-8-1990 గురువారం వరకు

మేషం: : ఇది శుభదాయకవారం. యోగాతిశయానికి అనుకూలం. కుటుంబ వృద్ధి, ధనధాన్యవృద్ధి, చాలాకాలంగా తటప టాయించిన శుభ కార్యాచరణం. పత్రికారం గాన మీ శక్తియుక్తులు ప్రదర్శింపబడుట. స్త్రీలకు: పత్రికారంగాన, చలనచిత్రరంగాన పరిచితుల వలన మేలు.

వృషభం: బంధు సహాయమున్నది. మాటకు అధిక గౌరవం, కార్యానుకూలం, దూరప్రయాణం. ప్రభుత్వపరంగా రావల సిన డబ్బు అందటం యిత్యాది విషయా లలో మేలు చేకూరుట, మరేం కావాలి? అంతా మేలుగానే సాగిపోతుంది. స్త్రీలకు: ఆదాయవృద్ధి, కార్యానుకూలత, ఉద్యోగ మందు పెంపు, గమనించాలి.

మిధునం: వారాంతాన తలచిన విధంగా అన్ని రంగాలలో మేలు చేకూరుట నిశ్చయం. ఈ వారమంతా 'యోగదా యకమే' అని గ్రహిస్తారు. అంటే, గృహ నిర్మాణ సంకల్పం నెరవేరటం. ఆదాయ మందు పెంపు, ఆలస్యంగానైనా కార్యా నుకూలత. స్త్రీలకు: 'శుక్ర, శని' వారా లందు అనుకొనని విధంగా మేలు చేకూ రుట గమనిస్తారు.

కర్కాటకం: సర్వవిధాలా అనుకూ లమే. అయినా, గురు, కేతు గ్రహాల యుతి. ఒకానొక వ్యవహారంలో బాధాకరం కావచ్చు. విలువ గల వస్తు సేకరణకు ఆస్కారం. ఆప్తమిత్రుల రాక, మహదా నందదాయకమవుతుంది. కుటుంబానంద మున్నది. స్త్రీలకు: నూతనోద్యోగ ప్రాప్తి, కార్యసిద్ధి, రచయితలకు సదవకాశా .

సింహం: బంధువుల రాక చెప్పదగిన ముఖ్యాంశం. శుభకార్యాల నిమిత్తం సంభా షణలకు అనుకూలం. రాజకీయాలందు బెంగగా ఉన్నవారికి కొంత ప్రశాంతి, 'కోర్టు' వ్యవహారాలు అనుకూలం. స్త్రీలకు: ఉద్యోగరీత్యా శ్రద్ధ అవసరం. తోటివారితో మాట పట్టింపులు రావచ్చు.

కన్య: వారం భయంకరంగా జరిగిపోనున్న దనుకొంటారు. అధికవ్యయం తప్ప పెద్దగా బాధాకరంగాదు. ఆదాయమున్నది. బంధు సమాగమం, పెద్దల సహాయం. పోగొట్టు కొన్న పైకం రాబట్టుకొనుట, యిత్యాది మేళ్లు. స్త్రీలకు: వృత్తియందు పెంపు, ఆదాయవృద్ధి.

తుల: బహుదూర ప్రాంతాల నుండి కొందరకు ఆహ్వానం అందనున్నది. సినీరం గాన కొందరకు సదవకాశాలు. పూర్వపు చిక్కులు సమసిపోవటం 'ఆనందదాయకం. వారమంతా' అని పొంగిపోవటం. ఎలాగో సంపదవృద్ధినందినదన్న సంతోషం. స్త్రీలకు: సజ్జనసాంగత్యం. సద్గోష్ఠి, యిత్యాదులు.

వృశ్చికం: సంతాన ఉన్నత విద్యాభ్యాస కార్యక్రమ నిమగ్నత లాభదాయకం. విద్యా వేత్తల సహాయం. ప్రభుత్వ సహాయం. చలన చిత్రరంగానుకూలత. కొందరకుదర్శకులగు అవకాశాదులు, చెప్పదగిన ముఖ్యాంశాలు. స్త్రీలకు: ఉద్యోగం కొరకు యత్నించటం న్యాయమే. మేలున్నది గ్రహించాలి.


ధనుస్సు: బంధు మిత్ర సహాయము న్నది. రాబడియున్నది. అయితేనేం, అధిక వ్యయం కూడా ఉన్నది. ఆదాయం మెరు గవుతుంది. ద్వితీయ 'రాహు గ్రహస్థితి' మంచిది కాదుగదా! ఆరోగ్య రీత్యా శ్రద్ధ అవసరం. స్త్రీలకు: అతిముఖ్యమైన పనులు కొన్ని సానుకూలం కావటం, గ్రహిస్తారు.


మకరం: విరోధివర్గమున్నది. మీ వలన మేలు పొందిన వారే ఎదురు తిరుగు తారు, సహాయపడరు, ఆప్తమిత్రులుండే కల తలు రావచ్చు. స్వల్పంగా ఆరోగ్యలోపం చెప్పవచ్చు. వయసు మీరిన స్త్రీ, పురుషా దుల వలన అనుకూలత ఈవారమందు చెప్పదగిన ముఖ్యాంశం. స్త్రీలకు: హఠాత్తు ప్రయాణ సూచన, తద్వారా లాభం, గ్రహించాలి.

కుంభం: కుటుంబానందమున్నది. ప్రభుత్వ సహాయం అందుకొంటారు. అప్పులుంటే వసూలు చేసికోండి అనువైన సమయం. వృత్తియందు పెంపు, 'సినీరంగాన' కీర్తి ప్రతిష్ఠలు, ఆటపాటలందు ప్రావీణ్యత గల వారికి అనుకూల్యత. స్త్రీలకు: చిత్రరంగ, విద్యారంగ, ఉద్యోగపరిస్థితులందు మెరుగు, మరి యోగదాయకమేగా!

మీనం: మీన రాశికి 'గురుని' కర్కా టక స్థితియోగదాయకం. సర్వసంపత్కారం, ఆరోగ్యప్రదం ఆనందదాయకం, శుభకార్య తత్పరతకు ఆస్కారం. వస్తు వాహన సేక రణకు ఆస్కారం. స్త్రీలకు: రాజకీయరం గానుభవం గల వారికి అనుకూలం, మిత్రస మాగమం, అతిథి అభ్యాగతుల ఆదరణకు ఆస్కారం.

-విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి





లవ్ గేమ్



చల్లా సుబ్రహ్మణ్యం

"సర్ - మీరా?"

అమితాశ్చర్యంతో అన్నాడు పవన్‌కుమార్.

"యస్- నీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాడు స్వాగత్.

"ప్లీజ్ కమిన్ సర్...." షాక్ నుంచి తేరుకోకుండానే పక్కకు తొలిగాడతను.

స్వాగత్ లోపలికొచ్చి- సోఫాలో కూర్చున్నాడు.

ఆ గదంతా- అందంగా- ఖరీదుగా వుంది. ప్రతి వస్తువూ చాలా నీట్‌గా అమర్చివున్నాయి.

డోర్ వేసి- "వన్ మినిట్ సర్" అంటూ లోపలికెళ్ళాడు పవన్.

పవన్ స్వాగత్ దగ్గర పి ఆర్ వోగా చేస్తున్నాడు. నెలకు ఐదు వేలు జీతం- సహజంగా ఆస్తిగలవాడవడం చేత యిలాంటి విలాస వంతమైన జీవనానికి అలవాటు పడ్డాడతను.

ఇంకా పెళ్ళి కాలేదతనికి.

రెండు కప్పుల్ని ట్రేలో పెట్టుకుని వచ్చాడు పవన్.

అందుకున్నాడు స్వాగత్.

"థాంక్యూ మిష్టర్ పవన్- నిన్నో విషయం అడుగుతాను. సూటిగా నిర్మొహమాటంగా జవాబు చెప్పాలి-" అన్నాడు స్వాగత్.

ఇంత ఉదయాన్నే తన దగ్గరకొచ్చి- ఇలా సీరియస్‌గా అడుగుతున్న బాస్‌ను ఆశ్చర్యంగా చూస్తూ-

"అలాగే సర్- అడగండి-" అన్నాడతను.

"శైలజ ఎంత కాలం నుంచి నీకు పరిచయం?"

ఉలిక్కిపడ్డాడు పవన్.

(గత సంచిక తరువాయి)

అధిగమించిన స్వాగత్ చిన్నగా నవ్వి అన్నాడు.

"బీ ఫ్రాంక్ మిస్టర్ పవన్- చెప్పు-"

"దాదాపు నాలుగేళ్ళ నుంచి పరిచయం సర్-" తల దించుకుని చెప్పాడు.

"అంటే ఆమె అప్పాయింట్ అయిన సంవత్సరం తర్వాత నుంచీ పరిచయమన్నమాట-" అన్నాడు స్వాగత్.

తలూపాడు పవన్.

"ఈ నెల పదహారో తారీఖున ఆమె దగ్గర కెళ్ళావ్ గదూ నువ్వు?"

టీపాయ్ మీదున్న ఛాన్సలర్ ప్యాకెట్ అందుకుని చూస్తూ అడిగాడు స్వాగత్.

"అవును సర్- వెళ్ళాను-" భయంగా అన్నాడు.

"ఎందుకు?"

అతను జవాబు చెప్పలేదు. సగం తాగిన కాఫీ కప్పును సాసర్లో గుండ్రంగా తిప్పుతున్నాడు.

"నాకు సమాధానం కావాలి మిస్టర్ పవన్" తీవ్ర స్వరంతో అన్నాడు స్వాగత్.

"ఏం... ఎందుకు సర్?" తడారిపోతున్న గొంతుతో అడిగాడు.

"అంతా తర్వాత చెప్తాను. నువ్వు ఏ మాత్రం సంకోచించకుండా జరిగింది యధాతధంగా చెప్పు-" అన్నాడు స్వాగత్.

జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి వెలిగించుకుని ఛాన్సలర్ ప్యాకెట్ అతని వేపు విసురుతూ-

"కమాన్ హావిట్" అన్నాడు.

పవన్ సన్నగా వణుకుతున్న చేతుల్తో సిగరెట్ వెలిగించుకుని అన్నాడు.

"శైలజ నేను ప్రేమించుకున్నాం సర్- పెళ్ళి కూడా చేసుకోవాలనుకున్నాం. శైలజకు తండ్రి లేదు. తల్లి ఊళ్ళో వున్న పొలం చూసుకుంటూ- అక్కడే వుంటోంది. శైలజకి ఇద్దరు తమ్ముళ్ళున్నారు. వాళ్ళక్కడే చదువు కుంటున్నారు. వాళ్ళమ్మ తనని పెళ్ళి చేసుకోమని బలవంత పెడుతోందని నాతో చెప్పింది శైలజ. నాకు ఆస్తి పరమైన వ్యవహారాలు కోర్టులో వున్నాయి. అవి తేలిపోతే ఆమెను వెంటనే పెళ్ళి చేసుకుంటానని చెప్పాను. ఆమె నన్ను అపార్థం చేసుకుంది. పదహారో తారీఖున నాకు ఫోన్ చేసి అర్జంట్‌గా రమ్మని చెప్పింది. నేను వెళ్ళగానే వాళ్ళ అమ్మ రాసిన ఉత్తరాలు నాకిచ్చి చదవమంది. ఆ తర్వాత తాను మా విషయం వాళ్ళమ్మకి ఉత్తరం రాస్తున్నానంటూ నా కళ్ళముందే ఉత్తరం రాసింది...."

ఓ క్షణం ఆగాడుతను. సిగరెట్ ఫిల్టర్‌ను ఓ అంగుళం దూరంలో ఉండగా యాష్ ట్రే లో పడేశాడు.

"ఊ తర్వాత" అడిగాడు స్వాగత్.

"అంతలో ఏదో గుర్తొచ్చిన దానిలా హఠాత్తుగా ఉత్తరం రాయడం మాని- తనకో అప్పాయింట్ మెంట్ వుందనీ- అర్జెంట్‌గా వెళ్ళాలనీ హడావుడిగా తయారైంది. నన్ను అబిడ్స్ వరకూ డ్రాప్ చేయమంది.

అబిడ్స్‌లో ఆమెను వదిలి- నేను డైరెక్ట్‌గా ఆఫీస్ కొచ్చాను..."

చెప్పడం ఆపి- స్వాగత్‌నే చూస్తున్నాడతను.

స్వాగత్ లేచి పచార్లు చేస్తూ హఠాత్తుగా ఆగి-

"నువ్వు చెప్పిందంతా శుద్ధ అబద్ధం-" అన్నాడు.

తెల్లబోయి చూశాడు పవన్.

"అవును మిస్టర్ పవన్- నేను నీకు ముందే చెప్పాను. జరిగిన విషయాన్ని కరెక్ట్‌గా చెప్పమని...."

"సర్... నేను చెప్పింది నిజం ప్రామిస్-"

"నో- ఆ రోజు అంటే- పదహారో తారీఖు ఉదయం శైలజకు నువ్ ఫోన్ చేశావ్- హోటల్ ప్యారడైజ్‌లో రూం నెంబర్ 302కి బాస్ నిన్ను రమ్మన్నారని చెప్పావు. సరిగ్గా అదే టైంకి ఆమె తన తల్లికి ఉత్తరం రాస్తోంది. నీ ఫోన్ కాల్ విని నిన్ను

ఇంతవరకూ సాగిన కథ-20: తనను వ్యతిరేకిస్తున్న భార్య నవ్యను దారికి తెచ్చుకొనే విషయంలో స్వాగత్‌కు మేనమామ భాగ్యరాజ్ సహకరిస్తాడు. శైలజ హత్యకేసులో చిక్కుకున్న నవ్యను స్వాగత్ జైలునించి విడిపించుకువస్తాడు. ఈ కేసునుంచి నవ్యను విడిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వాగత్‌కు కొన్ని సలహాలిస్తాడు. ఆ సలహాలు ఆధారంగా శైలజ ఇంట్లో స్వాగత్ కొన్ని సాక్ష్యాధారాలను సేకరిస్తాడు. కాని అవి తన ఇంట్లో గల్లంతు అవుతాయి.

అర్జంట్‌గా తన దగ్గరకు రమ్మంది. నువ్వు వెళ్ళావ్. బాస్ అవసరమైతే నాకు ఫోన్ చేస్తారు. నీకెందుకు చెప్పారని అడిగింది. దానికి నువ్వు బొంబేనుంచి డీలర్ వచ్చి షెరటాన్‌లో దిగాడు. ఆ విషయం బాస్‌కి నేనే చెప్పాను. అప్పుడు బాస్ నిన్ను కూడా అక్కడికే రమ్మని చెప్పి హడావిడిగా వెళ్ళిపోదామని ఆమెను నమ్మించావ్...."

పవన్ రక్తం ఇంకి పోయిన వాడిలా భయంగా చూస్తున్నాడు.

"ఆమె తన పెళ్ళి విషయం నిన్నడిగింది. నువ్వు ఒప్పుకున్నావ్– కాదు. ఒప్పుకున్నట్టు నటించావ్– ఆమె సంతోషంతో– ఆ విషయం ఉత్తరంలో రాయబోతుండగా– నువ్వు ఆమెను కంగారు పెట్టి హోటల్‌కి వెళ్ళమన్నావ్– ఆమె ఆ ఉత్తరాన్ని అలాగే అసంపూర్ణంగా వదిలి– నీతోనే బయల్దేరింది. నువ్వామెను హోటల్‌లో డ్రాప్ చేసి...."

"కానీ సర్... "

"డోంటాక్ ఐసే మిస్టర్ పవన్. దానికి సాక్ష్యం హోటల్ ముందున్న గేట్‌బాయ్. అతను నిన్నూ... నీ కారునీ స్పష్టంగా చూశాడు. అలా ఆమెను హోటల్ రూంకి పిలిపించి– వెంటనే డిటెక్టివ్‌కి ఫోన్ చేసి నా భార్యకి ఆ విషయం చెప్పమని చెప్పి– నువ్వు రూం కెళ్ళి శైలజను...." సిగరెట్ వెలిగించి పొగ వదిలి అన్నాడు స్వాగత్–

"హత్య చేశావ్."

"నో"

పెద్దగా అరిచి రెండు చేతుల్లో ముఖం కప్పుకుని ఏడవసాగాడు పవన్–

ఆవేశంగా అతని జుట్టు పట్టుకుని పైకి లేపి అన్నాడు స్వాగత్.

"యస్ మిస్టర్ పవన్‌కుమార్– నీకు అడ్డుగా



వుంది- పెళ్ళి చేసుకొమ్మని నిన్ను బలవంతం చేస్తున్న ఆమె పీడ వదిలించుకోవాలని నువ్వే ఆ హత్య చేశావ్. దాన్ని చాలా తెలివిగా నా భార్య మీదకు నెట్టావ్-"

"కాదు- ప్లీజ్ నన్ను నమ్మండి సర్- ప్లీజ్... ఆ హత్య నేను చేయలేదు. నన్ను నమ్మండి-" బాధగా అరుస్తూ రెండు చేతులూ జోడించాడతను.

అతన్నొదిలి అన్నాడు స్వాగత్-

"అయితే ఎవరు చేశారీ హత్య?"

"నాకు... నాకు.... తెలీదు..." భయంతో వణికిపోతూ అన్నాడు.

అతనికేమైందో తెలీదు.

కడుపు మీద పదిటన్నుల బరువేదో వేగంగా వచ్చి తగిలినట్టయి- కళ్ళముందు చీకటి కమ్మి- మెరుపులు కనిపించి- భరించలేని బాధతో - రెండు చేతుల్తో కడుపు పట్టుకుని అన్నాడు.

"అ...మ్... మ్... మ్... మ్మా...."

తూలి కింద పడబోతున్న అతన్ని పట్టుకుని అన్నాడు స్వాగత్.

"చెప్పు- ఎవరు చేశారీ హత్య- చెప్పకపోతే- నిన్నిక్కడే చిత్రవధ చేసి చంపుతాను. కమాన్ స్పీక్ ఐసే..."

బాధతో విలవిల్లాడుతూ సోఫాలో కూలబడ్డాడు పవన్.

స్వాగత్ ఎదురుగా రాక్‌లో కనిపిస్తున్న విస్కీ బాటిల్ తీసి- ఓ పెగ్ పోసి- ఫ్రిజ్‌లోని నీళ్ళు కలిపి అతనికిస్తూ అన్నాడు. నాకు నిజం కావాలి మిస్టర్ పవన్- చెప్పు..."

పవన్ ఆ గ్లాసందుకుని- మొత్తం దించకుండా తాగి- గ్లాస్ కింద పెట్టాడు.

స్వాగత్ సిగరెట్ అందించాడు. అతను పెదవుల మధ్య పెట్టుకోగానే అది వెలిగించి అన్నాడు స్వాగత్.

"ఇప్పుడు చెప్పు.... జరిగిందేవిటో ..."

ఓ క్షణం గాఢంగా నిట్టూర్చి అన్నాడు పవన్.

"అవును- శైలజ నాకు పెద్ద సమస్యగా మారింది. ఆఫీస్‌లో ఇంటి దగ్గర- ప్రతి చోటా నన్ను విసిగించేది- నేను చేసింది తప్పే- పెళ్ళి ఎరగా చూపి- ఆమెతో ఆనందాన్ని పంచుకున్నాను. డబ్బు ఆశ చూపి- నన్నొదల మన్నాను. ఆమె

లవ్‌గేమ్

ఒప్పుకోలేదు. పైగా- మీకి విషయం చెప్తానంది. దేవుడి క్కూడా భయపడను నేను- కానీ మీరంటే నాకెంతో భయమూ భక్తి- అందుకే..." అతను చెప్పలేకపోయాడు.

"చెప్పు.... అందుకే- ఆమెను హత్య చేశావ్- అవునా?" అన్నాడు.

"లేదు సర్- నేను హత్య చేసేంత దుర్మార్గుణ్ణి కాదు. ఆ రోజు అంటే పదహారో తారీఖు ఉదయం ఆరు గంటలకు నాకు ఫోనొచ్చింది. శైలజ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది." నువ్వామెను అర్జెంట్‌గా హోటల్ ప్యారడైజ్ రూం నెంబర్ 302కి తీసుకొచ్చెయ్- అని- నేనప్పుడు శైలజ దగ్గరకెళ్ళి- మీరు ప్యారడైజ్‌లో వున్నారనీ అర్జెంటుగా రమ్మన్నారని చెప్పి నాటకం ఆడి ఆమెను ఆ హోటల్ దగ్గర డ్రాప్ చేసి- నేను ఆఫీస్‌కొచ్చాను-"

భయంగా చెప్పాడు పవన్.

"నీకు ఫోన్ చేసిన ఆ వ్యక్తి ఎవరు?"

అతని కళ్ళలోకి చూస్తూ అడిగాడు స్వాగత్.

అతను మాట్లాడలేదు. భయంగా గుటకలు మింగి తలదించుకున్నాడు.

ఆ వ్యక్తి ఎవరో చెబితే జైలు కెళ్ళే అవసరం లేకుండా నేను చేస్తాను.

అంతేగానీ- ట్రిక్స్ ప్లే చేస్తే జైలుకాదు. ఉరికంబం కూడా ఎక్కుతావ్- ఆలోచించు-"

సిగరెట్ వెలిగించుకుని - పచార్లు చేస్తూ అన్నాడు స్వాగత్.

పవన్ నెమ్మదిగా లేచి- విస్కీ మరో పెగ్ ఫిక్స్ చేసుకుని టేబుల్ దగ్గర నిల్చున్నాడు.

"కమాన్- చెప్పు..... ఫోన్ చేసిన వ్యక్తి ఎవరు?"

అతను సగం గ్లాసు ఖాళీ చేసి- గ్లాస్ టేబుల్ మీద పెట్టి స్వాగత్‌ను చూస్తూ.... పెదవులు తడుపుకున్నాడు.

"ఊ.... క్విక్...." అసహనంగా అన్నాడు.

"అతను... అతనెవరంటే...."

అంటున్న పవన్‌కుమార్ రెండు కనుబొమల మధ్య నల్లటి చిన్న మచ్చపడి-

మరుక్షణం ఆ మచ్చలోంచి రక్తం ఉబికి అతని ముఖాన్ని తడిపేస్తూ....

స్వాగత్ చూస్తున్నాడు.

ఏం జరిగిందో అతను తెలుసుకునే సరికి- పవ కార్పెట్ మీద బోర్లా పడి వున్నాడు. బూడిదరం కార్పెట్ మీద చిక్కటి రక్తం మెల్లగా వ్యాపిస్తోంది

స్వాగత్ క్షణం కూడా ఆలస్యం చేయలేదు.

పవన్‌కి అభిముఖంగా వున్న కిటికీ దగ్గర పరుగెత్తి చూశాడు. దూరంగా రోడ్ మీద ఓ తెల్ల ఎంబాసిడర్ వెళ్తోంది. స్వాగత్ వేగంగా పరుగెత్తి బయటికొచ్చి- కారెక్కాడు.

అతని కారు బుల్లెట్‌లా ముందుకు దూసు పోయింది.

* * * * * * *

"అది నిజంగా సైనైడ్ అయితే ఏం చేసేవాడివి? నవ్వుతూ అంది శ్రీమతి.

"మీకు తెలీదేమో- అది నిజంగా సైనైడనే నేన తాగాను" అన్నాడు సూర్యం.

"ఎందుకంత అఘాయిత్యం చేశావ్-' చిరుకోపంతో అందామె.

"అనురాగం వుండాలిగానీ- అలాంటి వెన్నైన చేయగలడు మనిషి-" నవ్వుతూ అన్నాడు.

శ్రీమతి మాట్లాడలేదు.

హోటల్ కిటికీలోంచి కింద కనిపిస్తున్న ట్రాఫిక్‌ను చూస్తోంది. విపరీతంగా ఆలోచించడం వల్ల ఏర్పడిన అలసట ఆమె ముఖంలో కనిపిస్తోంది. కొద్దిసేపు నిశబ్దం తర్వాత తలతిప్పి సూర్యాన్ని చూస్తూ అంది.

"నేను నీకన్నా చాలా పెద్దదాన్ని- తెలుసా?"

సూర్యం నవ్వాడు.

"షేక్స్పియర్ తనకన్నా చాలా పెద్దావిడను పెళ్ళి చేసుకున్నాడు..."

"నువ్ షేక్స్పియర్‌వా?"

"మీరు ఒప్పుకుంటే కాళిదాసును కూడా అవుతాను...."

ఆమె నవ్వలేదు.

మనస్సులో చెలరేగుతున్న ఘర్షణ తాలూకు నీడలు ఆమె ముఖం మీద ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. ఒక్క రోజులో ఆమె నాలుగు లంఖణాలు చేసిన మనిషిలా కనిపిస్తోంది.

ఓయే ఓయే
జంట



త్రిదేవ్ చిత్రంలో నటించిన ఓయే ఓయే జంట నసీరుద్దీన్‌షా, సోనమ్‌లన్న విషయం అందరికీ తెలిసిందే. ఆఓయే ఓయే జంట తిరిగి మళ్ళీ 'చోర్‌పే మోరే' చిత్రంలో దర్శనమివ్వబోతోంది. ఈ చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుందట. ఈ చిత్రం ద్వారా మళ్ళీ వీళ్ళు ప్రేక్షకుల్లో ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించు కుంటారేమో! లెటజ్ వెయిట్ అండ్ సీ.



"మీరంతగా ఎందుకాలోచిస్తున్నారో నాకర్థం కావడం లేదు. కేవలం వయస్సే మనిద్దరి మధ్య ప్రేమకు అడ్డయితే ఆ విషయం మర్చిపోండి. అయినా స్త్రీ స్వాతంత్ర్యం వగైరాల మీద అంత స్థిర నిర్ణయాలున్న మీరు- మగాడు తనకన్నా ఎంతో చిన్నదైన అమ్మాయిల్ని చేసుకుంటున్నప్పుడు- స్త్రీకా స్వాతంత్ర్యం ఎందుకుండకూడదో ఆలోచించండి-" అన్నాడు సూర్యం.

బేరర్ వచ్చి కాఫీ పెట్టి వెళ్ళిపోయాడు.

సూర్యం కాఫీని రెండు కప్పులలోకి సర్దుతూ అన్నాడు.

"అంతకన్నా మీకు వేరే అభ్యంతరాలుంటే దయచేసి చెప్పండి"

శ్రీమతి మాట్లాడ లేదు.

ఉబికి వస్తున్న కన్నీటిని నిగ్రహించు కుంటోంది.

ఆమె కళ్ళ ముందో దృశ్యం:

ప్రాణభయంతో నేలమీద పాకుతున్న లేడిని- తుపాకి అవతల పడేసి- తన ఒడిలో చేర్చుకుని- గాయానికి చికిత్స చేస్తోంది. ఆమె కన్నీరు ఆ గాయాల మీద పడి వెంటనే మానిపోతున్నాయి. లేడి ముఖానికి బదులుగా వున్న పురుషుడి ముఖం ఇప్పుడు సూర్యం ముఖంలా కనిపిస్తోంది. ఆమె ఆ లేడిని పదిలంగా రెండు చేతుల్తో ఎత్తి జీప్‌లో కూర్చుని తన ఒడిలో ఆ లేడిని పెట్టుకుని డ్రైవర్‌కు సైగ చేసింది. జీప్ వెనక్కు తిరిగి వేగంగా వెళ్తోంది.

"మిమ్మల్నే- మాట్లాడరేం?"

ఆమె అతని కళ్ళలోకి చూసింది.

స్వచ్ఛంగా- ఏ కపటమూ- వంచనా లేకుండా- నిజాయితీగా తన నిర్ణయం మీద తన జీవితం ఆధారపడుందన్న ఆత్రుతతో తనను చూస్తున్నాడు.

తల విదిలించిందామె

"నో- నాకిష్టంలేదు..." అంది.

"ఎందుకో చెప్పండి. కారణం తెలుసుకోవడంలో తప్పు లేదుగా"- కాఫీ కప్పు ఆమె వేపు జరిపి అన్నాడు.

"ప్రతి దానికీ కారణాలు చెప్పలేం. ఎందుకో- ఎందుకో..."

ఆమెకు గొంతు పలక లేదు. చప్పున తల దించుకుంది.

రెండు కన్నీటి బొట్లు టేబుల్ మీదున్న మెనూ కార్డ్ మీద పడ్డాయి.

"మేడం.... మీరు... మీరు ఏడుస్తున్నారా?" ఆశ్చర్యంగా- బాధగా అన్నాడు.

"వద్దు. నన్ను బలవంత పెట్టకు. నన్నేమీ అడక్కు- హాయిగా వేరే అమ్మాయిని చేసుకుని సుఖపడు- అంతే-"

చివాలున లేచి వెళ్ళబోతున్న ఆమె చేయి పట్టుకున్నాడు సూర్యం. విసురుగా చూసిందామె. సూర్యం చేయి వదల్లేదు. అలాగే పట్టుకుని లేచి నిలబడి అన్నాడు...

"ఆనాడు మన తొలిపరిచయ మైనప్పుడు- మీరు నా చెంప మీద వేసిన ముద్దు ముద్ర తడ ఇంకా ఆరలేదు మేడం. ఆ క్షణం గొప్పదనమో- మీ పెదవుల అద్భుతమో గానీ- ఆనాడే ఆ క్షణం నుంచే మీరు నా మనసులో ప్రవేశించారు. అప్పట్నుంచీ మిమ్మల్ని ఆరాధిస్తున్నాను. మన స్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. అఫ్‌కోర్స్- నేను మీకు తగను. మీ అందానికి అంతస్తుకు నేను సరి తూగను. అని మరుసుకుంటే చెప్పండి- ఈ క్షణమే హైదరాబాద్ వదలి- జీవితంలో మళ్ళీ మీకు ఏనాటికీ కనిపించను.

"సూర్యం- సూర్యం- ఎందుకు మీరంతా ఇలా ప్రవర్తిస్తున్నారు- నాకు తెలీదు. నాకు తెలీదు- నేనే మీకు తగను. నన్ను మర్చిపో- ప్లీజ్- నన్ను మర్చిపో"- విసురుగా చేయి లాక్కుని ఏడుస్తూ వెళ్ళిపోతున్న ఆమెను- శిలా ప్రతిమలా నిలబడి చూస్తుండిపోయాడు సూర్యం.

* * * * * * *

"మై గుడ్‌నెస్- ఎంతసేపయింది?" షాక్‌తో అడిగాడు సవ్యసాచి.

"జస్ట్ ఓ గంట కూడా కాలేదు" అన్నాడు స్వాగత్.

"పోలీస్ కంప్లయింటిచ్చావా?"

"ఇంకా ఇవ్వలేదు. నీకు చెప్పి ఇద్దామనుకుంటున్నాను"-

"రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత అన్నాడు సవ్యసాచి.

"ఆ ఇంట్లోకి నువ్వెళ్ళడం గానీ- రావడం గానీ ఎవరైనా చూశారా?"

"లేదు- అసలా చుట్టుపక్కల కూడా ఎక్కువ ఇళ్ళు లేవు."

"అయితే ఓ గంటలో నేను నీ దగ్గర కొస్తాను. ఈ లోగా తొందరపడి ఏమీ చేయకు" అన్నాడు సవ్యసాచి.

"అలాగే" అని ఫోన్ పెట్టి సిగరెట్ వెలిగించుకున్నాడు.

భాగ్యరాజ్ అందర్నీ సిటీ చూపిస్తానని బయటకు తీసుకెళ్ళాడు. నవ్య ఒక్కతే ఇంట్లో వుండిపోయింది.

దుర్గను పిలిచి కాఫీ తెమ్మని అలసటగా సోఫాలో వాలి కళ్ళు మూసుకున్నాడు స్వాగత్.

జరుగుతున్న సన్నివేశాలు అతన్ని ఊపిరి తీసుకోనివ్వడం లేదు. మొన్న నవ్య మీద హత్యానేరం- ఈ రోజు తన మీద మరో హత్యానేరం. అవును. హంతకుడు తలచుకుంటే- పవన్‌కుమార్ని నువ్వే హత్య చేసినట్టు నిరూపించగలడు.

దుర్గ కాఫీ కప్పుతో వచ్చింది. అందుకున్నాడు. దుర్గ వెళ్ళిపోయింది. ఆ ఇంట్లో పనిమనిషి- తోటమాలి- వంటమనిషి అందరి ముఖాల్లో దిగులు- నిస్తేజం తాండవించడం గమనించాడు స్వాగత్- విషాదంగా నవ్వుకున్నాడు.

కాఫీ తాగి- కప్పు పక్కన పెట్టి- సిగరెట్ వెలిగించుకున్నాడు. అప్పుడు మోగింది ఫోన్! అందుకుని 'హలో' అన్నాడు.

కర్కశంగా వినిపించింది.

స్వాగత్ వేళ్ళు ఫోన్ మీద బిగుసుకున్నాయి.

"నేనెవరో తెలుసుకోవాలన్న ప్రయత్నంలో నువ్వు మరో ఉద్యోగిని కోల్పోయావ్–"

"రాస్కెల్– ఎవడ్రా నువ్వు– ధైర్యం వుంటే– ముందు కొచ్చి నిలబడు–" ఆవేశంతో అరిచాడు స్వాగత్.

"తొందరపడకు స్వాగత్. నా పథకం పూర్తయ్యే రోజు దగ్గర పడింది. బైదిబై– ఫోనెందుకు చేశానో తెలుసా? నిన్నిప్పుడు ఉన్నపళంగా పవన్‌కుమార్‌ని హత్య చేసిన నేరం కింద కటకటాల వెనక్కు పంపించగలను.."

"అసలు అతన్నెందుకు హత్య చేశావ్?"

"నేనెవరో చెప్పాలని ప్రయత్నిస్తున్న అతని స్వామి భక్తిని మెచ్చుకుని" నవ్వాడా వ్యక్తి.

"యూ రాస్కెల్ నువ్వెవరో తెలుసుకుని– నిన్ను ఉరికంబం ఎక్కించందే నిద్రపోను– మర్చిపోకు–" ఫకాలున నవ్వాడా వ్యక్తి.

"ఇది సినిమా కాదు మిస్టర్– పాపం ఎంతో కష్టపడి శైలజ ఇంట్లో ఆధారాలు సంపాదించావ్. ఫలితం పవన్‌కుమార్‌ని బలి తీసుకున్నావ్– ఇంకెప్పుడూ అలాంటి అ డ్వంచర్స్ చేయకు. బైదిబై నువ్వు చేయాల్సిన ఆఖరి ఎస్సైన్‌మెంట్ మరొకటుంది–"

"నెవర్– ఇంక నీ చేతిలో కీలు బొమ్మగా నటించలేను" ఆవేశంగా అన్నాడు స్వాగత్.

పెద్దగా నవ్వాడతను.

"ప్రతిసారీ అలాగే అంటావు. అయినా చేస్తావు. ఎందుకో తెలుసా? నీ అనంగీకారం ఖరీదు ఓ నిండు ప్రాణమని నీకు తెలుసు. యామై కరెక్ట్?" హేళనగా అన్నాడతను.

"అసలెవరున్నువ్వు? నా దగ్గర ఏమాశించి ఇవన్నీ చేయిస్తున్నావ్?" కోపంగా అడిగాడు స్వాగత్.

"అవన్నీ చెప్పను మిస్టర్– ఇంతకీ నువ్వు నేను చెప్పేది చేస్తావా లేదా?" రెండు క్షణాల నిశ్శబ్దం తర్వాత నిస్సహాయంగా అన్నాడు స్వాగత్.

"చెప్పు– ఏవిటది?"

తెరలు తెరలుగా నవ్వి అన్నాడతను.

"నీ భార్యను నువ్వు హత్య చేయబోయినట్టు నటించాలి" పిడుగు పడినట్టు అదిరిపడ్డాడు స్వాగత్.

"వా....ట్..." అప్రయత్నంగా అన్నాడు.

"యస్– జస్ట్ యాక్ట్ లైక్ దట్– దట్సాల్–"

"ఇంపాజిబుల్– నువ్వేం చేసుకున్నా సరే– ఆ పని మాత్రం చేయను" స్థిరంగా అన్నాడు స్వాగత్.

"ఐ... సీ.. అయితే జాగ్రత్తగా విను. ఇప్పుడు టైమెంత?"

"ఒంటిగంట"

"సరిగ్గా రెండు గంటల కల్లా– అంటే మరో గంటలో నీ భార్యను మేము చంపబోతున్నాం. నీ పెళ్ళాం ప్రాణానికి ఈ క్షణం నుంచే కౌంట్ డౌన్ ప్రారంభం – మైండిట్–"

ఫోన్ క్లిక్‌మన్న చప్పుడు.

నిశ్చేష్టుడై నిల్చుండిపోయాడు స్వాగత్. అతనికి

లవ్‌గేమ్

మరో మాటకు అవకాశమివ్వకుండా ఫోన్ పెట్టేసిన అవతలి వ్యక్తి సామర్థ్యం తనకు తెలుసు. తాను అతను చేయమన్న పనులు చేయలేదన్న నెపం మీద శైలజను– ఆ తర్వాత పవన్‌నూ చంపాడు. అలాంటి వాడికి నవ్యను చంపడం చాలా తేలికైన విషయం.

ఎలా? ఎలా?

అతని మెదడు తీవ్రంగా ఆలోచిస్తోంది సాధ్యమైనంత వరకు నవ్యను బయటకు పోనీకుండా ఇంట్లోనే ఉంచాలి. ఉంచి కంటికి రెప్పలా ఆమెను కాపాడాలి–

తల విదిలించాడతను.

హంతకుడు తలచుకుంటే తమందరి మధ్యా నడుస్తున్నప్పుడు కూడా నవ్యను హత్య చేయగలడు.

అన్నిటికీ మించి–

అసలు తాను ఆమెనెలా కాపాడగలడు?

తన నీడనే అసహ్యించుకుంటున్న ఆమెను అనుక్షణం వెన్నంటి ఉండడం అసాధ్యం.

వాచీ చూసుకున్నాడు.

అప్పుడు అయిదు నిముషాలు గడిచాయి.

వాచ్ డయల్ మీద తిరుగుతున్న సెకన్ల ముల్లు అతనిలో టెన్షన్ పెంచసాగింది.

అసలు విషయం చెప్పి– నవ్యను హెచ్చరిస్తే?

అతని ఆలోచనకు అతనికే నవ్వొచ్చింది. ఇంట్లో అంతా తనని రాక్షసుడిలా చూస్తున్న ఈ సమయంలో– తనేం చెప్పినా వాళ్ళు వినరు– విన్నా నమ్మరు.

వెల్– ఎవరేమనుకున్నా – తనెంత అవమానించినా నవ్య ప్రాణం తనకు ముఖ్యం. అందుకోసం ఎలాంటి పరిణామాల్నైనా ఎదుర్కోడానికి సిద్ధంగా వుండాలి.

తన ప్రమేయం లేకుండా వరుసగా జరుగుతున్న అనూహ్యమైన పరిణామాలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అన్నిటినీ మించి అతన్ని ఆశ్చర్యపరుస్తున్న విషయం –శైలజ రూంలో అతనికి లభించిన ఆధారాలు– తెల్లారేసరికి మాయమవడం. అదో అంతుపట్టని మిస్టరీలా ఉంది. అంటే ఎవరో– తన ప్రతి కదలికనూ అతి జాగ్రత్తగా గమనిస్తున్నారని అర్థమైంది, అలాంటప్పుడు నవ్యను కాపాడుకోవడం చాలా రిస్క్‌తో కూడిన ప్రయత్నమని తెలిసిపోతోంది.

సరిగ్గా అప్పుడు మోగింది ఫోన్–

అతనో క్షణం ఆలోచించాడు. మళ్ళీ ఆ వ్యక్తి ఫోన్ చేసి మరేదైనా చేయమంటే?

అతన్ని హెచ్చరిస్తున్నట్టు మోగుతున్న ఆ ఎరుపురంగు ఫోన్ అతన్ని విపరీతమైన టెన్షన్‌కు గురి చేసింది.

చప్పున అందుకోబోయాడు.

ఫోన్ రింగవడం ఆగిపోయింది.

హాయిగా ఊపిరి పీల్చాడు– ఏదో గొప్ప ప్రమాదం నుంచి బయటపడినట్టు ఫీలయ్యాడు. నెమ్మదిగా హాల్లోకొచ్చి నవ్య గదిలోకి చూశాడు.

బెడ్ మీద పడుకుని ఏదో ఇంగ్లీష్ మేగజైన్ తిరగేస్తోంది. హాల్లోంచి ఆమె గదిలోకి ఓ గుమ్మం– గదిలో కుడి పక్కన పెద్ద కిటికీ– ఎటాచ్‌డ్ బాత్‌రూం– రెండు వెంటిలేటర్స్–

హంతకుడు ఆమెను హత్య చేయడానికి– నాలుగు మార్గాలు. ఎవర్నైనా రెడీగా అక్కడ కాపలా వుండమన్నా తనేదో కొత్త నాటకం ఆడుతున్నాడని తేలిగ్గా కొట్టి పారేస్తారు. అప్పుడొచ్చిందతనికి ఆ ఆలోచన.

యస్– అసలు మెయిన్ గేట్ దగ్గర ఘూర్కాకు అపరిచితుల నెవరినీ లోపలికి రానివ్వొద్దని చెబితే–

క్షణం కూడా ఆలస్యం చేయలేదతను ఫోనందుకుని ఎక్స్‌టెన్షన్ నొక్కి ఘూర్కాకు ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు. చుట్టూ వున్న ప్రహరీ గోడ దూకి రావడం అసాధ్యం.

దాదాపు పదడుగుల ఎత్తులో – దాని పైన ఇనుప ముళ్ళ తీగలతో ఫెన్సింగ్ వేసివున్న ఆ గోడ దూకి రావడం– ఇంత పట్టపగలు అసాధ్యం సోఫాలో కూర్చుని వాచీ చూసుకున్నాడు.

ఒకటీ పదిహేను!!

ఇంకా నలభై ఐదు నిముషాలు టైముంది. సిగరెట్ వెలిగించుకున్నాడు.

సీలింగ్ ఫ్యాన్ చప్పుడు కూడా అతని కెంతో టెన్షన్‌గా అనిపించసాగింది.

డోర్ బెల్ మోగింది!

ఉలికిపాటుగా తలుపు వేపు చూశాడు స్వాగత్.

(ఇంకా వుంది)

ముహూర్త బలం?

ఆ యిద్దరికి పెళ్ళి అని ముహూర్తం పెట్టారు. గుళ్ళో ఏర్పాట్లు చేశారు కాని పెళ్ళికి ముందు– పెళ్ళికొడుకు మిలట్రీవాడు– తన డ్రెస్సుకి గంజిపెట్టి యిస్త్రీ చేసుకుంటూ– 'షాక్' తగిలి మరణించాడు– 29 సంవత్సరాల పెళ్ళి కొడుకు యిలా "హరీ" మన్నా కూడా– అదే ముహూర్తానికి పెళ్ళి జరగాలి అన్నారు పెళ్ళికూతురు తరపువాళ్ళు– 29 సంవత్సరాల వీర జవాన్ వీరస్వర్గం అలంకరించిన దుర్ముహూర్తం అనేనా చూడకుండా– పెళ్ళికూతురు ఉషా కుమారిని చేపట్టడానికి, ఆ పిల్ల మేనబావ "సుగాతన్" పీటలమీదకు "రెడీగా" వచ్చేశాడు కేరళలోని కళ్యాణపురంలో పట్టాభిదేవి దేవాలయంలో యీ వివాహం జరిగింది– ముహూర్త బలాన్ని ఎలా అన్వయించాలి?

ప్రశ్నావళి

-కె. రామలక్ష్మి

జి. మాధవి, విశాఖపట్నం

'జగతి'చూస్తారా? దాన్లో చందూర్ గారి డైరీ నాకు చాలా యిష్టం. ఎప్పుడేనా మిమ్మల్ని గురించి రాస్తారేమోనని చూస్తాను...

* మా సర్కిల్ వేరు. వారి సర్కిల్ వేరు. నాకు చాలా మంది 'తెలిసిన' వాళ్లేగాని స్నేహితులు మామయ్య మాలతీనే. అంచేత మా గురించి రాయిడానికేముంటుంది? నాకూ డైరీ చాలా యిష్టం. చందూర్‌గారి భాష భేషజం లేకుండా సాఫీగా చక్కగా వుంటుంది - వాడుక భాష అంటే, అదేనని నా ఉద్దేశ్యం.

దగాని సుధ, గండిగుంట

ప్రేమ! పెళ్లి!! తరువాత జీవితం సుఖాంతమా? దుఃఖాంతమా?

* అది వారి వారి చేతుల్లో వుంటుంది? ఇద్దరిమధ్య అవగాహన ఏర్పడకపోతే దుఃఖాంతం. ఏర్పడితే సుఖాంతం.....భవిష్యత్తు గురించి కలలు కనడం, గతం గురించి బెంగపడడంమాని వర్తమానాన్ని ఏ రోజుకా రోజు కొత్తరోజుగా బ్రతికేయడం అలవాటు చేసుకుంటే - కొంచెంలో కొంచెం సుఖాంతంగా సాగే మార్గమేనా ఏర్పడుతుంది అని నా నమ్మకం.

పోలోజు వెంకటాచారి, బోడుప్పల్

అప్పులెక్కువయ్యాయనే బెంగతో అప్పు చేసి తాగుతున్నాడు ఒకాయిన. ఇలాంటివారు బాగుపడేదెప్పుడు?

* చచ్చాక! అతనూ బాధావిముక్తుడౌతాడు. అతన్ని అంటిపెట్టుకు బ్రతికేవాళ్లూ బాధావిముక్తులవుతారు.

ఈసారి కాంగ్రెస్ పరాజయం నేషనల్ ఫ్రంట్ విజయంపై మీ అభిప్రాయం ఏమిటి?

* ఎదురు దెబ్బలు - పాఠం నేర్పకపోతే - కాంగ్రెస్‌లాగే చేసిన తప్పులే చేస్తూ పోతారు. వీరినెవరూ మార్చలేరు - గత కీర్తిపై అంత గట్టినమ్మకం వీరికి. ఇక వీరి పెద్దలు - నోరా వెన్నుకి తేకే! అన్నట్టు - ప్రవరిస్తారు. ఇంక అభిమానంవున్నా జనం మటుకు చేయకల్గిందేమిటి?


రామజన్మభూమి నాల్గు నెలలు వాయిదా వేయడం సరైనదేనా?

* అసలది ముఖ్యమా అని ఎందుకెవరూ ఆలోచించరు? దీన్నే ఇల్లు కాలి చస్తుంటే - చుట్టకాల్చుకుందుకు నిప్పుకెళ్లడం అంటారు. ఉన్న దేవాలయాల గతి చూస్తూంటే - మీకేమనిపిస్తోంది? నాకుమటుకు మతం అంటే అసహ్యం పుడుతోంది!

ఎల్.పి. చంద్ర, ధర్మవరం

అభిమాన ప్రశ్నావళి నిర్వాహకురాలు శ్రీమతి కె. రామలక్ష్మిగారూ నేటి స్త్రీ సమస్యలపై మళ్లీ ఓ నవలరాయరూ?

* ఎక్కడ రాయమంటావయ్యా బాబూ? ఏ సమస్యమీద రాయమంటావు? స్త్రీ సమస్యలంటూ వెబ్రియనిజమ్ మీదా సెక్సుమీదా రాసే మేధావులెందరో వుండగా - యీ సాంఘిక అన్యాయాలపై రాస్తే చదివే పాఠకులు వుండరు - మీకు తెలియదా?!



మ సాలా చిత్రాలూ మసాలా సీరియల్స్ అన్నీ మహిళ చుట్టూ తిరుగుతూనే వున్నాయికదా. నన్నొదిలిపెట్టు! నెంబర్ ఒన్, నెంబర్ టూ, నెంబర్ ఒన్+ నెంబర్ టు+అంటూ ఉత్తమ, ఉత్తమోత్తమ ఉత్ప్రేక్షక రచయితల చిరునామాలు వెదకు - వారి వారికి టైము లేకపోయినా 'ఎవరికో' చెప్పి 'ఎవరిచేతో' రాయించి సంపాదకుల 'మెడలు వంచి' అచ్చేయించగల బహు నేర్పరులట వారు.

ప్రశ్నావళి ద్వారా మీరు తెలుసుకున్నదేమిటి? తెలియజేసినది ఏమిటి? ఇలా అడిగానని కోపమా?

* ఛ కోపమెందుకు? నా కంతట్లో కోపంరాదు. తెలియచెప్పినది - లోకోభిన్న రుచి!! తెలుసుకున్నది - జిహ్వకో రుచి!! అని.

మహమ్మద్ రఫీ, అయితానగర్

మీతో స్నేహంగా వుండే మీ స్నేహితులు మిమ్మల్ని మోసంచేస్తే మీరెలా ఫీలవుతారు?

* నాకంటే నా స్నేహితులు తెలివైన వాళ్లనుకుంటాను. నేను మనుషులని అంత త్వరగా నమ్మను. అంత త్వరగా స్నేహమూ చెయ్యను. నాకు స్నేహితు లన్నవాళ్లందరు - నాకు ముప్పయి నలభై ఏళ్లుగా దగ్గరవారు.

కట్నం గురించి మనం ఎన్ని ప్రసంగాలు చేసినా మనదాకా వస్తే తీసుకోకుండా వుంటామా కె. రా. గారూ.

* మన అనకండి - మీ దాకా అనండి! ఎంతమంది ఎన్ని చెప్పినా - ఆత్మగౌరవం, సిగ్గు, లజ్జ ఎవరికివారు గ్రహింపు చేసుకోవలసిన సంగతులు - అందుకే ప్రసంగాల బలం వేదికల దాకానే వుంటోంది!

గొట్టాపు దుర్గారావు, గోపాలపురం

ధనవంతుడు మరీ ధనవంతుడవుతున్నాడు. బీదవాడు మరింత బీదవాడవుతున్నాడు. ఈ సామాజిక వ్యవస్థలో న్యాయం చేకూరేదెప్పుడు?

* న్యాయం ఎప్పుడు ఒక ఆశయంగానే మిగిలిపోతుందని - ప్రపంచదేశాల వ్యవస్థలు నిరూపిస్తూనే వున్నాయి కదా....ఆశయసిద్ధి చాలా అందుకోలేని - గోల్. డబ్బు డబ్బుని పెంచుతుంది. అప్పు అప్పుని పెంచుతుంది. డబ్బున్నవాడు అప్పుచేస్తే అతని హోదా ఇంకా పెరుగుతోంది. అదీ పెట్టుబడికింద మారి. డబ్బులేనివాడు అప్పుచేస్తే - అది అతగాడి జీవనభృతినే హరించివేస్తూంది. అందుకే - డబ్బున్నవాడింకా గొప్పగానూ, పేదవాడింకా దరిద్రుడుగానూ తయారవక తప్పదు...

తాపత్రయం

న్యాయపతి కమలా రాంజీ



నీరజ బరువెక్కిన గుండెతో నెమ్మదిగా వంటింట్లో అడుగు పెట్టింది. ఆ వంటిల్లంతా అందంగా అమర్చబడి ధగధగా మెరిసే స్టీలుసామాన్లతో ఒక స్టీలు సామాన్లమ్మే దుకాణంలా కనిపించి మనసులో కెలికినట్లయింది! గుండెని ఎవరో రంపంతో కోస్తున్న చేదు అనుభూతి! ఈ గుండె కోతపై నిర్లిప్తత అనే పూత వేసి గుట్టుగా దాచేసుకుందామన్నా సాధ్యం కావడం లేదు. ఆ వంటిల్లు చూస్తుంటే నీరజకి దుఃఖం తన్నుకొస్తోంది. అదొక స్టీలు సామ్రాజ్యం! ఆ సామ్రాజ్యానికి మహారాణి... అమ్మ! ఆమె బ్రతికున్నప్పుడు ఎవర్నీ స్టీలు గిన్నెలని ముట్టుకోనిచ్చేదికాదు. పొరపాట్న ఎవరి చేతిలోంచైనా గిన్నె జారిపడితే ఆ రోజు వాళ్లకి తిట్లే భోజనం! ప్రతీ గిన్నె నోరుతెరుచుకుని తన్ని "అమ్మ ఏది నీరజా?" అని అడుగుతున్నట్టే అనిపిస్తోంది! నీరజకి చెప్పలేనంత ఏడుపొచ్చింది. "అదేమిటి! ఒక స్టీలు గిన్నె ఆయుర్దాయం అమ్మ ఆయుర్దాయంకంటె ఎక్కువా! ప్చ్. కోరి ఆయుర్దాయాన్ని తక్కువ చేసుకునే వాళ్ళని ఎవరేం చేయగలరు!" అనుకుంది.

అయినా మనిషి బ్రతుకు ఎంత అశాశ్వతమైనది! మూణ్నాళ్ల ముచ్చటైన ఈ జీవితం కోసమా యింత తాపత్రయం!

"ఈ చీరనాది! ఈ బంగారం నాది! ఈ గిన్నెనాది! ఈ యిల్లు నాది!" అని ప్రతిదీ తనది, తనేదో శాశ్వతంగా యిక్కడ వుండి పోయినట్టు తాపత్రయ పడిపోతాడు మనిషి! జీవితం ఎంత క్షణభంగురం! నీటి బుడగలాంటి జీవితంలో 'నాది' అనే తాపత్రయం ఎంత మూర్ఖత్వం! పుబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకుందికి విశ్వప్రయత్నం చేస్తూ అక్కడే ఓ మూల అలసటగా గోడకి చేరబడి పోయింది నీరజ. మూసుకున్న కనురెప్పల వెనుక గతంలోని కొన్ని సంఘటనలు సినిమారీళ్లలాగ కదిలేయి......

* * *

మే నెల ఎండలు. ఉదయం తొమ్మిదయింది. ప్రభాకరుడు అప్పుడే తన ప్రభావాన్ని చూపిస్తున్నాడు. లలితమ్మ రెండు చేతుల్లోనూ రెండు బరువైన సంచులున్నాయి. ఒక సంచీలో పది కేజీల మామిడికాయలు వున్నాయి. మరొక సంచీలో నిండా కూరగాయలున్నాయి. లలితమ్మ యిల్లు బొంకుల దిబ్బదగ్గర లక్ష్మపందిరి వీధిలో వుంది. కాని అక్కడ కూరగాయల ధర ఎక్కువ చెప్తారని పెద్ద బజారుకి బయలుదేరింది. కూరగాయలు కొని ఒక సంచీ పూర్తిగా నింపేసి, మామిడికాయల బేరం కుదరక యించుమించు గంటస్థంభం దాకా వచ్చింది. అక్కడ కాయలు కొనడం పూర్తయింది.

ఎండకి ఆమె శరీరం చెమట్లు పట్టేసింది. అసలే అర్భకంగా, నీరసంగా వుంటుంది. దానికితోడు ఆ రోజు శనివారం. ప్రతీ శనివారం కటిక వుపవాసం చేస్తుంది. ఆ రోజు పొద్దున్నించీ ఏమీ తాగలేదు. తులసి తీర్థం రెండు గుక్కలు నోట్లో పోసుకుంది. అంతే. హార్లిక్స్, మాల్టోవా లాంటివి మడికి పనికిరావుట. ఆమె చాదస్తం అమెది! రెండు చేతుల్లో రెండు బరువైన సంచీలు మోసుకుంటూ అంత ఎండలో నడవడం అంటే కష్టమే. అయినా ఆమె పట్టుదలగా నడుస్తున్నది. ఆ పంతం, పట్టుదల అంతా రిక్షావాళ్ళమీద. అసలు ఆ బరువైన రెండు సంచుల్ని మోసుకుంటూ యింటి దాకా నడవగలనన్న నమ్మకం చాలక మొదట ఒకరిక్షా వాడ్ని పిల్చింది.

"ఏయ్. రిక్షా? బొంకుల దిబ్బదగ్గరికి ఏం తీసుకుంటావు?"

రిక్షావాడు ఆగి లలితమ్మ చేతుల్లో వున్న సంచీల వైపు ఒకసారి చూసేడు. తర్వాత లలితమ్మ వైపు చూసి చెప్పేడు.

"రెండున్నర యిప్పించండి."

లలితమ్మకి ఆశ్చర్యం, కోపం రెండూ ఒక్కసారే కలిగేయి.

"ఏమిటీ! యిక్కడున్న బొంకుల దిబ్బకి రెండున్నరా? ఏవూరయ్యా మీది! కొత్తగా వచ్చేవా?" అంది సాగదీస్తూ.

రిక్షావాడికి చిర్రెత్తుకొచ్చింది.

"బొంకులదిబ్బ యిక్కడుందంటున్నారు! మరెందుకు రిక్షా. నడిచి వెళ్ళిపోండమ్మా!" అన్నాడు ఎగతాళి చేస్తూ.

తను బేరమాడ దామనుకునేలోగానే ఎవరో పెద్ద మనిషి, బాగా డబ్బున్న వాడిలా వున్నాడు, వచ్చి, బేరం ఆడకుండానే రిక్షా ఎక్కి కూర్చున్నాడు! లలితమ్మకి వళ్ళు మండిపోయింది. మరో రిక్షాని పిల్చింది. వాడూ రెండున్నరే చెప్పేడు. తను ముందుకు నడుస్తున్న కొద్దీ దూరం తరిగి పోతున్నది. కాని రిక్షావాళ్ళ రేటు మాత్రం అంతే వుంటున్నది. ఇది చాలా అన్యాయం అనిపించింది ఆవిడకి.

"సరి అయిన బేరం చెప్పు." అంది లలితమ్మ.

"రెండు రూపాయిలివ్వండి." ఏదో జాలి తల్చినట్టుగా అన్నాడు. లలితమ్మ ఒక నిముషం ఆలోచించింది. బొంకులదిబ్బ దగ్గరకూరగాయలు ధరలు ఎక్కువ చెప్తారని, రెండు మూడు రూపాయలు మిగల్చవచ్చనే కదా యింత దూరం కాళ్ళీడ్చుకుంటూ వచ్చింది! ఇప్పుడు రిక్షాకి పెట్టేస్తే ఏం లాభం! ఏదో ఒక రూపాయైతే ఆ నష్టం ఎలాగో భరించవచ్చు. అదీనూ ఎండ ఎక్కువగా వుంది కాబట్టి!

లలితమ్మ యింకా మాట్లాడక పోవడం చూసి రిక్షావాడు అన్నాడు. "పోనీ మీరు ఎంతిస్తారో చెప్పండమ్మా?"

"నేను ఒకరూపాయికంటె ఎక్కువ యివ్వను. అప్పుడే సగందూరం నడిచి వచ్చేసేను. నీ కిష్టం అయితే రిక్షాకట్టు. లేకపోతే లేదు." అంది లలితమ్మ ఖచ్చితంగా. "తను అనుకున్న రూపాయికే ఏ రిక్షావాడైనా వచ్చినా సరే లేకపోతే తను నడిచే వెళ్తుంది." అని నిర్ణయించుకుంది. ఆయాసంతో రొప్పుతూ నడుస్తూనే మధ్య మధ్యలో సంచుల్ని కిందకిదించి మళ్ళీ చేతుల్లోకి తీసుకుంటూ, మరో యిద్దరు ముగ్గురు రిక్షా వాళ్ళని కేకేసింది. ఇద్దరు వినిపించుకోకుండా వెళ్ళిపోయేరు. ఒకడు మాత్రం రూపాయిన్నరకి కడ్తానన్నాడు. అప్పుడన్నా అర్ధరూపాయి దగ్గర పట్టింపు ఏమిటి అని లలితమ్మ అనుకోలేదు. ఆవిడ పంతం అలాంటిది! ఒక రూపాయి అనుకుంటే ఒకరూపాయే యిచ్చి ఎక్కాలి. అంతకంటె అయిదు పైసలు కూడా ఎక్కువ యివ్వడానికి ఆవిడ మనసు అంగీకరించదు.

ఇంటి దాకా నడుచుకొచ్చే సరికి మరి పాదాల్లో శక్తిలేనట్టు, నోట మాట రానట్టుగా అక్కడే, యింటి ముందు మెట్ల మీద చతికిల పడిపోయింది. గుండె గొంతులోకి వచ్చినట్టుగావుంది. నాలుక పిడచ కట్టుకు పోయింది. నీరసం, నిస్సత్తువ ఆవహించేయి.

"అమ్మ యింకా రాలేదేమిటి?" అనుకుంటూ వీధిలో కొచ్చిన నీరజ తల్లి వాలకం చూసి గతుక్కుమంది. ముందు రెండు సంచుల్నీ గబగబా లోపలుంచేసి వచ్చి తల్లి చేయి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళి మంచం మీద పడుకోబెట్టి ఫ్యాను వేసింది. మంచినీళ్ళు తెచ్చి అందిస్తున్న కూతుర్ని తేరిపార చూసింది లలితమ్మ.

"ఇవాళ శనివారం కదా. నేను ఏ నీళ్ళుపడితే ఆ నీళ్ళు తాగేస్తే నా మడి ఏమయిపోవాలే!" అని అంత నీరసంలోనూ ఖస్సుమంది. తల్లి చాదస్తానికి వళ్ళు మండిపోయింది నీరజకి.


"ఏంటమ్మా. మడి మడి అని కూర్చుంటావు. మంచినీళ్ళు, శుభ్రమైనవి నేను స్వయంగా తెచ్చియిస్తే అవి పనికిరావా! చల్లటి మంచినీళ్ళు కొంచెం తాగు. హాయిగా వుంటుంది." అంటూ బలవంతం చేసింది. లలితమ్మ వద్దుగాక వద్దంది. "మంచినీళ్ళకే యింతరాద్ధాంతంచేసే తల్లి యిహ హార్లిక్స్ కలిపి యిస్తే పుచ్చుకుంటుందా! హమ్మో." అనుకుని ఆ పని చేయబోయి విరమించుకుంది.

"రిక్షాలో వచ్చేలేక పోయేవమ్మా! అంత దూరం నించి ఎండలో రావడం అంటే తమాషానా? అందులోనూ నీ ఆరోగ్యం కూడా అంత మంచిదికాదు" అంది బాధ పడుతూ.

లలితమ్మ కోపంగా చూసింది కూతురి వైపు.

"ఈ రిక్షావాళ్ళకి బుర్ర తిరుగుడు ఎక్కువై పోయిందే. ఎంతిచ్చినా చాలదంటారు! లేకపోతే ఏమిటి గంట స్థంభంనించి యిక్కడికి రెండు రూపాయిలివ్వాలట. వాడి బాబుగాడి సొమ్ము వుంది యిక్కడ!" అంది. పోనీ యింట్లో యింకెవరన్నా బజారు కెళ్ళి కూరగాయలు అవీ తెస్తానంటే ఆవిడకి నమ్మకం చాలదు. వాళ్ళకి సరిగ్గా బేరమాడ్డం తెలీదని, తెలివి తక్కువ వాళ్ళని, వాళ్ళు ఎంతంటే అంతా యిచ్చి చెత్తరకం తెచ్చేస్తారని, డబ్బు దుబారా చేసేస్తారని ఆవిడ అనుమానం!

* * *



తాపత్రయం

నీరజకి తల్లి ధోరణి కొత్తకాదు. ఆమె రిక్షావాళ్ళతోనూ, కూరల వాళ్ళతోనూ ఎలా గీసి గీషి బేరమాడుతుందో తనకి బాగా తెల్సు! రిక్షా వాళ్ళతో పంతానికిపోయి రిక్షా ఎక్కకుండానే ఎంత దూరమైనా ఆపసోపాలు పడిపోయి ఎలా నడచుకు వస్తుందో నీరజకి బాగా అనుభవం! అసలు తల్లి మనసు అర్థం చేసుకోవడం అన్నది ఆమెకి చాలా కష్టమైన పనిగా తోస్తుంది. రిక్షావాడికి ఒక రెండు రూపాయిలిస్తే తన ఆస్తినంతా ఎవరికో ధారపోసినట్లుగా బాధపడి పోతుంది. భోజనం విషయంలోనూ అంతే. అందరికీ పప్పు వేస్తుంది. తను వేసుకోదు. ఎందుకంటే నాకు 'సహించదు' అంటుంది. కాని అమ్మ 'పొదుపు' సంగతి తనకి తెల్సు. కూర కూడా అందరికీ ఎక్కువ వేసేసి తను మాత్రం పచ్చడి వేసుకున్నంత వేసుకుంటుంది! "నాకిది చాలు. ఇంకెంత తినేస్తాం" అంటుంది పైగా. అన్నం, చారు, మజ్జిగ, ఆవకాయ ఈ నాలుగింటితోనే ప్రతీ రోజూ భోజనం అయిందని పించేస్తుంది. మజ్జిగ కూడా కొంచెం వేసుకుని ఆపైన నీళ్ళు పోసేసుకుని అన్నం కలిపేసుకుంటుంది. అదేమని అడిగితే "యిలాగే బలం" అంటుంది. ఏది బలమైన ఆహారమో తనకి తెలీదూ?! అమ్మ ఎవ్వరి మాటా వినదు. తనకి ఏది తోస్తే అదే.

"ఏంటమ్మా, ఆ తిండి? ఇలా తింటే ఏం అవుతావు? ఆరోగ్యం పాడయిపోదూ?" అంటే...

"ఇప్పుడు నాకేమైందే? నిక్షేపంలా వున్నాను." అంటుంది!

"మరి ఎందుకు దగ్గుతున్నావు? అప్పుడప్పుడు గుండెనొప్పి, కడుపులో నొప్పి అంటావు! ఇదంతా ఏమిటి?" అంటే

"ఏమిటే నీరజా! మనిషన్నాక రోగాలు రాకుండా వుంటాయా? ఆ మాత్రం దగ్గకుండా, తుమ్మకుండా ఎవరైనా వుంటారా? నువ్వు అన్నిట్లోనూ నాకు నీతులు చెప్పకు. నాకు అన్నీ తెల్సు. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందట!" అని తన మాటల్ని కొట్టిపారేస్తుంది!

ఆమెకు తల్లి ప్రవర్తనని చాదస్తం అనుకోవాలో, పిచ్చి అనుకోవాలో, పొదుపు అనుకోవాలో, పిసినారితనం అనుకోవాలో ఏమనుకోవాలో తెలీటంలేదు. వారంలో మూడు రోజులు వుపవాసం చేస్తుంది అమ్మ. ప్రతీ రోజూ తెల్లవారు ఝామున నాలుగ్గంటలకే లేచి పోయి చన్నీళ్ళతో నూతి దగ్గరే స్నానం చేసేస్తుంది. ఎంత చలికాలమైనా అంతే. జలుబు, దగ్గువున్నా, జ్వరం వున్నా అలాగే మొండిగా స్నానం చేసేసి యింటెడు పని చేస్తుంది. మరెవ్వరు చేసినా ఆవిడకి తృప్తి వుండదు. అసలు మరెవ్వరి పనీ ఆవిడకి నచ్చదు. ఏమిటో! అమ్మలో మార్పు ఎప్పుడు వస్తుందో!....

తల్లి లేవడం చూసి ఆలోచనల్లోంచి తేరుకుని తనూ లేచి వంటింట్లోకి వెళ్ళింది నీరజ.

* * * * * *

సాయంత్రం నీరజ ఆఫీసు నుండి వచ్చేసరికి లలితమ్మ ఏదో కుడుతున్నది శ్రద్ధగా.

"ఏమిటమ్మా? ఏమిటి కుడుతున్నావు?" అని అడిగింది నీరజ తల్లిని.

"శ్రీరాముల వారికి, సీతా అమ్మవారికి, లక్ష్మణ స్వామికి పట్టుబట్టలు కుడుతున్నానే. అయిపో వచ్చింది. బాగున్నాయా? చూడు." అంటూ ఒక్కొక్కటి విప్పి చూపించింది.

"రేపు శ్రీ సీతారాముల కల్యాణం! ఈ సంవత్సరం నేను దేవుడి కల్యాణం చేయిస్తున్నాను. సీతారాముల కల్యాణం చేయిస్తే నీకు కల్యాణం కలుగుతుందని...." అంటున్నదల్లా ఆపేసి కూతురి ముఖం వైపు చూసి వూరుకుంది.

"ఎన్నిసార్లు చెప్పాలమ్మా. నేను యిప్పట్నుంచి పెళ్ళి చేసుకోనని. అయినా ప్రాణంలేని రాతి బొమ్మలకి కల్యాణం ఏమిటమ్మా నీ పిచ్చిగాని! అదొక మిష పెట్టుకుని నీలాంటి వాళ్ళందరి దగ్గర బాగా లాగాలని వాళ్ళ తాపత్రయం కాకపోతే. దేవుడి కల్యాణం చేయించని వాళ్ళకి పెళ్ళిళ్ళే అవడం లేదా?! చెప్పు. నీకంతగా పుణ్యం చెయ్యాలని కోరిగ్గావుంటే ఎవరైనా పేద పిల్లకి నీ డబ్బు ఖర్చుపెట్టి పెళ్ళి చెయ్యి" ఆవేశంగా అంది నీరజ.

"తప్పు. లెంప లేసుకో ముందు. దేముడ్ని పట్టుకుని అంతంత మాట లనడానికి నీకు నోరెలా వచ్చింది? వూ! ముందు లెంప లేసుకో!"

"నేను వేసుకోను. నేనేం తప్పు చెయ్యలేదు." బింకంగా అంది నీరజ.

"ఉత్త మొండి ఘటం. దీనికి పెళ్ళెలా అవుతుందో ఏమిటో? శ్రీ రామచంద్రా! నువ్వే కాపాడాలి నా కూతుర్ని" దేవుడి పటం వైపు చూసి రెండు చేతులు జోడించి దణ్ణంపెడుతూ గొణుక్కుంది లలితమ్మ.

రిక్షావాళ్ళ దగ్గర, కూరలవాళ్ళ దగ్గర గీసి గీసీ బేరం చేసే తల్లి దేవుడి కార్యం అనేసరికి యింత దుబారాగా ఎందుకు ఖర్చు చేస్తుందో నీరజకి అర్థం కావడం లేదు. బహుశా పాప భీతో లేక పుణ్యం సంపాదించాలనే తపనో అయి వుంటుంది. సమాజంలో అమ్మలాంటి ఆడవాళ్ళు చాలామంది వుంటారు. వీళ్ళ మూఢనమ్మకాన్ని, అంధ విశ్వాసాలని దేవుని పేరు చెప్పి మరికొందరు కాష్ చేసుకుంటున్నారు హాయిగా!

"నాన్నకి పెన్షన్ వస్తుంది. అన్నయ్య డబ్బు పంపిస్తున్నాడు. నేను ఉద్యోగం చేస్తున్నాను. అదికాక అన్నయ్య నీకు వేరేగా డబ్బు పంపిస్తున్నాడు! ఎందుకో తెలుసా అమ్మా? నువ్వు నీరసంగా వున్నావని! పళ్ళు కొనుక్కుని తినమని, హార్లిక్స్, బోర్నవీటా, కాంప్లాన్ లాంటివి తాగమని. నువ్వు ఆరోగ్యంగా వుండాలని పంపిస్తున్నాడు! నువ్వేమో ఆ డబ్బంతా దేవుడు, పూజలు, రుద్రాభిషేకాలు, అర్చనలు, కల్యాణాలు, వీటికి ఖర్చు చేస్తున్నావు. వుపవాసాలు వుంటూ! అసలు నీకు బుద్ధి లేదు. నీ ఆరోగ్యం ముఖ్యమా? ఇవన్నీ ముఖ్యమా?" అందామనుకుంది, కాని అన్నా ప్రయోజనం లేదని తెల్సి వూరుకుంది.

మర్నాడు పొద్దున్నే పెరట్లోంచి తల్లికేకలు వినిపించి పెరట్లోకి వెళ్ళింది నీరజ గాభరాగా.

పని మనిషితో దెబ్బలాడుతున్నది లలితమ్మ. అది కొడుక్కి వంట్లో బాగాలేదని కిందటి నెలలో నాలుగు రోజులు పనిలోకి రాలేదు. నెలకివ్వాల్సిన ముప్పయిరూపాయల జీతంలోంచి ఆ నాలుగు రోజుల జీతం నాలుగు రూపాయలు కట్‌చేసి మిగతాది దాని చేతిలో పెట్టింది లలితమ్మ.

అది ఎంత ఏడ్చి మొత్తుకున్నా, బతిమాలినా లలితమ్మ మనసు కరగలేదు. పైగా రెచ్చిపోయి తిట్టడం మొదలెట్టింది ఆవిడ. దాంతో పాపం రంగమ్మ చేసేది లేక వెళ్ళిపోయింది.

"ఏం బాపనమ్మవి! నువ్వు పొయ్యేటప్పుడు యిదంతా పట్టుకుపోతావా? చంటాడికి వంట్లో బాగులేక నాను పన్లోకి రాలేదు. కావలిస్తే నానెవరిల్లలో పన్జేస్తున్నానో ఆల్లందర్నీ అడుగు. ఆల్లెవరూ మానాగ జీతం కోసేనేదు. నానెందుకు

'ఆవారా' ఘనత

దేశ, విదేశాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన రాజ్‌కపూర్ స్వంత చిత్రం 'ఆవారా'లో మూడు తరాలవారు నటించారట. హీరో, నిర్మాత, దర్శకుడు అయిన రాజ్‌కపూర్‌తో పాటు ఆయన తండ్రి పృధ్వీరాజ్‌కపూర్, తాత బదరీనాథ్‌కపూర్ ఆ చిత్రంలో నటించారు. రాజ్‌కపూర్ సోదరుడు శశికపూర్ కూడా ఈ చిత్రంలో బాలనటుడిగా నటించాడు. ఈ విధంగా మూడు తరాలవాళ్ళు ఒకే సినిమాలో నటించిన ఘనత కపూర్ కుటుంబానిదీ, ఆవారా చిత్రందీను.

1951లో విడుదలైన ఈ చిత్రం మనదేశంలో అత్యంత ప్రజాదరణ పొందటమే గాక సోవియెట్ యూనియన్‌లో కూడా విశేషాదరణ పొంది అక్కడ రాజ్‌కపూర్‌కు అభిమానులనెందరినో సంపాదించి పెట్టింది.



ఇద్దరు భార్యల భట్!

ఒక వ్యక్తికి యిద్దరు భార్యలుండి వాళ్లలో వాళ్లకి ఎన్ని తగవులున్నా ఆ వ్యక్తి మరొకామెతో వుంటే నొచ్చుకోవటం సహజమేమో! ఆ పరిస్థితే ఎదురైంది మహేష్ భట్‌కు. తనకున్న యిద్దరు భార్యలు కిరణ్, సోనిలు ఒక పార్టీలో కలుసుకుని హాయిగా సంభాషించుకుంటుండగా భట్ కొత్త హీరోయిన్ అను అగర్వాల్‌తో "హస్కు" కొడుతున్నాడట. కిరణ్ - సోని తమ మధ్య ఎటువంటి మనస్పర్థలున్నా భర్త మరొకరితో వుండటానికి యిష్టపడక అను అగర్వాల్‌నుంచి భట్‌ను ఎలా దూరంచేయాలా అని పథకం వేసుకుంటున్నారని బొంబాయి ఫిలిం ఫీల్డ్ టాక్!

అబద్ధం ఆడతాను!..." రంగమ్మ వెళ్ళిపోతూ మెల్లగా గొణుక్కోవడం నీరజ చెవుల్లో పడింది.

"ఒక నాలుగు రూపాయిల కోసం అమ్మ ఎంత మూర్ఖంగా ప్రవర్తిస్తోంది? ఇలా మూర్ఖంగా అమ్మలా ప్రవర్తించేవాళ్ళు యింకావున్నారా?వుండే వుంటారు! మధ్య తరగతి కుటుంబాల్లో అక్షరజ్ఞానంలేని చాలామంది ఆడవాళ్ళు యిలాగే ప్రవర్తిస్తారేమో!..." అనుకుంది బాధగా.

దేముడికోసం కుట్టిన పట్టుబట్టలు... అమ్మదేవుడి కల్యాణం కోసం పెట్టేఖర్చు... అంతా జ్ఞాపకంవచ్చింది. దేవుడు ఎక్కడున్నాడు? దేవుడు రాతి బొమ్మల్లోలేడు. మన చుట్టూ వున్న పేదల గుండెల్లో వున్నాడు! దీనుల హృదయాల్లో వున్నాడు. వళ్ళువంచి కష్టపడి రాత్రనక, పగలనక; ఎండనక పనేస్తున్న రిక్షావాడిలో వున్నాడు దేవుడు! కడుపుకి జరక్క, కన్నపిల్లల్ని ముష్టివాళ్ళని చెయ్యలేక నాలుగిళ్ళల్లో పాచి పని చేసుకుని దీనంగా, రోజులు వెళ్ళదీస్తున్న రంగమ్మలో వున్నాడు దేవుడు! వీళ్ళకి సహాయం చేస్తే దేముడు సంతోషించడా?'పెన్నీవైజ్ పౌండ్ ఫూలిష్' అన్నట్టు అమ్మలాంటి ఆడవాళ్ళు చాలామంది అజ్ఞానంలో పడి కొట్టుకుపోతూ తాము చేసేపన్లే చాలా మంచివనీ, తామే తెలివైనవాళ్ళని, యితరులు ఏమీ చేతకానివాళ్ళని అనుకుంటూ వుంటారు!దేవుడికోసం ఎంతైనా ఖర్చుపెట్టడానికి వెనుదీయని వీళ్ళు ముష్టివాడికి పదిపైసలు వెయ్యడానికి గింజుకు పోతారు! విచిత్రమైన మనస్తత్వాలు వాళ్ళవి!...

పని మనిషితో దెబ్బలాడి, దానిమీద కేకలువేసి నోరు నొప్పిపుట్టి, గుండె దడదడలాడుతూంటే వచ్చి నిస్సత్తువగా కుర్చీలో కూర్చుంది లలితమ్మ. అంతలా గొంతు చించుకు అరిచినందుకు విపరీతమైన నొప్పితో ఆమె గొంతు గరగర లాడుతోంది. పెదవులు యింకా అదురు తున్నాయి. గుండెలు వేగంగా కొట్టు కుంటున్నాయి! మాట్లాడ లేనట్టుగా చేత్తో సంజ్ఞ చేసి నీరజకి చెప్పింది మాత్ర తెమ్మని. నీరజ వంటింట్లోకెళ్ళి తల్లి మాత్రల డబ్బీ మూత తీసింది. ఏవో రకరకాల మాత్రలన్నీ వున్నాయి దాన్నిండా. అన్నీ కల్సి అదోరకమైన కంపు కొడుతున్నాయి. కొన్ని డేట్ ఎక్స్‌పైర్ అయిపోయినవి కూడా వున్నాయి! అవి కూడా భద్రంగా దాచుకుంది ఆవిడ. పారేడం అన్నది ఆవిడ డిక్షనరీలో లేదు. ఎక్కడ ఏ మాత్ర కనబడితే ఆ మాత్ర వెంటనే నోట్లో పడేసుకుంటుంది.

"అదేమిటమ్మా! ఆ మాత్ర పేరేమిటో, ఎందుకు పనికొస్తుందో చూసుకోకుండానే వేసేసుకుంటున్నావు?" అంటే—

"ఆఁ పోనీద్దూ. మాత్రలన్నీ వళ్ళు బాగవడానికేకదా తయారు చేస్తున్నారు! నా వంట్లో ఎన్నో రకాల రోగాలున్నాయి. దేనికైనా పని చెయ్యదా?" అంటుంది నిర్లక్ష్యంగా. పోనీ అమ్మకి తెలీకుండా విసిరి పారెద్దామంటే తన్నినంత పని చేస్తుంది. తనకు తెలియకుండా అలాంటి పనికిరాని మాత్రలన్నీ యింకెక్కడో దాచేసుకుని మరీ వేసుకుంటుంది! అందుకే మాట్లాడకుండా ఆ డబ్బీతెచ్చి తల్లికిచ్చేసి అయోమయంగా చూస్తూ నిల్చుంది నీరజ. తల్లిని ఏమనడానికి ధైర్యంచాలదు ఆ అమ్మాయికి. ఏమన్నా అంటే ఆవిడ తిరిగి గట్టిగా కేకలేస్తే ఆవిడ గొంతునొప్పి ఎక్కువై పోతుంది... తన మూలంగా! అందుకే వూరుకుంది. ఆ మాత్రల కయ్యే ఖర్చు రంగమ్మకివ్వాల్సిన దానికంటే ఎక్కువే! అలా గొంతుక నొప్పిపుట్టేలా, నరాలు వణికిపోయేలా, గుండెలు అదిరిపోయేలా కేకలు పెట్టడం ఎందుకు? ఆ తర్వాత డబ్బు ఖర్చుపెట్టి మాత్రలు కొనుక్కుని వేసుకోవడం ఎందుకు? అంతకోపం... అంత పంతం... ఆ వయసులో అసలు మంచిదికాదు. ఆవిడకి హై.బి.పి. కూడా వుంది!

ఆ యింట్లో లలితమ్మ మాటకి తిరుగులేదు. ఆవిడ చెప్పింది భర్త, పిల్లలు విని తీరాలి. వినకపోతే రాద్ధాంత సిద్ధాంతం చేసి పెద్ద కేకలు పెట్టేసి నీరసం తెచ్చేసుకుంటుంది. ఆ తర్వాత మాత్రలకని వీళ్ళే పరుగెత్తాలి. అందుకే ఎవ్వరూ ఆవిడ మాటలకి ఎదురు చెప్పరు. అందరూ సర్దుకుపోవడం నేర్చుకున్నారు. వాళ్ళు సర్దుకు పోతున్నారని అనుకోదు ఆవిడ. తను చేసేది 'మంచి' కాబట్టే వాళ్ళు వూరుకుంటున్నారని అనుకుంటుంది.

మరో నాలుగు రోజులకి లలితమ్మ చిన్న స్టీలు గిన్నె కనిపించడం లేదని మళ్ళీ పనిమనిషితో తగవు పెట్టుకుంది.

"స్టీలుగిన్నె నువ్వే తీసేవు. ఇంట్లో ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడికి పోతుంది. నువ్వు తియ్యకపోతే? మర్యాదగా తెచ్చి యిచ్చేయ్" అని కేక వేసింది లలితమ్మ.

"నేదమ్మా. నా నటుమంటిదాన్నిగాను. మీ యింటనే ఏమూలనో వుంటాది. సూస్కోండి. నా మాట నమ్మండి." అని రంగమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

నీరజకి చిరాకేసింది. ఏమిటి రోజు రోజుకీ అమ్మకి తాపత్రయం ఎక్కువై పోతున్నాది. వంటింటినిండా పెద్దా, చిన్నా బోలెడన్ని స్టీలు సామాన్లు వున్నాయి. వంటింట్లోకి అడుగు పెడితే చాలు అదొక స్టీలు సామాన్ల షాపులా కనబడుతుంది! అంత అందంగా, నేర్పుగా అమర్చింది స్టీలు సామాన్లని అమ్మ! లెక్కలేనన్ని గిన్నె లుండగా ఒక చిన్న స్టీలు గిన్నె, పావు లీటరు పాలు కూడా పట్టని ఆ గిన్నెమీద అంత మోజెందుకు? అది కనబడకపోతే అంత గొడవెందుకు? పని మనిషి మంచిది. పాపం దానిమీద అనవసరంగా అనుమానపడి కేకలు వెయ్యడం ఎందుకు? వళ్ళు పాడుచేసుకోవడం ఎందుకు? ఆ తర్వాత అడ్డమైన మాత్రలు మింగడం ఎందుకు?!... ఏమిటో నీరజకి తల్లి ధోరణి ఏమీ అర్థంకావడం లేదు. తల్లి చాదస్తానికి అంతూ పొంతూ లేకుండా వుంది. అడ్డమైన తిట్లూ తిట్టే పాపం అది ఏడ్చుకుంటూ వెళ్ళిపోయింది. ఆ తర్వాత నీరజ వంటిల్లంతా జాగ్రత్తగా వెతికేసరికి గ్లాసు సిలెండరు వెనకదొరికింది ఆ గిన్నె!

ఈమధ్య లలితమ్మ విపరీతంగా దగ్గుతున్నాది. పెద్ద డాక్టరుకి చూపించుకోమంటే డబ్బు దండగ. అదే తగ్గిపోతుందని మొండికేసింది. డబ్బు... డబ్బు... డబ్బు... డబ్బు దేనికి? అవసరాలకు కూడా వాడుకోకుండా అంతలా కూడబెట్టేసి ఏంచెయ్యాలని? అన్నయ్య, తను, యిద్దరు తమ్ముళ్ళు! అంతే. యింట్లో ఖర్చులు కూడా ఎక్కువ లేవు. అమ్మ అంత యిదిగా కూడబెట్టినా అది ఎవరో ఒకరు ఖర్చు పెట్టాల్సిందేగా! జీవితాంతం సుఖంగా కూర్చుని తిన్నా సరిపడేంత డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో వుంది! మరి దేనికి ఈ తాపత్రయం?! నీరజకి

సాహితీ పజిల్

గళ్ళనుడికట్టు-29

ఫలితాలు : బహుమతులు

వందలాదిమంది పాఠకులు అమిత ఉత్సాహంతో ఈ పోటీలో పాల్గొన్నారు. వారందరికీ మా అభినందనలు. అయితే సరైన సమాధానం తొమ్మిదిమంది మాత్రం పంపగలిగారు. బహుమతి మొత్తం రు. 200/- లను వీరికి పంచగా ఒక్కొక్కరికి రు. 22/-లు వచ్చాయి. ఈ బహుమతులు త్వరలో నగదు రూపంలో వారికి పంపే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పజిల్ ఒకరు ఎన్ని కూపన్లైనా పంపవచ్చు. కాని ఒక్క బహుమతికే అర్హులు. తెల్ల కాగితం మీద వ్రాసిన కూపన్‌లు చెల్లవు. మీరు పంపిన జవాబులు మా వద్ద గల సీలు వేసిన జవాబుకు సరిపోవాలి! ఎడిటర్‌దే తుది నిర్ణయం.

\- ఎడిటర్

1 శి	2 బి	■	3 కే	4 ప్ర	ము	■	5 లం	క
■	డా	■	■	హ్లా	■	■	గ	■
■	లం	■	6 వె	దు	రు	■	రు	■
7 వ	■	8 వా	■	డు	■	9 ము	■	10 పి
11 సం	జ	యు	డు	■	12 వి	దు	రు	డు
తం	■	వు	■	13 కా	■	రు	■	గు
■	14 వే	■	15 అ	ప్ప	డం	■	16 మ	■
■	డా	■	■	ర	■	■	కు	■
17 మా	ద్రి	■	18 వి	పు	ల	■	19 టం	కం

సరైన జవాబులు పంపినవారి పేర్లు

సోమవరపు శ్రీవల్లి (కొల్లూరు), రామరాజు ప్రసాద్(గుంటూరు), బి. శ్రీనివాస్ (తిమ్మసముద్రం), ఆర్. లక్ష్మీనారాయణ (గుంటూరు), కె. దశరథరామిరెడ్డి (భీమునిపట్నం), ఎ. రేవతి (హైదరాబాద్), టి. రాజేశ్వరీబాయి (పామిడి), ఎ. సాత్రాజితి (అలుదు), యు.డి. ప్రసాద్ (హైదరాబాద్).

తాపత్రయం

తల్లిమీద పీకలదాకా కోపం వచ్చింది. జగన్నాధరావుగారు భార్యని బలవంతంగా హాస్పిటల్‌కి తీసుకు వెళ్ళారు. నీరజ కూడా వెంట వెళ్ళింది. ఆవిడ్ని పూర్తిగా పరీక్ష చేసిన డాక్టరు జగన్నాధరావుగార్ని తిట్టేడు.

"ఇంత ఆలస్యం చేసేరేం? రెండు వూపిరితిత్తులు, మూత్రపిండాలు పూర్తిగా పాడయిపోయేయి! దానికితోడు యితర కాంప్లికేషన్స్ కూడా! ముఖ్యంగా హై బి. పి. ఆవిడ సర్వైవ్ అవడం కష్టం" అని చెప్పేయగానే తండ్రీ కూతుళ్ళిద్దరూ ఏడుపు ముఖం పెట్టారు. నీరజకి చెప్పలేనంత దుఃఖం ముంచుకొచ్చింది. ఎవరెంత నచ్చజెప్పినా హాస్పిటల్‌లో జాయినవను. యింటి దగ్గరే వుంటానని పట్టుబట్టింది లలితమ్మ. మందులు సరిగ్గా వేసుకోక. ఇంజక్షన్లు సరిగ్గా తీసుకోక. తిండి సరిగ్గా తినక, "నా రోగాన్ని ఆ శ్రీరామచంద్రుడే నయం చేస్తాడు!" అని తన ఆరోగ్యాన్ని మూర్ఖత్వంతో, అజ్ఞానంతో తనే పాడు చేసుకుంది. ఆరోగ్యం ఏమైపోనీ, తన పంతం నెగ్గి హాస్పిటల్‌లో జాయిన్ అవకుండా యింట్లోనే వున్నందుకు తృప్తి. లేక తన ఆరోగ్యం మాట ఎలా వున్నా, డబ్బు కదలకుండా బ్యాంకులోనే వుందన్న తృప్తో తెలీదు ఆఖరికి ఆవిడ నిశ్చింతగా కన్ను మూసింది!

నీరజకి దుఃఖం ఎంత ఆపుకుందామన్నా సాధ్యం కావడం లేదు!...

... ...

* * * * *

"నీరజా! ఏంటి తల్లీ! ఆలోచిస్తున్నావు?" అన్న ఆప్యాయమైన పిలుపుకి ఆలోచనల్లోంచి తేరుకుని కళ్ళు తెరచి చూసింది నీరజ.

"ఏంలేదు నాన్నా! అమ్మ జ్ఞాపకం వస్తుంటేనూ..." అంది దుఃఖం తన్నుకొస్తుంటే కళ్ళు తుడుచుకుంటూ.

"పిచ్చిపిల్లా! ఏడిస్తే అమ్మ వచ్చేస్తుందా? ఈ భూమ్మీద ఏదీ కూడా శాశ్వతం కాదమ్మా. ఈ యింటిని యిప్పుడు నువ్వే చక్కదిద్దాలి! వంటిల్లు చూడు. అమ్మ లేకపోతే ఎలా వెలవెలా బోతోందో! వంటిల్లంతా సర్దిపెట్టి వంట ప్రయత్నం చూడమ్మా.." అన్న తండ్రి మాటలకి భయంగా చూసింది నీరజ. ఆమె మనసులో భయంతో కూడిన ఆలోచనలు సముద్ర తరంగాల్లా వువ్వెత్తున లేస్తున్నాయి. తను మళ్ళీ... ఈ తాపత్రయంలో పడి 'అమ్మ'లా తయారవదుకదా. ఆమెకి కొత్తగా భయం పట్టుకుంది! స్టీలుగిన్నెలన్నీ, అందరికీ పంచెయ్యాలన్న పిచ్చి కోరిక ఆ క్షణంలో కలిగింది. కాని తండ్రి ముఖంలోకి చూసిన నీరజ మాట్లాడకుండా లేచింది వంటిల్లు సర్దడానికి!!

తెలుగు కళారంగ అంబ

కన్నాంబ



"ముగ్గురు కొడుకులు" చిత్రంలో...

దక్షిణాది చలన చిత్రసీమలో ఒకప్పుడు యువ నటీనటు లందరకూ ఒక మహానటి "అమ్మ"గా, ఒక మహానటుడు "నాన్న"గా పిలువ బడుతూ, గౌరవింపబడేవారు. వారిద్దరూ కన్నాంబ, నాగయ్యలు.

ఈ విషయం నాటి చిత్రసీమ లోని వారికే గాక, నాటి చిత్రాభిమానులకు కూడా తెలుసు!

నాటక రంగంలో రాటుదేరి, సినీమా రంగంలో నాయకిగా ప్రవేశించింది. స్టార్ కంబైన్స్ వారు పి. పుల్లయ్య దర్శకత్వంలో తీసిన "హరిశ్చంద్ర" (1935) చిత్రంలో చంద్రమతి పాత్రతో కన్నాంబ సినీమా ప్రేక్షకులకు పరిచయ మయింది. తొలి చిత్రంతోనే ప్రేక్ష కులను, చిత్ర నిర్మాణరథసారథు లను ఆకర్షించింది. ఎత్తైన నిండైన విగ్రహంతో పాటు స్వచ్ఛ మైన వాచకం, అంతకు మించి నవరసాలను ఒప్పించే నటనా కౌశలం ఆమెకు ఆభరణా లుగా నిలిచాయి.

కన్నాంబ పేరు గుర్తుకు రాగానే నాటి గృహలక్ష్మి (38) చండిక (40), తల్లి ప్రేమ (41), సుమతి (42), పల్నాటి యుద్ధం (47), మనోహర (54) వంటి చిత్రాలు– వాటిలో కన్నాంబ నటనా ప్రతిభ స్మృతి పథంలో మెదులుతాయి.

ఏలూరుకు చెందిన పసుపులేటి కన్నాంబ నాటక రంగంలో వివిధ పాత్రలు పోషించి మంచి పేరు సంపాదించింది. అనాడు నాటక రంగంలో పేరు పొందిన నటీనటులను సినిమా రంగం ఆహ్వానించేది. ఆ విధంగా కన్నాంబ సినీమా రంగంలో ప్రవేశించడం, వరుసగా చిత్రాలలో నటించడం జరిగింది.

కన్నాంబ సంభాషణలు పలకడంలో వాక్యాలు ఎక్కడ– ఎలా విభజించి ఉచ్చరించాలో ఈమెకు తెల్సినట్లు అందరికీ తెలీదు. గంభీరమైన కంఠం ఈమెకు ఖజానా! ఏ పాత్ర నటించినా, ఆ పాత్రకు జీవం పోసి తన వ్యక్తిత్వాన్ని మరిచి, పాత్ర రూప కల్పనకు కృషి సల్పి సజీవత్వాన్ని పాత్రకు కల్గజేసేది. అందుచేత దక్షిణాది నట లోకంలో మకుటంలేని మహారాణిగా మన్నన లందుకుంది.

అటు తమిళ చిత్రాలలోను, ఇటు తెలుగు చిత్రాలలోను ప్రధాన పాత్రలు లభించడం, ఆ చిత్రాలు విజయవంతం కావడంతో కన్నాంబ అగ్రస్థానం అలంకరించింది.

రాజరాజేశ్వరి ఫిల్మ్ కంపెనీ (1941)ని ఈమె, భర్త కడారు నాగభూషణం కలసి స్థాపించారు. ఈ సంస్థ తరఫున తొలి చిత్రం "తల్లి ప్రేమ" (41) హెచ్. ఎల్. ఎన్. సిన్హా దర్శకత్వంలో తీశారు. అది విజయవంత మైంది. కన్నాంబ నటనకు పేరు వచ్చింది. తదాదిగా సుమారు పాతిక చిత్రాలు తీశారు. "నవ జీవనం" అనే వీరి

"చండిక" చిత్రంలో...



తమిళ చిత్రానికి ప్రభుత్వం బహుమతి నిచ్చి సత్కరించింది వీరిని. వ్యక్తిగా, నటిగా ఉన్నత స్థానం పొందిన కన్నాంబ తన అభిరుచులకు అను గుణంగా పౌరాణిక, సాంఘిక చిత్రాలు తన భర్త దర్శకత్వంలో తీయడం జరిగింది. కొన్ని చిత్రాలు ఆర్థికంగా పరాజయం పొందినప్పటికీ, తమ పంథాలో మార్పు రాలేదు.

1935 నుంచి 1964 వరకు మూడు దశాబ్దాల పాటు తెలుగు, తమిళ ప్రముఖ దర్శకుల చిత్రాలలో ప్రధాన పాత్రలు పోషించింది.

* * * * * *

కన్నాంబ ఏలూరులో ఉన్నప్పుడు నాటకరంగ ప్రవేశం సల్పింది. చంద్రమతి, సావిత్రి, ప్రభావతి, లీలావతి, దేవకి వంటి శోకరస ప్రధాన పాత్రలు నటించి ఎంతో కీర్తి గడించింది. ఎందరో నాటి ప్రముఖ నటులతో నటించి ధీటుగా నిలబడ గల్గింది.

తర్వాత విజయవాడ మకాం మార్చడం, కళాభిమాని కడారు నాగభూషణం గారి సహచర్యం లభించడంతో ఆమె జీవితంలో మార్పు సంభవించింది. ఇద్దరూ తర్వాత భార్యాభర్త లయ్యారు. వీరిరువురూ కలసి "శ్రీ రాజరాజేశ్వరీ నాట్య మండలి" అనే సంస్థ నెలకొల్పి ఒక దశాబ్దం పాటు యావదాంధ్ర దేశంలో తమ నాటకాలు ప్రదర్శించేరు. పేరు— పైసా పుష్కలంగా సంపాదించారు.

కన్నాంబ ఖ్యాతి విన్న గ్రామ్‌ఫోన్ కంపెనీ వాళ్ళు ఆమెచేత కొన్ని భక్తి గీతాలు రికార్డింగ్ చేయించారు. కొన్ని నాటకాలు రికార్డు చేశారు...

ఇంతగా ప్రసిద్ధి పొందిన కన్నాంబపై సినిమా వాళ్ళ దృష్టి పడడంలో ఆశ్చర్యం లేదు. 'హరిశ్చంద్ర'లో చంద్రమతిగా రాణించడముతో సరస్వతీ టాకీసు వారి "ద్రౌపదీవస్త్రాపహరణం"లో ద్రౌపది పాత్ర నటించే అవకాశం లభించింది. ఆ తర్వాత ఆమె కనకతార (37), గృహలక్ష్మి (38), చండిక (40), భోజ కాళిదాసు (40),

కన్నాంబ

తల్లిప్రేమ (41), సతీ సుమతి (42), మాయాలోకం (45), మాయా మచ్చీంద్ర (45), పాదుకా పట్టాభిషేకం (45), ముగ్గురు మరాటీలు (46), పల్నాటి యుద్ధం (47), సౌదామిని (51), ముగ్గురు కొడుకులు (52), పేద రైతు (52), లక్ష్మి (53), మనోహర (54), సతీ సక్కుబాయి (54), అనార్కలి (55), వదిన (55), నాగ పంచమి (56), చరణదాసి (56), తోడి కోడళ్ళు (57), సతీ సావిత్రి (57) కుటుంబ



"సౌదామిని" చిత్రంలో...

గౌరవం (57), ఆడ పెత్తనం (58), కార్తవరాయుని కథ (58), కృష్ణమాయ (58), మాంగల్య బలం (59), వీర భాస్కరుడు (59), రాజమకుటం (60), జల్సారాయుడు (60), ఉషాపరిణయం (61), జగదేక వీరుని కథ (61), కలసి వుంటే కలదు సుఖం (61), దక్షయజ్ఞం (62), స్వర్ణ మంజరి (62) ఆత్మ బంధువు (62), లవకుశ (63), ఆప్త మిత్రులు (63), రామదాసు (64) మొదలగు చిత్రాల్లో నటించి తన నటనా కౌశలాన్ని అగపర్చింది. అలాగే ఆర్. ఎస్. ప్రకాష్ ప్రోత్సాహంతో తమిళం బాగా నేర్చుకొని నూరు తమిళ చిత్రాల్లో నటించింది! ఆమె తొలి తమిళ చిత్రం "కృష్ణం తూ తూ" ఆ తర్వాత అశోక్ కుమార్, కణ్ణగి చిత్రాలలో నటించి అఖండ కీర్తి గాంచింది.

జెమినీ వారి "అవ్వయ్యార్" చిత్రానికి తెలుగు వ్యాఖ్యానం చెప్పింది. తెలుగు, తమిళం కలుపుకొని మొత్తం 200 చిత్రాలు వరకు నటించింది. కన్నాంబ నిత్యమూ రాజరాజేశ్వరీ దేవి పూజ సల్పిన తర్వాతే దైనందిన కార్యక్రమాలు ఆరంభించేది.

మరణించే నాటికి భరణీ వారి "వివాహ బంధం", "రామదాసు", కొన్ని తమిళ చిత్రాల్లో పాత్రధారణ పూర్తి చేయలేక పోయింది.

తే 20-9-1912 న కడపలో జన్మించి, ఏలూరులో నివాసం ఏర్పర్చుకొని, విజయవాడలో బంధం ఏర్పర్చు కొని, మద్రాసులో కన్నాంబ పాంచ భౌతిక దేహాన్ని తే7-5-1964 న విసర్జిం చింది. ఆనాడు కన్నాంబ దేహాన్ని మట్టిలో ఖననం చేస్తున్నప్పుడు వేలాది మంది అభిమానులు, ఆత్మీయులు అశ్రు తర్పణం చేశారు.

అయితే సుమారు ముప్ఫై ఏళ్లపాటు తోడు— నీడగా జీవించిన భర్త కడారు నాగభూషణంకి కన్నాంబ మరణం అన్ని విధాల కృంగ దీసింది. మాయా మర్మ మెరుగని నాగభూషణంకి కన్నాంబ పేరున వున్న ఎటువంటి ఆస్తులు ఆయనకు దక్కకుండా కొందరు స్వార్థపరులు తమ తమ పేర ఆస్తులు అంతిమ ఘడియల్లో రాయించు కున్నారట. అక్కినేని సహాయంతో కొన్నాళ్ళు నాగభూషణం జీవించారు.

కన్నాంబ చిత్రాలు చూచిన వారికి ఆమె ప్రజ్ఞ తెలుసు! చూడని ఈ తరం వారు ఎప్పుడైనా ఆ ఊరి థియేటర్‌లో ప్రదర్శిస్తే— చూస్తే గమనించ గలరు. అంతటి మహోన్నత నటీమణిని కళాభిమానులు స్మరించడం కనీస ధర్మం.

— ఆరిపాక సూరిబాబు

సీరియల్

హాట్‌ట్విన్స్



జి.వి.అమరేశ్వరరావు

రజని జగదాంబా నగర్ ప్రారంభంలో ఉన్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ ముందు వ్యాన్ గార్డ్ ఆపింది.

శివాజీ రివాల్వర్ బ్యారెల్ కురియన్ డొక్కలో గుచ్చిపట్టాడు. కారు డోర్ తెరిచి కురియన్‌ను క్రిందికి దింపాడు. ఇప్పుడు శివాజీ చేతికి గ్లౌజస్ మెరుస్తున్నాయి.

కురియన్ శివాజీ వంక భయంగా చూశాడు.

"నిన్నేమీ నడిరోడ్డు మీద చంపనుగా అలా భయంగా చూడకు. ముందు పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోకి పద" అంటూ కురియన్‌ను ముందుకు తోశాడు.

కురియన్ టెలిఫోన్ బూత్ వైపు నడిచాడు.

శివాజీ చాలా జాగ్రత్తగా రివాల్వర్ పట్టుకోవడంతో అది రోడ్డు మీద పోయే వాళ్ళకు కనపడటం లేదు.

"నువ్విపుడు ఎర్రతేలుకు ఫోన్ చెయ్. అర్జంటుగా నిన్ను వచ్చి కలవమని చెప్పు. కారణం అడిగితే వచ్చిన తర్వాత చెప్తాను అని చెప్పు.... ఎర్రతేలుకు ఫోన్ ఉందా?"

"లేదు ఎర్రతేలును పిలవమంటే అతడుండే ఇంటిపక్క షాపు వాళ్ళు పిలుస్తారు."

"వెరీగుడ్ ముందు ఎర్రతేలుకు ఫోన్‌చెయ్... నేన్నిన్ను చంపనని అభయం ఇచ్చాగదా."

శివాజీ కురియన్ భుజం మీద ఫర్వాలేదులే అన్నట్టు తట్టాడు.

కురియన్- ఎర్రతేలు ఇంటి ప్రక్క నుండే మెడికల్ షాపు నెంబర్ డయల్ చేశాడు.

అవతల్నుంచి రెస్పాన్స్ రాగానే అడిగాడు "అర్జంటుగా ఎర్రతేలుతో మాట్లాడాలి. నా పేరు కురియన్."

అయిదు నిమిషాల తర్వాత ఎర్రతేలు లైన్‌లోకి వచ్చాడు. పీకలదాకా మందు కొట్టిన గుర్తుగా అతడిగొంతు బరువుగా, మత్తుగా ఉంది.

"ఏంటి గురూ! హటాత్తుగా ఫోన్ చేశావ్. మన

(గత సంచిక తరువాయి)

బాస్ ఊళ్ళో లేడుగదా అని మజా చేసుకుంటుంటే.... మధ్యలో డిస్ట్రబెన్సు చేసేశావ్."

"నీతో అర్జంటుగా మాట్లాడాలి ఫోన్‌లో మాట్లాడడం కుదరదు. చాలా సీక్రెట్ వ్యవహారం. నువ్వు జగదాంబా నగర్ వచ్చెయ్."

"ఏంటి? నువ్విపుడు నీ గర్ల్‌ఫ్రెండ్ సుందరమ్మ దగ్గిర్నుంచి కాదా మాట్లాడేది."

"కాదు. జగదాంబా నగర్ నుంచి మాట్లాడుతున్నా... నువ్వు వెంటనే ఆటోలో బయల్దేరి వచ్చెయ్."

"ఓ కే."

అవతల్నుంచి రిసీవర్ పెట్టేసిన శబ్దం వినపడింది. శివాజీ కురియన్ చేతిలోని రిసీవర్ తీసుకుని హుక్ మీద ఉంచాడు.

రివాల్వర్ అతడి డొక్కలో మరింత గట్టిగా ప్రెస్ చేస్తూ అన్నాడు.

"ఇపుడు మన ఇంటికి వెడుతున్నాం.... అన్నట్టు నల్లముత్తు ఏ నెంబర్‌లో దొరుకుతాడు?"

కురియన్ నల్లముత్తు ఏ నెంబర్ ఫోన్‌లో దొరుకుతాడో చెప్పాడు.

"నేను నిన్ను చంపను. నిన్ను ఎర్రతేలు చంపుతాడు" అన్న శివాజీ మాటలు కురియన్‌కు గుర్తున్నాయి. ఎర్రతేలు తన మీద ఈగవాలినా ఊరుకోడు. కనక తనకు చావు భయం లేదు.

ఈ ఆలోచన రాగానే కురియన్ మనస్సు దూది పింజలా తేలికపడింది.

శివాజీ, కురియన్ బ్యాక్‌సీట్స్ ఆక్రమించారు.

రజని వ్యాన్ గార్డ్‌ను ముందుకు దూకించింది.

"పదమూడో నెంబర్ ఇంటిముందు కారు ఆపు" శివాజీ చెప్పాడు.

రజని తల ఊపింది.

కురియన్ ఆ మాట వింటూనే ఆశ్చర్య పోయాడు.

వీడు తన ఇంటి నెంబర్ కూడా కనుక్కున్నాడన్నమాట అనుకున్నాడు మనస్సులో.

శివాజీ డోర్ తెరిచి కురియన్‌ను ముందుకు తోశాడు.

కురియన్ దిగిన తర్వాత అన్నాడు "నీ దగ్గర ఇంటి తాళం చెవి ఉందా?"

కురియన్ లేదన్నట్టు తల ఊపాడు.

వెంటనే శివాజీ చాలా వైల్డ్‌గా రియాక్ట్ అయాడు. కురియన్ పొట్టలో బలంగా బూటు కాలితో తన్ను తున్నాడు. కురియన్ కడుపు పట్టుకుని వెల్లకిలా పడిపోయాడు.


జరుగుతున్న సంఘటన చూసిన చుట్టు పక్కల వాళ్ళు తలుపులు వేసుకున్నారు. షాపుల వాళ్ళు షట్టర్లు దించేశారు. తోపుడు బళ్ళమీద కూరగాయలు, ఉల్లిపాయలు, అరటిపళ్ళు అమ్ముకుంటున్న వాళ్ళు తమ బళ్ళను తోసుకుంటూ అక్కడ్నించి ఉడాయించేశారు.


శివాజీ కురియన్ ప్యాంటు జేబునుంచి ఒకతాళం చెవి తీశాడు. దాన్ని కురియన్ ముఖం ముందు ఆడిస్తూ చెప్పాడు.

"లే... లేచి నిలబడు.... గది తాళం తియ్."

కురియన్ తల ఊపాడు. అతడికి శివాజీని ఎక్కడికక్కడ నిర్దాక్షిణ్యంగా ముక్కలు

ఇంతవరకూ సాగిన కథ-*12:* మారుపేర్లతో మోసాలకు అలవాటుపడి వచ్చిన దాంట్లో సమంగా పంచుకుంటూ కాలం గడుపుతుంటారు శివాజీ, రజని. మోహిని మోజులో పడిన కాళీప్రసాద్ తన భార్య పార్వతిని కురియన్, నల్లముత్తు, ఎర్రతేలుల ద్వారా హత్య చేయిస్తాడు. ఆ హత్యను కళ్ళారా చూసిన శివాజీ తల్లిదండ్రులను, చెల్లిని కురియన్ బృందం చంపేస్తారు. ఇది తెలిసిన శివాజీ కురియన్‌ను చితకబాది ఎర్రతేలు ఉండే ప్రదేశానికి తీసుకువెళ్తాడు.





హిట్‌లిస్ట్

ముక్కలుగా నరికి పారేయాలని ఉంది. కాని శివాజీ చేతిలో ఉన్న రివాల్వర్ అతడిని కంట్రోలు చేస్తోంది.

కురియన్ లేచి నిలబడి శివాజీ అందించిన తాళం చెవితో గుమ్మం వైపు నడిచాడు. అతడు తలుపు తెరిచిన తర్వాత శివాజీ రజనితో అన్నాడు నువ్వు లోపలకు రావలసిన పనిలేదు. బయట కార్లో వెయిట్ చేస్తూ ఉండు.

రజని తలఊపి వ్యాన్‌గార్డ్ రివర్స్ చేసి తిరిగి మెయిన్‌రోడ్ వైపు వెళ్ళడానికి వీలుగా టర్న్ తీసుకుని రెడీగా వుంచుకుంది.

ముందు కురియన్ ఆ తర్వాత శివాజీ లోపలికి వెళ్ళారు. శివాజీ తలుపు దగ్గరగా వేసి రివాల్వర్ జేబులో పెట్టుకున్నాడు.

శివాజీ జేబులోకి రివాల్వర్ తోయగానే కురియన్ ముందుకు అడుగు వేశాడు. అతడి ఉద్దేశం గ్రహించిన శివాజీ కురియన్ గుండెలమీద బలంగా తన్నాడు. ఆ విసురుకు కురియన్ వేగంగా వెళ్ళి కుర్చీలో కూలబడ్డాడు.

“దొంగనాయాల నన్ను అంత తేలిగ్గా అంచనా వేయకు” అని తిడుతూ శివాజీ కురియన్‌ను ఛాతీమీద కాలితో నొక్కిపట్టాడు. ఇరుకుగా ఉన్న కుర్చీలో కూర్చున్న కురియన్ ఊపిరి అందక అవస్థ పడ్డాడు.

శివాజీ జేబు నుంచి నైలాన్ తాడు తీసి కురియన్ కాళ్ళు చేతులూ బంధించాడు. కాళ్ళూ చేతులను కట్టగా మిగిలిన తాడు గదిలో పడి ఉన్న చాకు సహాయంతో తెంపేశాడు.

కురియన్ యిక ఒక అంగుళం కూడా కుర్చీలోంచి కదల్లేడు. శివాజీకి ఒక మూల దండేనికి వేలాడుతున్న కురియన్ దుస్తులు ఆకర్షించాయి. వాటిల్లోంచి ఒక చొక్కా పైకి తీసి దాన్ని చాకు సహాయంతో పీలికలుగా చింపాడు. ఆ పీలికల్లో కొన్ని ఉండగా చుట్టాడు. కురియన్ నోరు బలంగా తెరిచాడు. బంతిలా చుట్టిన గుడ్డపీలికల ఉండను అతడి నోట్లో కుక్కాడు. రిబ్బన్‌లా పొడుగ్గా ఉన్న ఒక గుడ్డముక్కతో అతడి నోటిని బలంగా కట్టేశాడు.

ఇపుడు చనిపోయేముందు కురియన్ ఆర్తనాదం చేయడానికి కూడా అవకాశం లేదు.

శివాజీ చేతిగడియారం వంక చూసుకున్నాడు. ఎర్రతేలుని రమ్మనమని ఫోన్ చేసి పావుగంట అయ్యింది. మరో పావుగంటలో అతడు యిక్కడ ఉంటాడు.

శివాజీ దృష్టి కిటికీ ముందున్న చెక్కటేబుల్ మీద పడింది. దాన్ని జరుపుకుంటూ తెచ్చి కురియన్ ఎదురుగ్గా ఉంచాడు. తర్వాత ఆలోచిస్తూ గదిఅంతా వెదికాడు. కాని అక్కడ అతడికి కావలసిన వస్తువు కనపడలేదు.

శివాజీ వెనుక వైపు తలుపు తెరిచి దొడ్లోకి వెళ్ళాడు.

అక్కడ కుప్పగా పోసి ఉన్నాయి సిమెంట్‌తో తయారయిన ఇటికరాళ్ళు.

శివాజీ వాటిల్లో కొన్ని ఇటుకలు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు. మధ్యలో కాస్తంత ఎడం ఉండేట్టుగా రెండు ఇటికరాళ్ళను పక్కపక్కనే అమర్చాడు. జేబు నుండి రివాల్వర్ బయటకు తీశాడు. దాని ట్రిగ్గర్‌కు నైలాన్‌తాడు కట్టాడు. రివాల్వర్ కున్న సేఫ్టీ క్యాచ్ రిలీజ్ చేశాడు. ట్రిగ్గర్‌కు కట్టిన నైలాన్ తాడు వెనక్కు లాగాడు. తాడుతోపాటు ట్రిగ్గర్ కూడా కదిలింది. తాడు మరికాస్త లాగితే రివాల్వర్ పేలిపోతుంది. నైలాన్ తాడు చివరి భాగాన్ని వీధి తలుపు కున్న గడియకు కట్టాడు.

ఆ ఇంటి తలుపులు బయటి వైపుకు తెరుచుకునే విధంగా ఉండడంతో శివాజీ పని సులువయ్యింది. ట్రిగ్గర్‌కూ, తలుపు గొళ్ళేనికి కట్టిన నైలాన్ తాడు ముడి గట్టిగా ఉందేమో పరిశీలించిన తర్వాత రివాల్వర్ టేబుల్ మీద ఉన్న సిమెంట్ ఇటికల మధ్య అమర్చాడు. పెద్ద సైజులో ఉన్న ఆ ఇటికరాళ్ళు చాలా బరువుగా ఉన్నాయి. పెద్ద సైజులో బరువుగా ఉన్న ఆ ఇటికరాళ్ళ మధ్య రివాల్వర్ అణుమాత్రమయినా కదలకుండా సరిగ్గా ఇమిడిపోయింది. దాని బ్యారెల్ కుర్చీలో కదలకుండా బంధింపబడి ఉన్న కురియన్ వైపు చూస్తోంది. దాని ట్రిగ్గర్‌కు మూసిఉన్న వీధి గుమ్మాన్ని నైలాన్‌తాడు కలుపుతోంది. బయట్నుంచి కనక ఎవరైనా తలుపు లాగిన పక్షంలో నైలాన్‌తాడు కదిలి ట్రిగ్గర్ వెనక్కు జరిగి బుల్లెట్ రిలీజ్ అవుతుంది.

కురియన్‌కు శివాజీ పథకం అర్థం అయ్యింది. తనచేత శివాజీ ఎర్ర తేలుకు ఎందుకు ఫోన్ చేయించాడో కూడా ఊహించ గలిగాడు. మరి కాసేపట్లో ఎర్రతేలు వస్తాడు. దగ్గిరగా వేసివున్న తలుపు తెరిచే ప్రయత్నంలో లాగుతాడు. మరుక్షణం రివాల్వర్ పేలుతుంది. తను కుక్క చావు ఛస్తాడు

కురియన్ భయంగా శివాజీవంక చూశాడు.

శివాజీ అతడి ముఖంలో ముఖం పెట్టి చెప్పసాగాడు.

“చూడూ. నువ్వు ఇదేవిధంగా కుర్చీలో కాళ్ళు చేతులు నోరు బంధించి ఉన్న పార్వతిని ఏమాత్రం కనికరం లేకుండా చంపేశావ్. నీకు ఇపుడు అదేగతి పట్టబోతోంది.”

శివాజీ చేతి గడియారం వంకే చూసుకుని చెప్పడం కొనసాగించాడు.

“ఖచ్చితంగా మరో అయిదు నిమిషాల్లో ఎర్రతేలు ఇక్కడికి వస్తాడు. బయట్నుంచి నిన్ను పిలుస్తాడు. నువ్వు పలక్క పోవడంతో దగ్గరికి వేసి ఉన్న తలుపు లాగుతాడు. దాంతో నీ చావు మూడుతుంది. తాను చనిపోతున్నానని తెలిసి పార్వతి ఎంత నిస్సహాయంగా వుండి పోయిందో. మా అమ్మా, నాన్నా, చెల్లెలు ఎంత ఘోరంగా మరణించారో నువ్వూ అంతే ఘోరంగా చావబోతున్నావ్.”

చెప్పడం పూర్తి అయిన తర్వాత శివాజీ దొడ్డి గుమ్మం గుండా బయటకు వెళ్ళి, వ్యాన్‌గార్డ్‌లో కూర్చుని ఎదురు చూస్తున్న రజనిని కలిశాడు. శివాజీ ప్రక్కసీటులో కూర్చోగానే రజని కారు

ముందుకు దూకించింది. మెయిన్ రోడ్ మీదికి, రాగానే శివాజీ చెప్పడంతో రజని కారు ఒక పక్కగా పార్క్ చేసింది.


ఇద్దరూ మరో కొద్ది నిమిషాల్లో రాబోయే ఎత్తేలు కోసం ఎదురు చూడసాగారు.

* * * * * *

బేగంపేట ఎయిర్ పోర్ట్ –

కాశీప్రసాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఆఫీస్‌కు ఫోన్ చేశాడు. డ్రైవర్ శ్రీనివాస్ కారు తీసుకు వచ్చాడు. ఆయన నేరుగా టెలిఫోన్స్ జి. యం.ని కలిసి ఇక అబ్జర్వేషన్ అవసరం లేదనీ, తన భార్యను తీవ్రవాదులు చంపేశారనీ, అప్పటివరకూ రికార్డయిన క్యాసెట్ కనక యిస్తే దాన్ని పోలీసులకు హ్యాండోవర్ చేస్తాననీ అన్నాడు.

భార్య చనిపోయినందుకు కాశీప్రసాద్‌కు టెలిఫోన్స్ జి.యం. తన గాఢ సంతాపాన్ని తెలియజేశాడు. తర్వాత కాలింగ్ బెల్ నొక్కాడు. లోపలకు



వచ్చిన బాయ్‌తో చెప్పాడు.

"రంగారావ్‌ను నేను రమ్మన్నానని చెప్పు."

బోయ్ బయటకు వెళ్ళిపోయాడు.

రంగారావు లోపలకు వచ్చాడు.

జి. యం. అతడికి కాశీప్రసాద్‌ను పరిచయం [illegible]

"వీరి పేరు కాశీప్రసాద్. వీరిఫోన్ అబ్జర్వేషన్‌లో ఉంది. ఇప్పటివరకూ ఆయనకు వచ్చిన ఫోన్‌కాల్స్ రికార్డు అయిన క్యాసెట్, అబ్జర్వేషన్ రిపోర్ట్సు పత్రా."

రంగారావ్ బయటకు నడిచాడు.

పది నిమిషాల తర్వాత ఒక ఆడియో క్యాసెట్, దాంతో పాటు ఒక టైప్ చేసిన కాగితం కాశీప్రసాద్‌కు అందించాడు. జి. యం. వైపు తిరిగి అడిగాడు.

"ఇక కాశీప్రసాద్ గారి ఫోన్ అబ్జర్వేషన్‌నుండి తీసేయ మంటారా?"

జి. యం. తల ఊపి చెప్పాడు.

"అవును. అబ్జర్వేషన్ క్యాన్సిల్ చేయమని కాశీప్రసాద్ గారు అడుగు తున్నట్టు ఒక లెటర్ టైపు చేసి పత్రా."

రంగారావ్ సరే అన్నట్టు తల ఆడించి బయటకు నడిచాడు.

"ఈ క్యాసెట్, అసలు హంతకులను పట్టుకోవడానికి బాగా ఉపకరిస్తుంది" కాశీప్రసాద్ అన్నాడు.

"అంతేకాదు ఇపుడు మీ చేతిలో ఉన్న కాగితంలో ఏ ఫోన్ ఎక్కడ్నించి ఎన్ని గంటలకు మీకు వచ్చిందో కూడా వివరంగా వ్రాసి ఉంది. కాబట్టి ఈ కాగితం కూడా మీకు ఉపకరిస్తుంది."

కాశీప్రసాద్ తల ఊపాడు.

రంగారావ్ టైపు చేసిన ఒక కాగితం తెచ్చి కాశీప్రసాద్ ముందు ఉంచాడు. అది ఇక నుంచి తన ఫోన్ అబ్జర్వేషన్‌లో ఉండనవసరం లేదంటూ కాశీప్రసాద్ పెట్టుకున్న దరఖాస్తు. రంగారావ్ చూపించిన చోట కాశీప్రసాద్ సంతకం చేశాడు.

కాశీప్రసాద్ జి. యం.కి థాంక్స్ చెప్పి బయటకు

హిట్‌లిస్ట్

నడిచాడు. ఈసారి అతడు నేరుగా ఇంటికి వెళ్ళలేదు. పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి, ఇన్స్‌పెక్టర్ రాం శరణ్‌ని కలిశాడు.

కాశీప్రసాద్ వెళ్ళిన సమయానికి ఇన్స్‌పెక్టర్ రాంశరణ్ స్టేషన్‌లోనే ఉన్నాడు. కాశీప్రసాద్ కారు స్టేషన్ ముందు ఆగింది. అతడిని చూడగానే ఒక కానిస్టేబుల్ కంగారుగా లోపలకు పరుగు తీశాడు. రాంశరణ్‌తో కాశీప్రసాద్ వస్తున్నట్టు చెప్పాడు.

లోపలికి వచ్చిన కాశీప్రసాద్ సాధ్యమయినంత విచారంగా ముఖం పెట్టాడు. దుఃఖంతో గొంతు పూడుకు పోయినట్టు మాట్లాడసాగాడు.

"నా పేరు కాశీప్రసాద్. చనిపోయిన పార్వతి నా భార్య. నేను బాంబేలో ఉండగా ఈ ఘోరం జరిగింది."

కాశీప్రసాద్ కర్చీఫ్‌తో ముక్కు తుడుచుకుని చెప్పసాగాడు.

"అసలు నాకు కొద్ది రోజుల క్రితం నుంచీ ఎవరో తీవ్రవాదులు ఫోన్ చేయసాగారు. నన్నూ నా భార్యనూ చంపుతాం అని బెదిరించడం మొదలు పెట్టారు. వెంటనే నేను టెలిఫోన్స్ జి. యం.తో మాట్లాడి మా ఫోన్‌ని అబ్జర్వేషన్‌లో పెట్టాను. తర్వాత ఈ బెదిరింపులు అలా నడుస్తూనే ఉండగా బాంబే నుంచి ఒక రోజున ఫోన్ వచ్చింది. మా చెల్లెలు బాంబేలో ఉంటోంది. ఆమెకు ఆరోగ్యం బాగోలేదనీ ఆ ఫోన్ సారాంశం. నేను బాంబే వెళ్ళాను. కాని ఆ ఫోన్ అబద్ధం అని తెలిసింది. కాని బాంబేలో నా ఆరోగ్యం బాగుండక పోవడంతో అక్కడే ఉండి పోయాను. ఈ లోపు నా భార్య హత్య గురించి పేపర్లలో పడడంతో అసలు విషయం తెలుసుకుని ఇక్కడికి వచ్చేశాను. వస్తూ వస్తూ దారిలో టెలిఫోన్స్ జి. యం. గారిని కలిశాను. ఇక టెలిఫోన్ అబ్జర్వేషన్‌లో ఉంచ వద్దని చెప్పాను. మా ఫోన్ అబ్జర్వేషన్‌లో ఉన్నప్పుడు వచ్చిన ఫోన్‌కాల్స్ ఈ క్యాసెట్‌లో రికార్డు అయ్యాయి. ఏ ఫోన్ ఏ సమయానికి ఎక్కడ్నించి వచ్చిందో ఈ కాగితంలో రాసి ఉన్నాయి."

కాశీప్రసాద్ క్యాసెట్టు, టెలిఫోన్ కాల్స్ గురించి డిటైల్డ్‌గా రాసి ఉన్న కాగితం రాంశరణ్‌కు అందించాడు.

రాంశరణ్ వాటిని అందుకుంటూ అడిగాడు.

"అసలు మీకు బెదిరింపు ఫోన్స్ రావడం ప్రారంభం అవగానే మాకు ఎందుకు ఫోన్ చేయలేదు."

"అదేదో ఆకతాయి తనానికి చేస్తున్న ఫోన్‌కాల్స్ అనుకున్నాను."

"మరి బాంబేలో ఉన్న మీ చెల్లెలికి బాగోలేదని ఫోన్ వచ్చిందే దాంతో మీరు బాంబే వెళ్ళారు. కాని అక్కడ మీ చెల్లెలు నిక్షేపంలా ఉంది. అపుడు కూడా మీకు అనుమానం రాలేదా?"

"లేదు... నేను బాంబే వెళ్ళిన రోజు ఏప్రిల్ ఫస్ట్. ఎవరన్నా నన్ను ఫూల్ చేయడానికే అలా ఫోన్ చేశారేమో అనుకున్నాను. తీరా బాంబే వెళ్ళిన తర్వాత మా చెల్లెలు మీరు చెప్పినట్టు నిక్షేపంలా ఉంది. కాని నాకు బి.పి. పెరిగి పోవడంతో అక్కడే ఉండిపోవలసి వచ్చింది. ఈ లోపు ఈ ఘోరం జరిగి పోయింది."

కాశీప్రసాద్ కళ్ళు వత్తుకున్నాడు. ముక్కు చీదాడు.

"మనం ముందు ఈ క్యాసెట్ వినాలి. కాని నాదగ్గిర టేప్ రికార్డర్ లేదే..." అన్నాడు రాంశరణ్.

"ఫరవాలేదు. నా కార్లో టేప్ రికార్డర్ ఉంది. విందాం పదండి."

రాంశరణ్ తల ఊపాడు.

వెంటనే కాశీప్రసాద్, రాంశరణ్ మరొక కానిస్టేబుల్ బయటికి నడిచారు.

కార్లో కూర్చున్న తర్వాత రాంశరణ్ టేప్ రికార్డర్‌లో క్యాసెట్ ఇన్‌సర్ట్ చేసి ప్లే బటన్ నొక్కాడు.

కాని క్యాసెట్‌లో కదలిక లేదు.

కాశీప్రసాద్ ఇగ్నిషన్ కీ ప్రక్కకి త్రిప్పగానే టేప్ రికార్డర్ పని చేయ సాగింది.

క్యాసెట్‌లో నుంచి మాటలు మెల్లిగా వినపడసాగాయి. కాశీప్రసాద్ వాల్యూం పెంచాడు.

"హలో" కాశీప్రసాద్ కంఠం వినపడింది.

బదులుగా... ఈహ్హాహ్హాహ్హా... ఈహ్హాహ్హాహ్హా... అతి భయంకరమైన నవ్వు.


అది కురియన్ నవ్విన నవ్వు.

"ఎవరు మీరు. ఏం కావాలి... చెప్పండి. ఎవరు మీరు... మీకేం కావాలి?"

రాంశరణ్ కాశీప్రసాద్ గొంతు గుర్తుపట్టాడు.

"ఏం కావాలో చెప్తాంరా బద్మాష్. నీలాంటి లోఫర్ వెధవలకు డాఫర్ వెధవలకు బుద్ధి రావడానికే మేం రంగంలోకి దిగాంరా వెర్రి పీనుగా... నీ పాపం పండిందిరా దొంగ బాధకవ్. నీ యవ్వ నీ పేగులు పీకి మెడలో వేసుకుంటాంరా గాడిద కొడకా."

ఎవరో నోటికి అడ్డంగా గొంతు గుర్తించేందుకు వీలు లేకుండా సన్నటి ఉలిపిరి కాగితం పెట్టుకుని మాట్లాడుతున్న విషయం రాంశరణ్‌కు అర్థం



అయ్యింది. రాంశరణ్ టేప్ పూర్తిగా విన్నాడు. ఏనే సమయంలో అర చేతిలో ఉన్న కీ షీట్‌లో ఉన్న వివరాలను పోల్చి చూసుకుంటూ సందేహం వచ్చినపుడు కాశీప్రసాద్‌ను అడిగి తెలుసుకుంటున్నాడు.

క్యాసెట్‌లో చిట్టచివరగా వినపడింది ఒక మగ గొంతు.

ఆ గొంతు "అక్కడ కాశీప్రసాద్ ఉన్నాడా?" అని అడిగింది.

కారు బయట నిలబడి, విండో లోంచి లోపలకు తలపెట్టి వింటున్న ఒక కానిస్టేబుల్ ఉలిక్కిపడి చెప్పాడు.

"సార్! ఆ గొంతు నాకు బాగా గుర్తు. ఆ గొంతు పిక్‌పాకెటర్ శివాజీది."

ఆ మాట వినగానే రాంశరణ్, తన దగ్గరున్న క్యాసెట్‌లో ఉన్న చిట్టచివరి ఫోన్‌కాల్‌కు సంబంధించిన పర్టిక్యులర్స్ చూశాడు.

అర్ధరాత్రి తర్వాత చేసిన ఆ ఫోన్ అంబర్‌పేట పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి వచ్చింది.

"శివాజీ ఇల్లు అంబర్‌పేటలోనే కదా ఉంది" రాంశరణ్ అడిగాడు.

"అవును సార్ పబ్లిక్ టెలిఫోన్ బూత్‌కు మూడు నాలుగు వందల గజాల దూరంలోనే అతడి ఇల్లు ఉంది" కానిస్టేబుల్ చెప్పాడు.

రాంశరణ్ తల ఊపాడు.

ఆ విధంగా శివాజీని నేరస్తుడిగా నిరూపిస్తూ మరొక సాక్ష్యం కూడా వచ్చి చేరింది.

* * * * * *

జగదాంబనగర్ కాలనీ ముందు మెయిన్‌రోడ్ ప్రక్కగా పార్క్ చేసి ఉంది వ్యాన్‌గార్డ్ కారు. దాని ఫ్రంట్ సీట్స్‌లో కూర్చుని ఉన్న రజని, శివాజీలకు చాలా అసహనంగా ఉంది. వాళ్ళ అంచనా ప్రకారం ఆపాటికే ఎర్రతేలు రావాలి.

శివాజీ పదిహేనోసారి చేతిగడియారం వంక చూసుకున్నాడు. అసహనంగా నిట్టూర్చాడు. ఒక బర్కిలీ సిగరెట్ తీసి పెదాల మధ్య ఇరికించుకుని గుండెల నిండుగా దమ్ము లాగాడు.

సరిగ్గా ఆ సమయంలో –

శరవేగంతో దూసుకు వచ్చిన ఒక ఆటో మెయిన్ రోడ్ నుంచి టర్న్ తీసుకుని మట్టి రోడ్డు మీదుగా జగదాంబానగర్ వైపు దౌడు తీసింది.

ఆ లిప్తకాలంలో ఆటోలో కూర్చుని ఉన్న మనిషి ఎవరో శివాజీ గ్రహించాడు.

ఆ మనిషి ఎర్రతేలు.


ఆటో పదమూడో నంబర్ ఇంటిముందు ఆగింది.

శివాజీలో టెన్షన్ ఒక్కసారిగా పెరిగింది. అతడు మరొకసారి బలంగా సిగరెట్ దమ్ము లాగాడు.

ఆటో వెళ్ళిపోయిన తర్వాత ఎర్రతేలు మెట్లు ఎక్కి గుమ్మం వైపు నడిచాడు. తలుపు మీద మెల్లిగా తట్టాడు. లోపల్నించి సమాధానం రాకపోవడంతో... "గురూ... గురూ.." అంటూ పిలిచాడు.

సమాధానం రాకపోవడంతో ఎర్రతేలు తలుపుకు గుమ్మానికి మధ్యనున్న సందులో నుంచి చూశాడు.

భలే ప్రచారం



తైవాన్‌లో యిటీవల జరిగిన ఎన్నికలలో తన అర్ధనగ్న శరీర ప్రదర్శనలిచ్చి సంచలనాన్ని సృష్టించిన హ్సు సియావోడాన్ ఎన్నికల్లో గెలవాలంటే శరీరమే కావాలంటోంది. కాని యింత చేసినా ఆమె గెలవలేకపోయింది. ప్రతిపక్ష లేబర్ పార్టీ ఆమెను మహిళా వ్యవహారాల షాడో మినిష్టరుగా నియమించింది. ఇప్పుడు ఓడిపోతే యేం మళ్ళీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానంటోందీమె. మహిళలను చైతన్యవంతం చేయటమే తన లక్ష్యమంటోన్నది హ్సుసియావోడాన్. చైతన్యం అంటే అర్ధనగ్న ప్రదర్శనల్లోనా? ఏమో?

మరుక్షణం అతని గుండె ఝల్లుమంది.

కుర్చీలో కురియన్ బంధింపబడి ఉన్నాడు. అరవకుండా అతడి నోట్లో గుడ్డలు కుక్కి ఉన్నాయి.

కురియన్ ఎదురుగ్గా టేబుల్ మీద ఉన్న రెండు ఇటికల మధ్య ఉందొక రివాల్వర్. దాని ట్రిగ్గర్‌కు కట్టిన నైలాన్ తాడు తలుపు వైపుగా ప్రయాణించింది.

ఎర్రతేలుకు విషయం అర్థం అయింది. తను కనక తలుపులాగితే కురియన్ చావడం ఖాయం.

అతడు చుట్టూ తిరిగి ఇంటి వెనక్కు నడిచాడు. తలుపు తీసి ఉన్న గుమ్మం గుండా లోపలికి ప్రవేశించాడు.

ఎర్రతేల్ని చూడగానే కురియన్ కళ్ళు ఆనందంగా మెరిశాయి.

అతడు ముందుగా కుర్చీ వెనక్కు విరిచి కట్టిన కురియన్ చేతుల్ని విముక్తం చేయసాగాడు.

* * * * * *

ఎర్రతేలు తలుపు సందులోంచి చూసి ఆ తర్వాత కంగారుగా ఇంటి వెనక్కు పరుగెత్తడంతో శివాజీకి ఏం జరుగుతోందో అర్థమయింది.

అతడు కుడిచేయి పిడికిలి బిగించి స్టీరింగ్ మీద [illegible] గుద్ది నిస్సహాయంగా [illegible]. అతని [illegible] తొంగిచూసింది.

"[illegible] అంతా ఫ్లాప్ అయిపోయింది. ఎర్రతేలుగాడు [illegible] విషయం [illegible]గాడు. ఇప్పుడు వాడు ఇంటి వెనక్కు [illegible] తను దగ్గరికి [illegible] లోపలకు వెళతాడు. కురియన్‌ను [illegible] ఆ తర్వాత [illegible] కష్టం అవుతుంది [illegible] వాళ్ళు చాలా [illegible]

తుదముట్టించడానికి మనం మరొక ప్లాన్ ఆలోచించాలి."

అదే సమయంలో ---

గుమ్మం గుండా లోపలకు ప్రవేశించిన ఎర్రతేలు వెనక్కు విరిచి కట్టిన కురియన్ చేతులకున్న నైలాన్ తాడుచకచకా విప్పదీయసాగాడు.

శివాజీ బలంగా వేసిన ముడులను విప్పదీయడం చాలా కష్టంగా ఉంది. వేళ్ళతో, పళ్ళతో లాగుతూ ఆ పీటముళ్ళన్నీ విప్పదీయసాగాడు. ఆ తాడు మొత్తం ఊడదీయటానికి పావుగంటపైనే పట్టింది. అంతసేపూ శివాజీ బయటకు రాబోయే ఎర్రతేలు కురియన్‌ల కోసం ఎదురు చూస్తున్నాడు.

ఎర్రతేలు చిట్టచివరి ముడి విప్పుతున్న దశలో –

బయట రోడ్డు మీద నిలబడి ఉన్న ఆటోడ్రయివర్ అసహనంగా తల విదిలిస్తాడు. ఎర్రతేలు వచ్చింది అతడి ఆటోలోనే. తలుపు సందుగుండా కురియన్ పరిస్థితి గమనించిన ఎర్రతేలు ఆ కంగారులో ఆటోడ్రయివర్ విషయం మర్చిపోయి కురియన్ కట్లు విప్పటంలో నిమగ్నమయ్యాడు.

అప్పటికి పావుగంటదాటి పోవడంతో అసహనంగా తల విదిలిస్తూ ఆటోడ్రయివర్ గుమ్మాన్ని సమీపించాడు. వీధి తలుపు ఒక్కసారిగా తన వైపు లాగాడు.

మరుక్షణం----

పెద్దశబ్దంతో రివాల్వర్ పేలింది.

జరిగిందేంటో అర్థం అయ్యేలోపే బుల్లెట్ కురియన్ నుదుటిని రంధ్రం చేస్తూ తలలోకి దూసుకుపోయింది.

పెద్దగా ఆర్తనాదం చేసిన కురియన్ తల వెనక్కు వాల్చేశాడు. తను తలుపు లాగగానే పెద్దశబ్దంతో రివాల్వర్ పేలడం, కురియన్ చావుకేక పెట్టడంతో

హడలి పోయిన ఆటో డ్రయివర్ ఒక్క గంతులో ఆటోలోకి దూకి పారిపోయాడు.

ఊహించని సంఘటన జరగడంతో కొయ్యబారి పోయాడు ఎర్రతేలు.

కుర్చీలో [illegible] టేబుల్ [illegible] అతడిలో చలనం వచ్చింది.

జనం తనను హంతకుడిగా భావించే అవకాశంఉంది. ఈ ఊహ రాగానే ఎర్రతేలు వెనక గుమ్మం గుండా బయటపడి పారిపోసాగాడు. మెయిన్ రోడ్డు మీదికి చేరుకునే వరకూ పరుగుతీస్తూనే ఉన్నాడు.

మెయిన్ రోడ్డు మీద ఉన్న లిక్కర్ షాపులో ఒక ఫుల్ బాటిల్ రమ్ము సీసా కొన్నాడు. దారిన వెడుతున్న ఆటో ఆపి 'జామై ఉస్మానియా' అన్నాడు. ఆటో వాడు జామై ఉస్మానియా వైపు వస్తానన్నట్టు తల ఊపాడు.

ఆటో డ్రయివర్ తలుపు లాగగానే భయంతో పారిపోవడం, ఆ తర్వాత కొద్ది క్షణాలకు ఎర్రతేలు పరిగెత్తుకుంటూ వచ్చి ఒక రమ్ము బాటిల్ కొనుక్కుని జామై ఉస్మానియా వైపు వెళ్ళిపోవడం శివాజీ గమనిస్తూనే ఉన్నాడు.

అతడి పెదవుల మీద ఒక చిరుదరహాసం ప్రత్యక్షమయింది. వెంటనే జేబులోంచి ఒక చిన్న కాగితం ముక్క పైకి తీశాడు. దాని మీద వరుసగా కురియన్, ఎర్రతేలు, నల్లముత్తు, కాళీప్రసాద్‌ల పేర్లు వ్రాసి వున్నాయి. శివాజీ ఎర్రరంగు స్కెచ్ పెన్‌తో కురియన్ పేరు కొట్టేశాడు. ఆ చీటీని మడిచి జేబులోకి తోసి చెప్పాడు.

"రజనీ! ఇక మిగిలింది ఎర్రతేలు, నల్లముత్తు, కాళీప్రసాద్... కాళీప్రసాద్ ప్రత్యక్షంగా మా వాళ్ళను చంపలేదు కనక వాడికి జైలు శిక్ష పడేలా చేస్తాను."

"మనం ఇపుడు ఎక్కడికి వెడుతున్నాం" రజని అడిగింది. "వీలయితే మనం నిన్నట్నుంచీ దాక్కున్న ప్రదేశానికి వెళ్ళి అక్కడ కూర్చుని ఎర్రతేల్ని ఎలా చంపాలో చర్చించుకుందాం."

రజని తల ఊపి చెప్పింది.

"ఇపుడు బుల్లెట్ కురియన్ కుడి భుజంలో కనక తగిలితే వాడు మళ్ళీ బతికే అవకాశం ఉంది. మనం వాడు చచ్చినట్టు నిర్ధారణ చేసుకోవడం ఎందుకయినా మంచిది."

శివాజీ తల ఊపాడు.

వ్యాన్ గార్డ్ స్టీరింగ్ వీల్ మీది నుంచి క్రిందికి దిగాడు.

అప్పటికే కురియన్ ఇంటి ముందు జనం గుంపుగా నిలబడి ఉన్నారు. కిటికీ తలుపు తెరిచి లోపలకు చూడసాగారు. శివాజీ వాళ్ళతో పాటు కలిసిపోయాడు. గుంపులో నుంచి లోపలకు చొచ్చుకు వెళ్ళి కిటికీ గుండా గదిలోకి చూశాడు.

కురియన్ తల వెనక్కు వాలి వుంది.

నుదిటి మీద ఎర్రటి బొట్టు పెట్టినట్టు బుల్లెట్ సృష్టించిన రంధ్రం స్పష్టంగా కనపడుతోంది.

కాంతిలేని చోట

ఒకటి ఒకటి కలిస్తే
ఒకటే
వందిమాగధులున్న చోట
వంతలు పలికే చోట!
హరివిల్లు వెదజల్లింది
ఐదే ఐదు రంగులు
అంధులు వున్నచోట
మౌఢ్యం ముసిరిన చోట!



వరుణుడికి పూజ చెయ్యందే
వర్షం కురవదు
అజ్ఞానులు వున్న చోట
తిమిరం కమ్మిన చోట!
శ్రమకు వెలగట్టడం
శ్రామికుడి నేరం–
దోపిడీ దాగి వున్న చోట
న్యాయం నిద్రించిన చోట!

–అడిగోపుల వెంకటరత్నమ్

శివాజీ తను రివాల్వర్ అంత యాక్యురేట్‌గా అమర్చగలనని ఊహించలేదు.

కురియన్ చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత వెనక్కు తిరిగి వచ్చాడు. వ్యాన్ గార్డ్ కొంత దూరంలో ఉండగానే విజయసూచకంగా బొటన వేలు పైకెత్తి చూపించాడు.

శివాజీ డ్రైవింగ్ సీట్ ఆక్యుపై చేసిన తర్వాత వ్యాన్‌గార్డ్ ముందుకు కదిలింది.

కొంత దూరం వెళ్ళిన తర్వాత సుప్రీం డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ ముందు కారు ఆపాడు.

"తినడానికి ఏదన్నా కొనుక్కోవాలి"

రజనికి చెప్పి లోపలికి నడిచాడు.

ఒక జాం బాటిల్, నాలుగు ప్యాకెట్ల బ్రెడ్ స్లయిసెస్ తీసుకుని డబ్బులు చెల్లించడానికి కౌంటర్ దగ్గరికి వచ్చాడు. కౌంటర్ ముందు చిన్న క్యూ ఉంది. శివాజీ ముందు నిలబడి ఉన్న మార్వాడీ జంట హిందీలో మాట్లాడుకుంటున్నారు. వాళ్ళిద్దరికీ వయసు నలభై అయిదు [illegible] ఉంది.

"[illegible] ఈ రోజు ఊరికి వెళ్ళిపోతున్నాం కదా! చందూలాల్‌కి ఇబ్బంది అవుతుందేమో" ఆమె అంటోంది.

"మరేం పర్లేదు. నాలుగు రోజుల్లో వచ్చేస్తాం కదా! వాడు ఎల్లుండి ఊర్నుంచి వస్తాడు. ఆ రెండు రోజులూ మీ అన్నయ్య ఇంట్లో ఉంటాడులే" అన్నాడతను. ఆమె ఏం మాట్లాడలేదు.

క్యాష్ కౌంటర్‌లో మనిషి డబ్బు తీసుకుంటూ మార్వాడీ వ్యక్తిని పలకరించాడు.

"ఏంటి సోహన్‌లాల్ భయ్యా... ఊరికి వెడుతున్నావట."

"అవును ఈ సారి మా ఆవిడను కూడా తీసుకు వెడుతున్నాను. నా దోస్త్ శంకర్‌లాల్ కూతురు పెళ్ళి.... నాలుగు రోజులు వుండి వస్తాను."

కౌంటర్‌లోని మనిషి తల ఊపి సోహన్‌లాల్‌కు మిగిలిన చిల్లర అందించాడు.

శివాజీకి తన ముందు నిలబడిన మార్వాడీ వ్యక్తి పేరు సోహన్‌లాల్ అనీ, అతడు భార్యా సమేతంగా ఊరికి వెడుతున్నాడనీ సోహన్‌లాల్ కొడుకు చందూలాల్ మరో రెండు రోజుల దాకా రాడనీ అప్పటి వరకూ అతడి ఎపార్ట్‌మెంట్ ఖాళీగానే ఉంటుందని అర్థం అయ్యింది.

శివాజీ తను కొన్న బ్రెడ్, జాంలకు బిల్లు పేచేసి బయటకు నడిచాడు.

సోహన్‌లాల్, అతడి భార్య సూపర్ బజార్ నుండి బయటకు వచ్చి కుడివైపు తిరిగారు. పేవ్‌మెంట్ మీద నడుస్తూ 'సన్‌రైజ్' ఎపార్ట్‌మెంట్స్ వైపు సాగిపోయారు.

శివాజీ వ్యాన్ గార్డ్ ముందు సీట్‌లో కూర్చుని ఉన్న రజనిని కాసేపు అక్కడే వెయిట్ చేయమని కళ్ళతోనే హెచ్చరించి, మార్వాడీ దంపతులను అనుసరిస్తూ సాగిపోయాడు.

అతడిలో ఒక పథకం రూపుదిద్దుకోసాగింది.

సోహన్‌లాల్, మిసెస్ సోహన్‌లాల్‌లు సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్ లిఫ్ట్ ముందు నిలబడ్డారు. తొమ్మిదో అంతస్తులో ఉన్న లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్‌కి వచ్చేటప్పటికి పది నిమిషాల సమయం తీసుకుంది.

లిఫ్ట్‌ను ఆపరేట్ చేయడానికి ఎవరూ లేరు. సోహన్‌లాల్, మిసెస్ సోహన్‌లాల్‌లు లిఫ్ట్‌లోకి నడిచారు. శివాజీ వాళ్ళను అనుసరించాడు.

సోహన్‌లాల్ ఏడో నెంబరు బటన్ నొక్కాడు. పైకి వెడుతున్న లిఫ్ట్ మూడో ఫ్లోర్ దగ్గిర ఆగింది. ఇద్దరు యువకులు ఒక పది సంవత్సరాల అమ్మాయి లోపలకు వచ్చారు. వాళ్ళు అయిదో ఫ్లోర్‌లో దిగిపోయారు. లిఫ్ట్ ఎలాంటి ఆటంకమూ లేకుండా ఏడో ఫ్లోర్‌లో ఆగింది.

శివాజీ సోహన్‌లాల్, మిసెస్ సోహన్‌లాల్‌లను

అనుసరిస్తూ బయటకు నడిచాడు.

మిసెస్ సోహన్‌లాల్ బయటకు నడుస్తుండగా ఆమె భుజాల మీది నుంచి వేలాడుతున్న దుపట్టా లిఫ్ట్ ముందు భాగాన ఉన్న ఐరన్ గ్రిల్‌కు తగులుకుంది. ఆమె చేతిలోని బరువయిన ప్యాకెట్లన్నీ కింద పడిపోయాయి. శివాజీ చకాచకా వాటిని ఏరాడు.

మిసెస్ సోహన్‌లాల్ వాటిని అందుకోవడానికి చేతులు చాపింది.

శివాజీ చిరునవ్వు నవ్వి హిందీలో చెప్పాడు.

"మరేం పర్లేదు మేడం. మీ ఇల్లు ఈ ప్రక్కనే కదా నేను తెస్తానులే".

శివాజీ వాళ్ల ఇంటి గుమ్మం దాకా వెళ్లి ప్యాకెట్లు అందించాడు.

"థాంక్స్" మిసెస్ సోహన్‌లాల్ అన్నది.

"ఇట్స్ ఆల్‌రైట్" శివాజీ మందహాసం చేసి వెనక్కు తిరిగాడు. ఆ కాస్త సమయంలోనూ శివాజీ సోహన్‌లాల్ ఇంటిలో పలి భాగాన్ని పరిశీలించాడు.

గుమ్మానికి ఆనుకుని పెద్ద హాలు, హాలు పైకప్పు నుంచి ఒక ఫ్యాను వేలాడుతోంది. ఫ్యాను వేలాడే చోట పైకప్పుకు ఇనప కొక్కెం ఒకటి బిగించి ఉంది. ఎదురుగా ఒక పెద్ద అద్దాల కిటికీ.

శివాజీ సోహన్‌లాల్ ఇంటిని పరిశీలించిన తర్వాత వెనక్కు తిరిగి లిఫ్ట్ వైపుకు నడిచాడు. లిఫ్ట్ మీదుగా గ్రౌండ్ ఫ్లోర్‌లోకి వెళ్లి అక్కడి నుంచి సుప్రీం డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ ముందు కార్లో వెయిట్ చేస్తున్న రజని దగ్గరికి వెళ్లి చెప్పాడు.

"నేను ఆ ఎదురుగా ఉన్న హోటల్‌లో ఉంటాను. నువ్వు వెంటనే మీ ఇంటికి వెళ్లి తాళాల గుత్తి తీసుకురా".

"తాళాలగుత్తి పట్రావాలా?"

"అవును.... నేను వారం క్రితం మీ ఇంటికి వచ్చినపుడు ఒదిలేశాను గుర్తుందా?"

హిట్‌లిస్ట్

"ఉంది... ఇపుడు దాంతో ఏం పని".

"చెప్తాగా వెళ్లిరా".

రజని తల ఊపి వ్యాన్‌గార్డ్ ముందుకు దూకించింది.

శివాజీ సన్‌రైజ్ ఎపార్ట్‌మెంట్స్ ఎదురుగా ఉన్న 'గోల్డెన్ రైఫిల్' రెస్టారెంట్‌లోకి నడిచాడు. ఓ కార్నర్ టేబుల్ ఆక్యుపై చేశాడు. ఒక ప్లేటు సమోసాకు ఆర్డర్ ఇచ్చి, పక్క టేబుల్ మీద పడివున్న తెలుగు దినపత్రిక అందుకున్నాడు. మొదటి పేజీలో 'నేటి నుండి కరెంటు కోత అమలు' అనే వార్త ప్రముఖంగా బాక్స్ కట్టి ప్రచురించబడి వుంది.

నగరంలో ఏ ఏ ఏరియాల్లో, ఏ ఏ సమయాల్లో కరెంటు ఎంతసేపు తీసేస్తారో ఆ వార్త విపులంగా వివరిస్తోంది.

శివాజీ విసుగ్గాపేజీలు తిప్పి పేపర్‌ను ప్రక్క టేబుల్ మీదకు విసిరాడు.

ఈ లోపు శివాజీ ఆర్డర్ చేసిన సమోసా సర్వ్ అయాయి. వాటిని ఫినిష్ చేసి పొగలు కక్కే చాయ్ చప్పరించసాగాడు.

మరో అరగంట తర్వాత సోహన్‌లాల్ తన భార్యతో కలిసి ఒక పెద్ద సూట్‌కేస్ పట్టుకుని రోడ్డు మీదికి వచ్చాడు.

ఓ ఆటోలో ఎక్కి రైల్వేస్టేషన్ దిశగా వెళ్లిపోయాడు. సోహన్‌లాల్ వెళ్లిపోయిన అయిదు నిమిషాలకు రజని నడుపుతున్న వ్యాన్‌గార్డ్ గోల్డెన్ రైఫిల్ రెస్టారెంట్ ముందు ఆగింది.

రజని హ్యాండ్ బ్యాగ్ ఊపుకుంటూ శివాజీ దగ్గరికి వచ్చింది. తాళం చేతులు తెచ్చినట్టు తల ఊపింది.

పావు గంట తర్వాత-

వ్యాన్‌గార్డ్ నాంపల్లిస్టేషన్ రోడ్‌లో ఉన్న సైన్స్ ఎక్విప్‌మెంట్స్ అమ్మే షాపుల ముందు ఆగింది.

హైస్కూలు, కాలేజీల లేబరేటరీలకు, హాస్పిటల్స్‌కు కావలసిన ఎక్విప్‌మెంట్స్, యాసిడ్స్ మొదలయినవి సైన్స్ షాపులవాళ్లు అమ్ముతుంటారు.

శివాజీ ఓ షాపులోకి నడిచాడు. సేల్స్‌మాన్‌ని కాన్‌సన్‌ట్రేటెడ్ సల్ఫ్యూరిక్ యాసిడ్ కావాలని అడిగాడు.

"మీ కంపెనీ లెటర్ హెడ్ మీద ఆర్డర్ ఇస్తేగాని యాసిడ్స్ అమ్మం" సేల్స్‌మన్ అన్నాడు.

"మరేం పర్లేదు. కావాలంటే బిల్లు పెంచుకోండి" శివాజీ చెప్పాడు.

సేల్స్‌మన్ ఇక లెటర్‌హెడ్స్ గురించి అడగలేదు. థౌజండ్ సి. సి. కెపాసిటీ ఉన్న యాసిడ్ సీసా తెచ్చి శివాజీ ముందు పెట్టాడు. సేల్స్‌మన్ చెప్పిన రేటు చెల్లించిన శివాజీ బయటకు నడిచాడు. అదే రోడ్డులో ట్రావెలింగ్ మెటీరియల్ అమ్మే షాపులో ఒక బ్రీఫ్‌కేస్, ఆ ప్రక్కనే ఉన్న ఎలక్ట్రికల్ షాపులో వెయ్యి క్యాండిల్స్ బల్బు కొన్నాడు.

అతడు కొన్న బల్బ్ మామూలుగా ఇళ్లలో వాడుకునే వంద క్యాండిల్స్ ఎలక్ట్రిక్ బల్బ్ కంటే చాలా పెద్దదిగా ఉంది.

అతడు ఈ వస్తువులు కొన్నంతసేపూ రజని మౌనంగా ఉంది. ఎందుకు? ఏమిటి? అనే ప్రశ్నలు ఆమె వేయలేదు.

"మనం సాయంత్రందాకా గడపాలి. ఇలా బహిరంగంగా తిరిగే బదులు ఏదయినా సినిమాహాల్లో టైంస్పెండ్ చేద్దాం". అన్నాడు శివాజీ.


రజని తల ఊపింది.

వ్యాన్‌గార్డ్ కాచిగూడా చౌరస్తా మీదుగా కుమార్ థియేటర్ వైపు పరుగుతీసింది.

(ఇంకావుంది)

కాలం మారినా ప్రేమ ఆగదు!

అచ్చి రఘురామరెడ్డి



ప్రళయ చాలా అందమైనది.

టైట్ బెల్‌బాటం ప్యాంటు, టైట్ షర్ట్ వేసుకొని స్టయిల్‌గా ఉంటుంది.

వంకీలు తిరిగిన బాబ్డ్ హేర్ ఎంతో మనోహరంగా ఉంటుంది. ముఖాన బొట్టూ కాటుక లాంటివి కనుపించకపోయినా- విశాల నేత్రాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. అఫ్‌కోర్సు, పువ్వులు పెట్టుకోవడం అసలు లేదనుకోండి- అది ఎప్పుడో ఔటాఫ్ ఫ్యాషన్ అయిపోయింది! ముఖానికి సినిమా వాళ్ళలాగ మేకప్ చేసుకొని ఉంది. పెదాలకు ఎర్రని లిప్‌స్టిక్ పెట్టుకుంది. ఆమె అందం చూసి నోరు తెరిచే వారికి, ఆమె పూసుకొన్న విదేశీ సెంట్ గుబాళిస్తూ మత్తెక్కిస్తుంది.

ఇక, ఆమె అవయవ సోయగాలు ఇట్టే పదేళ్ల కుర్రాడు వర్ణించి పారేస్తాడు!- కొట్టొచ్చినట్టున్న సువక్ష సంపద. టైట్ ప్యాంటులోని ముందు వెనుక అందాలు - అన్నీ ఎంతో స్పష్టంగా కనుపిస్తూ యువకుల్ని పిచ్చివాళ్లను వేసేస్తున్నాయి.

ఆమె ఇంటి ఎదురుగా ఒక పెళ్లికాని యువకుడు ఉన్నాడు. పేరు శ్రీసింహ! రివటలా ఉన్నా ఆడవాళ్లను ఆకర్షించే మోమూ, మగతనమూ ఉన్నవాడు.

ప్రళయ అంటె శ్రీసింహకు అమితమైన ప్రేమ. చిన్నతనం నుంచీ ఆమెను చూడకుండా ఒక్క నిమిషం కూడ ఉండలేడు. అతనిది ఘాటైన ప్రేమ!

ప్రళయకు కూడ అతనంటే యిష్టమే. ప్రేమ ఇద్దరి మధ్యా టూ వే ట్రాఫిక్‌లా నడుస్తోంది.

వచ్చిన చిక్కంతా 'కన్యాశుల్కం' వద్దే!

ప్రళయ తండ్రి భీషణరావ్ ధనాశాపరుడు. ప్రళయకు భారీ కన్యాశుల్కం వసూలు చేయాలని చూస్తున్నాడు.

పాపం శ్రీసింహ, తల్లిదండ్రులకు నాల్గవ కుమారుడు. ముగ్గురు కొడుకులకు పెళ్లిళ్ళు చేసి అసలే ఇల్లు గుల్లయిపోయివున్నారేమో, శ్రీసింహకు పెళ్లి ఎలా చేయడమా అని వాళ్ళు బెంగ పెట్టుకు ఉన్నారు.

ఆ రోజు శ్రీసింహకు అన్నం పెట్టి తల్లి శాంతమ్మ దగ్గర కూర్చుంది.

"నాయనా, సింహా! ప్రళయ తండ్రి ఐదు లక్షల కన్యాశుల్కం కావాలని అడుగుతున్నాడ్రా! నీకు తెలియందేముంది. చెప్పు! అన్నయ్యలు ముగ్గురికి పెళ్లిళ్ళు చేసి పూర్తిగా అప్పుల్లో మునిగిపోయాం..." అని చెప్పుకుపోతోంది. శ్రీసింహకు ఆ మాటలు కర్ణకఠోరంగా ఉన్నాయి.

శ్రీసింహ ప్రళయను ప్రేమిస్తున్నాడని శాంతమ్మకు తెలుసు.

శాంతమ్మకి కూడ ప్రళయ బాగా నచ్చింది. కాని, వాళ్ల అంతస్థుకి తాము తూగలేమని ఆవేదన చెందుతోంది. కొద్దిగా కన్యాశుల్కం అడిగే సంబంధం ఏదైన చూసి మెల్లిగా ముడి పెట్టేద్దామని శ్రీసింహ తండ్రి ఆలోచన. తల్లికి మాత్రం శ్రీసింహ అంటే ప్రత్యేకమైన ప్రేమ. అందువల్ల కొడుకుకి నచ్చ చెప్పాలని విఫల ప్రయత్నం చేస్తోంది.

"అమ్మా, నేను పెళ్లంటూ చేసికొంటే ప్రళయనే చేసుకొంటా! లేదా ఈ జన్మకి పెళ్లి చేసుకోను!"

"బాబూ! నాకు మాత్రం ప్రళయతో నీ పెళ్లి చేయాలని లేదా, చెప్పు! కాని అంత డబ్బు ఎక్కడి నుండి తేగలం? మాయదారి రోజులు వచ్చి, మన బ్రతుకులు ఇలా అయిపోయాయి. మా నాన్నగారి రోజుల్లో మగ పెళ్లివారికే 'వరకట్నాలు' వచ్చేవి! దర్జాగా పెళ్లిళ్ళు జరిగేవి. ఏ ముదనష్టపోడు ఈ కన్యాశుల్కం మొదలెట్టాడో గాని- మగ పెళ్లి వారి నోట్లో మట్టి కొట్టాడు. నాగరికత పెరుగుతున్నా, కన్యాశుల్క నిరోధక చట్టం ఖచ్చితంగా అమలు జరపకపోవడం అన్యాయం. మగపిల్లలకి పెళ్లిళ్ళు చేయలేక ఎంతమంది ఆత్మాహుతి చేసికొంటున్నారు హే! భగవాన్! ఈ కన్యాశుల్క బాధితుల్ని రక్షించు!" అని భగవంతునికి రెండు చేతులు ఎత్తి దండం పెట్టింది.

తల్లి ఆవేదన విన్న శ్రీసింహ మౌనం వహించాడు. కంచంలో చేయి కడుక్కుని భోజనం దగ్గర నుంచి లేచిపోయాడు.

★ ★ ★ ★ ★

అది ఇరవై ఒకటవ శతాబ్దం-మొదటి దశాబ్దం దాటి రెండవ దశాబ్దం ఆరంభమయిన రోజులు. భారతదేశంలో ఈ ఇరవై ఏళ్లలో చాలా మార్పులు వచ్చాయి.

అయితే సూర్యుడు తూర్పునే ఉదయిస్తున్నాడు. చంద్రుడు వెన్నెల కురిపిస్తూనే వున్నాడు. గాలి వీస్తూనే వుంది. వర్షాలు పడుతూనే ఉన్నాయి. ప్రకృతి అంతా అలానే వుంది. మనిషి మాత్రం బాగా మారిపోయాడు.

ఇప్పుడు రోడ్లమ్మట వాహనాలు అట్టే వెళ్లడం లేదు. అన్నీ భూమికి అంత ఎత్తులో, సౌరశక్తితో ఇటూ అటూ తిరుగుతున్నాయి. రోడ్లన్నీ పెద్ద పెద్ద [illegible]తో నిండిపోయి వున్నాయి. వాటి కోసం పూర్వంలాగే ఇప్పుడూ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రోడ్ల ప్రక్కల నియాన్ లైట్లు రాత్రివేళ సౌరశక్తితోనే వెలుగుతున్నాయి. అటు ఫ్యాక్టరీలు, ఫరమ్‌లు, ఇటు షాపులు, ఇళ్ల దీపాలు- అన్నీ సౌరశక్తితోనే!


నిత్యావసర వస్తువులన్నిటికీ పెద్ద పెద్ద 'క్యూ'లలో నిలబడవలసి వస్తోంది. 'రెండు రూపాయల బియ్యం పథకం' ఇప్పుడు ఎత్తివేశారు. అవి కేవలం తిండి లేనివారికే ఇస్తున్నారు, ఇరవై రూపాయల చొప్పున, దేశంలో ఆకలిచావులు లేనందున తిండి లేనివారు లేరని నిర్ధారణ చేసుకొని, ప్రభుత్వం ఇప్పుడు ఎవరికీ ఇవ్వడంలేదు! దేశంలో కతీ అంటే ఎవరూ 'వర్రీ' కావడంలేదు. రాళ్లను అలా వుంచి, సింపిల్‌గా బియ్యం ఏరేస్తున్నారు. ఏటా వచ్చే వరదల నివారణకు ఇంకా గట్టి చర్యలు తీసికోవడానికి అధికారపార్టీ వాళ్ళు విశ్వప్రయత్నం చేస్తూనే వున్నారు.

ఫామిలీ ప్లానింగ్ చేసికొన్నట్లు ఆడామగా ఇద్దరూ సర్టిఫికెట్ తెచ్చుకున్న తర్వాతే ప్రభుత్వం వివాహాలకు అనుమతి యిస్తోంది.

ప్రతి ఆఫీసులో కంప్యూటర్లే అన్ని పనులు చేస్తున్నాయి. ఉద్యోగం అంటే కేవలం ఆకాశదీపం. ఉద్యోగాలు లేనివాళ్ళు ఆటోలు నడుపుకోవడం వలన- క్రమంగా వాటి సంఖ్య లక్షల నుండి కోట్లకు పెరిగిపోయి. బేరాలు లేక ప్రస్తుతం చాలామంది ఈగలు తోలుకుంటున్నారు.

తిండి అంటే- చాలామంది ఫుడ్ టాబ్లెట్లు కొనుక్కొని స్టయిల్‌గా తిని కాలం గడిపేస్తున్నారు.

సినిమాల్లో ప్రేమ చాలా భయంకరంగా చూపిస్తున్నారు. అలనాటి బ్లూ ఫిల్మ్‌లోని తంతు ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్‌లో చోటు చేసుకొంది. రెండర్థాల



పాటలు కావు. డైరెక్టే అయిపోయాయి. సినిమాల్లో అంతా పాత హీరోల ఏల్లలే- ప్రస్తుతం ఆడపిల్లలు కూడ ఫీల్డులో దిగిపోయారు. విచిత్రం! సినిమాలు చూసే ఆడా మగా ప్రేక్షకులు ఏం తగ్గలేదు!

నేరోకట్- బెల్‌బాటం- నేరోకట్-ఇలా పది పదేళ్ళకు మార్పు వస్తూ వస్తూ- ప్రస్తుతం బెల్‌బాటం ఓర్పు వచ్చేసింది. చీర కట్టడం బొత్తిగా ఔటాఫ్ అయిపోయింది. టైలర్ ఒక జతకి ఇప్పుడు వెయ్యి తీసుకుంటున్నాడు. ఇలా చాలా మార్పులు వచ్చాయి.

డాక్టర్ ఫీజు మినిమం ఐదు వందలయింది. ప్రభుత్వ ఆసుపత్రుల బెడ్ల మీద కుక్కలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. మేక్సిమమ్ ప్రతి ఒక డాక్టరూ ఒక సొంత నర్సింగ్‌హోమ్ పెట్టాడు!

దేశంలో మానభంగాలూ-హత్యలూ- దోపిడీలూ కామన్ అయిపోయాయి. ఎవరు దొంగో, ఎవరు పోలీసో- ఎవరూ చెప్పలేకుండా వున్నారు. గాంధీమహాత్ముడు అంటే- రామాయణం జరిగిందా? కథా?-అన్నంత ఆశ్చర్యంగా వుంది.

దేశంలో తిండి కొరత ఎలా వున్నా- అడుక్కుతినడం బేన్ చేశారు! ఉద్యోగాల బేన్ అలా నడుస్తూనే వుంది! రిజర్వేషన్లు ఇంకా కొనసాగుతూనే వున్నాయి!

ఆశ్చర్యకరమైన విషయం!ప్రజలు ఎవరూ టీవీలు కొనడం మానివేశారు- ఎందుకో మీకు చెప్పనవసరం లేదనుకుంటాను!-

ఇక రాజకీయ నాయకులు-అధికారపార్టీ వాళ్ళంతా సన్యాసుల్లా కాషాయి వస్త్రాలే ధరిస్తున్నారు! వాళ్ళ వద్ద ఏడు తరాలను తగలబెట్టడానికి సరిపడ నోట్ల కట్టలు ఫారిన్ బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. అయినా ఇంకా సంపాదిస్తూనే ఉన్నారు-ప్రజాసేవలో.

ఇప్పుడు నిరుద్యోగ నిర్మూలనకు ఒక కేబినెట్ హోదా పెరిగింది!-అలాగే పేదరిక నిర్మూలనకు మరొకటి!- రోజుకొక్క పార్టీ మొలుస్తూనే వుంది-

కాలం మారినా ప్రేమ ఆగదు

ప్రస్తుతం ఐదు వందల చిల్లర పార్టీలు ఉన్నాయి. నాయకులు ఏ పార్టీ అధికారానికి వస్తే ఆ పార్టీలోనికి సెకెండ్లలో జంప్ చేస్తున్నారు.

పార్లమెంట్‌లో ప్రజానాయకులు అపరకీచకుల లాగున ఒకరి బట్టలు ఒకరు ఊడదీసుకుంటున్నారు! మహిళా నాయకురాళ్ళు సంపూర్ణ కవచాలు ధరించి మరీ వెళ్తున్నారు!బహిరంగంగా అలగాజనం కంటె నీచాతి నీచంగా ది బండెస్ట్ బూతులు తిట్టుకొంటూ, చెప్పులతో కొట్టుకొంటున్నారు. ఓహ్! ఏం చెప్పమంటారు?– ఒకరిపై నొకరుగాండ్రించి ఉమ్మి కూడ వేసుకుంటున్నారు!

ఓటు హక్కు ఇప్పుడు పదేళ్ళకే ఇచ్చారు!!

న్యూస్‌ప్రింట్ కొరత కావాలనే అధికార పార్టీ ఉధృతం చేస్తోంది. దినపత్రిక ఖరీదు పది రూపాయలు. వార, పక్ష, మాస పత్రికల ధరలు ఆకాశాన్ని అంటాయని వేరే చెప్పనక్కరలేదు.


దేశంలో జాతులు, కులగజ్జి, ఆశ్రిత పక్షపాతం, లంచాలు, కుంభకోణాలు– అన్నీ అలాగే వున్నాయి. ప్రస్తుతం మంత్రులందరికీ ఒక్కొక్కరికీ వందకు తక్కువ కాకుండ కుంభకోణాలు అన్నికోణాల నుంచీ ఉన్నాయి.

ఏ కమీషన్ దేనికో అడిగితే ఇంటర్వ్యూల్లో చెప్పలేక చస్తున్నారు.

ఇలా ఎన్నో విచిత్రాలు జరిగినట్టే– మరో నమ్మలేనినిజం– అనూహ్యమైన మార్పు– అదే, వరకట్నాల సిస్టమ్ అంతరించి అలనాటి గిరీశం కాలం నాటి 'కన్యాశుల్కం' మళ్ళీ అమలులోనికి వచ్చింది!

★ ★ ★ ★ ★

సాయం సమయం. సూర్యాస్తమయ మౌతోంది. భానుడు తాపరహితుడై, ఎర్రగా కాలిన ఇనుపగుండులా అగుపిస్తున్నాడు. సముద్రతీరం



వృద్ధుల మౌనరాగాలతో, జంటల గుసగుసలతో, పిల్లల కేరింతలతో – సందడిగా వుంది.

లవర్స్‌పార్కులో ప్రేమజంటలు అక్కడక్కడ పూపొదల చాటున మాటువేసి, ఎవరి సొదలో వాళ్ళున్నారు. ఒకమూల ప్రళయ, శ్రీసింహలు కూర్చుని వున్నారు.

శ్రీసింహ ముఖం ఖిన్నమై ఉంది. ప్రళయ అతనికేసి జాలిగా చూస్తోంది.

"ప్రళయా, ఈ జన్మకు మనకి పెళ్ళి జరుగుతుందా?"

"నాకు మాత్రం ఆశలేదా? కాని– మా నాన్న చండశాసనుడు! ఐదు లక్షల కన్యాశుల్కం ఇవ్వకపోతే మన పెళ్ళికి ఒప్పుకోడు!" ప్రళయ స్వరంలో బాధ మిళితమయింది.

"ఓహ్! కన్యాశుల్కం, బ్లడీ– కన్యాశుల్కం! వెధవ డబ్బుకోసం మన ప్రేమను విడదీస్తాడా? ఇప్పటికే మీ అక్కయ్యలు నలుగురికీ పెళ్ళిళ్ళు చేసి బోలెడు సంపాదించాడు. ఇంకా ఆశ తీరలేదా?... ప్రళయా! నువ్వు లేకపోతే నా బ్రతుకు శూన్యం అయిపోతుంది. నువ్వు లేకుండా నేను బ్రతకలేను!ప్లీజ్! ఏదో ఒకటి నువ్వే చెయ్యాలి!..."

"నన్నర్థం చేసికో, సింహా! మా డాడీతో మాట్లాడడమంటే నాకు గుండెదడ!..."

"ప్రేమించే వాళ్ళు భయపడరాదు! మధురమైన ప్రేమ మసి అయితే యింక బ్రతుకులో ఏం ఉంటుంది? ధైర్యంచేసి మీ నాన్నకు మన ప్రేమ గురించి చెప్పెయ్!"

"ఇప్పటికే ఇద్దరు ముగ్గురు ఐదు లక్షలు యిస్తామని వస్తున్నారు. ఇంకా ఎక్కువ వస్తుందేమోనని ఎదురు చూస్తున్నాడు మా డాడీ!... కావాలంటే ఇద్దరం కలిసి చద్దాంగాని, నావల్లకాదు!" ప్రళయ ఖచ్చితంగా చెప్పేసింది.

శతాబ్దం మారినా ప్రేమ మారదు! ఆగదు! అది అనంతమైనది. ఆ చైతన్య స్రవంతిలో ఎందరి ప్రేమ భగ్నమయిందో చరిత్రకు మాత్రమే తెలుసు! చరిత్రకందని భగ్న ప్రేమలు ఎన్నో! జీవన పథంలో ప్రేమ విఫలమైనా అది అమరమైనది. మానవుని మనుగడలో తీయని అనుభూతి– ప్రేమ!!–

మరి, ప్రళయ, శ్రీసింహల ప్రేమస్వప్నం అమృతధారలు చిలికేనా? లేక, భయంకర విషబిందువులను వెలిగ్రక్కేనా?–

★ ★ ★ ★ ★ ★

రోజు రోజుకీ ప్రళయకి సంబంధాలు వస్తున్నాయి.

ఒకరోజు శ్రీసింహ 'జూలో' ప్రళయ కోసం ఎదురు చూస్తున్నాడు. అంతలో ఆమె రానే వచ్చింది ఆమె మోములో విషాదాందోళనల ఉద్విగ్నత ప్రస్ఫుట మౌతోంది. శ్రీసింహ గుండె ఆ ముఖ కవళికలు చూసి ఒక క్షణం స్పందించడం మానేసింది! ఏదో కీడును శంకించింది!

"సింహా! అంతా అయిపోయింది! నిన్న అనకాపల్లి నుండి ఒక ముసలాడు వచ్చాడు. ఏడు లక్షలు శుల్కంగా ఇస్తానని! నాకు భయంగా

ఉంది!- ఈ సంబంధం బహుశా మా డాడి సెటిల్ చేసేస్తాడని నా మనసు కీడు శంకిస్తోంది!- ఇప్పుడు ఏం చేద్దాం?" ఉద్వేగంగా వెలిబుచ్చింది ప్రళయ.

శ్రీసింహకు ఏం బోధపడలేదు. ఇప్పుడు ఏం చేయడం?- బుర్ర ఎంత గోక్కున్నా ఆ సమస్య తీరే స్ఫూర్తి అతనిలో వెలగలేదు.

ఆరోజు నుండి శ్రీసింహ మనసు ఏమీ బాగోలేదు. ఎటు చూసినా అంధకారమే కనిపిస్తోంది. తమ ప్రేమ పండే చిహ్నాలు ఏమీ గోచరించలేదు. తిండి సహించడం లేదు. నిద్ర పట్టడం అస్సలు లేదు. గెడ్డం పెంచుకొని పిచ్చివాడిలా తయారయ్యాడు.

పాపం! ప్రళయకు కూడ బెంగ పట్టుకొంది. తను తన తండ్రిని ఎదిరించలేదు. అలా అని శ్రీసింహను కాదని మనలేదు.

ఆమె ఒక రోజంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది! అదే- శ్రీసింహతో కలిసి ఏ సముద్రంలోనో మునిగి ఆత్మహత్య చేసుకొనడమే! అలా ఆలోచిస్తుంటే ఆమె కను కొలకుల్లో నీరు చిప్పిల్లింది.

* * * * * *

అర్ధరాత్రి అమావాస్య, కారు చీకటి. ఆకాశంలో నక్షత్రాలు మాత్రం మిణుకు మిణుకు మంటున్నాయి...

ఎక్కడెక్కడో తిరిగి శ్రీసింహ యింటికి చేరాడు. అతని మనసేమీ బాగోలేదు. తినాలి అనిపించలేదు. తలుపు గుడ్డకుండా- ఆరు బయట తనకోసం వేసి ఉంచిన మడత మంచంమీద వాలిపోయాడు.

మనసంతా శూన్యంగా ఉంది.

పాపం! ప్రళయ ఏం చేస్తోందో?- అనుకోకుండా దృష్టి ఎదురింటి మేడ వేపు సారించాడు...

భ్రుకుటి ముడిచి చూపును తీక్షణం చేశాడు.

అంత చీకటిలో కూడ ఆ దృశ్యం అతనికి అగుపించింది!

ఔను! నిజమే! తను చూస్తున్నది కల కాదు!-

ఒళ్ళంతా చెమట పోసింది. గుండె గుభేల్ మంది.

ఆ క్షణంలో అతని మనసులో లేని ధైర్యం వచ్చేసింది.

గభుక్కున లేచాడు. పది వడిగా ఎదురింటి మేడకేసి శబ్దం చేయకుండా అడుగులు వేశాడు. కొన్ని క్షణాల్లో పోర్టికో వద్దకు చేరుకొన్నాడు.

ఎదురుగా డ్రెయినేజ్ పైపు మూడో అంతస్థు వరకు వ్యాపించి ఉంది. రెండవ అంతస్థులో ఆ పైపు వద్ద ఒక శాల్తీ గోచరించింది.

కొంపతీసి ప్రళయ ఆత్మహత్యా ప్రయత్నం చేయడం లేదుకదా!-

భయంకరమైన నిశ్శబ్దం. ఎక్కడో కీచురాళ్ళ రొద, శ్వాస బంధించి శ్రీసి ంహ ఆ శాల్తీవేపు నోరు తెరచి చూస్తూ ఉండిపోయాడు.

శాల్తీ పైపు పట్టుకు దిగుతోంది!

శ్రీసింహ ఎలర్ట్ అయిపోయాడు.

శాల్తీ జాగ్రత్తగా దిగింది... నేలమీద అడుగు మోపేసరికి శ్రీసింహ అమాంతంగా ఉడుంపట్టు పట్టేశాడు. శాల్తీకి ఊపిరి పీల్చడం కష్టమయింది!

* * * * *

మరుసటి రోజు ఆ కాలనీ అంతా ఒకటే గోల!-

ఎవరినోట విన్నా అదే వార్త!

అదివిని కాలనీ అంతా నోళ్ళు వెళ్ళబెట్టారు!- కాలనీ సంగతి దేవుడెరుగు!- ప్రళయ తండ్రే నెత్తీ నోరూ కొట్టుకు ఏడుస్తున్నాడు.

పోలీసులకు మాత్రం రిపోర్టు చేయలేదు. జరిగింది చిన్న విషయం కాదు! పోలీసులకు రిపోర్టు చేసే విషయం కాదు!

తన కొంప మునిగినంత పనయింది!- ఏం చేయాలో పాలు పోలేదు- కొన్నాళ్ళు లబోదిబో మన్నాడు ప్రళయ తండ్రి. అతను మామూలు మనిషి కావడానికి కొన్ని రోజులు పట్టింది.

* * * * *

ఒకనాడు శ్రీసింహ డైరెక్ట్‌గా భీషణరావ్‌ని కలిశాడు.

అతను భ్రుకుటి ముడిచి ఏంటన్నట్లు చూశాడు.

శ్రీసింహ జరిగిందంతా చెప్పేశాడు!-

భీషణరావ్ అది విని నోరు తెరిచాడు!-

"బాబూ! నన్ను కాపాడావు!- నీవు చేసిన ఈ ఉపకారానికి నేనేం చేసినా ఋణం తీరదు" అని శ్రీసింహ చేతులు పట్టుకొన్నాడు. అటువంటి నిజాయితీపరుణ్ని అతని జీవితంలో చూసి ఉండలేదు.

"నాకేం వద్దండి!... నేనూ, ప్రళయ ప్రేమించుకొన్నాం! మా ఇద్దరికీ పెళ్ళి జరిపించండి!" అని భీషణరావ్ కాళ్ళమీద పడ్డాడు శ్రీసింహ.

పక్కనేవున్న ప్రళయ కూడ "ఔను నాన్నా! నేను యితణ్నే పెళ్ళి చేసుకొంటాను!" అని తనూ తండ్రి కాళ్ళమీద పడిపోయింది.

భీషణరావ్ యిద్దరినీ లేపదీశాడు. చిరునవ్వుతో యిద్దరినీ దీవించాడు.

త్వరలోనే ప్రళయ-శ్రీసింహల వివాహం బ్రహ్మాండంగా జరిగిందని వేరే చెప్పనవసరం లేదు!-

అయితే, ఒక సస్పెన్స్ చెప్పడం మరచా!- సారీ!

అదే, శ్రీసింహ ఆనాడు పట్టుకొన్న ఆ శాల్తీ ఎవరు?

కాలనీ అంతా నోళ్ళు తెరవడానికి కారణం?

భీషణరావ్ కానీ కన్యాశుల్కం లేకుండా వాళ్ళ పెళ్ళి జరిపించడానికి కారణం?

ఆరోజు శ్రీసింహ క్రిందికి దిగుతున్న శాల్తీని ఊపిరి ఆడకుండా పట్టుకొని- ప్రళయ కాదని యిట్టే నిర్ధారణ చేసికొన్నాడు. ఉత్తర క్షణంలో అతనికి ఆ శాల్తీ ఎవరో తెలిసిపోయింది! వెంటనే ఫడేల్‌మని మెడ నరంమీద ఒక కరాటే షాట్ యిచ్చాడు! ఎదురు చూడని ఆ దెబ్బకి ఆ శాల్తీ కంగారుపడి, చేతిలోని సంచిని కింద దబ్బున పడేసి పారిపోయాడు!

ఆ శాల్తీ ఒక పెద్ద గజదొంగ!

భీషణరావ్ తన నల్గురు కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేసి సంపాదించిన ఇరవై లక్షల రెడీ క్యాష్ ఆ సంచిలో వుంది!

కొద్ది రోజుల తర్వాత శ్రీసింహ భీషణరావ్ దగ్గరికి వచ్చి జరిగింది చెప్పి- ఆ ఇరవై లక్షలూ జాగ్రత్తగా తిరిగి అప్పచెప్పాడు!

పోయిన సొమ్ము తిరిగి దొరకడం అన్నది ఆ రోజుల్లో గొప్ప వండర్ మరి!- అంత సాహసం చేసి నిజాయితీగా డబ్బు వాపసు యిచ్చినందుకు ఉక్కిరిబిక్కిరై-

భీషణరావ్ వాళ్ళ పెళ్ళికి కన్యాశుల్కం లేకుండా 'ఎస్' అన్నాడు, మరి!

○



నానా దర్శకత్వంలో డింపుల్

'ఘరిందా' చిత్రంలో అత్యద్భుతంగా నటించిన నానా పతేకర్ యిప్పుడు సుధాకర్ బొకాడేతో కలిసి 'ప్రహార్' చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. నాలుగు కోట్ల రూపాయల్తో నిర్మించబడుతున్న ఈ చిత్రానికి నానా పతేకర్ దర్శకుడు, నటుడు కూడా. ఈ కమర్షియల్ చిత్రంలో డింపుల్ కపాడియా హీరోయిన్‌గా నటిస్తోందట. ...క్కంలో నిర్మించే ఈ చిత్రానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అ...స్తోంది.

సీరియల్

వజ్రసంకల్పం

సాతవాహన

[గత సంచిక తరువాయి]

వజ్రపాణి చటుక్కున తలపైకెత్తి తన చుట్టూ చూశాడు. చేతుల్లో ఈ వెల్తో లాటవికులందరూ అప్పటికే ఆ హవేలీని ఆక్రమించేసుకున్నాడు.

వజ్రపాణి హఠాత్తుగా పగలబడి నవ్వాడు. ఆ హాలు దద్దరిల్లిపోయేట్టు అలా నవ్వుతూనే వున్నాడు.

"ఎవ్వరూ నన్నేమీ చెయ్యలేరు - ఎవ్వరూ....! ఎవ్వరూ నన్నేమీ చెయ్యలేరు! వజ్రపాణి అజేయుడు. సూర్యనేత్రం నా దగ్గరున్నంత వరకూ నువ్వేకాదు విశ్వధరవర్మా, నన్ను దేవుడు కూడా ఏమీ చేయలేడు" అంటూ గుండెలవిసిపోయేలా పగలబడి అలా నవ్వుతూనే వున్నాడు.

"అక్కడే పొరబడ్డావు వజ్రపాణీ!" పింకీ స్వరం హఠాత్తుగా వినిపించింది.

వజ్రపాణి చటుక్కున నవ్వాపేసి ఆమెకేసి ఆశ్చర్యంగా చూశాడు.

"నీ చేతుల్లో వున్న సూర్యనేత్రం అసలైన సూర్యనేత్రం కాదు. అసలైన సూర్యనేత్రం నా చేతుల్లో వుంది. ఇటు చూడు," అంటూ పింకీ తన చెయ్యి ముందుకు చాచింది. ఆ మరుక్షణం విశ్వధరవర్మతో సహా ఆ హాల్లో వున్న వాళ్లందరూ ఆశ్చర్యపోయారు. పింకీ చేతిలో కూడా సరిగ్గా సూర్యనేత్రంలాగే వున్న మరో వజ్రం ధగ ధగా మెరిసిపోతోంది.

వజ్రపాణి పింకీ చేతుల్లో వున్న వజ్రాన్ని కళ్లప్పగించి చూశాడు. ఆ తర్వాత తన చేతిలో వున్న వజ్రాన్ని కూడా చూస్తున్నాడు. హఠాత్తుగా అతనికి మతిపోయినట్టుగా అనిపించింది.

"ఇందులో అంత ఆశ్చర్యపడాల్సిందేమీలేదు వజ్రపాణీ! ఇదే అసలైన సూర్యనేత్రం. కావలిస్తే చూడు," అంటూ పింకీ కిందపడి వున్న కొన్ని పూలరేకుల్ని తీసి తన చేతిలో వున్న వజ్రాన్ని నేల మీద పెట్టి పూలరేకులు దాని మీదవేసింది. వెంటనే పూలరేకులు తగలబడిపోయాయి.

"నో!" అరిచాడు వజ్రపాణి.

గబుక్కున తనూ కొన్ని పూలరేకుల్ని పైకెత్తి తన చేతిలోని వజ్రం మీద పడేశాడు. ఏమీ కాలేదు. వజ్రం చల్లగా వుంది.

"చెప్పానుగా వజ్రపాణీ! అది సూర్యనేత్రం కాదు. నా చేతిలో వున్నదే అసలైన సూర్యనేత్రం. నీ చేతిలో వున్నది క్యూబిక్ జిర్కోనియా! శక్తిధర్ నాకు కానుకగా ఒక పెద్ద ముడి వజ్రం పంపించాడు. దాన్ని సానబెట్టించి జూడా చెప్పిన వివరాల ఆధారంగా అచ్చంగా సూర్యనేత్రాన్ని పోలిన వజ్రాన్ని తయారు చేయించాను. ఇందాక నగ్నదేవత పూజ చేస్తున్నప్పుడు తెలివిగా మీకెవరికీ తెలియకుండా వజ్రాల్ని మార్చేశాను," అంది పింకీ.

"యూ డెవిల్!" వజ్రపాణి పిచ్చి కోపంతో తన చేతిలోని వజ్రాన్ని నేలకేసి విసిరికొట్టాడు.

"పాపం, సూర్యనేత్రం పోగొట్టుకునేసరికి నీకు పిచ్చెక్కినట్టుగా వుంది కదూ వజ్రపాణీ? పోనీ, ఇన్ని చావుదెబ్బలు తిన్న నీకు చిన్నసాయం చేస్తాను. నీ వజ్రం నీకు తిరిగి ఇచ్చేస్తాను. ఇదిగో సూర్యనేత్రం-తీస్కో!" అంది చెయ్యి చాచి.

"పింకీ!" హెచ్చరించాడు శక్తిధర్.

పింకీ అతని హెచ్చరిక పట్టించుకోలేదు.

"చూస్తావేం వజ్రపాణీ! నీ సూర్యనేత్రం నాకు అవసరం లేదు. నువ్వే తీస్కో" అంది.

వజ్రపాణి సమ్మోహితుడిగా ఆ వజ్రంకేసి చూస్తూ ముందుకు కదిలాడు.

ఆ మరుక్షణం ఎవరూ వూహించని సంఘటన జరిగిపోయింది.

జూడా పిడుగులా వాళ్ల మధ్యకు దూకి ఆమె చేతిలోని వజ్రం పైకెగరేశాడు. ఏం జరుగుతోందో అక్కడున్న వాళ్లకి అర్థమయ్యేలోపలే ఆ వజ్రం అతని చేతిలో వుంది. అతని రెండో చేతిలో రివాల్వర్ మెరిసింది.

"ఎవరూ కదలడానికి వీల్లేదు. ఈ సూర్యనేత్రం నాది," అనరిచాడు.

ఆ మరుక్షణం అతని గొంతులోంచి వికృతమైన కేక వెలువడింది. భళ్ళున రక్తం కక్కుకుంటూ కిందపడి పోయాడు.

"డే.....వి.....డ్........," అతను విస్మయంగా యింకా ఏదో అనబోయే లోపలే అతని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

జూడా వీపులోంచి గుండెలోకి దించేసిన పిడిబాకు బయటికి లాగి డేవిడ్ విక్ర

ఇంతవరకూ సాగిన కథ-39: విశ్వధరవర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడుభూమిలో దొరికిన వజ్రసంపదను అతని దాయాది అయిన వజ్రపాణి చేజిక్కించుకుంటాడు. వజ్రపాణి హవేలీ నుంచి పింకీని శక్తిధర్ అపహరించుకుపోతాడు. శక్తిధర్, విశ్వధర వర్మలకి తానొక సి.ఐ.డి. ఆఫీసరునని పింకీ తెలియజేస్తుంది. వజ్రపాణిని దెబ్బతీసేందుకు ముగ్గురు కలిసి వేసిన పథకంలో భాగంగా రెండు గూడేల ప్రజల సాయంతో వజ్రాల గనులపై దాడిచేస్తారు. వజ్రాల గనులన్నీ విశ్వధరవర్మ హస్తగతమైపోవటంతో వజ్రపాణి అసహాయుడవుతాడు.

తంగా నవ్వాడు.

"సూర్యనేత్రం ఎవరిదీ కాదు. నాది. దీని కోసమే ఇన్నాళ్లు కాచుకున్నాను,"

ఉత్తర క్షణంలో రివాల్వర్ పేలిన శబ్దం ఆ హాల్లో మార్మోగి పోయింది.

డేవిడ్ వెర్రిగా కేకపెట్టి నేలకూలిపోయాడు.



అంటూ సూర్యనేత్రంతో వెర్రివాడిలా గంతులేయడం ప్రారంభించాడు.

అంతటి మహావజ్రం చేతిలోకి రాగానే అతనికి మతిపోయిందని అర్థమైపోయింది.



ముద్దుల రికార్డు

అనేకమంది వివిధ రంగాలలో తమకున్న ప్రతిభను ప్రపంచానికి చాటుకొని లేక ప్రదర్శించి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కటం మనం వింటునే వున్నాం. ఈ ఏడాది అమెరికాలో జరిగిన 'చుంబన క్రీడ' గిన్నిస్ బుక్‌లో చోటు చేసుకుందట. ఈ క్రీడలో అనేక జంటలు పాల్గొనటం విశేషంగా కనబడుతుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఏర్పాటయిన ఈ క్రీడలో 200 మంది పాల్గొన్నారట. రికార్డు సాధించాలని కాబోలు మళ్ళీ ఆ క్రీడను ఏర్పాటు చేయగా 400 మంది పాల్గొని రికార్డు సృష్టించి 'గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. ఈ సామూహిక చుంబన క్రీడ మనదేశంలో పెడితే యింకా ఎక్కువ మందే పాల్గొంటారేమో!?

వజ్రపాణి చేతిలోని రివాల్వర్ పొగలు కక్కుతోంది.

"నమ్మక ద్రోహులారా!" చావండి అంటూ వెర్రివాడిలా అతను అప్పటికే ప్రాణం పోయిన జూడా, డేవిడ్‌ల శరీరాల వైపు మరో రెండుసార్లు రివాల్వర్ పేల్చి నగ్నదేవత వైపు తిరిగాడు.

"విశ్వధరవర్మ మీద నాకు కోపం రావడంలేదు. నన్ను నమ్మించి గొంతుకోసిన మీ ఇద్దర్నీ బ్రతకనివ్వను," అంటూ నగ్నదేవత మీదికీ, బైరాగి మీదికీ వరుసగా మూడుసార్లు రివాల్వర్ పేల్చాడు. బుల్లెట్స్ సరిగ్గా వాళ్ల గుండెల్లోంచి దూసుకెళ్లిపోయాయి. వాళ్ళిద్దరూ హాహాకారాలు చేస్తూ నేలకూలిపోయారు.

వజ్రపాణి గిరుక్కున విశ్వధరవర్మ కేసి తిరిగి ట్రిగ్గర్ నొక్కాడు.

క్లిక్‌మన్న చప్పుడు వినిపించింది.

రివాల్వర్ పేలలేదు.

"లాభం లేదు వజ్రపాణీ! అందులో ఇక బుల్లెట్స్ లేవు," అన్నాడు విశ్వధర వర్మ.

వజ్రపాణి రివాల్వర్ కిందపారేసి నేల మీద పడి వున్న వజ్రాన్ని అపురూపంగా చేతిలోకి తీసుకున్నాడు.

"సూర్యనేత్రం నాది....., సూర్య నేత్రం నాది......," తనలో తనే పిచ్చిగా గొణుక్కున్నాడు.

"సారీ వజ్రపాణీ నేను అబద్ధం చెప్పాను. అది అసలైన సూర్యనేత్రం కాదు. నువ్వు విసిరికొట్టిందే అసలైన సూర్యనేత్రం. ఇదిగో నా చేతుల్లో వుంది," అంది పింకీ.

వజ్రపాణి చటుక్కున తలపైకెత్తాడు.

"అవును, వజ్రపాణీ! నేను నీకిచ్చింది సూర్యనేత్రం కాదు - క్యూబిక్ జిర్కోనియా! నేను వజ్రాల్ని మార్చలేదు."

"అబద్ధం. ఇదే అసలు సూర్యనేత్రం!"

పింకీ జాలిగా చూసింది.

"లేదు వజ్రపాణీ! అది అసలు సూర్య నేత్రం కాదు. అసలు సూర్యనేత్రం ఇదే. అసలు సూర్యనేత్రానికి నిజంగా వస్తువుల్ని భస్మం చేసే గుణం లేదు."

"పింకీ! ఏమిటి నువ్వంటున్నది?" అన్నాడు విశ్వధరవర్మ.

"అవును, సూర్యనేత్రానికసలు వస్తువుల్ని భస్మం చేసే గుణం లేదు. అది అన్ని వజ్రాల్లాంటిదే. దానికో ప్రత్యేకమైన గుణం వుందని జూడా చెప్పినప్పుడు నేను చాలా ఆశ్చర్యపోయాను. అలాంటి వజ్రం వుండడం అసాధ్యం అనిపించింది. ఇందాక నగ్నదేవత సూర్యనేత్రం మీద పూలుజల్లే పద్ధతి గమనించినప్పుడు నాకు అసలు రహస్యం తెలిసిపోయింది. ఆ పద్ధతే నేనూ ప్రయోగించి క్యూబిక్ జిర్కోనియా మీద పూలరేకులు పడేసి మండిపోయేలా చేశాను."

"అంటే?" ఆశ్చర్యంగా అడిగాడు శక్తిధర్.

"భాస్వరం" అంది పింకీ. "నగ్నదేవత 'సూర్యనేత్రం మీద పూలు చల్లినప్పుడు ఎవరికీ తెలియకుండా భాస్వరం కలిపింది. గాల్లోని ప్రాణవాయువు సోకుతూనే పూల రేకులు కాలిపోయాయి."

"కానీ...:., నగ్నదేవత అలా ఎందుకు చేస్తుంది. సూర్యనేత్రానికి లేని గుణం ఆపాదించడంలో ఆమె ఉద్దేశం ఏమై వుంటుంది?" అన్నాడు శక్తిధర్.

"ఆ విషయం ఆమే చెప్పాలి. కానీ, ఆ విషయం చెప్పడానికి నగ్నదేవత ప్రాణాల్తో లేదు. బహుశా సూర్యనేత్రానికి ఒక దుష్టశక్తిని ఆపాదించి ఆ శక్తిని కంట్రోల్ చేయగల శక్తి తన దగ్గరుందని నిరూపించి వజ్రపాణిని పూర్తిగా తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఆమె అలా చేసి వుండాలి" అంది పింకీ. "ఇప్పుడు అసలు సూర్యనేత్రం మన దగ్గరుంది."

"మోసం," నెమ్మదిగా లేస్తూ అన్నాడు వజ్రపాణి. అతని చేతిలోని వజ్రం నేల మీద పడిపోయింది. "మోసం! అందరూ కలిసి నన్ను మోసం చేశారు."

"లేదు వజ్రపాణీ! వజ్రాల మీద నీకున్న వ్యామోహమే నిన్ను మోసం చేసింది. నిన్ను పూర్తిగా పతనమైపోయేలా చేసింది," అన్నాడు విశ్వధర వర్మ.

వజ్రపాణి వున్నట్టుండి ఆయన పాదాల ముందు మోకాళ్ల మీద కూలబడ్డాడు.

"నువ్వే గెలిచావు విశ్వధరవర్మా! నేను ఒక జీవితకాలం కష్టపడి కూడబెట్టిన సంపదనంతా పోగొట్టుకున్నాను. నేను జీవించి ప్రయోజనం లేదు. చంపెయ్ విశ్వధరవర్మా! నన్ను చంపెయ్!"

విశ్వధరవర్మ అతనికేసి గంభీరంగా చూశాడు.

"ఒకప్పుడు నేను కూడా నీ ముందు మోకరిల్లి యిలాగే ప్రార్థించాను వజ్ర పాణీ! కానీ, ఆ రోజు నీకు నా మీద జాలికలగలేదు. జీవితాంతం నా వాళ్లని పోగొట్టుకున్న దుఃఖంతో కుమిలి పోయి కొంచెం కొంచెంగా చావమని శపించి నన్ను ప్రాణాల్తో వదిలేశావు. ఈ రోజు

నేను నిన్ను ప్రాణాల్తో వదిలేస్తున్నాను వజ్రపాణీ!"

వజ్రపాణి చేతులు జోడించాడు.

"ప్లీజ్ విశ్వధరవర్మా! నన్ను చంపెయ్! ప్లీజ్ చంపెయ్!"

"లేదు, వజ్రపాణీ! నిన్ను చంపి నా చేతులు మైలపర్చుకోలేను. నీ ప్రాణాల్ని ఏం చేసుకోవాలో నువ్వే నిర్ణయించుకో," అన్నాడు విశ్వధరవర్మ.

వజ్రపాణి హతాశుడైపోతూ చూశాడాయన వైపు.

అతని కళ్లు క్రమంగా నేలవాలిపోయాయి.

డేవిడ్ శవం చేతిలో వున్న కత్తి అతని దృష్టిని ఆకర్షించింది. చెయ్యి ముందుకు చాచి నెమ్మదిగా ఆ కత్తిని అందుకున్నాడు.

"నీ అంతటి గుండె ధైర్యం నాకు లేదు విశ్వధరవర్మా! నాకున్నదంతా పోగొట్టుకుని ప్రాణాల్తో జీవచ్ఛవంలా బ్రతకడం నాకిష్టం లేదు. అందుకే...." అంటూ కసుక్కున తన గుండెల్లో కత్తితో పొడుచుకుని ఆయన పాదాల ముందు కూలిపోయాడు.

విశ్వధరవర్మ తన కాళ్లదగ్గర పడున్న వజ్రపాణి శవాన్ని కొద్ది క్షణాలు కళ్లప్పగించి చూశాడు.

తర్వాత నెమ్మదిగా శక్తిధర్ భుజం మీద ఒక చెయ్యీ పింకీ భుజం మీద ఒక చెయ్యీ వేసి వెనక్కి తిరిగాడు.

హఠాత్తుగా ఆయనకు తన వయస్సు ఒక్కసారిగా మీదపడిపోయినట్లనిపించింది.

"పదండి....," వణుకుతున్న స్వరంతో అన్నాడాయన.

"ఒక దుష్టయుగం ఇంతటితో సమాప్తమైపోయింది."

32

కౌసల్య తన ఎదురుగా నిలబడి వున్న శక్తిధర్‌కేసి కొద్ది క్షణాలు కళ్లప్పగించి చూసింది.

అతని మొహం ఆమెకు స్పష్టంగా కనిపించడం లేదు.

"కౌసల్యా! నా మాట నిలబెట్టుకుంటున్నాను తల్లీ! ఇదుగో నీ కొడుకు, నీకిచ్చిన మాట ప్రకారమే క్షేమంగా తెచ్చి నీకప్పగిస్తున్నా," అన్నాడు విశ్వధరవర్మ.

"ఎంతాశ్చర్యం!" అంది కౌసల్య. ఆమె గొంతు వణుకుతోంది. "ఎవరినైతే ఒక్కసారి కళ్లారా చూసుకోవాలని ఇన్నేళ్లుగా పరితపించిపోయానో తీరా ఆ ముద్దుల పట్టిని చూసుకునే వేళకు కళ్లకు కన్నీరు అడ్డుపడుతూంది," అంటూ శక్తిధర్ నుదుటి మీద ముద్దుపెట్టుకుంది.

జీవితంలో మొట్టమొదటిసారిగా శక్తిధర్ కళ్లలోంచి కన్నీరు పొంగింది.

"అమ్మా!" అంటూ ఆమె పాదాల మీద వాలిపోయాడు.

ఆ అపురూపమైన దృశ్యాన్ని చూస్తున్న వాడల్లా విశ్వధరవర్మ నెమ్మదిగా కన్నీరు తుడుచుకుని బయటకి నడిచాడు.

"మాస్టారూ!"

జైలర్ సత్యం వీల్‌ఛైర్ నడుపుకుంటూ ముందుకొచ్చి ఆయన చెయ్యి పట్టుకున్నాడు.

"ఎక్కడికి మాస్టారూ?" నెమ్మదిగా అన్నాడు.

"సత్యం! నా జీవితాశయం నెరవేర్చుకున్నాను. ఇక నా శేషజీవితానికి కావల్సింది మనశ్శాంతి. అదే వెతుక్కుంటూ బయల్దేరుతున్నాను," అన్నాడు విశ్వధరవర్మ.

"క్షమించండి మాస్టారూ! మీకొక రహస్యం చెప్పాలి" విశ్వధరవర్మ అతనికేసి ఆశ్చర్యంగా చూశాడు.

"రహస్యమా!"

"అవును మాస్టారూ! శక్తిధర్ మీ మనవడు కాడు" విశ్వధరవర్మ తలమీద పిడుగుపడ్డట్లైంది.

"సత్యం! ఏమిటి నువ్వు, చెబుతున్నది?" అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుంటూ అడిగాడు.

"అవును మాస్టారూ! కౌసల్యకు కాన్పు జరిగిన రోజు గుర్తుందా? అదే రోజు నా భార్య కూడా ప్రసవించింది. మగబిడ్డ. కౌసల్య ఆడపిల్లను ప్రసవించింది. మగపిల్లవాడి మీద మీరు పెట్టుకున్న ఆశలు ఒక్కసారిగా కుప్పకూలిపోతే మీరేమైపోతారోనని భయం వేసింది. అందుకే హాస్పిటల్‌లో నర్సును ప్రాధేయపడి బిడ్డలిద్దర్నీ నేనే మార్చేశాను."

"అంటే....., అంటే......," విశ్వధరవర్మ ఇక మాట్లాడలేకపోయాడు.

"పింకీ మీ మనవరాలు," అన్నాడు సత్యం.

విశ్వధరవర్మ షాక్ తిన్న వాడిలా చూస్తుండిపోయాడు.

"నన్ను క్షమిస్తారా మాస్టారూ!" దీనంగా అడిగాడు సత్యం.

విశ్వధరవర్మ తననితాను నిలదొక్కుకోవడానికి ఒక జీవితకాలపు శ్రమ అనుభవించవలసి వచ్చింది.

"ఎంత పని చేశావు సత్యం! నాకు మగపిల్లవాడు ఒకటే, ఆడపిల్ల ఒకటే అనుకున్నావా? నా సంతానంతో వజ్రపాణిని సర్వనాశనం చేస్తానని నేను శపథం చేశానే తప్ప

పుస్తకాల పేజీ

★ **ఉ. వే. స్వామినాథ అయ్యరు**

ఆంగ్లమూలం: ప్రేమానందకుమార్, తెలుగుసేత: చల్లా రాధాకృష్ణశర్మ, [illegible] రూపాయలు, ప్రతులకు: 'స్వాతి' మందిర్‌మార్గ్, న్యూఢిల్లీ-110001.

★ **స్వర శాస్త్ర మంజరి**

సంపాదకుడు : మేడపాటి వెంకటరెడ్డి, పుటలు : 186, వెల : ముప్పది అయిదు రూపాయలు. ప్రతులకు: మేడపాటి రామకృష్ణారెడ్డి, అర్తమూరు-533351. తూ.గో. జిల్లా.

★ **మహదాత కర్ణ**

రచయిత: పురాణపండ రాధాకృష్ణ మూర్తి, పుటలు : 190, వెల : పది రూపాయలు, ప్రతులకు: పి. రాధాకృష్ణ మూర్తి, రాజమండ్రి-4.

భాగవత వాణి

సృష్ట్యాది వర్ణనలతో సుందరమైన శ్లోకాలు, శ్రీకృష్ణ లీలలు, భక్తుల చరిత్రలూ గల భాగవత వాణి వెల : 6 రు. ప్రకాశకుడు, సంపాదకుడు : పురాణపండ రాధాకృష్ణమూర్తి, పుటలు : 83, భాగవత వాణి ప్రతులను పంచిపెట్టుకోదలచిన వారికి తమ వంశ పరిచయంతో ఫోటో లేదా ఆత్మీయుల దివ్య సంస్మరణగా వారి ఫోటోతో కూడా ప్రచురించే వసతి కలదని రచయిత తెలియజేస్తున్నారు. వివరాలకు : పురాణపండ రాధాకృష్ణమూర్తి, భాగవత మందిరం, రాజమండ్రి-4 అన్న చిరునామాకే వ్రాయండి.

శ్రీరామ రక్షా స్తోత్రమ్

వెల : ఉచితం, పుటలు : 16, ప్రతులకు, వివరాలకు : పురాణపండ రాధాకృష్ణమూర్తి, జయశ్రీ టాకీస్ కుడి వైపు సందులో, భాగవత మందిరం- రాజమండ్రి-4.

బుద్ధ విగ్రహం వాస్తు ఆగ్రహం

హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో బుద్ధ విగ్రహ ప్రతిష్ఠలో జరిగిన ప్రమాదానికి కారణం వాస్తులోపం ముఖ్యంగా నైరుతి దోషం అని తెలియచెపుతూ నవలా రీతిలో వ్రాసిన పుస్తకం. గ్రంధకర్త : గౌరు తిరుపతిరెడ్డి, వెల రు. 10, పుటలు : 64, ప్రతులకు : గౌరు తిరుపతి రెడ్డి, వాస్తు కాంప్లెక్స్, మైదుకూరు రోడ్, ప్రొద్దుటూరు-516361.

కలకత్తాకి దగ్గరలో

(మూలం : శ్రీ గజేంద్రకుమార్ మిత్ర. తెలుగుసేత : శ్రీ మద్దిపట్ల సూరి. వెల : 40 రూ. పుటలు : 334. ప్రతులకు : సాహిత్య అకాడెమీ, స్వాతి మందిర్ మార్గ్, న్యూఢిల్లీ-110001)

కలకత్తాకి దగ్గరలో (కలకతార్‌కాఛేయీ) సాహిత్య అకాడెమీ బహుమతి పొందిన నవల. బెంగాలీలోని ఓ నిరుపేద కుటుంబాన్ని ఇతివృత్తంగా తీసుకొని వ్రాసిన ఈ నవలలోని పాత్రలు సజీవంగా, సంఘటనలు వాస్తవానికి దగ్గరగా, పాఠకుల మనస్సులకు హత్తుకునేలా వున్నాయి. ప్రధానపాత్ర శ్యామారాకూరాని చదువు సంస్కారం కలిగి సభ్య సమాజం నుంచి వచ్చిన యువతి. ఆ నవవధువు ఒక పనికిమాలిన మూర్ఖుడు నరేన్‌ను భర్తగా పొంది, గర్భదారిద్ర్యం అనుభవిస్తూ సంతానవతియైన ఆమె విధిలేక స్వార్థానికి, చివరికి చోరత్వానికి దిగజారుతుంది. ఒక నిరుపేద స్త్రీగా ఆమె పడిన కష్టాలు పాఠకునికి కంటతడి పెట్టిస్తాయి. అంతటి కష్టాల్లో కూడా ఆమె భర్త రాకకై ఎదురుచూస్తుందని చెప్పటం హైందవ స్త్రీత్వాన్ని ఆమె పాత్రలో జీవింపజేయటం విశేషం. ఒకానొక సంఘటనలో భర్త ఆమెని, పిల్లల్ని చంపుతానని కత్తిపీట ఎత్తినప్పుడు శ్యామా ఓ చెట్టుకొమ్మ ఎత్తి ఎదురునిల్చినప్పుడు ఆమెలో అపర చండీ అవతారం చూసిన నరేన్ ఆడదాని ఓర్పుమీద ఆఖరిదెబ్బ కొట్టానని గ్రహించి తోక ముడుస్తాడు. అష్టకష్టాలు పడి పిల్లలందరినీ గట్టెక్కించ గలిగిన శ్యామా మాత్రం వృద్ధాప్యంలో ఒంటరిగా మిగిలిపోతుంది. - ప్రమీల

వజ్రసంకల్పం

మగసంతానంతో అని కాదు, కానీ....., కానీ....., నువ్వు.....," అపైన ఆయన మాట్లాడలేకపోయాడు.

అంతం

సత్యం విశ్వధరవర్మకు చెప్పిన రహస్యం రహస్యంగానే మిగిలిపోయింది.

వజ్రపాణి వజ్రాల గనులు ప్రభుత్వపరమయ్యాయి.

సూర్యనేత్రాన్ని రాష్ట్రపతి స్వయంగా ఒక మ్యూజియంలో వుంచి ప్రారంభోత్సవం చేశాడు.

ఇక ఒక చిన్న కథ మాత్రం మిగిలిపోయింది.

★ ★ ★

ఆ హోటల్లో బాల్‌రూం డాన్స్ జోరుగా సాగుతోంది.

డాన్స్ పూర్తవుతూనే ఒక జంట చేసిన నృత్యానికి బాల్‌రూమంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

హోటల్ మేనేజర్ స్టేజి మీదికొచ్చాడు.

"లేడీస్ అండ్ జంటిల్మెన్ ఈ అద్భుతమైన జంట ఇదివరకు కూడా ఈ హోటల్‌లో షాంపేన్‌బాటిల్ గెల్చుకున్నారు. ఈసారి కూడా ఒక షాంపేన్ బాటిల్ మా హోటల్ తరఫున సగర్వంగా వీళ్లకు ప్రెజెంట్ చేస్తున్నాం. షాంపేన్ బాటిల్‌తో పాటు ఒక ప్రత్యేక బహుమతి కూడా వీరికి అందజేస్తున్నాం. ఈ ప్రెజెంటేషన్ ఒక అజ్ఞాత వ్యక్తి వీరికి అందించమని మాకు చెప్పారు. స్పెషల్ రిక్వెస్ట్ వల్ల ఆయన పేరు బయటపెట్టలేకపోతున్నాం. గివె బిగ్ హ్యాండ్ టు మిస్టర్ అండ్ మిసెస్ శక్తిధర్!"

బాల్‌రూమంతా మరోసారి చప్పట్లతో మార్మోగిపోయింది.

హోటల్ మేనేజర్ ఒక ప్యాకెట్ శక్తిధర్‌కి అందించి తనూ చప్పట్లు చరుస్తూ పక్కకు జరిగిపోయాడు.

"ఈ ప్రెజెంటేషన్ ఎవరిచ్చారో నాకు తెలుసు," నెమ్మదిగా అంది పింకీ.

"ఎవరు?" అడిగాడు శక్తిధర్.

"ప్రభు!" అంటూ ప్యాకెట్ తెరిచింది పింకీ.

తాజ్‌మహల్!

[అయిపోయింది]

సినిమా...సినిమా...

"కీచురాళ్ళు"

"నైట్ క్లబ్‌లోని నలుగురు యువగాయకులు ఆ క్లబ్‌లో జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా పోరాటం సాగించే విధానం ఆధారంగా ఈ చిత్ర కథ మలచబడింది. 'ఎస్సో థ్రిల్లర్' నవల ద్వారా పలువురి ప్రశంసలందుకున్న మాగంటిని సంభాషణ రచయితగా పరిచయం చేస్తున్నాం. ఒక పాప్ సాంగ్‌ను ఉషాఉతుప్ పాడుతుంది", అన్నారు గీతాకృష్ణ. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో ముళ్ళపూడి రాంబాబు నిర్మించే లక్ష్మీ లావణ్యా ఫిలిమ్స్ "కీచురాళ్ళు" చిత్రంలో భానుచందర్‌తో పాటు నలుగురు యువకులు ఉంటారు. వేటూరి గీతాలకు ఇళయరాజా స్వరకర్త. శ్రీనివాసులురెడ్డి ఛాయ, దిలీప్‌సింగ్ శిల్పం, పులియూర్ సరోజ నృత్యాలు, ప్రకాష్-బాలు ప్రొడక్షన్‌తో ఈ చిత్రాన్ని సమర్పించే కె. ఎల్. దుర్గేష్ "సెప్టెంబర్, అక్టోబర్‌లలో 1-15 తేదీల మధ్య జరిగే రెండు షెడ్యూల్స్‌తో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు. కె. ఎల్. దుర్గేష్ ఫిలిమ్ జర్నలిస్ట్‌గా, మయూరి డిస్ట్రిబ్యూషన్‌తో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా అనుభవజ్ఞుడు.

"శివ-శక్తి"

"చిత్రం పూర్వార్థం నేటి విద్యార్థుల జీవనసరళిని ప్రతిబింబిస్తూ, కాలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సరదాగా సాగుతుంది. ద్వితీయార్థం యాక్షన్ సెంటిమెంట్‌తో సస్పెన్స్‌తో నడుస్తుంది", అన్నారు భరద్వాజ. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహించే "శివ- శక్తి" చిత్రంలో తొలిసారిగా ద్విపాత్రలు నిర్వహించే నరేష్‌తో పాటు లిజి, రాజేష్, కోట శ్రీనివాసరావు, రమణమూర్తి, నిర్మలతో పాటు మరో నవ నాయిక ఉంటుంది. దివాకర్‌బాబు మాటలు, జయరాం ఛాయ, భువన చంద్ర గీతాలు. రాజ్-కోటి సంగీతం, కళ నృత్యాలు, శివ సంయుక్త దర్శకత్వం, సతీష్ ప్రొడక్షన్, కలిదిండ జయ ఎగ్జిక్యూటివ్ డైరెక్షన్, జి. రామారావు సమర్పణతో పి. ప్రతాపరావు సహ నిర్మాత. "హైదరాబాద్‌లో ఆగస్ట్ 1 నుంచి సెప్టెంబర్ వరకు ఒకే షెడ్యూల్లో షూటింగ్ పూర్తవుతుంది" అన్నారు నిర్మాత సూరపనేని భావ నారాయణ.



"బుజ్జిగాడి బాబాయ్"లో నిరోషా, ఓంకార్, సుమిత్ర



“దేవకన్య”లో శ్రీదేవి

కృష్ణ దర్శకత్వంలో "నాగాస్త్రం"

"పగ తీర్చుకోవడం కోసం మానవకాంతగా సంచరిస్తున్న సర్పం ఇందులో నాయిక. తన మానవాతీత శక్తులు చాలవని ఎస్టేట్ అధినేతతో పరిచయాన్ని పెంచుకుని, అతన్ని పెళ్లాడి అతని ద్వారా తన పగ తీర్చుకుంటుంది. ఎస్టేట్ యజమానిగా నాకూ, నాగ కన్యగా విజయశాంతికీ విలక్షణమైన పాత్రలు. అసంబద్ధమైన సన్నివేశాలు ఈ చిత్రంలో ఉండవు", అన్నారు కృష్ణ. ఈయన స్క్రీన్‌ప్లే, కూర్పు. దర్శకత్వంలో నన్నపనేని అన్నారావు నిర్మించే ఎస్. వి. ఎస్. క్రియేషన్స్ "నాగాస్త్రం" చిత్రంలో సత్యనారాయణ, కోట శ్రీనివాసరావు, పేకేటి శివరాం, అనంత్, చంద్రమౌళి, గౌతం రాజు, పృధ్వి, అన్నపూర్ణ, వై. విజయ, శ్రీలత, చంద్రిక ఆదిగా గల వారు పాల్గొన్నారు. శాతవాహన కథకు త్రిపురనేని మహారథి మాటలు రాశారు. వేటూరి, సిరి వెన్నెల సీతారామశాస్త్రి గీతాలను చక్రవర్తి స్వరపరిచారు. పుష్పాల గోపీకృష్ణ ఛాయాగ్రాహకుడు. ఎన్. గోపీకృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, కెప్టెన్ ఎన. ఎ. చౌదరి సమర్పణ.

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ చిత్రంలో బాలకృష్ణ


"హైదరాబాద్, రాజమండ్రి పరిసరాలలో షూటింగ్. జూలై 9 నుంచి 25 వరకు మొదటి షెడ్యూల్ జరిగింది. ఆగస్ట్ 1 నుంచి 7 వరకు రెండవ షెడ్యూల్. సెప్టెంబర్, అక్టోబర్‌లలో 10-20 తేదీల మధ్య షూటింగ్", అన్నారు తాతినేని రామారావు. ఈయన దర్శకత్వంలో అనుమోలు వెంకట సుబ్బారావు నిర్మించే ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ చిత్రంలో బాలకృష్ణ, విజయశాంతి, గుమ్మడి, చంద్రమోహన్, సత్యనారాయణ, సాక్షి రంగారావు, చలపతిరావు, వినోద్, సంజీవి, రాజ్‌వర్మ విద్యాసాగర్, జయంతి, తాతినేని రాజేశ్వరి, రాగిణి, సుధ, శ్రీలక్ష్మి, కల్పనారాయ్, యువశ్రీ, బేబీ సుజిత, మాస్టర్ తరుణ్ పాత్రధారులు. పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు. చక్రవర్తి సంగీతం, పి. ఎన్. సుందరం ఛాయ, బి. చలం శిల్పం, బాలు- కృష్ణస్వామి కూర్పు, విజయన్ సాహసాలతో డి. బ్రహ్మానందం ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్.

డి. వి. ఎస్. ప్రొడక్షన్స్ "దోషి-నిర్దోషి"

"జూలై 3 నుంచి 20 వరకు రెండో షెడ్యూల్ ముగించాం", అన్నారు డి. వి. ఎస్. రాజు. ఈయన నిర్మిస్తున్న "దోషి-నిర్దోషి" చిత్రంలో శోభన్‌బాబు, సుమన్, లిజి, సుమిత్ర, శుభలేఖ సుధాకర్, మహర్షి రాఘవ, సాయికుమార్, బ్రహ్మానందం, బాబూ మోహన్, మంజు, శ్రీహరిమూర్తి పాత్రధారులు. పరుచూరి సోదరులు కథ, మాటలు రాశారు. విద్యాసాగర్ సంగీతం, సిరివెన్నెల సీతారామశాస్త్రి పాటలు, విజయరాం ఛాయ, కళ నృత్యాలు, చంద్ర సాహసాలు, ఎం. బాలు సంయుక్త దర్శకత్వంతో డి. వి. కె. రాజు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వై. నాగేశ్వరరావు.

-జి.వి.జి.

వింబుల్డన్ జూనియర్ ఛాంపియన్ లియండర్ పియస్



కొద్ది రోజుల క్రితం వింబుల్డన్ జూనియర్ (1990) ఛాంపియన్‌షిప్ సాధించిన మన యువతార లియండర్ పియస్ ఎవరు? ఈ విచిత్ర బాలుని గురించి మన పత్రికలు అంతగా ప్రచారము యివ్వలేదు. పియస్ వింబుల్డన్ జూనియర్ ఛాంపియన్‌షిప్ గెల్చినప్పుడు అతని బొమ్మ చూపుటకు మన దూరదర్శన్ వారికి లభించలేదు ఏమో! చూపలేదు.

జూనియర్ టెన్నీసు రంగంలో ...ంచలనం సృష్టించిన లియండర్ పియస్ క్రీడాకారుల కుటుంబమునకు చెందినవాడు. తండ్రి విసీ పియస్ హాకీ ...టగాడు. తల్లి జెన్నిఫర్ పియస్ మంచి ...్ బాల్ క్రీడాకారిణి. మన జాతీయ ...ఁర్ ఛాంపియన్‌షిప్ గెల్చినప్పుడు ...లోనికి వచ్చాడు. అగ్రగామి ...ఎ అలీ శిష్యుడు.
...ఫ్రెంచి ఓపెన్, వింబుల్డన్‌లకు ...టెన్నీసు ఫెడరేషన్ యువ ...ఎంపిక అయ్యాడు.
...య టెన్నీసు సమాఖ్యచే ...వింటర్ సర్క్యూట్‌నకు, ...ఁకు అవకాశము యివ్వబడి ...డీఫుర్‌లో అంతర్జాతీయ ...మాఖ్య (ఐ. టి. ఎఫ్) వారి ...యుర్ ఛాంపియన్‌షిప్ యీ ఏడు ...ాడు. టాప్‌స్పిన్, స్లయిస్ ...కహాండ్ లలో గల నైపుణ్యము అతని విజయాలకు సహకరించు చున్నవి. బ్రిటానియా, అమృతరాజ్ ట్రస్ట్ కృషి ఫలితంయిది.

ఈ ఏడు ఆస్ట్రేలియన్ ఓపెన్ జూనియర్‌లో రన్నర్స్- అప్ అయిన పియస్ నకు వింబుల్డన్ జూనియర్ విభాగములో 11వ సీడింగు యిచ్చారు. జూలై 9న జరిగిన ఫైనలు పోటీలో దక్షిణ ఆఫ్రికాకు చెందిన మార్కోస్ ఆండ్రుస్కను 7–5, 2–6, 6–4 స్కోరుతో ఓడించి వింబుల్డన్ జూనియర్ ఛాంపియన్ అయ్యాడు.

1954లో రామనాథన్ కృష్ణన్, 1979లో రమేష్ కృష్ణన్‌లు సాధించినటువంటి విజయాలను నేడు లియండర్ పియస్ సాధించాడు. మంచి నడవడిక, ఆటలో ఆసక్తి పట్టుదల గల పియస్‌కు మంచి భవిష్యత్తు యున్నది.

–ముకరమ్

కల్పవృక్షం

ఆకర్షణీయమైన సితార (20-7-90) ముఖచిత్రంతో నయనానందకరంగా వెలువడింది ఆంధ్రపత్రిక. దిగంబర సుందరులు భాగవతుల సుబ్రహ్మణ్యం సవివరణ. వ్యాసానికి తగిన చిత్రాలు సంచికకు నిండుదనాన్నిచ్చాయి. కొత్తపాటకి పాత శృతి, మంగా మంగా, ఎవడుకొడుకు మొదలగు కథలు బాగున్నాయి. రాజకీయాలు: రాజీనామాలు సంపాదకీయం ప్రత్యేకంగా వుంది. వాస్తవికతకు అద్దం పట్టే కథలు, సీరియల్స్ చాలా బాగుంటున్నాయి. కాశీ, బాలి, ఉదయశంకర్ చిత్రాలు కథలకు సీరియల్స్‌కు. జీవం పోశాయి. ప్రతి సంచికను సాహితి విజ్ఞాన కల్పవృక్షంగా తీర్చిదిద్దుతున్న సంపాదకులకు హృదయపూర్వక అభినందనలు-

నందం రెడ్డియ్య
భట్టిప్రోలు

ఉత్తర వాహిని

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో మీరు ప్రచురిస్తున్న "సూపర్ హీరో" సీరియల్ చదువుచున్నంతసేపు మా అభిమాన నటుడి 'రియల్ స్టోరీ'లా అనిపిస్తుంది. మన్నెం శారదగార్కి మా ధన్యవాదాలు.

సుమన్ ముఖచిత్రం ప్రచురించగలరని ఆశిస్తున్నాను.

వై.వి.వి. త్రిమూర్తులు,
ఎస్. రాయవరం.

కథలు

18-5-'90 ఆం.స.వా. పత్రికలోని కథలన్నియూ ఆహ్లాదకరంగా వున్నవి! ముఖ్యంగా 'విజేత', మరియు 'విలువ' మరింత బావున్నాయి! రచయిత(త్రి)లు యం. 'విజయకుమారి', 'చెంగల్వ'గార్ల

వీక్లీ పోస్ట్

(4 వ పేజీ తరువాయి)

అభినందనీయులు! 'లవ్ గేమ్' యిప్పుడిప్పుడే వేగం పుంజుకుంటూంది అనిపిస్తూంది! 'హమేషా తమాషా', 'యువతా కవితా' శీర్షికలకు నిడివి పెంచమని వినయపూర్వక విన్నతి!

జి. సూర్యమోహనరావు,
ముంగండ.

యువతా కవితా

"కళామయం జీవనం" పేరుతో శ్రీ దిట్టకవిగారు వ్రాసిన కవిత చాలా బాగుంది. చక్కని మాటల పొందికతో చదువరులను ఆకట్టుకొంది. కవికి జగత్తంతా కళామయంగా కనిపిస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

ఎమ్.ఎల్. సత్యమణి,
మద్రాసు-34.

కథ

నూతననటి 'సితార' ముఖచిత్రం 20-7-90 ఆంధ్రసచిత్రవారపత్రికకు సరికొత్త ఆకర్షణను తెచ్చిపెట్టింది! ముఖ్యంగా 'అతికిన హృదయం' విరజగారి కథ కదిలించివేసింది! నవమాసాలు మోసి కనిపెంచిన కన్నతల్లిని కూడా తన తల్లి కాదంటున్న 'మధు' లాంటి వ్యక్తులకు 'రామం' లాంటి మిత్రులు కనువిప్పు. కానీ చదువుతుంటే అప్రయత్నంగానే కళ్ళవెంట నీరు చేరాయంటే కథ చదివిన వారు తప్ప మరొకరు నమ్మరు కాబోలు!

పోతే 'భలే పెళ్ళిళ్ళు' స్పెషల్ ఆర్టికల్ ఆదిమవాసుల వింత వైవాహిక వ్యవస్థను చిత్రంగా తెలియజేసింది!

ఏ. శ్రీధరాచార్యజ్యోషి
అయిజ

ముఖచిత్రం

27-7-90 ఆంధ్రసచిత్ర వారపత్రిక ముఖచిత్రంపై విజయశాంతి ఆ వారం పత్రికకి విజయాన్ని, శాంతిని చేకూర్చింది.

కన్నెదయ్యం కథ వెరైటీగా ఉంది. సదా మీ (మా) పత్రిక కొత్త కొంతలతో వెలువడాలని ఆశిస్తూ.....

కుమారి పెయ్యేటి చాముండే
ఒం...

శీర్షికలు

ఉత్తమ నటి విజయశాం... త్రంతో వచ్చిన మా (మీ) ... సుందరంగా వుంది. కథ ... శ్రద్ధ తీసుకుంటున్నందున ... షంగా వుంది. మరదలా! మ... బాగున్నా ముగింపు వేరే విధ... కథ ఇంకా రక్తికట్టేది. పాఠక... శీర్షికలను చాలా మటుకు ...న్నారు. ఇది చాలా అన్యాయ... పజిల్ తీసేశారు. రెండు వారాల నుండి టిట్ ఫర్ టా... ణాలు కూడా ఇవ్వడం లేదు. చూస్తుంటే పాఠకులు ఉత్తరాలు ప్లాన్... శ్రద్ధ ఉన్నట్లు లేదు. మహా... రాజ్‌కపూర్ (పాపాజి) గురి... తెలియని ఎన్నో విషయాలను విపులం... వివరించారు.

శ్రీదేవ్ రాంప్రసాద్
ప్రొద్దుటూరు

వయసు

మే-జూలై 13 ఆంధ్రపత్రికలో నా కథ "తుఫాన్ వెలసింది" ప్రచురించి నందుకు మరోసారి కృతజ్ఞతలు. చిత్రకారునికి, సిబ్బందికి అభినందనలు. నన్ను పాఠకలోకానికి పరిచయం చేస్తూ వయస్సు 24 సంవత్సరాలు అని వేసారు. నా వయసు 21 (ఇరవై ఒకటి) అని నేను తెలియజేయడం జరిగింది. గాన గమనించ ప్రార్థన. నా పుట్టిన తేది 07- జనవరి 1969. అందుకే 21 ఏళ్ళు నిండాయని రాసాను.

– బమ్మిడి జగదీశ్వరరావు (కాశీబుగ్గ)